

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 15 | సంచిక: 164

SUNDAY Special | ఆదివారం 4-9-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



నేడు రెండో రౌండ్

ఆసియా కప్ టీ20 టోర్నీలో భారత్, పాకిస్తాన్ జట్లు ఆదివారం రాత్రి 7.30 గంటలకు తలపడబోతున్నాయి. ఇప్పటికే విజయంతో జోరు మీదున్న రోహిత్ సేన.. మరోసారి పాక్‌పై గెలిచేందుకు ఉవ్విళ్లూరుతోంది.


- వివరాలు 12లో



వెండితెర టీచరమ్మ

టీచర్ పాత్రకు నిజజీవితాల్లోనే కాదు.. వెండితెరపైనా ప్రాముఖ్యత దక్కింది. మిస్సమ్మలో సావిత్రి, మట్టిలో మాణిక్యంలో జమున, రేపటిపౌరులు, ప్రతిఘటనలో విజయశాంతి.. ఇలా వెండితెరపై ఉపాధ్యాయులుగా వెలిగిన నటులు, సినిమాలపై కథనం.

- వివరాలు 11లో



మణిపూర్‌లో జేడీ(యూ)కు షాక్

మణిపూర్‌లో ఆరుగురు జేడీ(యూ) ఎమ్మెల్యేలకు గాను, ఏకంగా ఐదుగురు ఎమ్మెల్యేలు అధికార బీజేపీలో చేరారు.

వివరాలు 6లో



అది రాజ్యాంగబద్ధమా?

డబ్బులు ఎరవేసి ఎమ్మెల్యేలను కొనేయడం రాజ్యాంగబద్ధమేనా? అని బీజేపీని జేడీ(యూ) నేత, బిహార్ సీఎం నితీశ్ నిలదీశారు.


వివరాలు 6లో



'ఆప్'కు పనిచేయండి

బీజేపీలోనే కొనసాగుతూ.. తమ పార్టీకి సేవలందించాలని గుజరాత్‌లోని బీజేపీ కార్యకర్తలను ఆప్ నేత కేజ్రీవాల్ కోరారు.

వివరాలు 6లో



గోర్బచెవ్‌కు తుది వీడ్కోలు

సోవియట్ యూనియన్ చివరి అధ్యక్షుడు గోర్బచెవ్ అంత్యక్రియలు మాస్కోలో అధికారిక లాంఛనాలు లేకుండా ముగిశాయి.

వివరాలు 6లో



బ్రిటిష్ హయాం నాటి సంగం ఆనకట్ట



వైఎస్ జగన్ ప్రభుత్వం శరవేగంగా నిర్మించిన మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజ్

దశాబ్దాల కల సంగం సాకారం

ప్రారంభానికి సిద్ధమైన మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజ్

- రికార్డు సమయంలో నెల్లూరు బ్యారేజీ కమ్ బ్రిడ్జి కూడా పూర్తి
- ఈనెల 6న జాతికి అంకితం చేయనున్న సీఎం వైఎస్ జగన్
- 1882–83లో సంగం వద్ద ఆనకట్ట నిర్మించిన బ్రిటీష్ సర్కార్
- ఆనకట్ట శిథిలమవ్వడంతో ఆయకట్టుకు నీళ్లందించలేని దుస్థితి
- 2006లో బ్యారేజ్ నిర్మాణానికి వైఎస్సార్ శంకుస్థాపన
- మహానేత హఠాన్మరణంతో పనులకు గ్రహణం
- టీడీపీ హయాంలో కమీషన్ల పనులకే ప్రాధాన్యం ఇస్తూ నాన్చివేత
- జగన్ సీఎం కాగానే యుద్ధ ప్రాతిపదికన రూ.131.12 కోట్లతో పూర్తి
- నెల్లూరు జిల్లాలో 3.85 లక్షల ఎకరాల ఆయకట్టు సస్యశ్యామలం
- సంగం–పొదలకూరు మధ్య ప్రజల రాకపోకల సమస్యకు శాశ్వత పరిష్కారం.. నెల్లూరు బ్యారేజీ కమ్ బ్రిడ్జి ద్వారా నెల్లూరు– కోవూరు మధ్య సవ్యంగా రాకపోకలు
- 72 గ్రామాల పరిధిలో 99,525 ఎకరాల్లో సాగు నీటి పరిస్థితి మెరుగు

మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజ్ నిర్మాణం పూర్తి కావడంతో పెన్నా డెల్టాలోని 2.47 లక్షల ఎకరాలు, కనుపూరు కాలువ కింద 63 వేలు, కావలి కాలువ కింద 75 వేలు వెరసి మొత్తంగా 3.85 లక్షల ఎకరాల ఆయకట్టుకు సమృద్ధిగా నీళ్లందించడానికి మార్గం సుగమం అయింది. ప్రధానంగా నెల్లూరుకు ముంపు ముప్పు తప్పింది. చెప్పిన మాట మేరకు యుద్ధ ప్రాతిపదికన బ్యారేజ్ నిర్మాణం పూర్తి చేయడం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తన నిబద్ధతను చాటుకున్నారు. దీనికి తోడు నెల్లూరు బ్యారేజీ కమ్ బ్రిడ్జి కూడా రికార్డు సమయంలో పూర్తి కావడం విశేషం.

- వివరాలు 2లో

సరిలేరు సెరెనాకెవ్వరు..

టెన్నిస్‌కు సెరెనా విలియమ్స్ గుడ్‌బై



- చివరి మ్యాచ్ ఆడిన అమెరికా దిగ్గజం
- యూఎస్ ఓపెన్ మూడో రౌండ్‌లో పరాజయం

మహిళల టెన్నిస్ ఆల్‌టైమ్ గ్రేట్ సెరెనా విలియమ్స్ ఆటకు వీడ్కోలు పలికింది. యూఎస్ ఓపెన్‌లో మూడో రౌండ్‌లో పరాజయంతో ఆమె రిటైర్మెంట్ ప్రకటించింది. 40 ఏళ్ల సెరెనా తన కెరీర్‌లో 23 సింగిల్స్ గ్రాండ్‌స్లామ్ టైటిల్స్, 14 డబుల్స్ గ్రాండ్‌స్లామ్, 2 మిక్స్‌డ్ డబుల్స్, 4 ఒలింపిక్ స్వర్ణ పతకాలు.. ఇలా అనేక టైటిల్స్ గెల్చుకుంది.

"నా తల్లిదండ్రులే నా ఘనతకు కారణం. వారికి ఏం ఇచ్చినా తక్కువే. సెరెనా ప్రతీ విజయం వెనక అక్క వీనస్ కూడ ఉంది. ఇదో అత్యద్భుత ప్రయాణం. నా కెరీర్‌లో ఎప్పుడూ చివరి వరకు కూడా ఓటమిని అంగీకరించలేదు. ఇప్పుడు కూడా అలాగే పోరాడాను. ఇన్నేళ్లుగా నాకు కోర్టులో మద్దతునిచ్చిన అందరికీ కృతజ్ఞతలు." - సెరెనా విలియమ్స్

12లో

న్యూస్‌రీల్

పేటీఎం ఆఫీసులో ఈడీ సోదాలు



యాప్ ఆధారిత అక్రమ రుణాల కేసులో బెంగళూరులోని రేజర్‌పే ప్రైవేట్ లిమిటెడ్, క్యాష్‌ఫ్రీ పేమెంట్స్, పేటీఎం పేమెంట్ సర్వీసెస్ లిమిటెడ్ సంస్థల కార్యాలయాల్లో ఈడీ సోదాలు చేసింది.

వివరాలు 6లో ▸

విశాఖలో పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ పర్యటన



లేబర్, టెక్స్‌టైల్స్, స్కిల్‌డెవలప్‌మెంట్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ శనివారం విశాఖపట్నంలో పర్యటించి.. విశాఖ పోర్టు, హెచ్‌పీసీఎల్, ఐటీసీఎల్, స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించింది. కార్మికులు, కార్మిక సంఘాలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుంది.

వివరాలు 2లో ▸

240 లెక్చరర్ పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు



రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 240 లెక్చరర్ పోస్టుల భర్తీ కోసం ఏపీపీఎస్సీకి ప్రతిపాదనలు పంపామని రాష్ట్ర ఉన్నత విద్యా కమిషనర్ పోలా భాస్కరరావు తెలిపారు. ప్రస్తుతం ఈ కళాశాలల్లో డిప్యుటేషన్‌పై అధ్యాపకులు పనిచేస్తున్నారని చెప్పారు.

వివరాలు 2లో ▸

రాష్ట్రంలో మూడు రోజులు వానలు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో రానున్న మూడు రోజుల్లో విస్తారంగా వానలు కురవనున్నాయి. దక్షిణ, ఆగ్నేయ దిశగా వీస్తున్న గాలుల ప్రభావంతో రానున్న మూడు రోజులపాటు రాష్ట్రంలో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరుగాను, అక్కడక్కడా భారీ వర్షాలకు ఆస్కారం ఉందని భారత వాతావరణ విభాగం శనివారం నాటి నివేదిక వెల్లడించింది. ప్రధానంగా కోస్తాంధ్ర, యానాం, రాయలసీమల్లోని అనేక ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు పడతాయని ఈ నివేదిక తెలిపింది. అదే సమయంలో పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశమూ ఉందని పేర్కొంది.

వేగంగా పోలవరం

- ఇది జాతీయ ప్రాజెక్టు కనుక త్వరగా పూర్తయ్యేలా కేంద్రం చేయూత ఇవ్వాలి
- దక్షిణాది రాష్ట్రాల మండలి సమావేశంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్
- పెండింగ్ అంశాల అమలు పర్యవేక్షణకు యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి
- రాయలసీమ, ఉత్తరాంధ్ర వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీగా రూ.25,000 కోట్లు ఇవ్వండి
- విభజన చట్టంలోని సెక్షన్ 94 (2) ప్రకారం పారిశ్రామిక రాయితీలు ఇవ్వండి
- విశాఖ కేంద్రంగా కొత్త రైల్వే జోన్‌ను త్వరగా ఏర్పాటు చేయండి
- ఇన్‌స్టిట్యూషన్ల ఆస్తుల పంపిణీ కోసం ఇరు రాష్ట్రాల సీఎస్‌లతో సమావేశం..
- కేంద్ర హోం శాఖ కార్యదర్శికి కేంద్ర మంత్రి అమిత్ షా ఆదేశాలు





దక్షిణాది రాష్ట్రాల మండలి సమావేశంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, కేరళ, తమిళనాడు సీఎంలు విజయన్, స్టాలిన్, రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయడానికి కేంద్రం నిరంతర మద్దతు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరింది. రాష్ట్ర విభజన చట్టంలో ఈ ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించినందున అన్ని విధాలా కేంద్రం మద్దతు అవసరమని పేర్కొంది. తిరువనంతపురంలో శనివారం కేంద్ర హోం మంత్రి అమిత్ షా అధ్యక్షతన జరిగిన దక్షిణాది రాష్ట్రాల మండలి సమావేశంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్.. విద్యుత్, అటవీ, గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలతో కూడిన అధికారుల బృందం పాల్గొంది. ఈ సమావేశంలో మంత్రి బుగ్గన మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన జరిగి ఎనిమిదేళ్లు కావస్తున్నా, ఇంకా అనేక సమస్యలు పరిష్కారం కానందున రాష్ట్రం తీవ్రంగా నష్టపోతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విభజన చట్టంలోని పెండింగ్ అంశాలపై నిర్ణయాలు తీసుకోవడంతో పాటు వాటి అమలు, పర్యవేక్షణ కోసం తగిన సాధికారతతో కూడిన ప్రభావ వంతమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మంత్రి బుగ్గన ప్రస్తావించిన అంశాలు ఇలా ఉన్నాయి.

ఉమ్మడి ఏడు జిల్లాలకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ ఇవ్వాలి

విభజన నేపథ్యంలో ఏపీకి జరిగిన నష్టాన్ని భర్తీ చేయడానికి చట్టంలో, అప్పటి ప్రధాని పార్లమెంట్‌లో కీలక అంశాలపై హామీ ఇచ్చారు. దాదాపు దశాబ్ద కాలం గడుస్తున్నా అనేక కీలమైన హామీలు అమలు కాలేదు. ఫలితంగా రాష్ట్రం తీవ్ర సమస్యలను

మిగతా 3వ పేజీలో ▶

ఇళ్ల పథకంలో జోక్యానికి ఎన్‌జీటీ 'నో'



- 5,200 ఇళ్ల పట్టాల మంజూరుపై దాఖలైన పిటిషన్ తిరస్కరణ
- కుందు నది పరిరక్షణకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టింది
- ఆ నదిపై ప్రతికూల ప్రభావం పడుతుందన్న ఆరోపణలకు ఆధారాల్లేవు
- ప్రభుత్వ చర్యలు పిటిషనర్ అనుమానాలను నివృత్తి చేసేలా ఉన్నాయి
- ఆ భూమిని ఇళ్ల స్థలాలకు ఇవ్వాలా? లేదా? అన్న అంశం జోలికి మేం వెళ్లం
- బఫర్‌జోన్‌లో మాత్రం నిర్మాణాలు చేపట్టొద్దు.. వ్యర్థాలను నదిలో కలపొద్దు..
- తేల్చిచెప్పిన జాతీయ హరిత ట్రిబ్యునల్.. ఈ తీర్పుతో టీడీపీ కుట్రలు పటాపంచలు

2లో

ఇదం జగత్



సగం కేంద్రం, మిగతా సగం రాష్ట్రం సాయం చేస్తున్నాయని అలా ఫొటో పెట్టాను మేడం!

ఓ యువకుడి విజయ పొట్లం

చదివింది బీఏ.. చేసింది సాఫ్ట్‌వేర్ ఉద్యోగం

ఉద్యోగానికి స్వస్తి పలికి 'పొట్లం' యాప్‌కు శ్రీకారం చుట్టిన యువకుడు





యాప్ రూపకర్త శ్రీనివాస్ అలమండ

- కిరాణా, కూరగాయలు, పండ్లు, ఫుడ్ డెలివరీకి యాప్ రూపకల్పన
- ఏటా రూ.6 కోట్ల టర్నోవర్.. 200 మందికి ఉపాధి
- జంగారెడ్డిగూడెం, ఏలూరు, నర్సీపట్నం, సత్తుపల్లి, తణుకుల్లో 'పొట్లం' సేవలు
- ఏలూరు జిల్లా యువకుడు శ్రీనివాస్ అలమండ విజయగాథ

3లో



నంబర్ 5 ▸ బలమైన ఆర్థిక దేశాల్లో ప్రపంచంలో అయిదో స్థానం

బ్రిటన్‌ను నెట్టేసి దూసుకుపోతున్న భారత్

కరోనా మహమ్మారి విసిరిన సవాళ్లను తట్టుకొని నిలబడ్డ భారత్ ప్రపంచ పటంలో బలమైన ఆర్థిక శక్తిగా ఎదుగుతోంది. అగ్రరాజ్యమైన బ్రిటన్‌ను దాటి అయిదోస్థానంలోకి దూసుకుపోయింది. 2022 మార్చి చివరి నాటికి భారత్ ప్రపంచంలోని బలమైన ఆర్థిక దేశాల్లో అయిదో స్థానంలో నిలిచిందని బ్లూమ్‌బర్గ్ సంస్థ తాజా కథనంలో వెల్లడించింది. ప్రపంచంలో బలమైన ఆర్థిక దేశంగా అమెరికా మొదటి స్థానంలోనూ, చైనా రెండో స్థానంలో ఉంటే జపాన్, జర్మనీ వరుసగా మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాయి.

- వివరాలు 6లో

క్లుప్తంగా

ముగిసిన సీఎం జగన్ వైఎస్సార్ జిల్లా పర్యటన

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్ జిల్లా పర్యటన ముగించుకుని శనివారం ఉదయం ఇంటికి చేరుకొన్నారు. ఈనెల 1వ తేదీ మధ్యాహ్నం 2.10 గంటలకు తాడేపల్లి నుంచి బయలుదేరి వైఎస్సార్ జిల్లాకు వెళ్లిన సీఎం.. తన తండ్రి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా ఇడుపులపాయలోని సమాధి వద్ద నివాళులు అర్పించారు. అలాగే సొంత నియోజకవర్గం పులివెందులలో, జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షలు, ప్రారంభోత్సవాల్లో పాల్గొన్నారు. తిరిగి శనివారం ఉదయం 10.35 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకొన్నారు.

'పోలవరం'లో రెండో రోజూ సీఎస్ఎంఆర్ఎస్ బృందం పరిశీలన

పోలవరం రూరల్: ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టు పనులను కేంద్ర జలసంఘం పరిధిలోని సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ సెంటర్ (సీఎస్ఎంఆర్ఎస్) బృందం సభ్యులు రెండో రోజు శనివారం కూడా పరిశీలించారు. దిగువ కాఫర్ డ్యామ్ నిర్మాణంలో రాయి నాణ్యతను సీఎస్ఎంఆర్ఎస్ సభ్యులు సందీప్ దనోత్, ఉదయ్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. రాయి నాణ్యత ప్రమాణాల గురించి ప్రాజెక్టు ప్రాంతంలోని ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించారు. అనంతరం పనుల వివరాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట ఈఈ పాండురంగారావు, డీఈలు డి.శ్రీకాంత్, కె.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

176 మందికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు

5న సీఎం చేతుల మీదుగా పురస్కారాల ప్రదానం

సాక్షి, అమరావతి: భారత తొలి ఉపరాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఏపీలోని 176 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ శనివారం తెలిపారు. ఈ నెల 5న ఉదయం 10 గంటలకు విజయవాడలోని 'ఏ' కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్ ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలను అందించి, సన్మానిస్తారని తెలిపారు. పాఠశాల విద్యాశాఖ నుంచి 58 మంది ఉపాధ్యాయులు, ఇంటర్ విద్య నుంచి 19 మంది, ఉన్నత విద్య నుంచి 60 మంది అధ్యాపకులు, భాషా- సాంస్కృతిక శాఖ నుంచి ఐదుగురు, కేజీబీవీల నుంచి ముగ్గురు, జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు ఐదుగురు ఈ పురస్కారాలకు ఎంపికయ్యారన్నారు. స్వచ్ఛ విద్యాలయ పురస్కారాలను సాధించిన 26 పాఠశాలలను కూడా పురస్కారాలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. గురు పూజోత్సవం సందర్భంగా జరిగే ఈ కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పాఠశాల విద్య ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు, ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రా రెడ్డి పాల్గొంటారని చెప్పారు.

● తెలంగాణ

బీజేపీకి ప్రత్యామ్నాయం వస్తోంది

- ఇప్పటికిప్పుడు ఎన్నికలొస్తే.. 72–80 సీట్లు గెలుస్తాం
- టీఆర్ఎస్ఎల్పీ, టీఆర్ఎస్‌పీపీ సంయుక్త భేటీలో సీఎం కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: జాతీయస్థాయిలో బీజేపీకి ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి ఏర్పాటుకు సన్నాహాలు శరవేగంగా సాగుతున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దేశానికేం చేసిందో చెప్పుకునేందుకు అంశాలేవీ లేనందునే మత ఛాందసవాదాన్ని నమ్ముకొని రాజకీయాలు చేస్తోందన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో జరిగిన పార్టీ శాసన సభాపక్ష, పార్లమెంటరీ పార్టీల సంయుక్త సమావేశంలో కేసీఆర్ ప్రసంగించారు. మనం జాతీయ రాజకీయాల్లో అడుగు పెట్టడం ఖాయమని, మీలో చాలా మందికి కేంద్ర మంత్రులు, గవర్నర్లు, విదేశీ రాయబారులుగా అవకాశం లభిస్తుందని చెప్పారు. ఇటీవల నిర్వహించిన జాతీయ రైతు సంఘాల భేటీలో తెలంగాణ ప్రభుత్వ విధానాలపట్ల మంచి స్పందన లభించిందన్నారు. దళిత బంధులాంటి అద్భుతమైన పథకం దేశమంతా అమలు కావాలంటే తనను జాతీయ రాజకీయాల్లోకి వెళ్లాల్సిందిగా సూచించారని అన్నారు. రైతు సంఘాల భేటీ తరహాలో త్వరలో జాతీయ స్థాయిలో దళిత సంఘాల ప్రతినిధులతోనూ సదస్సు ఏర్పాటు చేస్తామన్నారు.

ఇప్పటికిప్పుడు అసెంబ్లీ ఎన్నికలు జరిగితే 72 నుంచి 80 స్థానాలతో టీఆర్ఎస్ విజయం ఖాయమని తెలిపారు. కొద్దిగా కష్టపడితే 100 సీట్లు సాధిస్తామన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లిస్తామని అన్నారు. అసెంబ్లీకి ముందస్తు ఎన్నికలు జరుగుతాయనే ఊహాగానాలను కేసీఆర్ తోసిపుచ్చారు. మునుగోడు ఉప ఎన్నికలో టీఆర్ఎస్ విజయం ఖాయమన్నారు. బీజేపీ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి డిపాజిట్ కూడా దక్కదని చెప్పారు.

ఇళ్ల పథకంలో జోక్యానికి ఎన్‌జీటీ 'నో'

సాక్షి, అమరావతి : నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం విషయంలో జోక్యానికి జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) తిరస్కరించింది. ఈ పథకం కింద నంద్యాల జిల్లాలో 5,200 ఇళ్ల పట్టాల మంజూరువల్ల పర్యావరణపరంగా కుందు నది తీవ్రంగా ప్రభావితమవుతుందంటూ దాఖలైన పిటిషన్‌ను హరిత ట్రిబ్యునల్ తోసిపుచ్చింది. కుందు నది పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టిందని ఎన్‌జీటీ స్పష్టంచేసింది. పేదల ఇళ్ల నిర్మాణాన్ని అడ్డుకునేందుకు టీడీపీ చేసిన కుట్రలు ట్రిబ్యునల్ తీర్పుతో పటాపంచలయ్యాయి. మరోవైపు.. ఇళ్ల స్థలాల మంజూరువల్ల పర్యావరణంగా కుందు నదిపై ప్రతికూల ప్రభావాలు ఉంటాయంటూ పిటిషనర్ చేసిన ఆరోపణలకు ఎలాంటి ఆధారాల్లేవని ఎన్‌జీటీ తెలిపింది. 5,200 ఇళ్ల స్థలాల మంజూరుకు ఉద్దేశించిన 145.61 ఎకరాల భూమిని పేదలందరికీ ఇళ్ల పథకం కోసం ఉపయోగించవచ్చా? లేదా? అన్న విషయం జోలికి కూడా తాము వెళ్లబోవడంలేదని ఎన్‌జీటీ తేల్చిచెప్పింది. ఆ భూములను ఇళ్ల స్థలాలకు కేటాయించడంపై హైకోర్టులో విచారణ జరుగుతున్న నేపథ్యంలో, ఆ భూముల విషయంలో తాము ఏ రకంగానూ జోక్యం చేసుకోవడంలేదని వివరించింది. ఇరువైపులా బఫర్‌జోన్ ఏర్పాటుచేసి కుందు నది బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలపట్ల సంతృప్తి వ్యక్తంచేసింది. నది ప్రవాహ ఎగువ, దిగువ ప్రాంతాల్లో శాస్త్రీయ ప్రాతిపదికన ప్రభుత్వం ప్రతిపాదించిన చర్యలు వరద విషయంలో పిటిషనర్ వ్యక్తంచేసిన అనుమానాలన్నింటినీ నివృత్తి



చేసేలా ఉన్నాయని స్పష్టంచేసింది. అయితే, కుందు నదికి ఇరువైపులా ఏర్పాటుచేసిన బఫర్ జోన్‌లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టడానికి వీల్లేదని తెలిపింది. ఒకవేళ హైకోర్టు ఆ 145 ఎకరాల భూమిని ఇళ్ల స్థలాల కోసం కేటాయించడాన్ని సమర్థించినప్పటికీ, పేదలందరికీ ఇళ్ల పథకం ప్రాజెక్టు అమలు విషయంలో పర్యావరణ చట్టాలను తూచా తప్పకుండా అమలుచేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే, వ్యర్థాల నిర్వహణ నిబంధనలను పాటించాలని, కుందు నదిలో గానీ, బఫర్ జోన్ ప్రాంతంలోగానీ వదలడానికి, వీల్లేదని ఆదేశించింది. ఈ మేరకు ఎన్‌జీటీ జ్యుడీషియల్ మెంబర్ జస్టిస్ కె. రామకృష్ణన్, ఎక్స్‌పర్ట్ మెంబర్ కొర్లపాటి సత్యగోపాల్ ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది.

ఇళ్ల స్థలాల కేటాయింపు వల్ల ఇబ్బంది లేదు

కుందు నది విస్తరణ నిమిత్తం నంద్యాల మండలం, మూలసాగరం పరిధిలో ప్రభుత్వం 2013లో 209.5 ఎకరాల భూమిని సేకరించింది. ఇందులో కొంతభాగాన్ని బఫర్ జోన్‌కు కేటాయించింది. మిగిలిన 145 ఎకరాల భూమిలో పేదలకు 5,200 ఇళ్ల పట్టాలు మంజూరుచేయాలని నిర్ణయించింది. దీన్ని సవాల్ చేస్తూ నంద్యాల సంజీవ్‌నగర్‌కు చెందిన షేక్ నూమాన్ బాషా పేరుతో ఎన్‌జీటీలో ఫిర్యాదు నమోదైంది. ఆ 145 ఎకరాల భూమిని ఇళ్ల స్థలాల కోసం కేటాయిస్తే వర్షాకాలంలో నంద్యాల ప్రజలు వరదను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఎన్‌జీటీ ప్రభుత్వ వివరణ కోరింది. అలాగే, క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలించేందుకు ఓ కమిటీని కూడా ఏర్పాటుచేసింది. ఇళ్ల స్థలాల కేటాయింపువల్ల ఎలాంటి ప్రతికూల ప్రభావం పడదంటూ కమిటీ నివేదిక ఇచ్చింది.

సర్కారు అన్ని జాగ్రత్తలూ తీసుకుంది

ఇక ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. కుందు నది పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుందన్నారు. నదికి ఇరువైపులా బలోపేతం చేసేందుకు నిర్మాణ పనులను సైతం ప్రారంభించిందన్నారు. తగినంత భూమిని బఫర్ జోన్ కింద విడిచిపెట్టి మిగిలిన భూమినే ఇళ్ల స్థలాల మంజూరు కోసం వినియోగిస్తున్నామన్నారు. అదనపు ఏజీ వాదనలతో ఏకీభవించిన ఎన్‌జీటీ ధర్మాసనం ఇళ్ల స్థలాల కేటాయింపు వల్ల కుందు నదిపై పర్యావరణపరంగా ఎలాంటి ప్రభావం ఉంటుందన్న అంశానికే తాము పరిమితమవుతున్నట్లు తెలిపింది.



నేడు సాక్షి టీవీలో పోలవరంపై గ్రౌండ్ రిపోర్ట్

- మూడేళ్లలో ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టును ఏ దశకు తీసుకువచ్చింది?
- గత ప్రభుత్వ నిర్వాకంవల్ల దెబ్బతిన్న కాఫర్ డ్యాం, డయాఫ్రం వాల్ ఇప్పుడు ఏ దశలో ఉన్నాయి?
- ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యాం నిర్మాణం ఎప్పట్లోగా ప్రారంభమవుతుంది?
- చంద్రబాబు ప్రభుత్వం చేసిన పాపాలు ఇప్పుడు పోలవరం నిర్మాణానికి ఎలా శాపాలుగా మారాయి?
- రోజూ ఈ ప్రాజెక్టుపై దుష్టచతుష్టయం చేస్తున్న ప్రచారం వెనుకనున్న అసలు నిజాలు ఏంటి?
- ఇప్పుడున్న పరిస్థితుల్లో పోలవరం ప్రాజెక్టును ప్రభుత్వం ఎప్పటిలోగా పూర్తిచేయగలుగుతుంది?
- ఎన్నడూ చూడని దృశ్యాలు.. వాస్తవిక గణాంకాలతో పోలవరం ప్రాజెక్టుపై ఎక్స్‌క్లూజివ్ గ్రౌండ్ రిపోర్ట్..

నేటి ఉ.9 గంటలకు మీ సాక్షి టీవీలో..

560 ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ల నియామకానికి షెడ్యూల్

- 5న నోటిఫికేషన్.. 18న పరీక్ష
- అంగన్‌వాడీ వర్కర్లు, సూపర్‌వైజర్లతో పోస్టుల భర్తీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 560 ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ (గ్రేడ్-2) పోస్టుల నియామకానికి రాష్ట్రప్రభుత్వం శనివారం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ పోస్టులను అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే అర్హులైన కాంట్రాక్ట్ వర్కర్లు, సూపర్‌వైజర్లతో భర్తీ చేయనున్నారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను రాష్ట్ర మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సంచాలకులు (డైరెక్టర్) అట్టాడ సిరి విడుదల చేశారు. రాష్ట్రంలో మొత్తం 560 గ్రేడ్-2 పోస్టులను భర్తీ చేస్తుండగా.. వాటిలో విశాఖపట్నం జోన్‌లో 76, ఒంగోలు జోన్‌లో 126, ఏలూరు జోన్‌లో 142, కర్నూలు జోన్‌లో 216 పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టులకు సంబంధించి ఈ నెల 5న నోటిఫికేషన్ జారీ చేస్తారు. 12లోగా అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలి. 15 నుంచి 17 వరకు హాల్‌టికెట్లు జారీ చేస్తారు. 18న పరీక్ష నిర్వహిస్తారు. రాష్ట్రంలోని నాలుగు జోన్ల పరిధిలో కేటాయించే కేంద్రాల్లో అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఇందుకు ఏర్పాట్లను కలెక్టర్ చైర్మన్‌గా ఉండే కమిటీ పర్యవేక్షిస్తుంది.

240 లెక్చరర్ పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు

- రూ.391 కోట్లతో 27 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు భవనాలు
- రూ.271 కోట్లతో 124 డిగ్రీ కళాశాలల్లో నాడు–నేడు పనులు
- రాష్ట్ర ఉన్నత విద్యా కమిషనర్ పోలా భాస్కరరావు
- విశాఖ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ ప్రయోగాత్మకంగా అమలు



వివరాలు వెల్లడిస్తున్న ఉన్నత విద్యా కమిషనర్ పోలా భాస్కరరావు

మద్దిలపాలెం (విశాఖ తూర్పు): రాష్ట్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 240 లెక్చరర్ పోస్టుల భర్తీ నిమిత్తం ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ)కి ప్రతిపాదనలు పంపామని రాష్ట్ర ఉన్నత విద్యా కమిషనర్ పోలా భాస్కరరావు తెలిపారు. ప్రస్తుతం ఈ కళాశాలల్లో డిప్యుటేషన్‌పై అధ్యాపకులు పనిచేస్తున్నారని చెప్పారు. వీరితోపాటు కాంట్రాక్ట్ లెక్చరర్లను కూడా కేటాయించామన్నారు. ఉన్నత విద్యతోపాటు ఉపాధికి బాటలు వేసేలా డిగ్రీ విద్యార్థుల బంగారు భవితను తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు. విశాఖపట్నం మద్దిలపాలెంలోని డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ విధానాన్ని శనివారం భాస్కరరావు ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 165 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలున్నాయన్నారు. వీటిలో రూ.391 కోట్లతో 27 కళాశాలలకు కొత్త భవనాల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. ఒక్కో కళాశాలకు రూ.14.5 కోట్ల చొప్పున త్వరలో మంజూరు కానున్నాయన్నారు.

ప్రతి నియోజకవర్గానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల

కాగా 124 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో నాడు– నేడు కింద భవనాల ఆధునికీకరణకు రూ.271 కోట్లు విడుదల కావాల్సి ఉందని భాస్కరరావు తెలిపారు. కొత్తగా వస్తున్న ఆరు డిగ్రీ కళాశాలల్లో ఒక్కో దానిలో 24 మంది అధ్యాపకులు, మరో 10 ఇతర పోస్టులు మంజూరు చేయాల్సి ఉందన్నారు. ఆరు కళాశాలల్లో అదనపు భవనాల నిర్మాణానికి రూ.1.67 కోట్లు కేటాయించామన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విధానంలో భాగంగా కొత్తగా 54 కళాశాలలను ఏర్పాటు చేయాల్సి ఉందని చెప్పారు. కళాశాలల ఏర్పాటుకు కావాల్సిన స్థలాలను పరిశీలిస్తున్నామన్నారు.

డిగ్రీతోపాటు పలు ఉపాధి కోర్సులు

డిగ్రీ కోర్సులతోపాటు విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి పలు కోర్సులను జోడించామని భాస్కరరావు తెలిపారు. డిగ్రీలో ప్రతి సెమిస్టర్‌లో 8 వారాల పాటు ఇంటర్న్‌షిప్ ఉంటుందన్నారు. విద్యార్థులు, అధ్యాపకుల హాజరు నమోదుకు ప్రయోగాత్మకంగా ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్.ఐ.విజయబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.


విశాఖలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పర్యటన

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్ని సందర్శించిన కమిటీ సభ్యులు

సాక్షి, విశాఖపట్నం: లేబర్, టెక్స్‌టైల్స్, స్కిల్‌డెవలప్‌మెంట్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ శనివారం విశాఖపట్నంలో పర్యటించింది. నగరంలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన విశాఖ పోర్టు, హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్, స్టీల్‌ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులు, కార్మిక సంఘాలతో కమిటీ సభ్యులు మాట్లాడారు. చైర్మన్ మెహతాబ్, 19 మంది ఎంపీలతో కూడిన కమిటీ.. కార్మికులకు అందుతున్న సౌకర్యాలు, వేతనాల గురించి అడిగి తెలుసుకుంది. క్రేన్ ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, మెకానిక్‌లు, వెల్డర్లు, ఫిట్టర్లు, డ్రైవర్లు తదితర కాంట్రాక్టు కార్మికులకు స్కిల్డ్ వేతనాలు ఇవ్వడం లేదన్న విషయాన్ని కమిటీ సభ్యులకు కార్మిక సంఘాల ప్రతినిధులు తెలిపారు. ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని వివరించారు.

'సంగం' సాకారం

ప్రారంభానికి సిద్ధమైన మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజ్



సీఎం వైఎస్ జగన్ పూర్తి చేసిన మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజీ



పెన్నా నదిపై సంగం బ్యారేజీ దిగువ వైపు నుంచి...

(మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజ్ నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి రామగోపాలరెడ్డి ఆలమూరు)

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ప్రజల దశాబ్దాల స్వప్నం సాకారమైంది. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జలయజ్ఞంలో భాగంగా చేపట్టిన మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజ్ పనులను ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి చేశారు. ఈనెల 6న బ్యారేజ్‌ను జాతికి అంకితం చేయనున్నారు.

దీంతో పాటు నెల్లూరు బ్యారేజ్ కమ్ బ్రిడ్జిని కూడా రికార్డు సమయంలో పూర్తి చేశారు. సంగం బ్యారేజ్ నిర్మాణం ద్వారా పెన్నా వరదలను సమర్థవంతంగా నియంత్రించి, ముంపు ముప్పు నుంచి నెల్లూరు జిల్లా ప్రజలను తప్పించవచ్చు. బ్యారేజ్‌లో 0.45 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశం ఉండటం వల్ల పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరగడం ఖాయం. తద్వారా తాగునీటి ఇబ్బందులు తీరుతాయి. మేకపాటి గౌతమ్‌రెడ్డి బ్యారేజ్ కమ్ బ్రిడ్జిని పూర్తి చేయడం ద్వారా సంగం, పొదలకూరు మండలాల మధ్య రాకపోకల సమస్యను సీఎం వైఎస్ జగన్ శాశ్వతంగా పరిష్కరించారు.

శిథిలమైనా పట్టించుకోని దుస్థితి

నెల్లూరు జిల్లా సంగం వద్ద పెన్నా నదిపై 1882–83లో బ్రిటీష్ సర్కార్ 0.9 మీటర్ల ఎత్తున ఆనకట్టను నిర్మించి.. పెన్నా డెల్టా, కనుపూరు, కావలి కాలువల కింద ఆయకట్టుకు 1886 నుంచి నీళ్లందించడం ప్రారంభించింది. ఈ ఆనకట్టకు దిగువన నదీ గర్భంలో నిర్మించిన రోడ్డు ద్వారా సంగం–పొదలకూరు మండలాల మధ్య రాకపోకలు సాగుతున్నాయి. పెన్నాలో వరద పెరిగితే ఈ రెండు మండలాల మధ్య రాకపోకలు స్తంభించిపోయేవి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఆనకట్ట శిథిలావస్థకు చేరుకోవడంతో.. దానిపై 0.3 మీటర్ల మేర ఇసుక బస్తాలు వేసి, నీటిని నిల్వ చేసినా.. ఆయకట్టుకు నీళ్లందించడం కష్టంగా మారింది. సంగం ఆనకట్ట స్థానంలో బ్యారేజ్ నిర్మించి, ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీళ్లందించాలని నెల్లూరు జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తూ వచ్చారు. అయితే ఆ డిమాండ్‌ను 2006 వరకూ ఎవరూ పట్టించుకోలేదు.

స్వప్నం సాకారం దిశగా అడుగులు..

నెల్లూరు జిల్లా ప్రజల చిరకాల స్వప్నాన్ని సాకారం చేసే దిశగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2006 మే 28న సంగం బ్యారేజ్‌కు శంకుస్థాపన చేశారు. రూ.147.50 కోట్ల అంచనా వ్యయంతో 2008 మే 21న పనులు చేపట్టారు. మహానేత వైఎస్ హయాంలో బ్యారేజ్ పనులు పరుగులు తీశాయి. ఈ పనులకు అప్పట్లో రూ.30.85 కోట్లు వ్యయం చేశారు. అయితే మహానేత వైఎస్ హఠాన్మరణం సంగం బ్యారేజ్ పనులకు శాపంగా మారింది.

కమీషన్లు వచ్చే పనులకే టీడీపీ హయాంలో పెద్దపీట

సంగం బ్యారేజ్‌ను నిర్మిస్తున్న ప్రాంతంలో పెన్నా నది వెడల్పు 1,400 మీటర్లు. కానీ.. అప్పట్లో సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీవో) చీఫ్ ఇంజనీర్ 846 మీటర్ల వెడల్పుతో బ్యారేజ్ (కాంక్రీట్ నిర్మాణం), ఇరువైపులా 554 మీటర్ల వెడల్పుతో మట్టికట్టలు నిర్మించేలా డిజైన్‌ను ఆమోదించారు. బ్యారేజ్ నిర్మాణ సమయంలో ఇబ్బందులు ఏర్పడటంతో డిజైన్‌లలో మార్పులు చేయాలని 2013లో అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం 2013 నవంబర్ 23న నిపుణుల కమిటీని నియమించింది. బ్యారేజ్ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించిన నిపుణుల కమిటీ.. 1,195 మీటర్ల వెడల్పుతో బ్యారేజ్ (కాంక్రీట్ కట్టడం) నిర్మించాలని 2014లో నివేదిక ఇచ్చింది. ఈ నివేదికను ఆమోదించడంలో రెండేళ్ల పాటు జాప్యం చేసిన టీడీపీ సర్కార్.. ఎట్టకేలకు 2016 జనవరి 21న బ్యారేజ్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ క్రమంలో అంచనా వ్యయాన్ని రూ.335.80 కోట్లకు పెంచింది. బ్యారేజ్‌ను 2017కు పూర్తి చేస్తామని ఒకసారి.. 2018కి పూర్తి చేస్తామని మరోసారి.. 2019కి పూర్తి చేస్తామని ఇంకోసారి ముహూర్తాలను మారుస్తూ వచ్చింది. టీడీపీ సర్కార్ కేవలం కమీషన్లు వచ్చే పనులకే అధిక ప్రాధాన్యం ఇచ్చింది. బ్యారేజ్‌లో 85 పియర్స్(కాంక్రీట్ దిమ్మెలు)ను సగటున 22 మీటర్ల చొప్పున అరకొరగా పూర్తి చేసింది. చేసిన పనుల కంటే.. ధరల సర్దుబాటు(ఎస్కలేషన్), పనుల పరిమాణం పెరిగిందనే సాకుతో అధికంగా బిల్లులు చెల్లించింది. రూ.86.10 కోట్లను ఖర్చు చేసినా బ్యారేజ్ పనులను ఒక కొలిక్కి తేలేకపోయింది.


అటు కరోనా, ఇటు వరద.. అయినా పూర్తి

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించాక సంగం బ్యారేజ్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ప్రాధాన్యత ప్రాజెక్టుగా ప్రకటించి, శరవేగంగా పూర్తి చేయాలని జల వనరుల శాఖ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. 2020 మార్చి నుంచి 2021 ఆఖరుదాకా కరోనా మహమ్మారి విజృంభించింది. గతంలో ఎన్నడూ లేని రీతిలో 2019–20, 2020–21, 2021–22లో పెన్నా నది ఉప్పొంగి ప్రవహించింది. 2019–20 లో 42.52, 2020–21లో 301.52, 2021–22లో 373.52 టీఎంసీల నీరు నెల్లూరు బ్యారేజీ నుంచి సముద్రంలో కలిసిందంటే ఏ స్థాయిలో వరద వచ్చిందో అంచనా వేసుకోవచ్చు. ఓ వైపు కరోనా మహమ్మారి తీవ్రత.. మరో వైపు పెన్నా వరద ఉధృతితో పోటీ పడుతూ సంగం బ్యారేజ్ పనులను సీఎం వైఎస్ జగన్ పరుగులెత్తించారు. బ్యారేజ్ 85 పియర్లను 43 మీటర్ల ఎత్తుతో పూర్తి చేయించారు. ఈ పియర్స్ మధ్య 12 మీటర్ల ఎత్తు, 2.8 మీటర్ల వెడల్పుతో 79 గేట్లు, కోతకుగురై వచ్చిన మట్టిని దిగువకు పంపడానికి 12 మీటర్ల ఎత్తు, 3.8 మీటర్ల వెడల్పుతో 6 గేట్లు (స్కవర్ స్లూయిజ్) బిగించారు. వరద ప్రవాహం వచ్చినప్పుడు దిగువకు విడుదల చేయడానికి వీలుగా గేట్లను ఎత్తడానికి, దించడానికి విద్యుత్‌తో పనిచేసే హాయిస్ట్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. బ్యారేజ్‌కు ఎగువన ఎడమ వైపున 3.17 కిలోమీటర్లు, బ్యారేజ్‌కు కుడి వైపున 3 కిలోమీటర్ల పొడవున కరకట్టలను పటిష్టం చేశారు. సంగం నుంచి పొదలకూరుకు రాకపోకలు సాగించడానికి వీలుగా బ్యారేజ్‌పై రెండు వరుసల రోడ్ బ్రిడ్జిని పూర్తి చేశారు. కనిగిరి, కావలి కాలువలకు సంయుక్తంగా నీటిని సరఫరా చేసే రెగ్యులేటర్, కనుపూరు కాలువకు నీటిని సరఫరా చేసే రెగ్యులేటర్‌లను పూర్తి చేశారు. ఈ పనులను రూ.131.12 కోట్ల ఖర్చుతో పూర్తి చేసి.. నెల్లూరు ప్రజల దశాబ్దాల స్వప్నాన్ని సాకారం చేశారు.

నెల్లూరు బ్యారేజీ కమ్ బ్రిడ్జి ప్రాజెక్టు సైతం

రికార్డు సమయంలో నెల్లూరు బ్యారేజీ కమ్ బ్రిడ్జిని కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పూర్తి చేసింది. జలయజ్ఞంలో భాగంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2008–09లో ప్రారంభించిన ఈ ప్రాజెక్టును పదేళ్ల తర్వాత ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా పూర్తి చేశారు. నెల్లూరు నగరానికి సమీపాన ఇప్పటికే ఉండే పాత ఆనకట్టకు వంద మీటర్ల ఎగువన ఇంకొక కొత్త బ్యారేజీ కమ్ బ్రిడ్జి ప్రాజెక్టు పనులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చి పూర్తి చేసింది. ఈ ప్రాజెక్టును కూడా ఈ నెల 6న జాతికి అంకితం చేయనున్నారు. 13 ఏళ్ల క్రితం మొదట్లో రూ.147.20 కోట్ల అంచనాతో మొదలు పెట్టిన ఈ ప్రాజెక్టులో 2014కు ముందే రూ.86.62 కోట్ల మేరకు పనులు పూర్తయ్యాయి. తర్వాత ప్రాజెక్టు వ్యయం రూ.274.83 కోట్లకు పెరిగింది. 2014–19 మధ్య చంద్రబాబు ప్రభుత్వం రూ.71.54 కోట్లు ఖర్చు చేసినా ప్రాజెక్టు పూర్తి చేసే ఆలోచనతో కాకుండా ప్రాజెక్టు నిర్మాణంలో కేవలం కమీషన్లకు అవకాశం ఉన్న పనులు చేపట్టేందుకు ఆసక్తి చూపింది. అయితే 2019లో వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక ఈ ప్రాజెక్టును ప్రాధాన్యత ప్రాజెక్టుగా గుర్తించారు. కేవలం మూడేళ్లలో రూ.77.37 కోట్లు ఖర్చు చేసి ప్రాజెక్టు ప్రధాన కాంక్రీట్, ఇతర మట్టి పనులన్నింటినీ ప్రభుత్వం పూర్తి చేసింది. ఈ ప్రాజెక్టు పూర్తి చేయడం ద్వారా 72 గ్రామాల పరిధిలోని 99,525 ఎకరాల్లో సాగు నీటి పారుదల అవకాశాలు మెరుగు పడతాయి. నెల్లూరు– కోవూరుల మధ్య రాకపోకల ఇబ్బందులు పూర్తిగా తొలగిపోనున్నాయి. ఆనకట్టకు ఎగువన ఇన్‌ఫిల్ట్రేషన్ బావులు నిండడం వల్ల ఆ ప్రాంతంలో భూగర్భ జల మట్టం పెరిగి నెల్లూరు నగరం.. ఆ చుట్టుపక్కల ప్రాంతాలకు తాగునీటి అవసరాలు తీరే అవకాశం ఉంది.

ఇదో మహోజ్వల ఘట్టం



సంగం బ్యారేజ్ నిర్మాణాన్ని మహానేత వైఎస్సార్ ప్రారంభిస్తే.. ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్ పూర్తి చేసి ఈ నెల 6న జాతికి అంకితం చేయనుండటం మహోజ్వల ఘట్టం. కరోనా తీవ్రత, పెన్నా వరద ఉధృతిని తట్టుకుని.. బ్యారేజ్‌ను పూర్తి చేశాం. నెల్లూరు జిల్లా ప్రజలకు మేకపాటి గౌతమ్‌రెడ్డి చేసిన సేవలను స్మరించుకుంటూ బ్యారేజ్‌కు ఆయన పేరు పెట్టాం. పెన్నా డెల్టా, కనుపూరు, కావలి కాలువల ఆయకట్టుకు నీళ్లందించి సస్యశ్యామలం చేస్తాం. – అంబటి రాంబాబు, జల వనరుల శాఖ మంత్రి

రికార్డు సమయంలో పూర్తి



సీఎం ఆదేశాల మేరకు బ్యారేజ్‌ను రికార్డు సమయంలో పూర్తి చేశాం. 3.85 లక్షల ఎకరాలకు నీళ్లందించడానికి ఇది దోహదపడుతుంది. బ్యారేజ్‌లో నిత్యం 0.45 టీఎంసీలను నిల్వ చేయడం వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయి. సాగు, తాగునీటికి ఇబ్బంది ఉండదు. బ్రిడ్జితో సంగం–పొదలకూరు మధ్య రవాణా సమస్యకు పరిష్కారం లభించింది. – సి.నారాయణరెడ్డి, ఈఎన్‌సీ

నాణ్యతకు ప్రాధాన్యత



సంగం బ్యారేజ్ పనులను అత్యంత నాణ్యతతో శరవేగంగా పూర్తి చేశాం. సీఎం వైఎస్ జగన్ ప్రాధాన్యత ప్రాజెక్టుగా సంగం బ్యారేజ్‌ను ప్రకటించి.. గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆ మేరకు గడువులోగా పూర్తి చేశాం. నెల్లూరు జిల్లా ప్రజల దశాబ్దాల కలను సీఎం వైఎస్ జగన్ నిజం చేశారు. – హరినారాయణ రెడ్డి, సీఈ, తెలుగుగంగ

క్లుప్తంగా

ఉపాధ్యాయ దినోత్సవాన్ని బహిష్కరించండి

యూటీఎఫ్, ఏపీటీఎఫ్ పిలుపు

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ఈనెల 5న నిర్వహించనున్న వేడుకలను బహిష్కరించాలని పిలుపునిస్తూ యూటీఎఫ్, ఏపీటీఎఫ్ శనివారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశాయి. ఓ వైపు అటెండెన్స్ యాప్‌లతో వేధిస్తూ, కేసులు పెడుతూ.. మరోవైపు సన్మానం చేస్తామంటే ఎలా అని ప్రశ్నించాయి. సీపీఎస్ రద్దు కోసం ఆందోళన బాటపట్టిన వారిపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్, ఏపీటీఎఫ్ అధ్యక్షుడు జి.హృదయరాజు, ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి డిమాండ్ చేశారు.

గురువులను అవమానించొద్దు

- 'ఉపాధ్యాయ' వేడుకల్ని బహిష్కరించి సహచర టీచర్ల మనోభావాలను దెబ్బతీయొద్దు
- పీఆర్టీయూ, వైఎస్సార్‌టీఎఫ్, జాక్టో హితవు

సాక్షి, అమరావతి: ఉపాధ్యయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే వేడుకలను స్వాగతిస్తున్నామని వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్(వైఎస్సార్‌టీఎఫ్), పీఆర్టీయూ, జాయింట్ యాక్షన్ కమిటీ టీచర్స్ ఆర్గనైజేషన్(జాక్టో) శనివారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నాయి. 'వృత్తి పరమైన కృషికి గుర్తింపుగా ప్రభుత్వం గురుపూజోత్సవం సందర్భంగా అవార్డులు ఇస్తుంది. వాటిని తీసుకోవద్దనడం సరికాదు. అవార్డులకు దరఖాస్తు చేసుకున్న సహచర టీచర్ల మనోభావాలను దెబ్బతీయడం ఎంతవరకు సమంజసం? అలాంటి హక్కు ఎవరికీ లేదు. వేడుకలను బహిష్కరించడమంటే గురువులను అవమానించడమే. ఈ వారంలో టీచర్లకు ప్రభుత్వం పదోన్నతులు ఇవ్వబోతోంది. వాటిని కూడా తీసుకోవద్దని చెప్పగలరా?' అని ప్రశ్నించాయి. సమస్యలుంటే ప్రభుత్వంతో చర్చల ద్వారా సాధించుకుందామని హితవు పలికాయి. అవార్డులకు ఎంపికైన ఉపాధ్యాయులకు వైఎస్సార్ టీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఓబుళపతి, గౌరవాధ్యక్షుడు హెచ్.గిరిధర్‌రెడ్డి, జాక్టో చైర్మన్ కె.జాలిరెడ్డి, సెక్రటరీ జనరల్ మల్లు శ్రీధర్‌రెడ్డి, పీఆర్టీయూ అధ్యక్షుడు గిరిప్రసాదరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీధర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

ఇదేం వింత ధోరణి?

ఉపాధ్యాయ సంఘాలకు ఎమ్మెల్సీ కల్పలత ప్రశ్న

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయ సంఘాలే గురుపూజోత్సవాలను బహిష్కరించాలని పిలుపునివ్వడం ఏమిటని, ఇదేమి వింత ధోరణి అని ఎమ్మెల్సీ కల్పలత శనివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. 'బహిష్కరించడమంటే.. ఉపాధ్యాయులుగా మనల్ని మనం అగౌరవపరచుకున్నట్లు కాదా? మనకు ఆదర్శప్రాయులైన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గౌరవానికి భంగం కలిగించడం కాదా?' అని ప్రశ్నించారు. పోరాటాలు, ఉద్యమాలు, ప్రభుత్వ ఒత్తిళ్లు సహజమని, వాటిని సాకుగా చూపి ఉపాధ్యాయ దినోత్సవాన్ని బహిష్కరించాలనడం సబబు కాదని హితవు పలికారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు, విద్యార్థులకు మార్గదర్శకులుగా ఉంటూ ఆదర్శవంతమైన సమాజం కోసం పాటుపడుతున్న ఉపాధ్యాయ లోకానికి ఆమె శుభాకాంక్షలు తెలిపారు.

విభజన సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం

'సదరన్ జోనల్' భేటీలో తెలంగాణ హోం మంత్రి మహమూద్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విభజన సమస్యల పరిష్కారంలో తీవ్రజాప్యం జరుగుతుండటం పట్ల తెలంగాణ రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రం ఏర్పడి ఎనిమిదేళ్లు గడిచినా.. ఉద్యోగుల విభజన, ప్రభుత్వ, ఇతర సంస్థల ఆస్తులు, అప్పుల పంపకాలు, ఇతర సమస్యలు పరిష్కారం కాలేదని తెలిపారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అధ్యక్షతన శనివారం కేరళ రాష్ట్ర రాజధాని తిరువనంతపురంలో జరిగిన 30వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన రాష్ట్రం తరపున పాల్గొని మాట్లాడారు. కేంద్ర హోంశాఖ చొరవతో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య వివాదాలు వేగవంతంగా పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సైతం ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఓ యువకుడి విజయ 'పొట్లం'

ఆ యువకుడిది.. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో ఒక సామాన్య రైతు కూలీ కుటుంబం. చిన్నప్పుడే తండ్రి ఇల్లు వదిలి వెళ్లిపోయినా, తల్లి వ్యవసాయ కూలీగా పనిచేస్తూ అతడిని పెంచి పెద్ద చేసింది. పేదరికంతో విద్యాభ్యాసమంతా ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లోనే సాగింది. బీఏ మాత్రమే చదివినా పట్టుదలతో ఐటీ కోర్సులు నేర్చుకుని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయ్యాడు. యాక్సెంచర్, విప్రో వంటి ప్రతిష్టాత్మక కంపెనీల్లో పనిచేశాడు. అంతటితో ఆగని ఆ యువకుడు 'పొట్లం' పేరుతో ఆహారం, సరుకులను డోర్ డెలివరీ చేసే యాప్‌కు శ్రీకారం చుట్టాడు. చదువుకునేటప్పుడే ఖర్చుల కోసం కిరాణా కొట్టులో పనిచేస్తూ 'పొట్లం' కట్టిన ఆ యువకుడు ఇప్పుడు తన సొంత ఊరు జంగారెడ్డిగూడెం కేంద్రంగా 200 మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగాడు. పొట్లం యాప్ ద్వారా ఐదు పట్టణాల్లో ఆహార పదార్థాలను, నిత్యావసర వస్తువులు, పండ్లు, కూరగాయలను డోర్ డెలివరీ చేస్తున్నాడు. తన వ్యాపారం ద్వారా ఏటా రూ.6 కోట్ల టర్నోవర్ సాధిస్తున్నాడు. కృషితో నాస్తి దుర్భిక్షం... అనే మాటను రుజువు చేస్తున్న ఆ యువకుడే.. శ్రీనివాస్ అలమండ. అతడి స్ఫూర్తిదాయక విజయగాథ ఇది..

ఉద్యోగానికి స్వస్తి పలికి 'పొట్లం' యాప్‌కు శ్రీకారం చుట్టిన యువకుడు



పొట్లం డార్క్ స్టోర్‌లో సరుకులు సిద్ధం చేస్తున్న సిబ్బంది



పొట్లం యాప్



తన స్నేహితులు హరికృష్ణ, రఘు, సోదరుడు పవన్‌తో శ్రీనివాస్

సాక్షి, అమరావతి: పేదరికం కారణంగా అలమండ శ్రీనివాస్ ఐదో తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుకునే సమయంలో ఖర్చుల కోసం అనేక పనులు చేశాడు. జంగారెడ్డిగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ పూర్తయ్యాక ఉద్యోగం కోసం హైదరాబాద్ వెళ్లాడు. అక్కడ నెలకు రూ.1,500 జీతంతో ఉద్యోగం చేశాడు. ఇంగ్లిష్, అమీర్‌పేటలో ఐటీ కోర్సులు నేర్చుకుని యాక్సెంచర్, విప్రో కంపెనీల్లో 17ఏళ్ల పాటు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేశాడు. ఆ తర్వాత ఇంగ్లండ్, కెనడాల్లోనూ కొన్నాళ్లు ఉద్యోగం చేశాడు. అయితే, సొంత ఊరు జంగారెడ్డిగూడెంపై మమకారంతో తిరిగి వచ్చేశాడు. ఏదైనా మొబైల్ యాప్ తయారు చేయాలనే లక్ష్యంతో తన స్నేహితులు హరికృష్ణ, రఘు, సోదరుడు పవన్‌లతో కలిసి జంగారెడ్డిగూడెం కేంద్రంగా 2020లో పొట్లం రిటైల్ కాన్సెప్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని ఏర్పాటు చేశాడు. ఇందులో భాగంగా 'పొట్లం ఫుడ్ అండ్ కిరాణా యాప్'కు శ్రీకారం చుట్టాడు.

లక్ష మందికిపైగా వినియోగదారులు

అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందించిన పొట్లం ఫుడ్ అండ్ కిరాణా యాప్‌కు ప్రస్తుతం లక్ష మందికిపైగా వినియోగదారులు ఉన్నారు. పొట్లం యాప్ ద్వారా జంగారెడ్డిగూడెం, ఏలూరు, తణుకు, నర్సీపట్నం, సత్తుపల్లి పట్టణాల్లో వినియోగదారులకు నిత్యం ఘుమఘుమలాడే ఆహార పదార్థాలు, కిరాణా సరుకులు, కూరగాయలు, పండ్లు, మాంసాన్ని డోర్ డెలివరీ చేస్తున్నారు. పొట్లం యాప్ ద్వారా శ్రీనివాస్ ఏటా రూ.6 కోట్ల టర్నోవర్ సాధిస్తున్నారు. పొట్లంలో 200 మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

2020లోనే పొట్లం మొదటి డార్క్ స్టోర్

పొట్లం యాప్ ద్వారా వినియోగదారుల నుంచి వచ్చే ఆర్డర్‌కు అనుగుణంగా సరుకులు అందించేలా 2020 ఆగస్టులో జంగారెడ్డిగూడెంలో మొదటి డార్క్‌స్టోర్‌ను శ్రీనివాస్ ఏర్పాటు చేశాడు. వినియోగదారులు నేరుగా రావాల్సిన అవసరం లేకుండా పొట్లం ఆన్‌లైన్ యాప్, ఆఫ్‌లైన్ (ఫోన్ ద్వారా)లో ఆర్డర్ ఇస్తే సరుకులు డార్క్‌స్టోర్ నుంచి సిబ్బంది డోర్ డెలివరీ చేస్తున్నారు.

రైతుకి వెన్నుదన్ను..

వ్యవసాయ కూలీ కుటుంబ నేపథ్యం కలిగిన శ్రీనివాస్ పొట్లం యాప్ ద్వారా రైతుల ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా అక్కడికక్కడే మంచి ధర దక్కేలా చేస్తున్నాడు. దీనిద్వారా ఓవైపు రైతులకు దళారీల బాధ లేకుండా మంచి ధర దక్కుతుంటే.. వినియోగదారులకు తాజా కూరగాయలు, పండ్లు తక్కువ ధరకే అందుతున్నాయి. మార్కెట్ ధరల కంటే కనీసం 20 నుంచి 50 శాతం వరకు తక్కువ ధరకే కూరగాయలు, పండ్లను డోర్ డెలివరీ చేస్తున్నాడు. బయట మార్కెట్‌లో దాదాపు రూ.400 విలువ చేసే 17 రకాల కూరగాయలను కేవలం రూ.199కే డోర్ డెలివరీ ఇస్తున్నాడు.

నిరక్షరాసులు సైతం..

ఆన్‌లైన్ కొనుగోళ్లు చేయాలంటే స్మార్ట్‌ఫోన్, ఇంటర్‌నెట్, చదువు తప్పనిసరి. ప్రస్తుతం బహుళజాతి సంస్థల యాప్‌లన్నీ ఈ కోణంలోనే ఉన్నాయి. కానీ పొట్లం యాప్ మాత్రం వీటికి భిన్నంగా ఆఫ్‌లైన్ విధానంలోనూ సేవలు అందిస్తోంది. పొట్లం వినియోగదారుల్లో చాలామంది స్మార్ట్ ఫోన్ లేనివారే అంటే అతిశయోక్తి కాదు. స్మార్ట్ ఫోన్ లేకపోయినా కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసి ఆర్డర్ ఇస్తే నేరుగా ఇంటికి సరుకులు పంపే ఏర్పాటు 'పొట్లం' ప్రత్యేకత.

కరోనా సమయంలోనూ ఉపాధి

2020లో కరోనా సమయంలో పొట్లం యాప్‌ను ప్రారంభించా. ఆ సమయంలో ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీల టీచర్లు చాలామంది ఉపాధి కోల్పోయి పొట్లం యాప్‌లో డెలివరీ బాయ్స్‌గా చేరారు. కరోనా కష్టకాలంలో ఏ ఉద్యోగం లేక రోజు గడవడం కష్టమైన చాలామందికి ఉపాధి కల్పించా. ఔత్సాహిక యువతకు మొదటి పది బ్రాంచ్‌లకు పొట్లం ఫ్రాంచైజీ ఉచితంగా ఇస్తా. ఫుల్లీ ఆటోమేటెడ్ అండ్ ఇంటిగ్రేటెడ్ టెక్నాలజీ ద్వారా మొత్తం 14 యాప్‌ల అనుసంధానంతో పొట్లం యాప్ పనిచేస్తోంది. పొట్లం ఫ్రాంచైజీని ఉచితంగా ఎవరైనా తమ ప్రాంతంలో తీసుకోవడానికి యాప్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. 2024 నాటికి రాష్ట్రంలో ఐదు వేల కేంద్రాలకు పొట్లం యాప్‌ను విస్తరించే లక్ష్యంతో పనిచేస్తున్నా. అధునాతన మెషీన్ లెర్నింగ్, ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ), కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)లను జోడించి వినియోగదారులకు సేవలందిస్తున్నా.

– శ్రీనివాస్ అలమండ, ఎండీ, పొట్లం రిటైల్ కాన్సెప్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్.

గుండ్లకమ్మ నుంచి ఖరీఫ్‌కు నీరిస్తాం

- రబీ సీజనుకల్లా ప్రాజెక్టు గేట్ల మరమ్మతులు పూర్తి
- అవసరమైతే సాగర్ కాలువల ద్వారా రిజర్వాయర్ నింపుతాం
- రిజర్వాయర్ మరమ్మతులను టీడీపీ ప్రభుత్వం గాలికొదిలేసింది
- పచ్చపత్రికలు చంద్రబాబు డైరెక్షన్‌లో వికృత రాతలు రాస్తున్నాయి
- నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు



గడ్డర్లు ఊడిపోయిన మూడో గేటును పరిశీలిస్తున్న మంత్రి అంబటి రాంబాబు తదితరులు

మద్దిపాడు: వచ్చే రబీ సీజన్‌కల్లా గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్ల మరమ్మతులు పూర్తి చేస్తామని నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. ప్రస్తుత ఖరీఫ్‌కు, వచ్చే రబీ సీజన్‌లో పంటలకు ప్రాజెక్టు నుంచి నీరందిస్తామని, తాగునీరు కూడా అందిస్తామని తెలిపారు. ఆయన శనివారం ప్రకాశం జిల్లాలోని కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ జలాశయాన్ని పరిశీలించారు. గడ్డర్లు ఊడిపోయిన మూడో గేటును పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రిజర్వాయర్‌లో నీటిని 1.25 టీఎంసీలకు తగ్గించి పనులు చేస్తామన్నారు. సాగు నీటి సరఫరాకు ఏ ఇబ్బందీ కలగదని, అవసరమైతే సాగర్ కాలువల ద్వారా రిజర్వాయర్ నింపుతామని తెలిపారు. మూడో నంబర్ గేటుతో పాటు మరో తొమ్మిది గేట్లకు మరమ్మతులు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపారన్నారు. ఈ పనులకు కాంట్రాక్టర్‌ను కూడా ఖరారు చేశామని చెప్పారు. నీరు కిందకు పోవడంవల్ల రైతులకు నష్టం జరుగుతోందంటూ టీడీపీ అధినాయకుడి డైరెక్షన్‌లో పచ్చ పత్రికలు వికృత భాషలో వండి వారుస్తున్నాయని మండిపడ్డారు. గేటు విరగడం నిన్న, మొన్న జరిగింది కాదని, 2014 – 19 మధ్య టీడీపీ ప్రభుత్వం రిజర్వాయర్‌కు మరమ్మతులు చేయించలేదని తెలిపారు. వారి హయాంలో మరమ్మతులకు రూ.6 కోట్లు మంజూరు చేయించుకుని గేట్లు, స్పిల్‌వేను పట్టించుకోలేదని చెప్పారు. ఆ డబ్బుతో రిజర్వాయర్ వద్ద బ్యూటిఫికేషన్, గెస్ట్ హౌస్‌లు అంటూ టీడీపీ నేతలు కమీషన్లు దండుకున్నారని ఆరోపించారు. పచ్చ పత్రికలకు ఇవేమీ కనిపించవని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ప్రతిపక్ష నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. పులిచింతలలో కొట్టుకుపోయిన గేటు రిపేరు చేస్తున్నామన్నారు. డ్యాములకు రిపేర్లు రావడం ఈ రోజు వచ్చిన సమస్య కాదని చెప్పారు. గత ప్రభుత్వం డ్యాముల నిర్వహణను నిర్లక్ష్యం చేయడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. అన్ని డ్యామ్‌లకు మరమ్మతులు చేపడతామని అన్నారు. రాష్ట్రానికి ఏ పరిశ్రమ రాకూడదని ప్రతిపక్షం కుట్రలు పన్నుతోందన్నారు. బల్క్ డ్రగ్ పార్క్ రాకుండా కేంద్రానికి టీడీపీ నాయకుడు యనమల రామకృష్ణుడు పర్యావరణ ఇబ్బందులు వస్తాయంటూ లేఖలు రాస్తున్నారని, ఇదేం పద్ధతని ప్రశ్నించారు. మూడు రాష్ట్రాలకు మాత్రమే డ్రగ్ పార్కులకు అవకాశం దక్కిందన్నారు. డ్రగ్ పార్క్ ద్వారా రూ.15 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయని, వేలాది నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. అటువంటి ప్రాజెక్టును అడ్డుకోవడం వారి దుర్బుద్ధికి నిదర్శనమని చెప్పారు.

ఖనిజం తవ్వకపోయినా డెడ్ రెంట్ చెల్లించాలి

- అనుమతులు రాలేదన్న కారణంతో చెల్లించబోమంటే కుదరదు
- న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు తీర్పు

సాక్షి, అమరావతి: అనుమతులు రాకపోవడం వల్ల మైనింగ్ జరపలేదన్న కారణంతో గనుల శాఖకు చెల్లించాల్సిన డెడ్ రెంట్ (మైనింగ్ లీజు రాయల్టీలో చెల్లించాల్సిన కనీస మొత్తం)ను ఆపడానికి వీల్లేదని హైకోర్టు తేల్చి చెప్పింది. మైనింగ్ లీజు పొందిన తరువాత ఆ ప్రాంతంలో కార్యకలాపాలు నిర్వహించినా, నిర్వహించకున్నా డెడ్ రెంట్ చెల్లించాలని స్పష్టంచేసింది. మంగళూర్ మినరల్స్ ప్రైవేట్ లిమిటెడ్ పిటిషన్‌ను కొట్టేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ఇటీవల తీర్పునిచ్చారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోట మండలం సిద్ధవరం పరిధిలో 260 ఎకరాల్లో సిలికా శ్యాండ్ తవ్వకాలకు మంగళూర్ మినరల్స్ ప్రైవేట్ లిమిటెడ్ 2003లో 20 ఏళ్లకు లీజు పొందింది. మైనర్ మినరల్స్ తవ్వకాలకు పర్యావరణ అనుమతులు తప్పనిసరి.. అంటూ నోటీసు అందడంతో 2006లో తవ్వకాలను నిలిపేసింది. 2017–18 వరకు డెడ్ రెంట్ చెల్లించింది. ఆ తరువాత ఆపేసింది. డెడ్ రెంట్ చెల్లించాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ రఘునందన్‌రావు... ఒప్పందం ప్రకారం తవ్వకాలకు అనుమతులు పొందే బాధ్యత లీజు పొందిన వ్యక్తిదేనని అన్నారు. మైనింగ్ నిలిపేశామన్న కారణంతో డెడ్ రెంట్ చెల్లించకుండా ఉండటానికి వీల్లేదన్నారు.

కుప్పంలోనే కుదేలయ్యావ్..
పులివెందులలో ఏం చేస్తావు?

- చంద్రబాబుపై మంత్రి జోగి రమేష్ మండిపాటు
- సెప్టెంబర్ 1ని అంతర్జాతీయ వెన్నుపోటు దినోత్సవంగా జరపాలి
- డిసెంబర్ నాటికి డీబీటీ ద్వారా రూ.2 లక్షల కోట్ల సాయం



సాక్షి, అమరావతి: కుప్పంలో వరుస ఓటములతో కుదేలైన చంద్రబాబు.. పులివెందులకు వెళ్లి ఏమి పీకుతారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ మండిపడ్డారు. సీఎం జగనన్న ఇలాకాను టచ్ చేసే దమ్ముందా అని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి, ఆయన పదవిని లాక్కున్న సెప్టెంబర్ ఒకటో తేదీన చంద్రబాబు పండుగ చేసుకుంటున్నారని, నిస్సిగ్గుగా, నిర్లజ్జగా మళ్లీ ఎన్టీఆర్ గురించి మాట్లాడుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. సెప్టెంబర్ ఒకటో తేదీని అంతర్జాతీయ వెన్నుపోటు దినోత్సవంగా జరపాలన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వల్లకాటికి వెళ్లిపోతున్న టీడీపీని తాళ్లు, బుల్డోజర్లు, జేసీబీలతో లేపాలని పచ్చపత్రికలు, చానళ్లు విశ్వప్రయత్నం చేస్తున్నాయని, వారు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం శూన్యమన్నారు. సెప్టెంబర్ రెండో తేదీ వైఎస్సార్ వర్ధంతి నుంచి ప్రజలను దృష్టి మరల్చేందుకు టీడీపీ విస్తృత స్థాయి సమావేశం... అంటూ చంద్రబాబు డ్రామా మొదలు పెట్టారన్నారు. మంత్రి జోగి రమేష్ ఇంకా ఏమన్నారంటే..

స్టేలు విత్ డ్రా చేసుకునే దమ్ముందా?

- రూ.2 లక్షల కోట్ల అవినీతి జరిగిందని బాబు మాట్లాడుతున్నాడు. దమ్ముంటే, సత్తా ఉంటే ఆ అవినీతిని నిరూపించాలని ఛాలెంజ్ చేస్తున్నా. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా ప్రజలకు అందించే సాయం వచ్చే డిసెంబర్ నాటికి రూ.2 లక్షల కోట్లకు చేరుతుంది. ఇప్పటికే రూ.1.75 లక్షల కోట్లు ప్రజలకు చేరాయి.
- శ్యాండ్, మైన్స్, వైన్ దోపిడీ జరిగింది చంద్రబాబు ప్రభుత్వంలోనే. అవినీతి మీద కోర్టులకు వెళ్లి స్టేలు తెచ్చుకున్నారు. స్టేలు విత్ డ్రా చేసుకునే దమ్ము చంద్రబాబుకు ఉందా? సీబీఐ విచారణ జరిగితే బాబు జైలుకు వెళ్లడం ఖాయం.
- డాక్టర్ వైఎస్సార్‌ను ప్రజల గుండెల నుంచి చంద్రబాబు తొలగించలేడు. ఆ మహనీయుడి పేరు చెబితే ఆరోగ్యశ్రీ, ఉచిత విద్య, 108, 104, పేదలకు ఇళ్లు.. వంటి పథకాలు గుర్తుకొస్తాయి. చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో ఒక్కటి కూడా చెప్పుకోదగిన పథకం లేదు.

ఈసారి ఒక్క స్థానం కూడా రాదు

- రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు, పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి పెద్ద ఎత్తున సంస్థలు ముందుకు వస్తుంటే.. చంద్రబాబు మాత్రం ఏపీ పారిశ్రామికంగా వెనుకబడిందని మాట్లాడటం దారుణం. సంక్షేమాభివృద్ధిని చూసి తట్టుకోలేక కడుపు మంట ఎక్కువైంది. అచ్చెన్న, బుచ్చెయ్య, గాలి, ధూళి, పయ్యావుల.. వీళ్లంతా ఎంతగా గొంతు చించుకున్నా, వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్ ప్రజా బలానికి కొట్టుకుపోతారు.
- చంద్రబాబుకు అధికారంలో ఉంటే దోచుకోవడం, దాచుకోవడమే తెలుసు. అదే మేము.. ఫలానా పనులు చేశామంటూ నేరుగా ప్రజల ఇళ్ల వద్దకే వెళ్లి ధైర్యంగా చెబుతున్నాం. సమస్యలుంటే పరిష్కరిస్తున్నాం. చంద్రబాబు ఏనాడైనా ఇలా చేశారా? బాబు దగాకోరు పాలన చూసిన ప్రజలు 23 స్థానాలకు పరిమితం చేశారు. అయినా తీరు మారనందుకే వచ్చే ఎన్నికల్లో ఒక్క స్థానం కూడా రాదు... అని జోగి రమేష్ అన్నారు.

ఆంధ్రజ్యోతి కథనం అవాస్తవం

ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ డి.మురళీధర్‌రెడ్డి



సాక్షి, అమరావతి: 'ముందు బిల్లులు ఇవ్వండి' అనే శీర్షికతో శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనంలో బయోమెడికల్ పరికరాల నిర్వహణ టెండర్‌లపై చేసిన ఆరోపణలన్నీ అవాస్తవం అని ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ డి.మురళీధర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ప్రకటన విడుదల చేశారు. బయోమెడికల్ పరికరాల నిర్వహణకు సర్వీస్ ప్రొవైడర్ ఎంపిక కోసం టెండర్ల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించామని, బిడ్లు దాఖలు చేసిన రెండు కంపెనీలు టెక్నికల్‌గా అర్హత సాధించడంతో రివర్స్ టెండర్ చేపట్టామని ఆయన తెలిపారు. ఎల్1గా నిలిచిన సంస్థ అప్పటికే పనిచేస్తున్న రాష్ట్రాలకు లేఖలు రాసి వారి నుంచి వచ్చిన స్పందన ఆధారంగా ఆ సంస్థకు బాధ్యతలు అప్పగించడం జరిగిందన్నారు. దీనిపై అగ్రిమెంట్ చేసుకోవాలని ఎన్‌హెచ్‌ఎం డైరెక్టర్‌కు జూన్ 27న లేఖ రాశామని, ఆ ప్రక్రియ ఇంకా కొనసాగుతోందన్నారు. అయితే, టెండర్ ప్రక్రియ పూర్తయింది కాబట్టి, ఎంవోయూ చేసుకోకుండానే మొదటి నెల బిల్లుగా రూ.5.5 కోట్లు తమకు ఇవ్వాలని సంస్థ నుంచి లేఖ వచ్చిందంటూ ఆంధ్రజ్యోతి రాసిందని, నిజానికి ఎటువంటి లేఖ అందలేదని స్పష్టం చేశారు. వైద్య శాఖ, ఏపీఎంఎస్ఐడీసీ ఉన్నతాధికారులు కలిసి దాదాపు 3.5 శాతం ధరకే పరికరాల నిర్వహణ చేస్తామని కంపెనీకి కట్టబెట్టారని కథనంలో ఆరోపించారన్నారు. పెద్ద పరికరం, చిన్న పరికరం నిర్వహణ మధ్య వ్యత్యాసాలను సగటుగా చేసుకుని టెండర్‌లో కంపెనీ కోట్ చేసినట్టు తెలిపారు. గతంలో బయోమెడికల్ పరికరాల నిర్వహణ కోసం ఎంపిక చేసిన సంస్థ పనితీరు మెరుగ్గా లేనందునే కాంట్రాక్ట్ రద్దు చేశామన్నారు. ముడుపులు ఇచ్చారు కాబట్టే ఎల్1 కంపెనీకి కాంట్రాక్ట్ కట్టబెట్టారని ఆరోపించడం సరికాదన్నారు. ఈ అంశంపై ఇప్పటికే పలుమార్లు వివరణ ఇచ్చినా పదే పదే ఏపీఎంఎస్ఐడీసీ ప్రతిష్టకు భంగం కలింగించేలా తప్పుడు కథనాలను ప్రచురించడం సరికాదన్నారు. ఇదే తీరు పునరావృతం అయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

వేగంగా పోలవరం

▶ మొదటి పేజీ తరువాయి

ఎదుర్కొంటోంది. పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరగా పరిష్కరించాలి.

- రాయలసీమలోని ఉమ్మడి నాలుగు జిల్లాలు, ఉత్తరాంధ్రలోని ఉమ్మడి మూడు జిల్లాలు వెనుకబడి ఉన్నాయి. ఆ జిల్లాలకు ప్రత్యేకంగా అభివృద్ధి ప్యాకేజీ ఇవ్వనున్నట్లు విభజన చట్టంలో పేర్కొనడమే కాకుండా పార్లమెంట్‌లో అప్పటి ప్రధాన మంత్రి హామీ ఇచ్చారు. బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇస్తామని ప్రకటించారు. ఏడు జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ కింద రూ.24,350 కోట్లకు ప్రణాళికా సంఘం సవివరమైన ప్రాజెక్టు రిపోర్టును కేంద్రానికి సమర్పించింది. అయితే, కేంద్ర ప్రభుత్వం రూ.2,100 కోట్లను మాత్రమే పరిగణనలోకి తీసుకుంది. ప్రస్తుతం నీతి ఆయోగ్ దగ్గర పెండింగ్‌లో ఉంది. జనాభా, ద్రవ్యోల్బణం పరిగణనలోకి తీసుకుని బుంధేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ కింద ఏడు జిల్లాలకు రూ.25,000 కోట్ల ప్యాకేజీ ఇవ్వాలి.
- రాయలసీమ కరువు నివారణ ప్రాజెక్టు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టులకు.. పీఎంకేఎస్‌వై సవరించిన మార్గదర్శకాల కింద మద్దతు ఇవ్వాలి. ఈ రెండు పథకాల వల్ల కొత్త ప్రాంతానికి నీటి పారుదల సౌకర్యం, తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు నీటి సరఫరాకు అవకాశం కలుగుతుంది. తద్వారా ఈ ప్రాంతాలను పీడిస్తున్న కరువు, పేదరికం, నిరుద్యోగ సమస్య శాశ్వతంగా దూరం అవుతుంది.

పారిశ్రామిక రాయితీలు పొడిగించాలి

- విభజనతో ఏపీ హైదరాబాద్‌ను కోల్పోవడంతో పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ప్రాంతాలు లేవు. అందువల్ల రాష్ట్రాభివృద్ధి అవకాశాలు తగ్గిపోయాయి. ఈ నేపథ్యంలో విభజన చట్టంలోని సెక్షన్ 94 కింద (2) రాష్ట్రంలో పారిశ్రామికీకరణను ప్రోత్సహించేందుకు ఐదేళ్ల కాలానికి పారిశ్రామిక రాయితీ ఇస్తామని పేర్కొన్నారు. అలా కాకుండా ప్రత్యేక హోదా కలిగిన రాష్ట్రాల తరహాలో పారిశ్రామిక రాయితీలను పొడిగించాలి.
- విభజన చట్టంలోని షెడ్యూల్ 13లో విశాఖపట్నం కేంద్రంగా కొత్త రైల్వే జోన్ ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం 2019 ఫిబ్రవరిలో ప్రకటించింది. వీలైనంత త్వరగా రైల్వే జోన్ ఏర్పాటుకు దక్షిణాది రాష్ట్రాల మండలి చైర్మన్ హోదాలో జోక్యం చేసుకోవాలని కోరుతున్నాం.
- విభజన చట్టంలోని సెక్షన్ 66 ప్రకారం వివిధ సంస్థల ఆస్తుల విభజన కోసం ఉత్తర్వు జారీ చేసే అధికారం కేంద్రానికి ఉంది. విభజన జరిగి పదేళ్లు గడుస్తున్నా సంస్థల ఆస్తుల విభజన పూర్తి కాకపోవడంతో పరిపాలన పరమైన ఇబ్బందులను రాష్ట్రం ఎదుర్కొంటోంది. పౌర సేవలపైన ప్రభావం పడుతోంది. ఈ నేపథ్యంలో కేంద్రం తన అధికారాలను వినియోగించి త్వరగా ఆస్తుల పంపిణీ పూర్తికి ఆదేశాలు జారీ చేయాలి.
- విభజన చట్టంలోని సెక్షన్ 93 కింద షెడ్యూల్ 13లో జాతీయ స్థాయి ప్రాముఖ్యత గల వ్యవసాయ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం రూ.135 కోట్ల సాయం అందించి రాష్ట్ర వ్యవసాయ యూనివర్సిటీనే జాతీయ స్థాయి యూనివర్సిటీగా పరిగణించాలని సూచించింది. ఏపీ వ్యవసాయ ఆధారిత రాష్ట్రం అయినందున జాతీయ ప్రాముఖ్యత కలిగిన వ్యవసాయ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కోరుతున్నాం.
- విభజన అనంతరం రాష్ట్రం ఆర్థికంగా తీవ్ర సమస్యలను ఎదుర్కొంటోంది. విభజన చట్టంలో పేర్కొన్న మేరకు రెవెన్యూ లోటు గ్రాంటును ఇవ్వాలి. ఈ గ్రాంటు మంజూరులో జాప్యం వల్ల రాష్ట్ర అభివృద్ధిపై ప్రభావం పడుతోంది.

ఆస్తుల పంపిణీపై ఇద్దరు సీఎస్‌లతో భేటీ

విభజన చట్టంలోని షెడ్యూల్స్‌లో గల ఇన్‌స్టిట్యూషన్స్ ఆస్తులు, అప్పుల పంపిణీలో జాప్యంపై ఇరు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా.. హోం శాఖ కార్యదర్శికి సూచించారు. చట్టంలోని నిబంధనల మేరకు ఏపీ, తెలంగాణ ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులతో చర్చించి.. ఆస్తుల పంపిణీ అంశాన్ని పరిష్కరించాలని చెప్పారు.

కోర్టుల్లో వసతులు కల్పించాలి

- సీఎం సహకారం అందిస్తామనడం శుభపరిణామం
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్



బద్వేలులో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనాన్ని ప్రారంభిస్తున్న జస్టిస్ బట్టు దేవానంద్

బద్వేలు అర్బన్: కక్షిదారులకు సత్వర న్యాయం అందాలంటే ముందుగా న్యాయస్థానాల్లో మౌలిక వసతులు కల్పించాలని, ఈ బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని హైకోర్టు న్యాయమూర్తి, కడప అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ బట్టు దేవానంద్ అన్నారు. వైఎస్సార్ జిల్లా బద్వేలులో నూతనంగా ఏర్పాటు చేసిన సీనియర్ సివిల్ జడ్జి కోర్టును శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ బట్టు దేవానంద్ మాట్లాడుతూ కోర్టుల్లో సిబ్బంది కొరత, మౌలిక వసతుల లేమితో పనులు వేగంగా జరగడం లేదని తెలిపారు. కక్షిదారులతో న్యాయవాదులు నిజాయితీగా వ్యవహరిస్తూ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. న్యాయస్థానాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, న్యాయవ్యవస్థకు సంబంధించిన అన్ని విషయాల్లో సహాయ సహకారాలు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల విజయవాడలో ప్రకటించడం శుభపరిణామమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సోలమన్‌రాజు, స్టేట్ బార్ కౌన్సిల్ మెంబర్ వీఆర్ రెడ్డి, జిల్లా న్యాయసేవాధికారి సంస్థ సెక్రటరీ, కడప సీనియర్ సివిల్ జడ్జి కవిత, సీనియర్ సివిల్ జడ్జి సరస్వతి, బద్వేలు జూనియర్ సివిల్ జడ్జి కాశీవిశ్వనాథాచారి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి, ఆర్డీవో ఆకుల వెంకటరమణ, డీఎస్పీ ఎస్ఆర్ వంశీధర్‌గౌడ్, జిల్లాలోని వివిధ న్యాయస్థానాల జడ్జిలు, బద్వేలు బార్ అసోసియేషన్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీజీ కలలు సాకారం చేసిన సీఎం

గ్రామ, వార్డు సచివాలయాల ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్యే గోపిరెడ్డి



కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, వెంకటరామిరెడ్డి తదితరులు

నరసరావుపేట: రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారని గ్రామ, వార్డు సచివాలయాల ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కాకర్ల వెంకటరామిరెడ్డి, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. తమ ఉద్యోగాల ప్రొబేషన్ డిక్లేర్, పే స్కేలు నిర్ధారిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేయడాన్ని పురస్కరించుకుని స్థానిక గ్రామ, వార్డు సచివాలయాల ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం భువనచంద్ర టౌన్‌హాలులో 'థ్యాంక్యూ సీఎం సార్' అంటూ ఆత్మీయ సభ నిర్వహించారు. సభకు అసోసియేషన్ కార్యదర్శి షేక్ మహమద్ అలీ అధ్యక్షత వహించారు. వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థకు ముఖ్యమంత్రి ఎటువంటి హాని చేయబోరని, ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. ప్రజలకు కార్యాలయాల చుట్టూ తిరిగే బాధ తప్పాలని, నిరుద్యోగులకు ఉపాధి చూపించాలనే ఆలోచనతోనే సచివాలయ వ్యవస్థ ఏర్పడిందన్నారు.

సచివాలయాల ఏర్పాటు ఓ చరిత్ర: గోపిరెడ్డి

నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి ఒక సచివాలయం ఉండే దశ నుంచి ప్రతి గ్రామానికి ఒక సచివాలయం చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 10,700 సచివాలయాలను తీసుకురావటం ఒక చరిత్ర అన్నారు. ప్రజల ముంగిటకే సచివాలయ ఉద్యోగుల ద్వారా పరిపాలన తీసుకురావటం సీఎం జగన్ లక్ష్యమన్నారు. ఇక అతిథులు కేక్ కట్‌చేయగా, వారిని ఉద్యోగులు సన్మానించారు.

కుటిలవర్తనుడు యెహోవాకు అసహ్యుడు. యథార్థవంతులకు ఆయన తోడుగా నుండును.

– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం
దక్షిణాయనం, వర్ష ఋతువు
భాద్రపద మాసం, తిథి: శు.అష్టమి ఉ.7.48 వరకు తదుపరి నవమి తె.5.32 వరకు (తెల్లవారితే సోమవారం), నక్షత్రం: జ్యేష్ఠ రా.8.02 వరకు తదుపరి మూల
వర్జ్యం: రా.3.27 నుండి 4.57 వరకు
దుర్ముహూర్తం: సా.4.32 నుండి 5.21 వరకు
అమృతఘడియలు: ఉ.11.41 నుండి 1.11 వరకు.

సూర్యోదయం : 5.49
సూర్యాస్తమయం : 6.10
రాహుకాలం : సా.4.30 నుండి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుండి 1.30 వరకు

నితీశ్ కుమార్ (బిహార్ సీఎం)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

ప్రధాని అవడం ఏముంది! ఎవరైనా అవొచ్చు. వాజ్‌పేయి అంతటి మనిషి ప్రధాని అయ్యారని చెప్పి... ఆయనపై గౌరవంతో మోదీజీ ఏమైనా ప్రధాని కాకుండా ఆగిపోయారా? మోదీజీ వంటి ఒక వ్యక్తి భారతావనికి ప్రధానిగా ఉండేవారని చరిత్ర పుస్తకాలలో ఉన్నా కూడా భావితరాల్లో ఎవరైనా ఆత్మగౌరవంతో ప్రధాని అవకుండా ఆగిపోతారా?

ప్రధాని ఎవరైనా అవొచ్చు. ప్రధాని 'అభ్యర్థి' అవడమే... ప్రధాని అవడం కన్నా పెద్ద సంగతి. ప్రతి పార్టీలో వాజ్‌పేయిలు, మోదీజీలు ఉంటారు. "అభ్యర్థి ఎవరైతేనేం, అయ్యేది ప్రధానేగా.." అని వాజ్‌పేయిలు అంటారు. "ప్రధాని ఎవరైతేనేం, ప్రధానం అభ్యర్థేగా" అని మోదీజీలు అంటారు. ఇక ఏకాభిప్రాయం ఎలా కుదురుతుంది? ఐతే అందరూ వాజ్‌పేయిలు అవ్వాలి. లేదంటే అందరూ మోదీజీలు అవ్వాలి. అయ్యేపనేనా?!

ఒక పార్టీలోనే అందరూ వాజ్‌పేయిలు, లేదా అందరూ మోదీజీలు కాలేనప్పుడు నాలుగైదు పార్టీలు కలిసి తమలోంచి ఒక వాజ్‌పేయిని, లేదా ఒక మోదీజీని ప్రధాని అభ్యర్థిగా ప్రకటించడం అన్నది కేసీఆర్ పాట్నా వస్తేనో, కేజ్రీవాల్ గుజరాత్ వెళ్లొస్తేనో ఒకపూటలో జరిగిపోతుందా?!



బిహార్‌లో ఒక మోదీజీ ఉన్నారు. సుశీల్ కుమార్ మోదీ ఆయన. బీజేపీలో పెద్ద మనిషి. పదకొండేళ్లు ఉప ముఖ్యమంత్రిగా నాతో ఉన్నారు. ఇప్పుడాయన రాజ్యసభ సభ్యులు. మంచి ఫ్రెండ్ నాకు. రామలక్ష్మణులు అనేవాళ్లు మమ్మల్ని. రామలక్ష్మణులు ఫ్రెండ్స్‌లా ఉన్నారేమో తెలీదు. మేము మాత్రం అన్నదమ్ముల్లా ఉండేవాళ్లం. వయసులో నేను సీనియర్. అనుభవంలో ఆయన సీనియర్. రాష్ట్రంలోని రెండు సభల్లో, కేంద్రంలోని రెండు సభల్లో సభ్యుడైన ఏకైక బిహార్ నేత ఆయన.

అంతటి విజ్ఞుడు, అనుభవజ్ఞుడు ఏమంటారంటే... కేసీఆర్ పాట్నా వచ్చి నన్ను అవమానించి వెళ్లారట!! అది ఎలాంటి అవమానం అంటే.. ఆయన నన్ను ప్రధాని అభ్యర్థిగా ప్రకటించకుండానే వెళ్లిపోయారట!!

బీజేపీలో కింది నుంచి పైదాకా అంతా మూర్తీభవించిన మోదీజీలే కనిపిస్తున్నారు!

కేసీఆర్, నేను ఈ దేశానికి ప్రధానమంత్రి అవాలని ఎవరికి వాళ్లం పగటి కలలు కంటున్నామని సుశీల్ కుమార్ అంటున్నారు. అలాంటప్పుడు కేసీఆర్ తన కలను పక్కన పెట్టి, పాట్నాలో నా కలను కనకపోవడం నాకు అవమానం ఎలా అవుతుంది?

"నితీశ్‌జీ! మీరు పగటి కలలు కంటున్నారని సుశీల్‌జీ అంటున్నారు కానీ, నిజానికి అది సుశీల్‌జీ రేయింబవళ్లు కన్న కల. ఉప ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మీ మెప్పు కోసం సుశీల్‌జీ మిమ్మల్ని 'పీఎం మెటీరియల్' అంటుండేవారు గుర్తుందా.." అన్నారు నీరజ్. జేడీ(యు) స్పోక్స్ పర్సన్ ఆయన.

నవ్వొచ్చేసింది. పక్కనే రాజీవ్ రంజన్‌సింగ్, ఉమేశ్ కుష్వాహ ఉన్నారు.

"రాజీవ్‌జీ! నాకు తెలీకుండా మీరేమైనా నేను ప్రధాని అభ్యర్థినని సుశీల్‌జీతో అన్నారా?" అని అడిగాను.

"లేదు నితీశ్‌జీ" అన్నారు రాజీవ్. పార్టీ నేషనల్ ప్రెసిడెంట్ ఆయన.

"ఉమేశ్‌జీ! మీరేమైనా నేను ప్రధాని అభ్యర్థినని సుశీల్‌జీతో అన్నారా?" అని అడిగాను.

"లేదు నితీశ్‌జీ.." అన్నారు ఉమేశ్. పార్టీ స్టేట్ ప్రెసిడెంట్ ఆయన.

నేషనల్ లెవల్‌లో ఎవరూ అనకుండా, స్టేట్ లెవల్‌లోనూ ఎవరూ అనకుండా ప్రధాని అవ్వాలని నేను కలగంటున్నట్లు సుశీల్‌జీ అనుకున్నారంటే అది సుశీల్‌జీకో, మోదీజీకో వచ్చిన పీడకల అయి ఉండాలి. వాళ్లకు పీడకల అంటే అది దేశ ప్రజలకు పీడ విరగడయ్యే కల.

ప్రధాని అవడం ఏముంది? ఎవరైనా అవొచ్చు. వాజ్‌పేయి వంటి ప్రధాని దగ్గర పనిచేసే భాగ్యమే అందరికీ దక్కదు. అది నాకు దక్కింది. ప్రధాని మోదీజీకి కూడా దక్కనిది నాకు దక్కింది. ప్రధాని అవడం కన్నా, 'ప్రధాని' అభ్యర్థి అవడం కన్నా కూడా పెద్ద సంగతి అది!

మాస్కో టూ హైదరాబాద్!

ఓల్గా సే గంగ, గంగా సే ఓల్గా. ప్రాంతం ఏదైనా దేశం ఏదైనా సరే, అసమర్థుల జీవయాత్ర ఒకే రకంగా ఉంటుందని పలుమార్లు రుజువైంది. ఖాతాల్లో ఎన్ని ఘనతలున్నా అవి వారికి ఉపయోగపడవు. కాలక్రమంలో ఆ ఘనతలన్నీ విజేతల ఖాతాల్లోకి బదిలీ అవుతుంటాయి. ఈ వారం రష్యాలో, తెలంగాణలో జరిగిన రెండు పరిణామాలు ఇదే సంగతిని మరోసారి నిర్ధారించాయి. రష్యాలో గోర్బచెవ్ మరణం, హైదరాబాద్ సంస్థాన విలీనాంశం ఈ పరిణామాలు.

మిహాయిల్ సెర్గీవిచ్ గోర్బచెవ్ సోవియట్ యూనియన్‌కు చిట్టచివరి అధ్యక్షుడిగా, కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. అయ్యవారిని చేయబోతే కోతి తయారైందని మన దగ్గర ఒక సామెత ఉన్నది. ఆయన కూడా ఒక లెనిన్‌ను సృష్టిద్దామనుకున్నాడు. సదరు సృష్టికార్యం వికటించి ఎల్సిన్ తయారయ్యాడు. ఎల్సిన్ ముదిరి పుతిన్ అవతారమెత్తాడు. జార్ చక్రవర్తుల నిరంకుశ కాలం నాటి రష్యాను 'జాతుల బందిఖానా'గా లెనిన్ అభివర్ణించాడు. కజకిస్థాన్ వగైరా మధ్యఆసియా దేశాలు, ఆర్మేనియా తదితర కాకేసస్ ప్రాంత రాజ్యాలు, ఉక్రెయిన్, బెలారస్ వంటి తూర్పు యూరప్ జాతులు, బాల్టిక్ తీర జాతులు, ఫిన్లాండ్... రష్యన్ సామ్రాజ్యంలో అంతర్భాగంగా ఉండేవి.



జనతంత్రం

వర్ధెల్లి మురళి

భాషాపరంగా, సాంస్కృతికంగా నాన్‌–రష్యన్ జాతులన్నీ తీవ్రమైన వివక్షకు, అణచివేతకు గురయ్యేవి. విప్లవం విజయవంతమైన తర్వాత ఏర్పడిన సోవియట్ యూనియన్‌లో ఈ జాతులన్నింటికీ విడిపోయే హక్కుతో సహా సమస్త ప్రజాస్వామిక హక్కులను కల్పించాలని లెనిన్ సంకల్పించారు. ఆ మేరకు బోల్షివిక్ పార్టీ ఒక ప్రకటన కూడా చేసింది. ఆ వెంటనే ఫిన్లాండ్ చేసిన స్వాతంత్ర్య ప్రకటనను కూడా లెనిన్ అనుమతించారు. మిగిలిన జాతుల సమస్యల్ని కూడా పరిష్కరించడానికి ఒక ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటుచేసి స్టాలిన్‌ను ఆ శాఖకు మంత్రిగా నియమించారు.

అనతికాలంలోనే లెనిన్ అనారోగ్యానికి గురికావడం, కొద్దిరోజుల్లోనే చనిపోవడంతో పాలనా పగ్గాలు స్టాలిన్ చేతికి చిక్కాయి. స్టాలిన్ స్వయంగా రష్యన్ కాదు. జార్జియన్. అయినప్పటికీ ఇతర జాతులేవీ యూనియన్ నుంచి విడిపోకుండా కమ్యూనిస్టు పార్టీ పెత్తనం ద్వారా జాగ్రత్తపడ్డారు. జారిస్టు రష్యా నాటి వివక్ష, భాషా సంస్కృతుల అణచివేతను అమలు చేయలేదు గానీ జాతుల స్వతంత్ర కాంక్షను మాత్రం ఉక్కుపాదంతో అణచివేశారు. స్టాలిన్ హయాంలో సోవియట్ యూనియన్ ఆర్థికాభివృద్ధికి వేగంగా పునాదులు పడినప్పటికీ, ప్రజాస్వామిక హక్కులు మాత్రం మృగ్యమయ్యాయి. ఏక పార్టీ నియంతృత్వం కొనసాగింది. సొంత పార్టీలో ప్రత్యర్థులను కూడా వెంటాడి వేటాడారు. లెనిన్ వారసుడిగా అధికారంలోకి రావాల్సిన ట్రాట్స్కీ వంటి మేధావిని కూడా ప్రవాసంలోనే మట్టుబెట్టారు. అయితే స్టాలిన్ అటువంటి కఠిన వైఖరి అవలంబించకపోయినట్లయితే సోవియట్ యూనియన్‌ను బాల్యదశలోనే సామ్రాజ్యవాద శక్తులు కడతేర్చి ఉండేవని స్టాలిన్ అనుకూల వర్గం వాదించింది. స్టాలిన్ మరణానంతరం ఆయన విధానాలను తీవ్రంగా వ్యతిరేకించే నికటా కృశ్చేవ్ అధికారంలోకి వచ్చారు. అయినా అంతర్గత ప్రజాస్వామ్యం విషయంలో పెద్దగా మార్పు రాలేదు. దీనికి సంబంధించి ఒక ఆసక్తికరమైన ఉదంతం ప్రచారంలో ఉన్నది. ఒక సమావేశంలో స్టాలిన్‌ను విమర్శిస్తూ కృశ్చేవ్ మాట్లాడుతున్నారట. అప్పుడాయన దగ్గరకు ఒక చీటీని ఎవరో పంపించారు. కృశ్చేవ్ ఆ చీటిని విప్పి చదివారు. 'స్టాలిన్ జీవించి ఉన్నప్పుడు మీరెందుకు ఈ మాటలన్నీ చెప్పలేద'ని అందులో ఉన్నదట. చదివిన తర్వాత ఆ 'చీటిని పంపిందెవరో చేయెత్తండ'ని కృశ్చేవ్ అడిగారట. ఎవరూ ఎత్తలేదు. కాసేపు నిరీక్షించిన తర్వాత 'ఇదిగో ఇందుకే నేను కూడా మాట్లాడలేద'ని కృశ్చేవ్ నవ్వుతూ చెప్పారట!

గోర్బచెవ్ చేతికి పార్టీ పగ్గాలొచ్చేనాటికి దేశంలో ప్రజాస్వామ్య ఆకాంక్ష పెరగసాగింది. ప్రచ్ఛన్న యుద్ధం కారణంగా ఆర్థిక పరిస్థితి దిగజారింది. అఫ్గానిస్తాన్ యుద్ధంతో చేతులు కాల్చుకున్నది. జనంలో అసంతృప్తి వ్యాపించడం మొదలైంది. ఈ పరిస్థితికి చెక్ పెట్టాలని గోర్బచెవ్ సంకల్పించారు. ప్రచ్ఛన్న యుద్ధానికి ముగింపు పలకడం కోసం రోనాల్డ్ రీగన్, మార్గరెట్ థాచర్‌లతో చర్చలు జరిపారు. వీరిద్దరూ ఆయా దేశాల్లో ఉక్కు మనుషులుగా పేరుగాంచారు. గోర్బచెవ్‌కు స్వదేశంలో మెతక మనిషనే పేరున్నది. పశ్చిమ దేశాలతో ఒప్పందం మేరకు భారీ సంఖ్యలో అణ్వస్త్రాలను ధ్వంసం చేశారు. అఫ్గానిస్తాన్ నుంచి ఉపసంహరించుకున్నారు. తూర్పు యూరప్ దేశాల్లోని కమ్యూనిస్టు ప్రభుత్వాలు ఒకదాని తర్వాత ఒకటి కూలిపోతుంటే ప్రేక్షకపాత్ర పోషించాడే తప్ప సైన్యాన్ని వినియోగించలేదు. బెర్లిన్ గోడ బద్దలవడాన్ని అనుమతించారు. జర్మనీల ఏకీకరణకు పరోక్షంగా సహకరించారు. ఆర్థిక రంగంలో పెరిస్త్రోయికా (పునర్నిర్మాణం), రాజకీయ రంగంలో గ్లాస్‌నోస్త్ (పారదర్శకత) విధానాలను అమలు చేశారు. సంస్కరణలను మరింత వేగవంతం చేయాలన్న ఎల్సిన్ తదితర ప్రజాస్వామిక వాదుల ఒత్తిడికి లొంగి ఒకేసారి సోవియట్ వ్యవస్థ తలుపులు, కిటికీలను బార్లా తెరిచేశారు. వీచే గాలుల ఉధృతికి తనను తాను నిభాయించుకోలేకపోయారు.

పరిస్థితులను తన అదుపులో ఉంచుకుంటూ నెమ్మది నెమ్మదిగా తలకెత్తుకోవలసిన సంస్కరణలను

ఆర్థిక రంగంలో పెరిస్త్రోయికా (పునర్నిర్మాణం), రాజకీయ రంగంలో గ్లాస్‌నోస్త్ (పారదర్శకత) విధానాలను అమలు చేశారు. సంస్కరణలను మరింత వేగవంతం చేయాలన్న ఎల్సిన్ తదితర ప్రజాస్వామిక వాదుల ఒత్తిడికి లొంగి ఒకేసారి సోవియట్ వ్యవస్థ తలుపులు, కిటికీలను బార్లా తెరిచేశారు. వీచే గాలుల ఉధృతికి తనను తాను నిభాయించుకోలేకపోయారు.

పరిస్థితులను తన అదుపులో ఉంచుకుంటూ నెమ్మది నెమ్మదిగా తలకెత్తుకోవలసిన సంస్కరణలను ఒక్కసారిగా చేపట్టారు. అతిపెద్ద ప్రజాస్వామ్యవాదిగా తానే మిగిలిపోవాలన్న దుగ్ధతో సంప్రదాయ కమ్యూనిస్టులకు దూరమయ్యారు. ఇటు ప్రజాస్వామికవాదులకు గోర్బచెవ్ కంటే ఎల్సిన్‌లోనే సమర్థుడైన నాయకుడు కనిపించాడు. గోర్బచెవ్ పరిస్థితి రెంటికీ చెడిన రేవడిగా మారింది. పశ్చిమ దేశాల్లో శాంతిదూత అనే ఇమేజ్ సంపాదించినప్పటికీ, స్వదేశంలో అసమర్థుడిగా ముద్రపడింది. సోవియట్ యూనియన్ పతనాన్ని ఆయన కోరుకోలేదు. ఆర్థిక పునరుజ్జీవనం కోసం మార్కెట్ శక్తులను ఒక మేరకు అనుమతించాలనుకున్నారు. సోషలిస్టు వ్యవస్థలోనే ప్రజాస్వామిక సంప్రదాయాలను పాటించాలనుకున్నారు. కమ్యూనిస్టు పార్టీని సోషల్ డెమోక్రాటిక్ పార్టీగా నడపాలని భావించారు. నిర్వహణా దక్షత లేక అధికారానికి దూరమై ముప్పయ్యేళ్లపాటు పత్రికలకు వ్యాసాలు, పుస్తకాలు రాసుకుంటూ గడిపేశారు. తన చర్యల ఫలితంగా ఎల్సిన్‌లూ, పుతిన్‌లూ పుట్టుకొచ్చి రాజ్యమేలుతుంటే మౌనంగా గమనించారు. ఇరవయ్యో శతాబ్దంలో చరిత్రను మలుపుతిప్పిన కీలక పరిణామానికి శ్రీకారం చుట్టిన మహాసంస్కరణవాది అంత్యక్రియలకు అధికార లాంఛనాలు కూడా దక్కలేదు.

ఒక్కసారిగా చేపట్టారు. అతిపెద్ద ప్రజాస్వామ్యవాదిగా తానే మిగిలిపోవాలన్న దుగ్ధతో సంప్రదాయ కమ్యూనిస్టులకు దూరమయ్యారు. ఇటు ప్రజాస్వామికవాదులకు గోర్బచెవ్ కంటే ఎల్సిన్‌లోనే సమర్థుడైన నాయకుడు కనిపించాడు. గోర్బచెవ్ పరిస్థితి రెంటికీ చెడిన రేవడిగా మారింది. పశ్చిమ దేశాల్లో శాంతిదూత అనే ఇమేజ్ సంపాదించినప్పటికీ, స్వదేశంలో అసమర్థుడిగా ముద్రపడింది. సోవియట్ యూనియన్ పతనాన్ని ఆయన కోరుకోలేదు. ఆర్థిక పునరుజ్జీవనం కోసం మార్కెట్ శక్తులను ఒక మేరకు అనుమతించాలనుకున్నారు. సోషలిస్టు వ్యవస్థలోనే ప్రజాస్వామిక సంప్రదాయాలను పాటించాలనుకున్నారు. కమ్యూనిస్టు పార్టీని సోషల్ డెమోక్రాటిక్ పార్టీగా నడపాలని భావించారు. నిర్వహణా దక్షత లేక అధికారానికి దూరమై ముప్పయ్యేళ్లపాటు పత్రికలకు వ్యాసాలు, పుస్తకాలు రాసుకుంటూ గడిపేశారు. తన చర్యల ఫలితంగా ఎల్సిన్‌లూ, పుతిన్‌లూ పుట్టుకొచ్చి రాజ్యమేలుతుంటే మౌనంగా గమనించారు. ఇరవయ్యో శతాబ్దంలో చరిత్రను మలుపుతిప్పిన కీలక పరిణామానికి శ్రీకారం చుట్టిన మహాసంస్కరణవాది అంత్యక్రియలకు అధికార లాంఛనాలు కూడా దక్కలేదు.

*****

ఈనెల పదిహేడో తేదీ కోసం తెలంగాణలో ఒక రాజకీయ జాతర కార్యక్రమం రూపుదిద్దుకుంటున్నది. హైదరాబాద్ సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనమై 74 సంవత్సరాలైంది. ఇప్పుడు ఏడాది పొడవునా కేంద్ర ప్రభుత్వం విమోచన ఉత్సవాలు జరుపబోతున్నదట! రాష్ట్ర ప్రభుత్వం కూడా ఏడాది పొడుగునా వజ్రోత్సవాలు జరపాలని కేబినెట్ నిర్ణయించింది. అసదుద్దీన్ ఒవైసీ సూచన మేరకు జాతీయ సమైక్యతా ఉత్సవాలుగా నామకరణం చేసింది. ఇంతకుముందు రజతోత్సవాలు, స్వర్ణోత్సవాలు వచ్చిపోయాయి గానీ, ఇంత హడావిడి గతంలో ఎప్పుడూ లేదు. కాలం గడిచిపోతున్నకొద్దీ ఉత్సవ సంరంభాలు తగ్గుముఖం పడతాయి కానీ పెరగడమన్నదే ఒక వింత. ఇదే రాజకీయ వింత!

విలీనానికి 'విమోచనం' అనే పేరుపెట్టి రాజకీయ లబ్ధి కోసం బీజేపీ ప్రయత్నిస్తున్నదని రాజకీయ పరిశీలకుల అభిప్రాయం. స్వాతంత్ర్యం రాకముందు దాదాపు 500 సంస్థానాలు బ్రిటిష్ వారి అనుమతితోనే స్వతంత్ర రాజ్యాలుగా ఉన్నాయి. అందులో చాలావరకు చిన్నచిన్న సంస్థానాలు. హైదరాబాద్, కశ్మీర్ మాత్రమే పెద్ద రాజ్యాలు. స్వతంత్రం వచ్చిన తర్వాత వీటన్నింటినీ ఇండియన్ యూనియన్‌లో విలీనం చేయవలసిన అవసరం ఏర్పడింది. విలీనానికి సిద్ధంగా లేని హైదరాబాద్ సంస్థానంపై కేంద్రం 'పోలీస్ చర్య' జరిపి విలీనం చేసుకున్నది. 'విమోచనం' అనే మాట వచ్చినప్పుడు ఎవరి నుంచి అనే ప్రశ్న వస్తుంది. నిజాం రాజు పరాయి దేశ పాలకుడు కాదు. ఏడెనిమిది తరాలపాటు ఇక్కడే పుట్టి పెరిగిన అసఫ్‌జాహీ వంశస్థుడు. పది తరాలకు ముందు ఇప్పటి ఉజ్బెకిస్థాన్ నుంచి వచ్చిన ఒక పండితుడు షాజహాన్ దగ్గర కొలువులో చేరాడు. క్రమంగా దక్కన్ రాజప్రతినిధులుగా మారి, ఔరంగజేబు మరణం తర్వాత స్వతంత్రరాజులయ్యారు.

ఏడో నిజాం రాజు మీర్ ఉస్మాన్ అలీఖాన్ హయాంలో చెలరేగిన రజాకార్ మూకలను అదుపులో పెట్టడంలో ఆయన విఫలమయ్యారు తప్ప స్వయంగా ఆయన మతసహనం లేనివాడు అనేందుకు ఎటువంటి ఆధారాలు లేవు. అనేక దేవాలయాలు కట్టించాడనే పేరు కూడా ఉన్నది. ఆ రోజుల్లో అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీకి ఐదు లక్షలు విరాళంగా ఇచ్చి, బనారస్ హిందూ విశ్వవిద్యాలయానికి మాత్రం పది లక్షలు విరాళమిచ్చాడు. ఇందులో జనాభానూ, విద్యార్థుల సంఖ్యను దృష్టిలో పెట్టుకున్నాడే తప్ప మతాన్ని ఆయన చూడలేదు. విద్య, వైద్య రంగాల్లో ఆయన వేసిన పునాదులను కూడా విస్మరించలేము.

ఒక ఫ్యూడల్ వ్యవస్థకు అధిపతి నిజాం ప్రభువు. ఈ వ్యవస్థ ప్రతినిధులుగా దొరలు, దేశ్‌ముఖ్‌లు గ్రామసీమల్లో చేసిన అరాచకం, దోపిడీ అంతా ఇంతా కాదు. రైతాంగాన్ని పీల్చి

ఒక ఫ్యూడల్ వ్యవస్థకు అధిపతి నిజాం ప్రభువు. ఈ వ్యవస్థ ప్రతినిధులుగా దొరలు, దేశ్‌ముఖ్‌లు గ్రామసీమల్లో చేసిన అరాచకం, దోపిడీ అంతా ఇంతా కాదు. రైతాంగాన్ని పీల్చి పిప్పిచేశారు. దిగువ శూద్రుల్ని వెట్టి బానిసలుగా మార్చివేశారు. ఈ అమానుషత్వానికీ, దోపిడీకీ వ్యతిరేకంగానే కమ్యూనిస్టుల (సంఘం) ఆధ్వర్యంలో రైతుకూలీలు జరిపిన సాయుధ పోరాటం దేశచరిత్రలో సాటిలేని ఒక ఉజ్జ్వల ఘట్టం. హైదరాబాద్‌పై 'పోలీస్ చర్య' జరిగేనాటికి సాయుధ రైతాంగ దళాలు 3 వేల గ్రామాలను భూస్వాముల పీడన నుంచి విడిపించాయి. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగి ఉంటే 'విమోచనం' అనే మాటకు అర్థం ఉండేది. కానీ, 'పోలీస్ చర్య' తర్వాత యూనియన్ సైన్యాలు భూస్వాములను మళ్లీ గ్రామాల్లో ప్రతిష్ఠించాయి. తీవ్రత తగ్గినా దోపిడీ కొనసాగింది. అధికార బదిలీ మాత్రమే జరిగింది తప్ప ప్రజలకు ఏరకమైన విముక్తీ లభించలేదని ఈ పరిణామం స్పష్టం చేసింది.

నల్లగొండ, వరంగల్, ఖమ్మం, కరీంనగర్ ప్రాంతాల్లో కమ్యూనిస్టులూ, మిగిలిన తెలంగాణాతో పాటు మరాఠా, కన్నడ జిల్లాల్లో స్టేట్ కాంగ్రెస్ పార్టీ, ఆర్యసమాజ్‌లు నాడు నిజాం ప్రభుత్వ వ్యతిరేక పోరాటాల్లో పాల్గొన్నాయి. ఈ పోరాటాల్లో హిందువులతో పాటు ముస్లింలు కూడా పెద్దయెత్తున పాల్గొన్నారు. నిజాం ప్రభువు ముస్లిం మతస్థుడు కనుక 'విమోచనం' అనే పదాన్ని పదేపదే వాడటం వల్ల భావోద్వేగాలు తలెత్తి రాజకీయంగా వర్కవుట్ కావచ్చన్న ఆలోచనలో బీజేపీ ఉన్నట్టు కనిపిస్తున్నది. నిజానికి బీజేపీ కానీ, దాని పూర్వరూపమైన 'జనసంఘ్' గానీ పోలీస్ చర్య జరిగేనాటికి పుట్టలేదు. బీజేపీకి దీటుగా ఉత్సవాలను తలకెత్తుకోబోతున్న టీఆర్ఎస్ కూడా అప్పుడు పుట్టలేదు.

పిప్పిచేశారు. దిగువ శూద్రుల్ని వెట్టి బానిసలుగా మార్చివేశారు. ఈ అమానుషత్వానికీ, దోపిడీకీ వ్యతిరేకంగానే కమ్యూనిస్టుల (సంఘం) ఆధ్వర్యంలో రైతుకూలీలు జరిపిన సాయుధ పోరాటం దేశచరిత్రలో సాటిలేని ఒక ఉజ్జ్వల ఘట్టం. హైదరాబాద్‌పై 'పోలీస్ చర్య' జరిగేనాటికి సాయుధ రైతాంగ దళాలు మూడువేల గ్రామాలను భూస్వాముల పీడన నుంచి విడిపించాయి. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగి ఉంటే 'విమోచనం' అనే మాటకు అర్థం ఉండేది. కానీ, 'పోలీసు చర్య' తర్వాత యూనియన్ సైన్యాలు భూస్వాములను మళ్లీ గ్రామాల్లో ప్రతిష్ఠించాయి. తీవ్రత తగ్గినా దోపిడీ కొనసాగింది. అధికార బదిలీ మాత్రమే జరిగింది తప్ప ప్రజలకు ఏ రకమైన విముక్తీ లభించలేదని ఈ పరిణామం స్పష్టం చేసింది.

నల్లగొండ, వరంగల్, ఖమ్మం, కరీంనగర్ ప్రాంతాల్లో కమ్యూనిస్టులూ, మిగిలిన తెలంగాణాతో పాటు మరాఠా, కన్నడ జిల్లాల్లో స్టేట్ కాంగ్రెస్ పార్టీ, ఆర్యసమాజ్‌లు నాడు నిజాం ప్రభుత్వ వ్యతిరేక పోరాటాల్లో పాల్గొన్నాయి. ఈ పోరాటాల్లో హిందువులతో పాటు ముస్లింలు కూడా పెద్దయెత్తున పాల్గొన్నారు. నిజాం ప్రభువు ముస్లిం మతస్థుడు కనుక 'విమోచనం' అనే పదాన్ని పదేపదే వాడటం వల్ల భావోద్వేగాలు తలెత్తి రాజకీయంగా వర్కవుట్ కావచ్చన్న ఆలోచనలో బీజేపీ ఉన్నట్టు కనిపిస్తున్నది. నిజానికి బీజేపీ కానీ, దాని పూర్వరూపమైన 'జనసంఘ్' గానీ పోలీస్ చర్య జరిగేనాటికి పుట్టలేదు. బీజేపీకి దీటుగా ఉత్సవాలను తలకెత్తుకోబోతున్న టీఆర్ఎస్ కూడా అప్పుడు పుట్టలేదు.

వచ్చే అసెంబ్లీ ఎన్నికల కోసం తెలివిగా ఈ తాజా ఎజెండాను బీజేపీ తలకెత్తుకున్నది. రాజకీయ పరిశీలకుల అంచనాల మేరకు నెలరోజుల కిందటి వరకు తెలంగాణలో బీజేపీ మూడో స్థానంలో ఉన్నది. ఎనిమిదేళ్లుగా అధికారంలో ఉన్న టీఆర్ఎస్‌పై సహజంగా ఉండే ప్రభుత్వ వ్యతిరేకత కారణంగా ఆ పార్టీకి కూడా కొత్తగా బలం పెరగడం లేదు. కాంగ్రెస్ పార్టీ పుంజుకుంటున్న దాఖలాలు కూడా లేవు. ఆశ్చర్యకరంగా అనిశ్చిత ఓటర్ల (ఎటూ తేల్చుకోని) సంఖ్య అనూహ్యంగా పెరుగుతున్నదని కొన్ని అనధికార సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఇందులో కాంగ్రెస్ ఓటర్లే ఎక్కువ. ఉపఎన్నిక వాకిట్లో ఉన్న మునుగోడులోనే ఇరవై శాతానికి పైగా అనిశ్చిత ఓటర్లున్నారని అంచనా. కాంగ్రెస్ పార్టీ ఏదైనా అద్భుతాన్ని సృష్టించగలిగితేనే అనిశ్చిత ఓటర్లు అటువైపు మొగ్గుతారు. నిజాం పాలనలో పోరాటాలు జరిపిన కాంగ్రెస్–కామ్రేడ్స్ కళ్లప్పగించి చూస్తుండగానే అదే అంశంపై బీజేపీ – టీఆర్ఎస్‌లు తలపడటం ఎన్నికల ఎత్తుగడగానే పరిగణించాలి. 'సెప్టెంబర్ 17' సాక్షిగా సెమీ ఫైనల్ దశ నుంచి ఫైనల్స్‌లో అడుగు పెట్టాలని బీజేపీ సన్నాహాలు చేస్తున్నది. భావోద్వేగాల ద్వారా అనిశ్చిత ఓటర్లను గెలవాలని అది వలవేస్తున్నది. లౌకిక బాణంతో ఎదుర్కోవడానికి టీఆర్ఎస్ సమాయత్తమవుతున్నది. కాంగ్రెస్ పార్టీ ఏదైనా అద్భుతాన్ని సృష్టిస్తుందా లేదా అన్నదే ఇప్పుడు బిలియన్ డాలర్ల ప్రశ్న. అటువంటి అద్భుతం జరగకపోతే మాత్రం కాంగ్రెస్, కమ్యూనిస్టుల ప్రయాణాలు అసమర్థుల జీవయాత్రలుగానే మిగిలిపోతాయి.

vardhelli1959@gmail.com



పంజాబ్ కేసరి లేఖను తొక్కిపెడతారెందుకు?

అభిప్రాయం



దివి కుమార్

లాల్‌–బాల్‌–పాల్ పేర్లతో ప్రసిద్ధులైన పంజాబ్, మహారాష్ట్ర, బెంగాల్ రాష్ట్రాలకు చెందిన స్వాతంత్ర్య సమర యోధులలో లాలా లజపతిరాయ్ ఒకరని, ఆయనను 'పంజాబ్ కేసరి' అంటారని మనకందరకూ తెలుసు. అయితే ఆయన చివరి రోజులనాటి ఆత్మవ్యథాపూరిత అంతరంగ మథనాన్ని చరిత్రకు అందనివ్వకుండా తొక్కి పట్టిన చరిత్ర సంగతి మనలో చాలామందికి తెలియదు. 'ఆజాదీ కా అమృతోత్సవం' సందర్భంగా అయినా దాన్ని జ్ఞాపకం చేసుకోవడం అవసరం.

1928లో లాహోర్ వచ్చిన సైమన్ కమిషన్‌ను బహిష్కరిస్తూ జరిగిన ఉద్యమానికి లాలా లజపతి రాయ్ నాయకత్వం వహించారు. అక్టోబర్ 30వ తేదీన నిరసన ప్రదర్శన లాహోర్ రైల్వే స్టేషన్‌కు చేరే సరికి బ్రిటిష్ పోలీసులు అడ్డుకున్నారు. లాలాజీకి రక్షణగా భగత్ సింగ్ లాంటివారు నిలిచారు. పోలీసులు ప్రదర్శనకారులపై విరుచుకుపడ్డారు. లాలాజీ తీవ్రమైన దెబ్బలతో లాహోర్ ఆసుపత్రిలో చేరి 1928 నవంబర్ 17న అమరుడైనాడు.

లాలాజీ రాజకీయ జీవితం చాలా ఎగుడు దిగుడులతో సాగింది. కాంగ్రెస్ నాయకునిగా అఖిల భారత ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ అధ్యక్షులుగా పనిచేశారు. తర్వాత కాంగ్రెస్ కార్యకలాపాలు విడిచి హిందూ మహాసభలో చేరి, మతమార్పిడి పొంది ముస్లిములుగా, క్రిస్టియన్లుగా మారిన వారిని తిరిగి హిందూ మతంలోకి చేర్చుకునే శుద్ధి కార్యక్రమాన్ని సాగించేవారు. అందుకుగాను జుగల్ కిషోర్ బిర్లా అనే ఆయన లజపతి రాయ్‌కి ఆ రోజులలోనే నెలకు 5 వేల రూపాయలు ఇచ్చేవారు. హిందూ మహాసభ తరఫున లాలాజీ కేంద్ర అసెంబ్లీకి (నేటి పార్లమెంట్) ఎన్నికయ్యారు. సరిగ్గా ఆ రోజుల్లోనే కేదార్‌నాథ్ సెహగల్ తదితర 24 మంది విప్లవకారులు 'కీర్తి' పత్రికలో లాలాజీపై ఛార్జ్ షీట్ లాంటి బహిరంగ విమర్శ చేశారు.

రాజకీయ అభిప్రాయాలలో నిలకడలేనితనం, జాతీయ విద్యా విధానం పేరుతో పక్కదారులు పట్టించడం, స్వరాజ్ పార్టీని వీడిపోవడం, హిందూ ముస్లింల నడుమ ఉద్రిక్తతలను పెంచడం, అభ్యుదయ వాద శిబిరం నుండి సాంప్రదాయిక శిబిరం వైపు దిగజారడం... వంటి అంశాలను ఈ విమర్శలో వారు ప్రస్తావించారు. అదే రోజుల్లో భగత్ సింగ్ తదితర కొంతమంది విప్లవకారులు లాలాజీకి వ్యతిరేకంగా 1927 సెప్టెంబరులో ఒక కరపత్రం పంచారు.



లాలా లజపతిరాయ్

అయితే ఇంతగా విమర్శల పాలైన లజపతి రాయ్‌లో వచ్చిన విప్లవాత్మకమైన పరివర్తనను తెలియజేసే ఒక ఉత్తరం గురించి చరిత్రకారులు కానీ, బీజేపీ వారు కానీ ప్రస్తావించకపోవడం గర్హనీయం. తన మరణానికి సరిగ్గా నాలుగు నెలల ముందు లాలాజీ మతాంతరీకరణ కార్యకలాపాలకు ఆర్థిక సహకారం అందజేసే జుగల్ కిషోర్ బిర్లాకు స్వయంగా తమ్ముడయిన, ప్రముఖ పారిశ్రామికవేత్త ఘనశ్యామ్ దాస్ బిర్లా (జీడీ బిర్లా)కు 1928 జూలై 12న లాలాజీ ఉత్తరం ఒకటి రాశారు. ఉత్తరం తొలి పేరాలోనే 'దీని విషయం ఎవరికీ చెప్పవనీ, నేను అడిగినప్పుడు దీన్ని నాకు తిరిగి ఇచ్చేస్తావనీ, నిన్ను పూర్తిగా నమ్మి నీకు ఇవన్నీ రాస్తున్నాను. దీన్ని భద్రంగా పదిలపరుచు' అని లజపతిరాయ్ సూచించారు.

ఉత్తరంలోని కొన్ని పేరాలైనా మనం చూడవలసి ఉంటుంది. 'దేవుడిపైనా, మానవత్వంపైనా, జీవితంపైనా, ప్రపంచంపైనా కూడా నమ్మకం పోయింది. ఏదీ వాస్తవ మనిపించడం లేదు. ప్రతిదీ అశాశ్వతమనీ, అంతా మానవ ఆర్భాటమేనని అనిపిస్తోంది'. 'మన ప్రార్థనలు వింటూ మంచి పనులకు మంచి కలగజేస్తూ చెడ్డ పనులను శిక్షిస్తూ ఉండే ఒక దేవుడు ఉన్నాడని నాకు ఒకప్పుడు నమ్మకం ఉండేది. క్రమంగా ఈ నమ్మకం పోయింది. ఇన్ని అసంగతులు, అసందర్భాలు జరుగుతున్నప్పుడు స్వీయ రక్షకుడు, దయామయుడు, సర్వశక్తి సంపన్నుడు, సర్వాంతర్యామి అనబడే దేవుడున్నాడని నమ్మటం ఎలా?' 'ఎందుకీ అసమానత్వం? ఇదంతా న్యాయబద్ధమైన, నిజమైన దేవుని సృష్టేనా? ఈ ప్రశ్నలకు మతాచార్యులు మత విశ్వాసులు ఇచ్చే సమాధానాన్ని నేను అంగీకరించను.' 'వారు మానవజాతిని మతాలుగా, పక్షాలుగా వివిధ రకా లుగా ఎందుకు విచ్ఛిన్నం చేశారు? సత్యమనేది విచ్ఛిన్నానికి అనైక్యతకు దారితీస్తుందా?' 'మంచి పనులకు పారితోషికాలు, పూర్వ జన్మలో చెడ్డ పనులకు శిక్షలు అనే సిద్ధాంతం హిందువుల పతనావస్థకు చాలావరకు కారణం అనిపిస్తోంది... దేవుడిపై విశ్వాసం, పునర్జన్మలో నమ్మకం, నైతికతకు చాలా బలహీనమైన పునాదిగా ఉంటుంది.' ఈ ఉత్తరం లాలాజీ ఆత్మ విమర్శ కావచ్చు. ఆత్మఖండన కూడా కావచ్చు. నిరాశాపూరిత బలహీన క్షణాలలో రాసినది కావచ్చు. ఏది ఏమైనా భారత జాతీయ ఉద్యమంలో సుదీర్ఘకాలం చురుకుగా కార్యకలాపాలు నిర్వహించిన, 'పంజాబ్ కేసరి'గా పేరుపొందిన ఒక ప్రముఖుని ఉత్తరం అది.

లాలాజీ సన్నిహితులూ, హిందూ మహాసభ వారసులయిన భాజపా వారే ఆయన వ్యక్తిత్వ చరిత్రను తెలిపే ఉత్తరాన్ని ఆశ్చర్యకరంగా తొక్కి పెట్టారు. 1978లో జనతా పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉండగా ఎల్‌కె అద్వానీ కేంద్ర క్యాబినెట్ మంత్రిగా బాధ్యత వహిస్తున్న 'సమాచార ప్రసార శాఖ' వారు లాలా లజపతిరాయ్ జీవిత చరిత్రను పుస్తకంగా విడుదల చేశారు. అందులో జీడీ బిర్లాకు లాలాజీ రాసిన ఉత్తరాన్ని ప్రస్తావించకుండా వదిలేశారు. 50 ఏళ్ల క్రితపు ప్రైవేటు రహస్య ఉత్తరం, రచయితకు తెలియలేదేమో అనుకోవడానికి వీల్లేదు. ఆ పుస్తకం రాసింది ఫిరోజ్ చంద్ అనే లాలాజీ సన్నిహితుడే. అంతేకాదు లాలాజీ మరణించిన ఐదు సంవత్సరాలకు అనగా 1933లో లాహోర్ నుండి వెలువడుతూండిన 'ది పీపుల్' అనే ఇంగ్లిష్ వారపత్రికలో ఆ ఉత్తరం ప్రచురితమైంది.

ఎన్ని కోణాలలో నుండి ఆలోచించినా లాలాజీ చివరి ఉత్తరం వెలుగులోకి రానివ్వకుండా తొక్కిపెట్టారని భావించక తప్పడం లేదు. ఇప్పటికైనా, 75 ఏళ్ల అమృత మహోత్సవ సందర్భంగానైనా జరిగిన పొరపాటుని సరిదిద్దుకుని ఆ ఉత్తరాన్ని భారత ఉపఖండ ప్రజానీకానికి వెల్లడి చేయటం ద్వారా, నూతన తరాలకు ఆ లేఖను పాఠ్యాంశంగా పరిచయం చేయాలి. లూధియానాలో నివసించే ప్రొఫెసర్ జగన్మోహన్ సింగ్ నిర్వహిస్తున్న షహీద్ భగత్‌సింగ్ రీసెర్చ్ కమిటీ వద్ద ఆ ఉత్తరం అందుబాటులో ఉంది.

వ్యాసకర్త 'జనసాహితి' అధ్యక్షుడు। 94401 67891



ఎల్‌ఐసీలో ఐపీవోలు తగదు

ఏఐఐఈఏ ఉపాధ్యక్షుడు వేణుగోపాల్

నెల్లూరు(అర్బన్‌): ఎల్‌ఐసీపై నమ్మకంతో ప్రజలు చెల్లిస్తున్న ప్రీమియం డబ్బులను కేంద్ర ప్రభుత్వం తీసుకువెళ్లి ఐపీవో రూపంలో షేర్‌ మార్కెట్‌లో పెట్టడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని ఆలిండియా ఇన్సూరెన్స్‌ ఎంప్లాయిస్‌ అసోసియేషన్‌ (ఏఐఐఈఏ) ఉపాధ్యక్షుడు కె.వేణుగోపాల్‌ చెప్పారు. ఇన్సూరెన్స్‌ కార్పొరేషన్‌ ఎంప్లాయిస్‌ యూనియన్‌ నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం(నెల్లూరు డివిజన్‌) జిల్లాల 26వ వార్షిక మహాసభ శనివారం నెల్లూరు దర్గామిట్టలోని ఎన్‌జీవో హోంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌ మాట్లాడుతూ బీమా రంగంలో ప్రీమియం చెల్లిస్తున్న 40 కోట్ల మంది పాలసీదారుల నమ్మకమే ఎల్‌ఐసీ అని తెలిపారు. ఎల్‌ఐసీలోని రూ.42 లక్షల కోట్ల ఆస్తులు ప్రజలకు చెందినవని చెప్పారు. అందువల్ల ఎల్‌ఐసీని పాక్షికంగా కూడా అమ్మే నైతిక హక్కు కేంద్ర ప్రభుత్వానికి లేదన్నారు. అయినా, ఇప్పటికే 3.5 శాతం వాటాను ప్రభుత్వం షేర్ల రూపంలో అమ్మివేసిందని చెప్పారు.

ధూళిపాళ్లను అడ్డుకున్న గ్రామస్తులు

పొన్నూరు: మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌ను గుంటూరు జిల్లా పచ్చల తాడిపర్రు గ్రామస్తులు అడ్డుకున్నారు. మండల పరిధిలోని పచ్చల తాడిపర్రు గ్రామంలో శనివారం టీడీపీ ఆధ్వర్యంలో ధూళిపాళ్ల బాదుడే బాదుడు కార్యక్రమాన్ని తలపెట్టారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు తమ ఇంటికి రావద్దంటూ ఇంటి తలుపులు వేసుకున్నారు. అలాగే, టీడీపీ నాయకులు తమ గ్రామంలో పర్యటించవద్దని ప్రజలు మండిపడటంతో ధూళిపాళ్ల అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ.. నియోజకవర్గ ఎమ్మెల్యే కిలారి రోశయ్యలు ప్రజలకు అండగా నిలుస్తుంటే టీడీపీ నేతలు బురద జల్లే కార్యక్రమాలు చేస్తున్నారని మండిపడ్డారు.

అంబేడ్కర్‌ కలలుగన్న రాజ్యాధికారం జగనన్నతోనే సాధ్యం

- బహుజన పరిరక్షణ సమితి నాయకులు

తాడికొండ: అంబేడ్కర్‌ కలలుగన్న బహుజన రాజ్యాధికారం సీఎం వైఎస్‌ జగన్‌తోనే సాధ్యమవుతుందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్‌ యాక్సిస్‌ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 706వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడుతూ.. రాజధాని పేరుతో జరుగుతోన్న దీక్షలలో నిజమైన రైతుల పాత్ర శూన్యమని, ఉద్యమం పేరుతో టీడీపీ నాయకులు, ఎన్‌ఆర్‌ఐలు, బాబు బినామీలే వీటిని నడిపిస్తున్నారని ఆరోపించారు. జేఏసీ ముసుగులో ఉన్న కొందరు వ్యక్తులు అమరావతి పేరుతో వస్తోన్న చందాలను ఆరగిస్తున్నారన్నారు. రాజధాని అభివృద్ధికి సీఎం జగన్‌ కట్టుబడి ముందుకెళుతున్నారని అన్నారు. బహుజన పరిరక్షణ సమితి నాయకులు నూతక్కి జోషి, పల్లె బాబు తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్‌ ప్లేస్‌మెంట్స్‌లో కేఎల్‌యూ సత్తా

గాంధీనగర్‌ (విజయవాడ సెంట్రల్‌): క్యాంపస్‌ ప్లేసెమెంట్స్‌లో కేఎల్‌ యూనివర్సిటీ ఇంజనీరింగ్‌ విద్యార్థులు సత్తా చాటారు. ప్రముఖ సాఫ్ట్‌వేర్‌ సంస్థ అమెజాన్‌లో నిర్వహించిన ప్రీ క్యాంపస్‌ ప్లేస్‌మెంట్స్‌ పరీక్షలో సీఎస్‌ఈ బ్రాంచ్‌కి చెందిన 25 మంది రూ.44 లక్షల వార్షిక జీతంతో ఉద్యోగాలను దక్కించుకున్నట్లు వర్సిటీ వీసీ డాక్టర్‌ సారథి వర్మ శనివారం తెలిపారు. వీరు 6 నెలల కంపెనీ శిక్షణలో నెలకు రూ.80 వేలు స్టైఫండ్‌ పొందుతారని, శిక్షణానంతరం పూర్తిస్థాయి జీతంతో ఉద్యోగంలో కొనసాగిస్తారని పేర్కొన్నారు. సూపర్‌ డ్రీమ్‌ కంపెనీల్లో 280 మంది, డ్రీమ్‌ కంపెనీల్లో 860 మందికి పైగా విద్యార్థులు అత్యుత్తమ ప్యాకేజీలతో ప్రీ క్యాంపస్‌ ప్లేసెమెంట్స్‌ లో ఉద్యోగాలు సాధించారని చెప్పారు.

ఆమె, ఈమె.. పెళ్లి!

- బంగ్లాదేశ్, మధురై యువతుల వివాహం
- చెన్నైలో వివాహం చేసుకున్న జంట




సుభీక్ష, దీనాల వివాహం

సాక్షి, చెన్నై : బంగ్లాదేశ్‌కు చెందిన యువతి వరుడిగా, మధురైకు చెందిన యువతి వధువుగా మారి చెన్నైలో వివాహం చేసుకున్నారు. బంధు, మిత్రుల సమక్షంలో వీరి వివాహం రెండు రోజుల కిందట జరగ్గా.. శనివారం వెలుగులోకొచ్చింది. మధురైకు చెందిన సుబ్రమణి కుటుంబం తొలుత ఖత్తార్‌లో ఉండేవారు. ఆ తర్వాత కెనడాకు వెళ్లిపోయారు. అక్కడ ఓ ప్లేస్కూల్‌ నిర్వహిస్తున్నారు. ఆయనకు సుభీక్ష అనే కుమార్తె ఉంది. వీరున్న ప్రాంతంలోనే బంగ్లాదేశ్‌కు చెందిన దీనా కుటుంబం కూడా నివసిస్తోంది. దీనాకు ఇది వరకే వివాహం జరిగింది. భర్త వదలి వెళ్లడంతో కుటుంబీకులతో ఉంటోంది. ఈ పరిస్థితుల్లో సుభీక్ష, దీనాల మధ్య పరిచయం ప్రేమగా మారింది. ఒకరిని విడిచి మరొకరు ఉండలేని స్థితికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో తామిద్దరం పెళ్లి చేసుకోవాలన్న నిర్ణయానికి వచ్చినట్టు ఇరు కుటుంబాల దృష్టికి తీసుకెళ్లారు. మొదట ఇరు కుటుంబాల బంధువులు పెళ్లికి అంగీకరించ లేదు. అయితే వారు బలవంతం చేయడంతో అంగీకరించకతప్పింది కాదు. దీనా వరుడిగా, సుభీక్ష వధువుగా మారి రెండు రోజుల కిందట చెన్నైలో వివాహం చేసుకున్నారు. తన కుమార్తెను ఒడిలో కూర్చోబెట్టుకుని సుబ్రమణి.. కన్యాదానం చేశారు. అత్యంత వైభవంగా ఈ వివాహం జరగడం విశేషం. ఈ వివాహాన్ని కెనడాలో రిజిస్ట్రేషన్‌ చేయిస్తున్నామని సుభీక్ష అవ్వ పద్మావతి చెప్పారు.

ఓనమ్‌ పండుగకు ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్‌: ఓనమ్‌ పర్వదినం సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేయనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్‌ రాకేశ్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్‌-త్రివేండ్రమ్‌ (07119/07120) స్పెషల్‌ ట్రైన్‌ ఈనెల 5న సాయంత్రం 6.15 గంటలకు బయల్దేరి మరుసటి రోజు రాత్రి 11.45 గంటలకు త్రివేండ్రమ్‌ చేరుకోనుంది. తిరుగు ప్రయాణంలో సెప్టెంబర్‌ 10న రాత్రి 10 గంటలకు బయల్దేరి రెండో రోజు తెల్లవారుజామున 3 గంటలకు హైదరాబాద్‌ చేరుకోనుంది. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా కాచిగూడ-యశ్వంత్‌పూర్‌ (07159/07160) స్పెషల్‌ ట్రైన్‌ ఏర్పాటు చేయనున్నారు. ఈ రైలు ఈనెల 5న రాత్రి 8.25 గంటలకు కాచిగూడ నుంచి బయల్దేరి మరుసటి రోజు ఉదయం 10.30 గంటలకు యశ్వంత్‌పూర్‌ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 6వ తేదీ సాయంత్రం 5.20 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 7 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది.



అటవీ శాఖ పునర్వ్యవస్థీకరణ



- కొత్త జిల్లాల వారీగా డివిజన్లు
- 26 జిల్లాలకు 32 డివిజన్లు.. కొత్తగా 9
- జిల్లాకో టెరిటోరియల్‌ లేదా సోషల్‌ ఫారెస్ట్‌ డివిజన్‌
- 5 లాగింగ్‌ డివిజన్లు, తెలుగు గంగ డివిజన్‌ రద్దు
- కొత్త పోస్టులు సృష్టించకుండా ఉన్న వారితోనే సర్దుబాటు
- ఎక్కువ అడవులున్న జిల్లా అల్లూరి.. అడవే లేని జిల్లా పశ్చిమ గోదావరి

సాక్షి, అమరావతి: కొత్త జిల్లాలవారీగా అటవీ శాఖను ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. ప్రతి జిల్లాలో ఒక అటవీ డివిజన్‌ (టెరిటోరియల్‌ లేదా సోషల్‌ ఫారెస్ట్‌) ఏర్పాటు చేసింది. అవసరం లేని, కాలం చెల్లిన 6 డివిజన్లను మూసివేసి వాటి స్థానంలో కొత్తగా 9 డివిజన్లు ఏర్పాటు చేసింది. దీంతో 26 జిల్లాలకు ఇప్పుడు 32 డివిజన్లు ఉన్నాయి. గతంలో 13 జిల్లాలకు 23 డివిజన్లు ఉండేవి. పునర్వ్యవస్థీకరణ తర్వాత కొత్తగా పార్వతీపురం మన్యం, చింతపల్లి, రంపచోడవరం, రాజమండ్రి, కోనసీమ, భీమవరం, మచిలీపట్నం, బాపట్ల, పల్నాడు డివిజన్లు ఏర్పాటయ్యాయి.

వెదురు, కలప వెలికితీత కోసం ప్రత్యేకంగా ఉన్న చింతూరు, రాజమండ్రి, జంగారెడ్డిగూడెం, గిద్దలూరు, నంద్యాల లాగింగ్‌ డివిజన్లను రద్దు చేశారు. డివిజన్ల పరిధి, కలప తగ్గడంతో వీటిని మూసివేశారు. తెలుగుగంగ ప్రాజెక్టు కట్టినప్పుడు దానికి పరిహారంగా అడవిని పెంచడానికి ఏర్పాటైన టీజీపీ డివిజన్‌ను కూడా రద్దు చేశారు.

- గతంలో సోషల్‌ ఫారెస్ట్, టెరిటోరియల్‌ డివిజన్లు విడిగా ఉండేవి. కొత్త డివిజన్లు చిన్నవి కావడంతో ఈ రెండింటినీ కలిపి ఒకటిగా చేశారు. గతంలో ఉన్న 13 సోషల్‌ ఫారెస్ట్‌ డివిజన్లను పదికి తగ్గించారు.
- పునర్వ్యవస్థీకరణ తర్వాత 3 జిల్లాల్లో మాత్రమే ఒకటికంటే ఎక్కువ డివిజన్లు ఏర్పాటయ్యాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలో నాలుగు డివిజన్లు (పాడేరు, చింతపల్లి, చింతూరు, రంపచోడవరం) ఏర్పాటు చేశారు. కర్నూలు జిల్లాలో 3 డివిజన్లు (కర్నూలు, ఆత్మకూరు, నంద్యాల), ప్రకాశం జిల్లాలో 3 డివిజన్లు (మార్కాపురం, గిద్దలూరు, ప్రకాశం) పెట్టారు. మిగిలిన 23 జిల్లాల్లో ఒక్కో డివిజన్‌ (టెరిటోరియల్‌) ఏర్పాటయ్యాయి.
- వన్యప్రాణి విభాగం (వైల్డ్‌ లైఫ్‌) డివిజన్లను గతంలో మాదిరిగా ప్రత్యేకంగానే ఉంచారు. ఏలూరు (కొల్లేరు, కృష్ణా అభయారణ్యాలు), సూళ్లూరుపేట (పులికాట్, నేలపట్టు అభయారణ్యాలు) వైల్డ్‌లైఫ్‌ డివిజన్లను అలాగే ఉంచారు. నాగార్జునసాగర్‌ – శ్రీశైలం టైగర్‌ రిజర్వు పరిధిలోని కర్నూలు, ఆత్మకూరు, గిద్దలూరు, మార్కాపురం డివిజన్లను అలాగే ఉంచారు. ఈ నాలుగింటికీ టెరిటోరియల్, వైల్డ్‌ లైఫ్‌ పరిధి రెండూ ఉంటాయి.


పరిపాలన సౌలభ్యం కోసం పునర్వ్యవస్థీకరణ



కొత్త పోస్టులు సృష్టించకుండా ఉన్న వాటినే సర్దుబాటు చేసి పునర్వ్యవస్థీకరణ చేశాం. దీనివల్ల పరిపాలన సౌలభ్యంతోపాటు జిల్లాకు ఒక డివిజన్‌ ఉంటుంది. రద్దు చేసిన డివిజన్లలోని ఉద్యోగులను కొత్త వాటిలో సర్దుబాటు చేస్తున్నాం.

– వై మధుసూదన్‌రెడ్డి, అటవీ దళాల అధిపతి, ప్రిన్సిపల్‌ చీఫ్‌ కన్సర్వేటర్‌ ఆఫ్‌ ఫారెస్ట్స్‌

అటవీప్రాంతం లేని జిల్లా పశ్చిమగోదావరి



పశ్చిమగోదావరి జిల్లా అటవీ ప్రాంతం లేని జిల్లాగా ఉంది. నర్సాపురం పార్లమెంటు పరిధిలో భీమవరం జిల్లా కేంద్రంగా ఏర్పడిన ఈ జిల్లాలో ఒక్క ఎకరం కూడా అటవీ భూమి లేదు. అయినా అక్కడ అటవీ డివిజన్‌ ఏర్పాటు చేశారు. అల్లూరి జిల్లాలో అత్యధికంగా 8,03,039.45 హెక్టార్ల అటవీ ప్రాంతం ఉంది. బాపట్ల, అంబేడ్కర్‌ కోనసీమ, తూర్పు గోదావరి, గుంటూరు జిల్లాల్లో 10 వేల హెక్టార్లకంటె తక్కువ అటవీ విస్తీర్ణం ఉంది. విశాఖపట్నం 14,512 హెక్టార్లతో పూర్తి అర్బన్‌ అటవీ ప్రాంతంగా మారింది.

కనపర్రులో టీడీపీ నేతల దౌర్జన్యం

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపైకి కారును దూకించిన మూకలు
- నలుగురికి గాయాలు
- వైఎస్సార్‌ వర్ధంతిని అడ్డుకునేందుకు కుటిలయత్నం



మానసిక వికలాంగుడు అనిల్‌ను ఆసుపత్రికి తరలిస్తున్న కుటుంబ సభ్యులు

నాదెండ్ల: పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం కనపర్రు గ్రామంలో టీడీపీ నేతలు దౌర్జన్యానికి తెగబడ్డారు. మహానేత వైఎస్సార్‌ వర్ధంతిని అడ్డుకునేందుకు కుటిలయత్నం చేసి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపైకి కారును వేగంగా దూకించారు. కనపర్రు గ్రామంలో శుక్రవారం దివంగత సీఎం వైఎస్‌ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని భారీ అన్నదానం చేపట్టారు. మహానేత విగ్రహానికి సాయంత్రం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా బయల్దేరారు. ఈ సమయంలో టీడీపీ కార్యకర్తలు నాతాని సురేష్, నాతాని ఆంజనేయులు, నాతాని మనోహర్‌లతో పాటు రొంపిచర్ల మండలం కొనకంచివారిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ నేత కుమారుడు రమేష్, కావూరు గ్రామానికి చెందిన కందుల శివప్రసాద్‌ గ్రామంలోని టీడీపీ నాయకుని నివాసంలో పూటుగా మద్యం సేవించారు. ఆ తర్వాత తమ కారుకు టీడీపీ జెండా కట్టుకుని ర్యాష్‌గా డ్రైవింగ్‌ చేస్తూ నానా హంగామా సృష్టించారు. ర్యాలీగా వస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులను అటకాయించేందుకు తమ కారును అడ్డుగా నిలిపారు. కారును తొలగించాలని గ్రామ సర్పంచ్‌ పెరుమాళ్లపల్లి వెంకటేశ్వర్లు కోరారు. దీంతో వారు కారును వేగంగా కార్యకర్తలపై దూకించారు. దీంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు కుంచాల శివశంకర్, మానసిక వికలాంగులైన చెవుల అనిల్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అన్నలదాసు ప్రసాద్, వేముల బాలరాజు గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో క్షతగాత్రులను 108 వాహనంలో నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైఎస్సార్‌సీపీ నేతల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బల్క్‌ డ్రగ్‌ పార్క్‌ వద్దనడం దారుణం

- చంద్రబాబుపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ధ్వజం

అమలాపురం రూరల్‌: ఏపీ అభివృద్ధి కోసం ప్రధాని మోదీ కాకినాడ జిల్లాకు బల్క్‌ డ్రగ్‌ పార్క్‌ కేటాయిస్తే.. చంద్రబాబు అడ్డుపడటం దారుణమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు మండిపడ్డారు. డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ కోనసీమ జిల్లా అమలాపురంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణతో పాటు అనేక రాష్ట్రాలు కోరినా కూడా ప్రధాని మోదీ ఆంధ్రప్రదేశ్‌కు బల్క్‌ డ్రగ్‌ పార్క్‌ కేటాయించారని చెప్పారు. ఈ పరిస్థితుల్లో చంద్రబాబు అడ్డుపడుతూ.. బల్క్‌ డ్రగ్‌ పార్క్‌ వద్దంటూ లేఖ రాయడం సిగ్గుచేటన్నారు. ప్రధాని జన్మదినాన్ని పురస్కరించుకొని ఈనెల 17 నుంచి అక్టోబర్‌ 2 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 5వేల స్ట్రీట్‌ కార్నర్‌ సభలు నిర్వహించబోతున్నట్లు వీర్రాజు చెప్పారు.

రాష్ట్రంలో పంజాబ్‌ పాత్రికేయుల బృందం పర్యటన

- పలు పర్యాటక ప్రాంతాల సందర్శన
- రాష్ట్ర టూరిజం ప్రాజెక్టులను వివరించిన అధికారులు



పంజాబ్‌ పాత్రికేయులతో ఏపీ టూరిజం అధికారులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల ప్రత్యేకతలను పరిశీలించేందుకు పంజాబ్‌కు చెందిన పాత్రికేయుల బృందం రాష్ట్రంలో పర్యటిస్తున్నట్టు ఏపీటీడీసీ ఎండీ కె.కన్నబాబు తెలిపారు. 'ఏక్‌ భారత్‌.. శ్రేష్ఠ భారత్‌' కార్యక్రమంలో భాగంగా గత నెల 31 న రాష్ట్రానికి వచ్చిన ఈ బృందం ఈ నెల 6వ తేదీ వరకు వివిధ ప్రాంతాలను సందర్శిస్తుందని చెప్పారు. ప్రెస్‌ ఇన్ఫర్మేషన్‌ బ్యూరో (పీఐబీ) జలంధర్‌ శాఖ ఆధ్వర్యంలో వచ్చిన ఈ బృందం తొలుత విశాఖలోని పర్యాటక ప్రదేశాలను, డిండిని సందర్శించిందన్నారు. శనివారం విజయవాడ బెర్మ్‌ పార్కులో ఈ బృందానికి రాష్ట్రంలో టూరిజం ప్రాజెక్టుల గురించి వివరించినట్టు చెప్పారు. రాష్ట్ర సంస్కృతి, కళలు, వారసత్వ సంపదను పంజాబ్‌లో ప్రచారం చేసేందుకు ఈ పర్యటన దోహదం చేస్తుందని కన్నబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ఉన్న 974 కిలోమీటర్ల సువిశాల తీర ప్రాంతం, నిత్యం ప్రవహించే నదులు, సుందరమైన బ్యాక్‌ వాటర్స్, కొండలు, అడవులు, పురాతన దేవాలయాలు, బౌద్ధ క్షేత్రాలు వంటి ఎన్నో పర్యాటక ప్రదేశాలు మన సంస్కృతి, వారసత్వాలను చాటిచెబుతాయన్నారు. పీఐబీ జలంధర్‌ నోడల్‌ అధికారి రాజేష్‌ బాలి మాట్లాడుతూ..ఏపీలోని పర్యాటక ప్రదేశాలు, సంస్కృతి, అలవాట్లు మంచి విజ్ఞానాన్ని అందించాయని చెప్పారు.

గ్రీన్‌ హైడ్రోజన్‌ హబ్‌గా ఆంధ్రప్రదేశ్‌!

విశాఖ, నెల్లూరులో ఉత్పత్తికి ప్రణాళికలు

- విశాఖలో 20 మెగావాట్ల ఎలక్ట్రోలైజర్‌ ప్లాంట్‌
- దీని ద్వారా ఏటా 4 వేల టన్నుల గ్రీన్‌ హైడ్రోజన్‌ ఉత్పత్తి
- బళ్లారి–నెల్లూరు మధ్య 30 మెగావాట్ల ఎలక్ట్రోలైజర్‌ ప్లాంట్‌
- దీని ద్వారా ఏడాదికి 5 వేల టన్నుల గ్రీన్‌ హైడ్రోజన్‌ ఉత్పత్తి
- పదేళ్లలో తగ్గనున్న 9 మిలియన్‌ మెట్రిక్‌ టన్నుల కార్బన్‌డయాక్సైడ్‌
- ఇండియా హైడ్రోజన్‌ అలయన్స్‌ ప్రణాళిక



సాక్షి, అమరావతి: గ్రీన్‌ హైడ్రోజన్‌ ఉత్పత్తి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌ అవతరించనుంది. తరిగిపోతున్న శిలాజ ఇంధన వనరులకు ప్రత్యామ్నాయంగా స్వచ్ఛ ఇంధనాన్ని వినియోగంలోకి తెచ్చే ప్రయత్నాల్లో ఏపీ భాగం కానుంది. ఈ ప్రాజెక్టు కోసం కేంద్రం ఎంపిక చేసిన ఐదు రాష్ట్రాల్లో మన రాష్ట్రం కూడా ఉంది. విశాఖ, నెల్లూరు జిల్లాల్లో గ్రీన్‌ హైడ్రోజన్‌ ఉత్పత్తి జరగనుంది. కేంద్ర పునరుత్పాదక ఇంధన వనరుల మంత్రిత్వ శాఖకు, నీతీ ఆయోగ్‌కు ఇండియా హైడ్రోజన్‌ అలయన్స్‌ (ఐహెచ్‌2ఏ) తాజాగా సమర్పించిన హైడ్రోజన్‌ హబ్‌ డెవలప్‌మెంట్‌ ప్లాన్‌లో ఈ విషయాన్ని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఈ హబ్‌లను రూపొందిస్తారు. గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ, ఆంధ్రప్రదేశ్‌లో ఐదు జాతీయ గ్రీన్‌ హైడ్రోజన్‌ హబ్‌లు ఏర్పాటు చేసి, వీటిని 25 ప్రాజెక్ట్‌ క్లస్టర్లుగా విభజిస్తారు. వీటి ద్వారా 2025 నాటికి గ్రీన్‌ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేసే 150 మెగావాట్ల ఎలక్ట్రోలైజర్‌ ప్లాంట్ల ఏర్పాటు లక్ష్యంగా ఐహెచ్‌2ఏ నిర్దేశించింది. వీటిని మొదటి తరం జాతీయ గ్రీన్‌ హైడ్రోజన్‌ ప్రాజెక్టులుగా పిలుస్తారు. ఈ గ్రీన్‌ హైడ్రోజన్‌ను వివిధ రంగాలకు చెందిన సంస్థలు ఉపయోగించుకునేలా ప్రణాళికలు రూపొందించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా బళ్లారి-నెల్లూరు (కర్ణాటక-ఆంధ్రప్రదేశ్‌) మధ్య నేషనల్‌ గ్రీన్‌ స్టీల్, కెమికల్స్‌ కారిడార్‌లోని స్టీల్, కెమికల్‌ ప్లాంట్ల కోసం 30 మెగావాట్ల ఎలక్ట్రోలైజర్‌ ప్లాంట్‌తో సంవత్సరానికి 5 వేల టన్నుల గ్రీన్‌ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేస్తారు. దీనివల్ల పదేళ్లలో వాతావరణంలో 5 మిలియన్‌ మెట్రిక్‌ టన్నుల కార్బన్‌డయాక్సైడ్‌ను తగ్గించవచ్చు. విశాఖపట్నంలో నేషనల్‌ గ్రీన్‌ రిఫైనరీ ట్రాన్స్‌పోర్ట్‌ హబ్‌లో 20 మెగావాట్ల ఎలక్ట్రోలైజర్‌ ప్లాంట్‌తో సంవత్సరానికి 4 వేల టన్నుల గ్రీన్‌ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేస్తారు. ఇది ఒక దశాబ్దంలో 4 మిలియన్‌ మెట్రిక్‌ టన్నుల కార్బన్‌డయాక్సైడ్‌ను తగ్గిస్తుంది. దీని కోసం రాష్ట్ర గ్రీన్‌ హైడ్రోజన్‌ విధానాలను రూపొందించనున్నారు.

పీహెచ్‌సీ వైద్యాధికారిపై సస్పెన్షన్‌ వేటు

- అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారంటూ మంత్రి రజని వద్ద ఏఎన్‌ఎంల ఆవేదన
- వైద్యాధికారి ఆస్పత్రిలో ఉండటం లేదంటూ స్థానికుల ఫిర్యాదు

బల్లికురవ: ప్రభుత్వ వైద్యశాలల్లో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరంగా చర్యలు తప్పవని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని హెచ్చరించారు. బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గం బల్లికురవ మండలంలోని గుంటుపల్లి పీహెచ్‌సీని శనివారం మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో వైద్యుడి గది, అటెండెన్స్‌ రిజిస్టర్, ఇన్‌పేషెంట్ల గది, ఆపరేషన్‌ థియేటర్, వ్యాక్సిన్‌ స్టోరేజ్‌ రూమ్, మందులిచ్చే గదులను మంత్రి పరిశీలించి అపరిశుభ్రంగా ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. ఆస్పత్రి నిర్వహణలోనూ లోపాలున్నట్టు గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురు ఏఎన్‌ఎంలు మంత్రి వద్దకు వచ్చి.. ఏడాది నుంచి వైద్యాధికారి అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాదు, మార్టూరులో ప్రైవేటు వైద్యశాల నిర్వహిస్తూ విధులకు సక్రమంగా రావడం లేదని, అత్యవసర పరిస్థితుల్లో వైద్యం అందక ఇబ్బందిపడుతున్నామని స్థానికులు చెప్పారు. వైద్యాధికారి భానుప్రకాష్‌రావును తక్షణమే విధుల నుంచి తొలగించి.. పూర్తిస్థాయి విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని అక్కడికక్కడే ఉన్నతాధికారులకు మంత్రి ఆదేశాలిచ్చారు. త్వరలోనే గుంటుపల్లి పీహెచ్‌సీకి వైద్యుడిని నియమించడంతో పాటు, సిబ్బంది కొరత కూడా తీరుస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

గణనాథునికి శ్రీశైలం ఆలయ పట్టువస్త్రాలు



స్వామివారికి పట్టు వస్త్రాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం

కాణిపాకం (యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామికి ఆయన తండ్రి ఆలయమైన శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయం నుంచి ఆలయ చైర్మన్‌ చక్రపాణి రెడ్డి, ఈవో లవన్న శనివారం పట్టువస్త్రాలు తీసుకువచ్చారు. వారికి ఆలయ చైర్మన్‌ మోహన్‌ రెడ్డి, ఈవో సురేష్‌బాబు మేళతాళాలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం వారు ప్రధాన అర్చకులకు పట్టువస్త్రాలు అందజేశారు. ఈ వస్త్రాలను స్వామి సన్నిధిలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు.

'సమరసత' సహకారంతో 111 ఆలయాలు

- శ్రీవాణి ట్రస్ట్‌ ఆధ్వర్యంలో నిర్మాణానికి చర్యలు

తిరుపతి అలిపిరి: శ్రీవాణి ట్రస్ట్‌ ఆధ్వర్యంలో సమరసత సేవా ఫౌండేషన్‌ సహకారంతో రెండో దశ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మత్స్యకార ప్రాంతాల్లో 111 ఆలయాల నిర్మాణం చేపట్టాలని టీటీడీ ఈవో ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని ఈవో కార్యాలయంలో శనివారం శ్రీవాణి ట్రస్ట్‌పై సమీక్ష నిర్వహించారు. శ్రీవాణి ట్రస్ట్‌ నిధులతో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,342 ఆలయాల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించామని, మొదటి దశలో 502 ఆలయాల నిర్మాణం పూర్తయిందని ఈవో చెప్పారు. రెండో దశలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మత్స్యకార ప్రాంతాల్లో ఎంపిక చేసిన గ్రామాల్లో రూ.10 లక్షలతో ఆలయాల నిర్మాణం చేపడతామన్నారు.

హకీం జానీకి ఆసియా వరల్డ్‌ రికార్డ్స్‌లో స్థానం



జానీకి ధ్రువపత్రం ఇస్తున్న మంత్రి నాగార్జున

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలికి చెందిన ఫ్రీలాన్స్‌ జర్నలిస్ట్, బాలసాహితీవేత్త షేక్‌ అబ్దుల్‌ హకీంజానీకి ఆసియా వరల్డ్‌ రికార్డ్స్‌లో స్థానం లభించింది. మూడు దశాబ్దాలుగా హకీంజానీ రాసిన 1,400 వ్యాసాలు వివిధ దిన, వార, మాసపత్రికల్లో ప్రచురితమయ్యాయి. ఈ నేపథ్యంలో హకీంజానీకి ఆసియా వరల్డ్‌ రికార్డ్స్‌ పుస్తకంలో స్థానం కల్పిస్తూ సూపర్‌ ఎచీవర్‌–2022 టైటిల్‌తో ధ్రువపత్రాన్ని సంస్థ వ్యవస్థాపక చైర్‌పర్సన్, ప్రధాన సంపాదకురాలు డాక్టర్‌ శాంతిదేవి పంపారు. ధ్రువపత్రాన్ని బాపట్ల జిల్లా కొల్లూరులో మంత్రి డాక్టర్‌ మేరుగ నాగార్జున చేతులమీదుగా హకీంజానీ అందుకున్నారు.

అయ్యన్నకు మతిభ్రమించింది

- టీడీపీ హయాంలో శిలాఫలకాలు తప్ప అభివృద్ధి శూన్యం
- నర్సీపట్నం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఉమాశంకర్‌ గణేష్‌ ధ్వజం



నర్సీపట్నం: టీడీపీ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడు మతిభ్రమించి మాట్లాడుతున్నారని నర్సీపట్నం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌ గణేష్‌ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శనివారం అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నర్సీపట్నం మునిసిపాలిటీ ప్రజల దాహార్తిని తీర్చేందుకు తమ ప్రభుత్వం రూ.166.89 కోట్లతో తాగునీటి ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపట్టిందన్నారు. అయితే టీడీపీ హయాంలోనే ఈ ప్రాజెక్టును తెచ్చామని మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. టీడీపీ హయాంలోనే ఈ ప్రాజెక్టు వచ్చి ఉంటే చంద్రబాబు ప్రభుత్వం ఎందుకు పూర్తి చేయలేకపోయిందని నిలదీశారు. అయ్యన్నపాత్రుడు తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో నర్సీపట్నానికి చేసిందేమీ లేదన్నారు. గత సార్వత్రిక ఎన్నికలకు నాలుగు నెలల ముందు ప్రజలను మభ్యపెట్టేందుకు రూ.56 కోట్ల ప్యాకేజీ–2కి టెండర్లు పిలిచారన్నారు. ఏలేరు నీటిని తీసుకునేందుకు అనుమతులు రాకపోయినా.. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు అప్పట్లో కేవలం పైపులకు టెండర్లు పిలిచారని మండిపడ్డారు.



తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 9 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సర్వ దర్శనానికి 9 గంటల సమయం పడుతోంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 67,525 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 31,484 మంది తలనీలాలు సమర్పించారు. హుండీలో రూ.4.28 కోట్లు వేశారు.

బైక్‌ను తాకాడని దళిత విద్యార్థిపై టీచర్ దాడి

బలియా (యూపీ): తన మోటారుసైకిల్‌ను తాకాడనే కారణంగా ఓ దళిత విద్యార్థిని తరగతి గదిలో బంధించి, ఇనుప రాడ్‌తో కొట్టాడో ఉపాధ్యాయుడు. ఉత్తరప్రదేశ్‌లోని నగ్రా పోలీస్ స్టేషన్ పరిధిలోని రసాపూర్ హయ్యర్ సెకండరీ స్కూల్‌లో శుక్రవారం ఈ దారుణం చోటుచేసుకుంది. 'స్కూల్ ఉపాధ్యాయుడు కృష్ణ మోహన్ శర్మ బైక్‌ను ఆరో తరగతి చదువుకుంటున్న ఓ దళిత విద్యార్థి తాకాడు. శర్మ ఆగ్రహంతో ఆ బాలుడిని గదిలో బంధించి, ఐరన్ రాడ్‌తో, చీపురుతో కొట్టాడు. అతడి గొంతు పిసికాడు. స్కూల్ సిబ్బంది బాధిత బాలుడిని కాపాడారు' అని పోలీసులు తెలిపారు. ఆగ్రహించిన బాలుడి కుటుంబసభ్యులు శనివారం స్కూల్ వద్ద ఆందోళనకు దిగారు. అధికారులు ఉపాధ్యాయుడు శర్మను సస్పెండ్ చేశారు.

సుకేశ్ చంద్రశేఖర్ కేసులో... ఫతేహిని ప్రశ్నించిన పోలీసులు



న్యూఢిల్లీ: మోసగాడు సుకేశ్ చంద్రశేఖర్ అక్రమార్జన కేసు దర్యాప్తులో భాగంగా బాలీవుడ్ నటి నోరా ఫతేహిని ఢిల్లీ ఆర్థిక నేరాల విభాగం పోలీసులు శుక్రవారం 6 గంటలపాటు ప్రశ్నించారు. ఆమె వాంగ్మూలాన్ని రికార్డు చేసుకున్నారు. ఈ కేసులో ఈడీ కూడా ఇప్పటికే ఫతేహిని ప్రశ్నించింది. ఆమెతో పాటు మరో నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్ కూడా సుకేశ్ నుంచి ఖరీదైన కార్లు, ఇతర వస్తువులను బహుమతిగా అందుకున్నట్లు ఈడీ తెలిపింది. ఈ కేసులో జాక్వెలిన్‌పై ఆగస్ట్‌లో ఈడీ కేసు కూడా నమోదు చేసింది. జాక్వెలిన్‌తోపాటు మరికొందరికి కూడా సమన్లు జారీ చేసినట్లు ఢిల్లీ పోలీసులు ఇప్పటికే తెలిపారు.

క్లుప్తంగా...

నేడు ఢిల్లీలో కాంగ్రెస్ ర్యాలీ

న్యూఢిల్లీ: ధరల పెరుగుదల, జీఎస్టీ, నిరుద్యోగం తదితర సమస్యలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని నిలదీస్తూ ఆదివారం ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో భారీ ర్యాలీ జరపాలని కాంగ్రెస్ నిర్ణయించింది. రాహుల్‌గాంధీతో పాటు పార్టీ సీనియర్ నేతలంతా ఇందులో పాల్గొంటారు. విదేశాల్లో ఉన్న రాహుల్ ఇందుకోసం శనివారం భారత్ తిరిగొచ్చారు. ధరాభారంతో సామాన్యుల కష్టాలు కేంద్రానికి అస్సలు పట్టడం లేదంటూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ సందర్భంగా విమర్శించారు. బాధ్యతను గాలికొదిలి విపక్షాల పాలనలోని రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కూలదోసేందుకు ఎమ్మెల్యేల కొనుగోలులో బిజీగా ఉందంటూ దుయ్యబట్టారు.

ఐఐటీలు దేశానికి గర్వకారణం: రాష్ట్రపతి

న్యూఢిల్లీ: భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యాసంస్థలను సన్నద్ధం చేయాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. శనివారం ఢిల్లీ ఐఐటీ డైమండ్ జూబ్లీ వేడుకల ముగింపు కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. ''మన దేశం ప్రతిభావంతుల గని. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త విధానాల్లో బోధన జరగాలి. ఐఐటీల సాయంతో యువతరానికి విజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని అందజేసి, సవాళ్లను ఎదుర్కొనేందుకు సంసిద్ధులను చేయగలరన్న విశ్వాసం నాకుంది. ఐఐటీలు మన దేశానికి గర్వకారణం. వాటి చరిత్రే స్వతంత్ర భారతావని చరిత్ర'' అన్నారు.

పేటీఎం ఆఫీసులో సోదాలు

సాక్షి, బెంగళూరు: స్మార్ట్‌ఫోన్ (యాప్) ఆధారిత అక్రమ రుణాల మంజూరు కేసుల దర్యాప్తును ఈడీ ముమ్మరం చేసింది. అందులోభాగంగా బెంగళూరులో రేజర్‌పే ప్రైవేట్ లిమిటెడ్, క్యాష్‌ఫ్రీ పేమెంట్స్, పేటీఎం సంస్థల కార్యాలయాల్లో 6 చోట్ల శనివారం ఆకస్మిక సోదాలు చేసింది. వీటితోపాటు చైనా వ్యక్తుల కనుసన్నల్లో పనిచేస్తున్న సంస్థల మర్చెంట్ ఐడీలు, బ్యాంక్ ఖాతాల నుంచి రూ.17 కోట్లను సీజ్ చేసినట్టు పేర్కొంది. వీటిలో పలు సంస్థలు నకిలీ అడ్రస్‌ల ద్వారా నేరాలకు పాల్పడుతున్నారని తెలిపింది.

తైవాన్‌కు భారీగా అమెరికా ఆయుధాలు

వాషింగ్టన్: తైవాన్ జలసంధిలో ఉద్రిక్తతలను మరింత పెంచుతూ, ఆ దేశానికి 109 కోట్ల డాలర్ల ఆయుధాలు విక్రయించేందుకు అమెరికా శుక్రవారం తుది ఆమోదం తెలిపింది. 65.5 కోట్ల డాలర్ల నిఘా పరికరాలు, 35.5 కోట్ల డాలర్ల హర్పూన్ క్షిపణులు, 85 మిలియన్ డాలర్ల సైడ్‌విండర్ క్షిపణులను తైవాన్ కొనుగోలుచేయనుంది. వీటితో తైవాన్ స్వీయ రక్షణ సామర్థ్యం మరితం మెరుగు పడుతుందని వైట్‌హౌస్ ఒక ప్రకటనలో పేర్కొంది.

ఆర్టెమిస్ మళ్లీ ఆగింది

కేప్‌కెనవెరాల్: చంద్రుడిపైకి పంపించేందుకు నాసా నిర్మించిన అత్యంత శక్తివంతమైన రాకెట్ ఆర్టెమిస్ ప్రయోగం రెండోసారి వాయిదా పడింది. శనివారం మధ్యాహ్నం జరగాల్సిన ప్రయోగాన్ని భారీ ఇంధన లీకేజీ కారణంగా వాయిదా వేసినట్లు నాసా తెలిపింది. 322 అడుగుల ఎత్తైన ఈ భారీ రాకెట్‌లోకి 10 లక్షల గ్యాలన్ల ద్రవీకృత హైడ్రోజన్ ఇంధనాన్ని నింపే కార్యక్రమం మొదలైన కాసేపటికే ఇంధనం లీకవుతున్నట్లు గుర్తించారు. ఎంత ప్రయత్నించినా లీకేజీ ఆగకపోవడంతో ప్రయోగం వాయిదా పడింది. గత సోమవారం కూడా సెన్సార్ల లోపం, ఇంధన లీకేజీ వల్ల ప్రయోగం ఆఖరి క్షణంలో వాయిదా పడటం తెలిసిందే.

జీవనదులు విలవిల



భూతాపంతో ఎండుతున్న వైనం • ప్రపంచమంతటా ఇదే దుస్థితి • ఉత్తరార్ధ గోళంలో తీవ్ర దుర్భిక్షం

అమెరికాతో సహా యూరప్, ఆసియా ఖండాల్లోని పలు దేశాలు తీవ్ర దుర్భిక్షం బారిన పడుతున్నాయి. పెచ్చుమీరిన వేసవి తాపం, అత్తెసరు వర్షపాతం, నానాటికీ పెరిగిపోతున్న భూతాపం దెబ్బకు మహా మహా నదులన్నీ అక్షరాలా మటుమాయమే అవుతున్నాయి. ముఖ్యంగా ఉత్తరార్ధ గోళం కనీవినీ ఎరుగని సంక్షోభంలో చిక్కి కొట్టుమిట్టాడుతోంది. పారిశ్రామిక, ఆహార ధాన్యాల ఉత్పత్తులు, సరుకు రవాణా, జల విద్యుదుత్పత్తి రంగాలన్నీ కుదేలవుతున్నాయి. ఈ దుర్భిక్షం గత 500 ఏళ్లలో ఎన్నడూ చూడని విపరిణామాలకు కారణమవుతోంది.

230 కోట్ల మందికి నీటి కొరత

జర్మనీ, ఇటలీ, ఫ్రాన్స్, స్పెయిన్, చైనా, అమెరికా, ఇరాక్ వంటి దేశాల్లో నిత్యం నిండుగా ప్రవహించే జీవనదులన్నీ నిలువునా ఎండిపోతున్నాయి. దాంతో వాటికి అనుసంధానంగా ఉన్న రిజర్వాయర్లు కూడా గుడ్లు తేలేస్తున్నాయి. ఫలితంగా కోట్లాది మంది తాగు, సాగు నీటికి అల్లాడుతున్నారు. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం వల్ల చాలా దేశాలను వేధిస్తున్న ఆహార ధాన్యాల కొరత కాస్తా ఈ కరువు దెబ్బకు రెట్టింపైంది. 2022లో ప్రపంచవ్యాప్తంగా ఏకంగా 230 కోట్ల మంది నీటి కొరత బారిన పడ్డట్టు ఐరాస నివేదికచెబుతోంది. లానినో పరిస్థితుల దెబ్బకు యూరప్‌లో 47 శాతంపై దుర్భిక్షం ఛాయలు కమ్ముకున్నాయని గ్లోబల్ డ్రాట్ అబ్జర్వేటరీ తాజా నివేదిక చెబుతోంది.

బయట పడుతున్న చారిత్రక అవశేషాలు

మహా నదులన్నీ ఎండిపోతుండటంతో ఎన్నడూ చూడని చారిత్రక అవశేషాలు వాటి గర్భం నుంచి బయటపడుతున్నాయి. అమెరికాలో కొలరాడో నది గర్భంలో లక్షలాది ఏళ్లనాటి డైనోసార్ అడుగుజాడలు బయటపడ్డాయి. స్పెయిన్‌లో బార్సెలోనా సమీపంలోని రిజర్వాయర్లో నీరు ఆవిరవడంతో 9వ శతాబ్దానికి చెందిన చర్చి బయట పడింది. మాడ్రిడ్‌లో వందల ఏళ్ల కింద నీట మునిగిన ఓ గ్రామ శిథిలాలు వెలుగు చూశాయి. స్పెయిన్‌లోనే కాసెరస్ ప్రావిన్స్‌లో క్రీస్తుపూర్వం 5 వేల ఏళ్లనాటి రాతి పలకలు చైనాలో యాంగ్జీ నదిలో బుద్ధ విగ్రహాలు బయటపడ్డాయి. ఇరాక్‌లో టైగ్రిస్ నది ఎండిన చోట మెసపటోమియా నగరికత కాలం నాటి రాజమహల్, నాటి నగరం బయట పడ్డాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

నదులన్నింటా కన్నీళ్లే...

- జర్మనీ, నెదర్లాండ్స్, స్విట్జర్లాండ్ దేశాల ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా చెప్పే రెయిన్ నది పరిస్థితి ఎంతో దైన్యంగా ఉంది.
- 2,900 కిలోమీటర్లు ప్రవహించి నల్లసముద్రంలో కలిసే ఈ నది ఎన్నోచోట్ల ఎండిపోయింది.
- రెయిన్, దాని ఉపనదులు, కాల్వల ద్వారా ఏటా ఏకంగా 8,000 కోట్ల డాలర్ల (రూ.6.4 లక్షల కోట్ల) విలువైన సరుకు రవాణా జరుగుతుంటుంది. అలాంటిది రవాణా నౌకలు కొంతకాలంగా చూద్దామన్నా కన్పించడం లేదు.
- ఆల్ప్స్ పర్వతాల్లో కరిగే మంచుతో నిత్యం నీటితో కళకళలాడే పో నది కూడా ఎండల దెబ్బకు జీవచ్ఛవంగా మారిపోయింది.
- ఇటలీలో 30 శాతం వ్యవసాయం ఈ నది మీదే ఆధారపడింది. ఇప్పుడు అదీ కుదేలైంది. గత కొన్ని దశాబ్దాల్లో ఇంతటి దుర్భిక్షాన్ని ఎన్నడూ చూడలేదంటూ ఇటలీ వాతావరణ నిపుణులు వాపోతున్నారు.
- ఇక ప్రపంచ ప్రసిద్ధ ఫ్రెంచ్ వైన్ తయారీకి ఆధారమైన లోయెర్ నదిలో కూడా నీరు అతి వేగంగా అడుగంటుతోంది. ఫ్రాన్స్‌లో 600 కిలోమీటర్ల మేర ప్రవహించే ఈ నదిలో జలమట్టాన్ని కాపాడుకునేందుకు అనేక రిజర్వాయర్ల నుంచి నీటిని వదులుతున్నారు.
- యూరప్‌లో 10 దేశాల గుండా పారే అతి పొడవైన నది డాన్యూబ్ కూడా చిక్కిపోతోంది.
- అమెరికాలో డెన్వర్ నుంచి లాస్‌ఏంజెలెస్ దాకా 4 కోట్ల మంది నీటి అవసరాలు తీర్చే కొలరాడో నదిదీ ఇదే దుస్థితి!
- 45 లక్షల ఎకరాలకు నీరందించి ఏటా 1.4 లక్షల కోట్ల డాలర్ల వ్యవసాయ, తదితర ఆదాయాన్ని సమకూర్చే ఈ నది ఎండల ధాటికి చేతులెత్తేస్తోంది.
- నిత్యం ఉధృతంగా ప్రవహించే చైనాలోని యాంగ్జీ నది మరింత దుస్థితిలో ఉంది. సి చువాన్ ప్రావిన్స్‌కు జీవనాధారమైన ఈ నదిలో ఎక్కడ చూసినా నీరు అడుగంటి నదీగర్భం పైకి కన్పిస్తోంది. దాంతో ప్రభుత్వం కరువు హెచ్చరికలు జారీ చేసింది.

నంబర్ 5

- ప్రపంచంలో ఐదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్
- బ్రిటన్‌ను వెనక్కు నెట్టిన వైనం



న్యూఢిల్లీ: కరోనా మహమ్మారి విసిరిన సవాళ్లను తట్టుకొని నిలబడ్డ భారత్ ప్రపంచ పటంలో బలమైన ఆర్థిక శక్తిగా ఎదుగుతోంది. అగ్రరాజ్యమైన బ్రిటన్‌ను దాటి అయిదోస్థానంలోకి దూసుకుపోయింది. 2022 మార్చి చివరి నాటికి భారత్ ప్రపంచంలోని బలమైన ఆర్థిక దేశాల్లో అయిదో స్థానంలో ఉందని బ్లూమ్‌బర్గ్ సంస్థ తాజా కథనంలో వెల్లడించింది. అంతర్జాతీయ ద్రవ్యనిధి నుంచి సేకరించిన జీడీపీ గణాంకాలు, డాలర్‌తో మారకపు రేటు ఆధారంగా బ్లూమ్‌బర్గ్ లెక్కలు వేసి ఒక నివేదికను రూపొందించింది. ప్రపంచంలో బలమైన ఆర్థిక దేశంగా అమెరికా మొదటి స్థానంలోనూ, చైనా రెండో స్థానంలో ఉంటే జపాన్, జర్మనీ వరుసగా మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాయి. పదేళ్ల క్రితం పదకొండో స్థానంలో ఉన్న భారత్ ఇప్పుడు బ్రిటన్‌ను ఆరో స్థానానికి నెట్టేసి అయిదో స్థానానికి ఎగబాకింది. 2021 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో భారత్ ఆర్థిక వ్యవస్థ పరిమాణం 854.7 బిలియన్ డాలర్లు ఉంటే, బ్రిటన్ ఆర్థిక వ్యవస్థ పరిమాణం 816 బిలియన్ డాలర్లుగా ఉంది. ఈ ఏడాది భారత్‌రూపాయితో పోల్చి చూస్తే బ్రిటన్ పౌండ్ విలువ 8% మేరకు క్షీణించింది. మరోవైపు భారత్ ఆర్థిక వృద్ధి ఈ ఏడాది 7శాతానికి పైగా నమోదు చేయవచ్చునని అంచనాలున్నాయి. 2021–22లో మన దేశం 8.7% వృద్ధి నమోదు చేసింది. అయితే తలసరి ఆదాయం, మానవ అభివృద్ధి సూచిలో మాత్రం మనం బ్రిటన్ కంటే వెనుకబడి ఉండడం గమనార్హం. విద్య, ఆరోగ్యం, ప్రజల జీవన ప్రమాణాలతో కొలిచే మానవ అభివృద్ధిలో బ్రిటన్ 1980లో ఉన్నప్పటి స్థితికి చేరాలన్నా మనకు మరో పదేళ్లు పడుతుందని ఆర్థిక వేత్తలంటున్నారు.

వలస పాలకుల్ని నెట్టేయడం గర్వకారణం

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తి చేసుకొని ఆజాదీ అమృతోత్సవాలు జరుపుకుంటున్న వేళ మన దేశం అయిదో స్థానానికి చేరుకోవడంతో కేంద్ర మంత్రులు, పారిశ్రామికవేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మన దేశాన్ని వలస రాజ్యంగా మార్చి పరిపాలించిన బ్రిటన్‌నే ఆర్థికంగా వెనక్కి నెట్టేయడం ప్రతీ భారతీయుడు గర్వించాల్సిందేనని ట్వీట్లు చేశారు. పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా కర్మ సిద్ధాంతం పని చేసిందని, దేశ స్వాతంత్ర్యం కోసం త్యాగాలు చేసిన ప్రతీ భారతీయుడి గుండె ఉప్పొంగిపోతుందని ట్వీట్ చేస్తే కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్‌సుక్ మాండవీయ ''రిఫార్మ్, పెర్‌ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్'' అన్న సూత్రంతోనే విజయం సాధించామని, ప్రధాని నరేంద్ర మోదీకే ఈ క్రెడిట్ దక్కుతుందని ట్విటర్‌లో పేర్కొన్నారు.

ఆర్థిక కష్టాల్లో బ్రిటన్

బ్రిటన్ గత కొన్నేళ్లుగా ఆర్థిక సుడిగుండంలో చిక్కుకుంది. ద్రవ్యోల్బణం రికార్డు స్థాయికి చేరుకుంది. ధరలు ఆకాశాన్నంటడంతో సామాన్యులకి బతుకు భారమైపోయింది. ఆర్థిక మాంద్యం ప్రమాదాన్ని కూడా ఎదుర్కొంటోంది. 2021 ద్వైమాసికంలో బ్రిటన్ జీడీపీ కేవలం 1% మాత్రమే పెరిగింది. కరోనా మహమ్మారి విసిరిన సవాళ్లను ఎదుర్కోలేక ఆర్థికంగా చతికిల పడిపోయింది. ఈ నేపథ్యంలోనే రాజకీయ అస్థిరత్వం, బోరిస్ జాన్సన్ రాజీనామా వంటివి ఆ దేశాన్ని మరింత కుదేల్ చేశాయి. 2024 వరకు ఇవే పరిస్థితులు ఉంటాయని బ్యాంకు ఆఫ్ ఇంగ్లండ్ అంచనా వేస్తోంది.

బీజేపీని ఓడిద్దాం రండి

ప్రతిపక్షాలకు బిహార్ సీఎం నితీశ్ పిలుపు

- విభేదాలు పక్కనపెట్టి చేతులు కలపాలి
- దేశ ప్రజలు ప్రత్యామ్నాయం కోసం ఎదురు చూస్తున్నారు
- ప్రతిపక్షాల ఐక్యత కోసం పనిచేయడమే లక్ష్యమని వెల్లడి

పట్నా: కేంద్రంలో బీజేపీని ఓడించడానికి ప్రతిపక్షాలన్నీ ఒక్కటి కావాలని జనతాదళ్(యునైటెడ్) సీనియర్ నాయకుడు, బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ పిలుపునిచ్చారు. దేశ ప్రజలు ప్రత్యామ్నాయం కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. పార్టీలన్నీ తమ మధ్యనున్న విభేదాలను పక్కనపెట్టి, ప్రజా సంక్షేమం కోసం చేతులు కలపాలని అన్నారు. శనివారం బిహార్ రాజధాని పాట్నాలో జేడీ(యూ) జాతీయ కార్యవర్గ సమావేశంలో నితీశ్ ప్రసంగించారు. ప్రతిపక్షాల ఐక్యత కోసం పనిచేయాలన్నదే తన ఏకైక లక్ష్యమని స్పష్టం చేశారు. బీజేపీయేతర పార్టీలను ఉమ్మడి వేదికపైకి తీసుకురావాలని భావిస్తున్నట్లు తెలిపారు. విపక్షాలన్నీ కలిసి పోరాడితే 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని కేవలం 50 సీట్లకే పరిమితం చేయొచ్చని అన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలను ఏకం చేయాల్సిన బాధ్యతను నితీశ్‌కు అప్పగిస్తూ జేడీ(యూ) జాతీయ కార్యవర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం గమనార్హం. అలాగే కాషాయ పార్టీ పాలనలో దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలవుతోందని, దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తూ ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారని ఆరోపిస్తూ ఒక తీర్మానాన్ని ఆమోదించారు. ప్రభుత్వ విధానాలు నచ్చకపోతే అసమ్మతి తెలియజేయడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని తీర్మానంలో ఉద్ఘాటించారు. అసమ్మతి తెలిపినవారిపై దేశద్రోహులుగా ముద్ర వేస్తున్నారని విమర్శించారు. మతోన్మాద బీజేపీకి బుద్ధి చెప్పాల్సిన సమయం వచ్చిందన్నారు. ''మైనార్టీలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. సమాజంలో అసహనం, తీవ్రవాదం పెరిగిపోతున్నాయి. దళితులు, గిరిజనులు వేధింపులకు గురవుతున్నారు'' అని జేడీ(యూ) ఆందోళన వ్యక్తం చేసింది.

మోదీకి ప్రత్యామ్నాయం నితీశ్

జాతీయ స్థాయిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ప్రత్యామ్నాయ నేతగా బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌ను తెరపైకి తీసుకొచ్చేందుకు బిహార్‌లో అధికార కూటమిలోని జేడీ(యూ) ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. పార్టీ జాతీయ కార్యవర్గ, జాతీయ మండలి సమావేశాలు శనివారం పాట్నాలో ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరుగున్న ఈ భేటీల్లో తొలిరోజు కీలక అంశాలపై చర్చించారు. నితీశ్‌ను ప్రధాని అభ్యర్థిగా అభివర్ణిస్తూ వేదిక వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. 'దేశ్ కా నేత కైసా హో.. నితీశ్ కుమార్ జైసా హో' అంటూ జేడీ(యూ) కార్యకర్తలు నినదించారు.



రేపటి నుంచి నితీశ్ ఢిల్లీ పర్యటన!

2024 ఎన్నికల్లో బీజేపీ ఢీకొట్టడానికి విపక్షాలన్నింటినీ ఏకతాటిపైకి తీసుకొచ్చే ప్రయత్నాల్లో భాగంగా నితీశ్ ఈ నెల 5 నుంచి మూడు రోజులపాటు ఢిల్లీలో పర్యటించే అవకాశముంది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సహా విపక్ష నాయకులతో ఆయన భేటీ కానున్నారు. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, హరియాణా మాజీ ముఖ్యమంత్రి ఓంప్రకాశ్ చౌతాలాతోపాటు కమ్యూనిస్ట్ నేతలతోనూ ఆయన సమావేశమవుతారని జేడీ(యూ) వర్గాలు తెలిపాయి. బిహార్‌లో బీజేపీతో తెగతెంపుల తర్వాత నితీశ్‌కు ఇదే తొలి ఢిల్లీ పర్యటన.

మణిపూర్‌లో జేడీ(యూ)కు షాక్

బీజేపీలోకి ఐదుగురు ఎమ్మెల్యేలు జంప్

పట్నా/ఇంఫాల్: జేడీ(యూ)కు మణిపూర్‌లో పెద్ద షాక్ తగిలింది. ఆరుగురు ఎమ్మెల్యేలకుగాను, ఏకంగా ఐదుగురు శుక్రవారం అధికార బీజేపీలో చేరారు. వారి విలీనానికి స్పీకర్ ఆమోదం కూడా తెలిపారని అసెంబ్లీ కార్యదర్శి ప్రకటించారు. ఆ ఎమ్మెల్యేలకు సాదర స్వాగతం పలుకుతున్నట్టు ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్, బీజేపీ రాష్ట్ర చీఫ్ ఎన్.శారదాదేవి సాదర పేర్కొన్నారు. శనివారం ఢిల్లీలో విందు కార్యక్రమంలో సదరు ఎమ్మెలోయేలతో వారు భేటీ అయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా పట్ల ప్రజల విశ్వాసానికి, ప్రేమకు ఎమ్మెల్యేల చేరిక సూచిక అని బీరేన్‌సింగ్ ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు. 60 సీట్లున్న మణిపూర్ అసెంబ్లీలో తాజా చేరికలతో బీజేపీ బలం 37కు పెరిగింది.

ఎమ్మెల్యేలను కొనడమే పనా: నితీశ్

తాజా పరిణామాలపై జేడీ(యూ) నేత, బిహార్ సీఎం నితీశ్‌కుమార్ మండిపడ్డారు. ఎమ్మెల్యేలను కొనేయడం రాజ్యాంగబద్ధమేనా అని బీజేపీని నిలదీశారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేలను బుట్టలో వేసుకోవడమే పనిగా పెట్టుకుందని బీజేపీపై ధ్వజమెత్తారు. 2024 ఎన్నికల్లో అన్ని పార్టీలూ బీజేపీకి వ్యతిరేకంగా కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. బీజేపీలో చేరిన తమ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ సుప్రీం కోర్టును ఆశ్రయిస్తామని మణిపూర్ జేడీ(యూ) అధ్యక్షుడు కుశ్ బీరేన్ చెప్పారు. వారి తీరు రాజ్యాంగ ఉల్లంఘనే అన్నారు.

దేశంలో కాంగ్రెస్, ప్రపంచమంతటా వామపక్షాలు... అంతరిస్తున్నాయి: అమిత్ షా

- కేరళలో బీజేపీకి మాత్రమే భవిష్యత్తు
- తిరువనంతపురంలో మంత్రి వ్యాఖ్యలు

తిరువనంతపురం: ''కాంగ్రెస్ పార్టీ క్రమంగా అంతరించిపోతోంది. దేశం నుంచి పూర్తిగా అంతర్ధానమవుతోంది. ఇక కమ్యూనిస్టు పార్టీలేమో ప్రపంచం నుంచే అంతర్ధానమవుతున్నాయి'' అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. దక్షిణాది జోనల్ మండలి సమావేశం నిమిత్తం కేరళ వచ్చిన ఆయన శనివారం ఇక్కడ బీజేపీ ఎస్సీ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ భవితవ్యం గురించి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. కమ్యూనిస్టు పార్టీలను ప్రపంచమంతా దూరం పెడుతోందని అభిప్రాయపడ్డారు. కేరళలో రాజకీయంగా కేవలం బీజేపీకి మాత్రమే భవిష్యత్తుందన్నారు. దక్షిణాది రాష్ట్రాలన్నింటికీ బీజేపీతోనే మంచి భవిష్యత్తు ఉంటుందని అభిప్రాయపడ్డారు. దక్షిణ భారతదేశమంటే ప్రధాని నరేంద్ర మోదీకి ప్రత్యేక అభిమానమన్నారు. మైనారిటీలు, వెనకబడ్డ వర్గాల వారి అభ్యున్నతికి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఎంతగానో పాటుపడుతోందన్నారు. కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు ఎన్నడూ ఎస్సీల క్షేమానికి కృషి చేయలేదంటూ దుయ్యబట్టారు. వారిని కేవలం ఓటు బ్యాంకులుగా మాత్రమే పరిగణిస్తూ వచ్చాయని ఆరోపించారు. ''బాబాసాహెబ్ అంబేడ్కర్ కృషిని, త్యాగాలను కూడా పట్టించుకోని చరిత్ర కాంగ్రెస్‌ది. అందుకే వాళ్లు అధికారంలో ఉండగా అంతటి మహా నేతకు భారతరత్న ఇవ్వాలనే ప్రయత్నం కూడా చేయలేదు'' అని విమర్శలు గుప్పించారు. కేరళలో బీజేపీ కార్యకర్తలు అద్భుతంగా పని చేస్తున్నారంటూ అభినందించారు. దేశభక్తి, త్యాగం, సాహసాలతో మరింతగా కృషి చేయాలని వారికి సూచించారు.



బీజేపీలో ఉంటూనే ఆప్ కోసం పనిచేయండి

గుజరాత్ బీజేపీ కార్యకర్తలకు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ పిలుపు



రాజ్‌కోట్: ''బీజేపీలోనే కొనసాగండి. ఆ పార్టీ నుంచి డబ్బులు తీసుకోండి. కానీ అంతర్గతంగా మాత్రం మా పార్టీకి సేవలందించండి. మా పార్టీ దగ్గర డబ్బుల్లేవు. అందుకే బీజేపీ నుంచే తీసుకోవాలని చెబుతున్నా'' అని గుజరాత్‌లో అధికార బీజేపీ కార్యకర్తలకు ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ విజ్ఞప్తి చేశారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న గుజరాత్‌లో శుక్ర, శనివారాల్లో ఆయన వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. శనివారం రాజ్‌కోట్‌లో మీడియాతో మాట్లాడారు. గుజరాత్‌లో ఆప్ అధికారంలోకి రాగానే ప్రజలకిచ్చిన హామీలన్నీ అమలు చేస్తామన్నారు. వాటిని బీజేపీ కార్యకర్తలకు కూడా వర్తింపజేస్తామని చెప్పారు. సాధారణ ప్రజల తరహాలోనే ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు పొందవచ్చని బీజేపీ శ్రేణులకు సూచించారు. చాలా ఏళ్లుగా బీజేపీకి సేవ చేస్తున్నారు, మీకేమైనా ప్రతిఫలం దక్కిందా అని ఆ పార్టీ కార్యకర్తలను ప్రశ్నించారు. బీజేపీ నాయకులు తమకు అవసరం లేదని, క్షేత్రస్థాయిలోని కార్యకర్తలు తమకోసం పనిచేస్తే చాలని వ్యాఖ్యానించారు. వారి కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందిస్తామని చెప్పారు. ఉచిత విద్య, వైద్యం, విద్యుత్ వంటి ప్రయోజనాలు పొందవచ్చని కేజ్రీవాల్ పేర్కొన్నారు. మహిళలకు ప్రతి నెలా రూ.1,000 చొప్పున భత్యం అందజేస్తామన్నారు. ఇంకా బీజేపీలో కొనసాగడంలో అర్థం లేదని, ఎందుకంటే గుజరాత్‌లో ఆ పార్టీ కథ ముగిసిపోతోందని తేల్చిచెప్పారు. బీజేపీ భయపెడితే భయపడడానికి తాము కాంగ్రెస్ నాయకులం కాదని స్పష్టం చేశారు.

గోర్బచెవ్‌కు నిరాడంబరంగా తుదివీడ్కోలు



సోవియట్ యూనియన్ చివరి అధ్యక్షుడు మిఖాయిల్ గోర్బచెవ్ (91) మృతదేహం వద్ద విలపిస్తున్న కుమార్తె ఇరినా. అనారోగ్యంతో మంగళవారం మరణించిన గోర్బచెవ్ అంత్యక్రియలు శనివారం మాస్కోలో నిరాడంబరంగా ముగిశాయి. భార్య రైసా సమాధి పక్కనే ఆయన పార్థివ దేహాన్ని ఖననంచేశారు. అభిమాన నేతను కడసారి చూసుకునేందుకు రష్యా పౌరులు భారీగా పోటెత్తారు. అంత్యక్రియల్లో అధ్యక్షుడు పుతిన్ పాల్గొనలేదు. సోవియట్ కుప్పకూలడానికి గోర్బచెవే కారకుడనే భావనతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. తాను పాల్గొనాల్సి వస్తుందనే అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో జరపలేదని కూడా చెబుతున్నారు.

పరాన్నజీవులూ, వెళ్లిపొండి

పోలండ్‌లో భారతీయునిపై ఓ అమెరికన్ జాత్యహంకార వ్యాఖ్యలు

లండన్: అమెరికాలో భారతీయ మహిళలపై జాత్యహంకార వివక్ష ఘటన మరవకముందే పోలండ్‌లోనూ అలాంటి ఉదంతమే వెలుగు చూసింది. రాజధాని వార్సాలో ఓ షాపింగ్ మాల్ వద్ద అమెరికా పర్యాటకుడు ఒక భారతీయుడిని జాత్యహంకార ప్రశ్నలతో వేధిస్తూ తీసిన వీడియో వైరల్‌గా మారింది. ''నేను అమెరికా పౌరుడిని. అందుకే అమెరికాలో మాత్రమే ఉంటాను. అమెరికా మీ వాళ్లతో నిండిపోతోంది. నువ్వెందుకు పోలండ్ వచ్చావు? పోలండ్‌ను సైతం భారతీయులతో నింపేస్తారా? మీ సొంత దేశానికి పోరెందుకు? మా దేశాలను ఎందుకు ముంచెత్తుతున్నారు? మీకు భారతదేశముందిగా. మీ దేశాన్ని ఎందుకు సుసంపన్నం చేసుకోరు? కష్టపడి సంపన్నంగా మార్చుకున్న మా దేశాలకు ఎందుకొస్తున్నారు? పోలండ్‌లోనూ స్థిరపడటం ఈజీ అనుకుంటున్నారా? మీ సొంత దేశానికెందుకు వెళ్లరు? మీరంతా మా జాతిని నాశనం చేస్తున్నారు. నువ్వో ఆక్రమణదారువు. పరాయిదేశంలో బతికే పరాన్నజీవివి. ఇక్కడి నుంచి వెళ్లిపో. మీరు మా యూరప్‌లో ఉండొద్దు. పోలండ్ పోలిష్ జాతీయులదే'' అంటూ వాగ్వాదానికి దిగాడు. అతన్ని 'గోయిమ్ టీవీ' అనే విద్వేష గ్రూప్‌నకు సారథ్యం వహిస్తున్న జాన్ మినడియో జూనియర్‌గా గుర్తించారు.

విమానం కూల్చేస్తా

అమెరికాలో ఆగంతకుడి కలకలం



వాషింగ్టన్: అమెరికాలో శనివారం ఓ ఆగంతకుడు ఏకంగా విమానాన్ని దొంగలించాడు. అందులో గంటల తరబడి ఆకాశంలో చక్కర్లు కొట్టాడు. అంతేగాక దాన్ని సూపర్ మార్కెట్‌పై కూల్చేస్తానంటూ కాసేపు అందరినీ హడలెత్తించాడు. ఎట్టకేలకు అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో కథ సుఖాంతమైంది.

మిసిసిపీ రాష్ట్రంలోని తుపెలో విమానాశ్రయంలోకి స్థానిక కాలమానం ప్రకారం ఉదయం ఐదింటికి ఓ ఆగంతకుడు చొరబడ్డాడు. తొమ్మిది సీట్ల సామర్థ్యమున్న చిన్న బీచ్‌క్రాఫ్ట్ కింగ్ ఎయిర్ సీ90ఏ విమానాన్ని టేకాఫ్ చేసి నగరంపై చక్కర్లు కొట్టించాడు. వాల్‌మార్ట్ స్టోర్‌పై విమానాన్ని కూల్చేస్తానంటూ బెదిరించాడు. దాంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. వాల్‌మార్ట్, సమీప స్టోర్లను ఖాళీ చేయించారు. విమానం తిరుగుతున్న ప్రాంతాల్లో ఉండొద్దంటూ స్థానికులను కూడా అప్రమత్తం చేశారు. మరోవైపు దుండగునితో నేరుగా మాట్లాడే ప్రయత్నం చేశారు. నాలుగు గంటలపాటు సిటీ గగనతలంపై తిరిగిన విమానం ఆ తర్వాత బ్లూ స్ప్రింగ్ ప్రాంతంలోని టొయోటో తయారీ కర్మాగారం వైపు వెళ్లింది. తర్వాత ఎట్టకేలకు ఉత్తరం వైపు మైదాన ప్రాంతంలో ల్యాండయింది. దాంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. వెంటనే అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దుండగునితో మాట్లాడి పరిస్థితిని చాకచక్యంగా అదుపులోకి తెచ్చినందుకు పోలీసులు, సంబంధిత దర్యాప్తు సంస్థలను మిసిసిప్పీ గవర్నర్ టేట్ రీవ్స్ అభినందించారు. కూల్చేస్తానని ఎందుకు బెదిరించాడనే దానిపై ఆరాతీస్తున్నారు. అతను తుపెలో ఎయిర్‌పోర్ట్ ఉద్యోగేనని స్థానిక పత్రిక పేర్కొంది. మొత్తంగా విమానం దాదాపు ఐదు గంటలకుపైగా చక్కర్లు కొట్టి స్థానికులకు చుక్కలు చూపించింది.

సాక్షి విజయనగరం

ఆదివారం । 4 । సెప్టెంబర్ । 2022



జనసేన కార్యకర్తల వీరంగం

జనసేన పార్టీ కార్యకర్తలు వీరంగం సృష్టించారు. తమ అభిమాన హీరో పవన్ కల్యాణ్ సినిమా ఆలస్యంగా వేసినందుకు పట్టణంలోని అమోఘ్ థియేటర్‌పై దాడికి ఎగబడ్డారు. - 8లో



పిడుగుపాటుతో రైతు మృతి

జిల్లాలో శనివారం పిడుగుల వాన కురిసింది. పిడుగు పాటుకు జిల్లాకు చెందిన ఇద్దరు రైతులు మృతి చెందారు. పొలంలో పనులు చేస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. - 8లో



కుండపోత

విజయనగరం జిల్లా కేంద్రంలో శనివారం సాయంత్రం కుండపోతగా వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. రాకపోకలకు కాసేపు అంతరాయం కలిగింది.

– సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం

న్యూస్‌రీల్

ఇంటర్ ప్రవేశాలకు మరో అవకాశం

విజయనగరం పూల్‌బాగ్: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర ప్రవేశాలకు (మూడో విడత) అర్హులైన అభ్యర్థులు ఈనెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని డీవీఈఓ రమేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే దరఖాస్తులు స్వీకరణ జరుగుతుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

షెడ్యూల్ ప్రకారం పోషణ మాసోత్సవాలు



పోషణ మాసోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న సీడీపీఓలు, అంగన్‌వాడీ సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో పోషణ మాసోత్సవాలను షెడ్యూల్ ప్రకారం జరిపించాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారిని బి.శాంత కుమారి పిలుపునిచ్చారు. స్థానిక మహిళా ప్రాంగణం వద్ద జిల్లా స్థాయి పోషణ మాసోత్సవ ర్యాలీని ఆమె శనివారం ప్రారంభించారు. అనంతరం సీడీపీఓలతో సమీక్షించారు. పిల్లల హాజరును వైఎస్సార్ సంపూర్ణ పోషణ యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. 15–18 సంవత్సరాల మధ్య వయసున్న డ్రాపౌట్స్ (కిశోరబాలిక)లను గుర్తించి నైపుణ్యాభివృద్ధి శిక్షణకు, ఓపెన్ ఇంటర్మీడియట్ చదువుకు రిఫర్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్వశిక్ష ఏపీసీ వేమలి అప్పలస్వామినాయుడు, రాము, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థంలో అలరించిన కళారాధన



స్వామి సన్నిధిలో భక్తి గీతాలు ఆలపిస్తున్న కళాకారులు

నెల్లిమర్ల రూరల్: దేవదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో ధర్మపథంలో భాగంగా రామతీర్థం సీతారామస్వామివారి దేవస్థానంలో శనివారం ఏర్పాటు చేసిన కళారాధన భక్తులను ఆకట్టుకుంది. విశాఖపట్నం హనుమంతవాక ప్రాంతానికి చెందిన భక్తతుకారాం శ్రీరామ భజన బృంద సభ్యులు స్వామి కీర్తనలు ఆలపించారు. విజయనగరం పట్టణానికి చెందిన దివ్య జీవన సంఘ సభ్యులు కోలాటం నిర్వహించారు. దేవస్థాన ఈఓ ప్రసాదరావు ప్రసంశాపత్రాలు అందజేసి అభినందించారు.

సంక్షేమం, అభివృద్ధిలో తగ్గేదేలే..

- డిప్యూటీ సీఎం రాజన్నదొర




గోముఖి నదిపై నిర్మించిన వంతెనను ప్రారంభిస్తున్న డిప్యూటీసీఎం రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

సాలూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజాసంక్షేమం, అభివృద్ధి విషయంలో తగ్గేదేలేదని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర పునరుద్ఘాటించారు. సాలూరు–దళాయివలస రోడ్డు నుంచి శంబర వెళ్లే రోడ్డులో కందులపదం వద్ద గోముఖి నదిపై రూ.5 కోట్ల13 లక్షల వ్యయంతో నిర్మించిన వంతెనను జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వంతెన వల్ల సుమారు 21 గిరిజన గ్రామాల ప్రజలకు వర్షాకాలంలో రాకపోకలకు ఆటంకాలు తప్పుతాయన్నారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ గిరిజన గ్రామాల దశాబ్దాల కలగా మారిన వంతెన నిర్మాణం జగనన్న పాలనలో, రాజన్నదొర హయాంలో పూర్తయిందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో గిరిశిఖర గ్రామాల రోడ్లకు అటవీశాఖ అనుమతుల కోసం రాజన్నదొర భగీరథ ప్రయత్నం చేసి సఫలీకృతులయ్యారన్నారు. అనంతరం రూ.35 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని రాజన్నదొరతో కలిసి ఆయన ప్రారంభించారు.

మా మంచి మాస్టార్‌లు



అక్షరమే అభివృద్ధికి నాంది. ప్రగతికి సోపానం. ఆ అక్షరాలు నేర్పే గురువులు... విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దే దేవుళ్లు. సమసమాజ స్థాపకులు. అందుకే.. వేదకాలం నుంచి గురువుది పూజ్య స్థానం. చక్కని బోధన.. సేవా భావంలో ముందుంటూ.. విద్యార్థుల్లో సామాజికి చైతన్యం నింపుతూ.. భాషా, క్రీడా, ఉద్యోగ, నైతిక వికాసానికి కృషిచేస్తున్న మా మంచి మా'స్టార్'ల సేవలను ప్రభుత్వం గుర్తించింది. విజయనగరం, పార్వతీపురం ఉమ్మడి జిల్లాల్లోని ఏడుగురిని రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులతో విజయవాడలో ఈ నెల 5న సత్కరించనుంది. ఈ సందర్భంగా వారి సేవలను ఓ సారి పరికిద్దాం.



క్రీడా శిఖరం.. వాసు మాస్టారు..



పార్వతీపురంటౌన్: జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు–2022 ఎంపిక జాబితాలో మన రాష్ట్రం నుంచి ఆరుగురు ఉపాధ్యాయులు జాతీయ జ్యూరీకి ఎంపిక కాగా, అందులో పార్వతీపురం మన్యం జిల్లాలోని డోకిశీల వ్యాయామ ఉపాధ్యాయుడు వాసుదేవరావునాయుడు ఒకరు. 1991లో పార్వతీపురం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ పరిధిలోని గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాల రావాడ రామభద్రపురంలో పీఈటీగా ఉద్యోగంలో చేరారు. తోనం, టిక్కబాయి, దుద్దుఖల్లులో పీఈటీగా పనిచేస్తూ 2012లో గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల పార్వతీపురంలో వ్యాయామ సంచాలకులుగా ఉద్యోగోన్నతి పొందారు. ప్రస్తుతం జిల్లా క్రీడా సమన్వయకర్తగా పనిచేస్తున్నారు. ఈ ఏడాదిలో జరిగిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాలలో 70కి పైగా నిర్వహించి ఉన్నతాధికారుల ప్రశంశలు పొందారు. ఆయన సేవలకు 2003–2004లో జిల్లా ఉత్తమ పీఈటీగా, 2010లో ఆంధ్రా యూనివర్సిటీ నుంచి ఉత్తమ పీఈటీగా అవార్డులు అందుకున్నారు. 2011లో రాష్ట్ర ఉత్తమ పీఈటీగా ఎంపికయ్యారు. ఆయన తీర్చిదిద్దిన ఎంతోమంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించారు. గిరిజన విద్యార్థులు పోలీస్, ఆర్మీ వంటి రక్షణ దళ ఉద్యోగాలకు అర్హత సాధించేలా తీర్చిదిద్దడంలో ఆయనకు ఆయనే సాటి. మరోవైపు రాష్ట్రస్థాయి గిరిజన క్రీడా పోటీలల్లో 2016–17 గుంటూరులో రాష్ట్రస్థాయి, అంతర సొసైటీ చాంపియన్‌షిప్ 2018–19లో విజయవాడలో నిర్వహించిన పోటీల్లో రాష్ట్ర కో–ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. పార్వతీపురం ఐటీడీఏను రెండుసార్లు చాంపియన్‌గా నిలిపారు.



సేవలకు గుర్తింపు



బలగ సుమన

విజయనగరం రూరల్: విజయనగరం మండల పరిధిలోని జొన్నవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న బలగ సుమనకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయినిగా అవార్డు వరించింది. సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఈ నెల 5న నిర్వహించే గురుపూజోత్సవంలో అవార్డు అందుకోనున్నారు. విద్యా బోధనతో పాటు పాఠశాల అభివృద్ధికి ఆమె చేసిన కృషికి అవార్డు వరించింది. ఆమె 1998లో ఉపాధ్యాయినిగా ఉద్యోగంలో చేరారు. నాటి నుంచి ఇప్పటి వరకు ఏడు పాఠశాలల్లో విధులు నిర్వహించారు. విజయనగరం మున్సిపాలిటీ పరిధిలోని కణపాక ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎంగా పనిచేసిన సమయంలో పాఠశాలకు హాజరు సంఖ్యను పెంచడంలో కీలకభూమిక పోషించారు. ఉత్తమ ఫలితాలు సాధించారు. 2017లో జిల్లా స్థాయిలో సావిత్రిబాయి పూలే అవార్డు పొందిన సుమన 2018లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా అవార్డు స్వీకరించారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కల నాడటం, వాటిపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడంతో 2020లో కలెక్టర్ నుంచి హరితమిత్ర అవార్డు అందుకున్నారు. 2022లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున కలెక్టర్ ఎ.సూర్యకుమారి చేతుల మీదుగా సత్కారం పొందారు. కోవిడ్ సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సొంతంగా శానిటైజర్లు, మాస్కులు పంపిణీ చేశారు. జిల్లా రక్తనిధి భవన నిర్మాణానికి తన వంతుగా రూ. 50 వేల చెక్కును కలెక్టర్‌కు అందజేశారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా పప్పెట్రీ విధానం, రోల్‌ప్లే, గీతాలతో విద్యాబోధన చేయడం ఆమె ప్రత్యేకత.

చదువుల జయరాం..



దత్తిరాజేరు: మండలంలోని గుచ్చిమి మధుర గ్రామైన భోజ రాజపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు గెద్ద జయరాం.. చక్కని బోధన అందించడంలో దిట్ట. సులభ పద్ధతుల్లో, టీఎల్‌ఎమ్‌ల సాయంతో చిన్నారులకు ప్రమాణాలతో కూడిన విద్యను బోధిస్తున్నారు. పాఠశాలకు సౌకర్యాలు సమకూర్చడంలో దాతలను ఒప్పించడంలో ఆయనకు ఆయనే సాటి. పాఠశాల పరిసరాలను పచ్చని చెట్లతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. చదువుల ఒడిగా మార్చారు. విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు నైతిక విలువలు నేర్పుతున్నారు. సమాజాన్ని మార్చే శక్తి గురువుకే ఉంటుందని, గురువు ఆదర్శంగా ఉంటే ఆదర్శవంతమైన సమాజం రూపుదిద్దుకుంటుందన్నది ఆయన నినాదం. ఆయన స్వగ్రామం దత్తికాగా, ప్రస్తుతం చిట్టి గురువులు కార్యక్రమం కో ఆర్డినేటర్ విధులు నిర్వర్తిస్తున్నారు.

ఉత్తమ అధ్యాపకుడిగా హనుమంతురావు



డెంకాడ: రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడిగా డెంకాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన తెలుగు అధ్యాపకులు మొయిద హనుమంతురావు ఎంపికయ్యారు. ఆయన విజయవాడలో జరగనున్న రాష్ట్ర టీచర్స్ డే వేడుకల్లో అవార్డు అందుకోనున్నారు. అధ్యాపకులు ఎం.హనుమంతురావు 2002 ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిగా బాధ్యతలు చేపట్టారు. 2004లో జూనియర్ లెక్చరర్ రావడంతో అధ్యాపక జీవితాన్ని ప్రారంభించారు. పూలే, అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం అధ్యక్షుడిగా పనిచేశారు. 2004 నుంచి తండ్రి మొయిద రామారావు పేరిట పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భాషాభివృద్ధికి విస్తృత కృషిచేస్తున్నారు.

'చిట్టి గురువులు'తో అక్షరాస్యత

- వయోజన విద్యాశాఖ డీడీ సుగుణాకరరావు



మాట్లాడుతున్న వయోజన విద్య శాఖ డీడీ కోట్ల సుగుణాకరరావు, డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి

విజయనగరం అర్బన్: జిల్లాలో అక్షరాస్యత శాతం పెంచే కార్యక్రమంగా చేపడుతున్న 'చిట్టిగురువులు' కార్యక్రమాన్ని మహిళా పొదుపు సంఘాల సభ్యులు విజయవతం చేయాలని వయోజన విద్యశాఖ డీడీ కోట్ల సుగుణాకరరావు పిలుపునిచ్చారు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో పొదుపు సంఘాల సభ్యులతో పీడీ కల్యాణచక్రవర్తి శనివారం నిర్వహించిన శాఖాపరమైన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పొదుపు మహిళలందరూ అక్షరాస్యులు కావాలన్నారు. సీఐఈ ఉన్నతి, స్త్రీనిధి, ఎస్‌వీఈపీ రుణాల రికవరీలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని కాంపోనెంట్లకు పెర్ఫార్మెన్స్ ఇండికేషన్లు రూపొందించామని, నిర్లక్ష్యంగా విధులు నిర్వహించిన వారిపై చర్యలు తప్పవన్నారు. ఎఫ్‌పీఓలు, వైఎస్సార్‌చేయూత, లైవ్ స్టాక్, ఉన్నతి, స్త్రీనిధి, బ్యాంకు లింకేజీలు, పుస్తకాల నిర్వహణ, అంతర్గత ఆడిట్లు వంటి అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏలోని వివిధ స్థాయిలోని సిబ్బంది పాల్గొన్నారు.

5, 6 తేదీల్లో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు



టీ షర్టులు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

- జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధుల వెల్లడి

నెల్లిమర్ల: జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు పుట్టిన రోజు సందర్భంగా ఈ నెల 5, 6వ తేదీల్లో రాష్ట్రస్థాయి ఆహ్వానపు కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్, వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల మండల, నగర పంచాయతీ అధ్యక్షుడు చనమల్లు వెంకటరమణ, చిక్కాల సాంబశివరావు తెలిపారు. నెల్లిమర్లలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. క్రీడలకు పుట్టినిల్లయిన నెల్లిమర్లలో రెండురోజుల పాటు ఫ్లడ్ లైట్ల వెలుతురులో మ్యాట్‌లపై పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, తూర్పు, పశ్చిమ గోదావరి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన జట్లు పోటీల్లో పాల్గొంటాయని పేర్కొన్నారు. ప్రథమ బహుమతిగా రూ.50వేలు, ద్వితీయ, తృతీయ, నాలుగవ బహుమతులుగా రూ.35 వేలు, రూ.25 వేలు, రూ.15 వేలు అందజేస్తామని చెప్పారు. పట్టణంలోని థామస్‌పేట ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో నిర్వహించే పోటీలను క్రీడాకారులు, క్రీడాభిమానులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడి పేరుతో తయారుచేసిన టీషర్టులను ఆవిష్కరించారు. కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కాళ్ల సూరిబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పతివాడ శ్రీనివాసరావు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్‌వీ రమణ, నగరపంచాయతీ వైస్‌చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నొపడ శ్రీనివాసరావు, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు, తుమ్మలపేట పీఏసీఎస్ అధ్యక్షుడు కోట్ల పైడినాయుడు, బోని సూర్యనారాయణ, బొమ్మన రామారావు పాల్గొన్నారు.

పులిని బంధించేందుకు...



ఎం.కె.పాలెంలో పులి కోసం అధికారులు ఏర్పాటు చేసిన బోను



బోనును నిరంతరం పరిశీలిస్తున్న అటవీశాఖ సిబ్బంది

- ఎం.కె.పాలెం వద్ద బోను ఏర్పాటు
- పహారా కాస్తున్న అటవీశాఖ అధికారులు
- గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని దండోరా

బొండపల్లి: బెంగాల్ టైగర్‌ను సురక్షితంగా పట్టుకుని తరలించేందుకు అటవీశాఖ అధికారులు పూర్తిస్థాయిలో సన్నద్ధమయ్యారు. రెండు రోజుల కిందట వెదురువాడ పంచాయతీ పరిధిలోని ఎం.కె. పాలెం గ్రామం వద్ద ఆవుదూడను చంపివేసిన ప్రాంతానికి సమీపంలో టైగర్ ట్రాపింగ్ కేజ్(బోను)తో పాటు రెస్క్యూ వ్యాన్‌ను ఏర్పాటు చేశారు. శనివారం అక్కడే కేజ్‌ను ఉంచి పహారా కాస్తున్నారు. పులి జాడపై నిఘా పెట్టారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ ఈ ప్రాంతంలో దండోరా వేయించారు. ఫారెస్టు రేంజ్ అధికారి ఎస్.అప్పలరాజు, ఫారెస్టు సెక్షన్ అధికారి కేవీఎస్ రాజు, కొత్తపాలెం ఫారెస్టు బీట్ అధికారి కె.వి.వెంకటజగదీష్ తదితరులు పులిని బంధించే ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు.

ముగిసిన జాతీయ అన్వేషిక ప్రయోగ నైపుణ్య పరీక్ష



పరీక్షకు హాజరైన విద్యార్థులు

విజయనగరం అర్బన్: స్థానిక ఆర్‌కే డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన జాతీయ అన్వేషిక ప్రయోగ నైపుణ్య ప్రాంతీయ పరీక్ష–2022 సజావుగా సాగింది. ఫోకస్ ఏపీటీ అన్వేషిక రాష్ట్ర కమిటీ, విజ్ఞాన భారతి, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ రాష్ట్ర కమిటీ సంయుక్త నిర్వహణలో పరీక్ష జరిగింది. జూనియర్ కేటగిరీలో 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు, సీనియర్ కేటగిరీలో డిగ్రీ, పీజీ భౌతిక శాస్త్ర విద్యార్థులకు వేర్వేరుగా పరీక్ష నిర్వహించారు. పరీక్షకు 24 విద్యాసంస్థల నుంచి 287 మంది విద్యార్థులు హాజరయ్యారు. నిత్యజీవితంలో జరుగుతున్న సంఘటనలను ప్రాజెక్టర్‌పై వీడియో రూపంలో ప్రదర్శించి దానికి అనుబంధంగా ఉన్న మల్టిపుల్ చాయిస్ విధానంలో సమాధానాలు రాబట్టారు. పరీక్షలో ప్రతిభ చూపిన 15 మంది విద్యార్థులను ఒక్కో కేటగిరీ నుంచి ఎంపిక చేసి నెలాఖరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తారు. రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచిన వారిని ఐఐటీ కాన్పూర్‌లో జరగబోయే జాతీయ స్థాయికి పంపిస్తారు. విద్యార్థులలో భౌతిక శాస్త్రం, శాస్త్ర సాంకేతిక రంగాలపై అభిరుచిని, ఆసక్తిని పెంపొందించడమే పరీక్షల ప్రధాన ఉద్దేశమని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జోగా చంద్రశేఖరరావు తెలిపారు. పద్మశ్రీ హరిశ్చంద్ర వర్మ ఆధ్వర్యంలో సాగిన పోటీల్లో ఐఏపీటీ సీనియర్ లైఫ్ మెండర్ వి.శ్రీనివాసరావు, ఎస్.సుబ్రహ్మణ్యం, పి.రమేష్, కె.బాలచంద్ర, జె.కిరణ్‌కుమార్, బి.శైలజ, ఎస్.సురేష్, గాయత్రి, దుర్గా ప్రసాద్, ఆర్‌కే కళాశాల కరస్పాండెంట్ సంతోష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పిడుగుపాటుతో రైతు మృతి


పొలంలో మృతి చెందిన సత్యం

జామి: పిడుగుపాటుకు గురై, జామికి చెందిన రైతు వర్రి సత్యం(46)మృతి చెందాడు. శనివారం ఉదయం భార్య రమణమ్మతో కలిసి తమ పొలంలో కలుపు తీస్తుండగా, ఉన్నట్టుండి మేఘావృతమై ఉరుములు మెరుపులు వచ్చి, పిడుగు పడింది. దీంతో అతడు అక్కడికక్కడే చనిపోయాడు. గాయాలైపాలైన రమణమ్మను చికిత్స నిమిత్తం దగ్గరలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ హేమంత్‌కుమార్ హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని, జరిగిన సంఘటనపై ఆరాతీశారు.


వేపాడ: ఘటన స్థలంలో రమణమ్మ మృతదేహం

వేపాడ: పిడుగుపాటుతో మండలంలోని కృష్ణారాయుడుపేటకు చెందిన మురుకుర్తి రమణమ్మ (35) మృతి చెందింది. వేపాడలోని తన అక్క బోర అర్జునమ్మ అల్లుడు పొలంలో వరి కలుపు తీసేందుకు ఈమె శనివారం ఉదయం వెళ్లింది. తన అక్క అర్జునమ్మ, అల్లుడు అక్క సునీతతో కలిసి కలుపు తీస్తుండగా, మధ్యాహ్నం అకస్మాత్తుగా ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ క్రమంలో దగ్గరలోని కళ్లాల్లోని పశువుల శాల వద్దకు వెళ్తుండగా పిడుగుపడింది. దీంతో ఆమె అక్కడికక్కడే చనిపోయింది. మృతురాలి భర్త గతంలో చనిపోగా, ఆమెకు ఓ కూతురు ఉంది. ప్రమాద విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఎస్.కృష్ణంరాజు, ఎస్‌ఐ రాజేష్, ఆర్‌ఐ రామలక్ష్మి, వీఆర్‌ఓ బాలభాస్కర్ హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని, వివరాలు సేకరించారు.

చికిత్స పొందుతూ..

విజయనగరం క్రైమ్: కాలిన గాయాలతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరి, చికిత్స పొందుతుండగా ఆకెళ్ల సన్యాసమ్మ(70) అనే వృద్ధురాలు శనివారం మృతి చెందింది. స్థానిక బాబామెట్టలో నివాసముంటున్న సన్యాసమ్మ ఈ నెల 1వ తేదీన ఉదయం 10 గంటలకు దేవుని పూజ చేస్తుండగా దీపం ఒత్తు ఆమె చీరకు అంటుకుని, గాయపడిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై మృతురాలి కొడుకు సంతోష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య


అప్పలనాయుడు మృతదేహం

రామభద్రపురం: పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న విషాద సంఘటన మండలంలోని ముచ్చర్లవలస గ్రామంలో శనివారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. భార్య జోగమ్మ చనిపోయి బాధతో ఎనిమిదేళ్ల నుంచి గ్రామానికి చెందిన పాచిపెంట అప్పలనాయుడు మద్యానికి బానిసయ్యాడు. తరచూ తన కొడుకు మహేశ్‌నే ఏదో ఒక సాకు చెప్పి, డబ్బులు అడిగి, మద్యం తాగేవాడు. అయితే రోజూ కొడుకును డబ్బులు అడిగి తాగడం తప్పు అని తెలుసుకుని, అతడు మనస్తాపం చెందాడు. ఈ నెల 1వ తేదీన రాత్రి ఇంట్లోని పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న తండ్రిని చూసిన కొడుకు చికిత్స నిమిత్తం అతడిని బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడే చికిత్స పొందుతుండగా శుక్రవారం రాత్రి ఆయన చనిపోయాడు. మృతుని కొడుకు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 500.00
విజయనగరం	రూ. 504.00
శ్రీకాకుళం	రూ. 504.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	50,890-00
బంగారం(22సి. 10గ్రా.)	46,650-00
వెండి (కిలో)	58,200-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹125	₹220	₹ 230

జనసేన కార్యకర్తల వీరంగం


జనసేన కార్యకర్తలు చించేసిన ప్రొజెక్టర్ సీలింగ్

- అమోఘ్ థియేటర్‌పై పవన్ అభిమానుల దాడి
- ప్రొజెక్టర్ సీలింగ్, సీట్లు, సీసీ కెమెరాలు ధ్వంసం
- జల్సా సినిమా ఆలస్యంగా వేసినందుకు నిర్వాకం
- థియేటర్ యాజమాన్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు


జనసేన కార్యకర్తలు దాడికి పాల్పడిన థియేటర్


థియేటర్ లోపల సీట్లు కోసిన దృశ్యం


పవన్ అభిమానులు విరగ్గొట్టిన సీసీ కెమెరా

చీపురుపల్లి: జనసేన పార్టీ కార్యకర్తలు వీరంగం సృష్టించారు. తమ అభిమాన హీరో పవన్ కల్యాణ్ సినిమా ఆలస్యంగా వేసినందుకు పట్టణంలోని అమోఘ్ థియేటర్‌పై దాడికి ఎగబడ్డారు. సీట్లు, సీలింగ్, సీసీ కెమెరాలు, సౌండ్ బాక్సులను ధ్వంసం చేశారు. దీంతో ఆగకుండా మనల్ని ఎవడ్రా ఆపేది అన్న స్థాయిలో రెచ్చిపోయి టాయిలెట్స్‌లోని ట్యాపులు, కేబిన్‌లోని ఫర్నిచర్ విరగ్గొట్టారు. ఆక్సిజన్ సిలిండర్లను బయటకు విసిరేశారు. దీనిపై థియేటర్ మేనేజర్ లెంక అప్పలనారాయణ చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నారు.

వివరాలిలా ఉన్నాయి.. ఈ నెల 2వ తేదీన పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 1వ తేదీ రాత్రి 6.30 గంటలకు జల్సా సినిమాను థియేటర్లలో ప్రదర్శించారు. అయితే సాంకేతిక లోపం కారణంగా అమోఘ్ థియేటర్‌లో ప్రదర్శితం కావాల్సిన సినిమా ఓ అరగంట ఆలస్యమైంది. ఇది తట్టుకోలేని జనసేన పార్టీ కార్యకర్తలు థియేటర్ విధ్వంసానికి పాల్పడ్డారు. అరుపులు, కేకలతో నానా రచ్చ చేశారు. ఇది చాలదంటూ థియేటర్‌లోని ఆస్తులను ధ్వంసం చేశారు. చేతికి దొరికినా ప్రతీ వస్తువునూ నాశనం చేశారు. ఫ్యాన్ల రెక్కలు విరగ్గొట్టడంతో పాటు ప్రొజెక్టర్ సీలింగ్ చించివేశారు. సాంకేతిక లోపం సరిచేసిన తర్వాత సినిమా ప్రదర్శిస్తామని యాజమాన్యం ఎంత మొత్తుకున్నా వారు వినకుండా పాల్పడిన ఈ నిర్వాకాన్ని అందరూ విమర్శిస్తున్నారు. ఇంత చిన్న విషయానికి అంత వింతైన దురుసు ప్రవర్తన సరికాదని అంటున్నారు.

స్మార్ట్‌సిటీకి స్థల సేకరణ చేపట్టాలి

- ఎమ్మెల్యే శంబంగి


అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: మధ్య తరగతి ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న స్మార్ట్ సిటీ కోసం బొబ్బిలిలో త్వరితగతిన స్థల సేకరణ చేపట్టాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఆదేశించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుడా, రెవెన్యూ అధికారులతో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏడెనిమిది నెలల్లో జగనన్న మోడల్ స్మార్ట్ సిటీని శంకుస్థాపనకు సిద్ధం చేయాలన్నారు. ఇప్పటికే పేద వర్గాలకు జగనన్న కాలనీల ద్వారా ఇళ్ల స్థలాలను ఉచితంగా అందజేసిన ప్రభుత్వం.. మధ్య తరగతి వారికి తక్కువ ధరలో ఎంఐజీ స్థలాలను అందించేందుకు జగనన్న స్మార్ట్ సిటీలను సిద్ధం చేస్తోందని చెప్పారు. ఇందులో భాగంగానే బొబ్బిలిలో ఉన్న మూడు ప్రాంతాలను పరిశీలించి త్వరితగతిన స్థలాలను కొనుగోలు చేసి అన్ని సౌకర్యాలతో ప్లాట్లు సిద్ధం చేయాలని ఆదేశించారు. మల్లంపేట, గున్నతోటవలసల్లో భూములను పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఇదిలా ఉంటే బుడా పరిధిలోని పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో 9 ఎకరాలు, పార్వతీపురంలో 5 ఎకరాలను ప్రాథమికంగా గుర్తించినట్టు బుడా అధికారులు తెలిపారు. బుడా చైర్మన్ ఇంటి పార్వతీగోపాల రావు, బుడా ప్లానింగ్ ఆఫీసర్ డీఎస్‌వీ కుమార్, టీపీఓ ఎస్. వెంకటరావు, తహసీల్దార్ రాజారావు, మున్సిపల్ టీపీఎస్‌ఓ వరప్రసాద్, బుడా సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు

- డీఈఓ వెంకటేశ్వరరావు


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరరావు

రామభద్రపురం: కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పిస్తున్నట్లు డీఈఓ వెంకటేశ్వరరావు అన్నారు. డిప్యూటీ డీఈఓ తిరుపతిరాయుడుతో కలిసి శనివారం ఆయ న స్థానిక ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొత్తగా నిర్మిస్తున్న అదనపు తరగతి గదులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కార్పొరేట్ స్థాయికి తగ్గట్టు బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. మనబడి నాడు-నేడు, విద్యాకానుక, జగనన్న గోరు ముద్ద, సంపూర్ణ పోషణ, అమ్మఒడి, తదితర పథకాల అమలును పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.కామేశ్వరరావు, ఉపాధ్యాయులు సీ హెచ్ రమణ, కె.దాలినాయుడు పాల్గొన్నారు.


అభ్యర్థుల ఎంపిక విధానాన్ని వివరిస్తున్న వరుణ్ మోటార్స్ ప్రతినిధి

జాబ్‌మేళాకు విశేష స్పందన

విజయనగరం అర్బన్: సీడాప్-వైఎస్ఆర్ క్రాంతి పథం, డీఆర్‌డీఏ సంయుక్త నిర్వహణలో స్థానిక టీటీడీసీ మహిళా ప్రాంగణంలో శనివారం వరుణ్ మోటార్స్ సంస్థలో ఖాళీల భర్తీకి నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. డిగ్రీ అర్హత కలిగిన కమర్షియల్ ఎక్జిక్యూటివ్-25, సేల్స్ ఎక్జిక్యూటివ్-40, రిలేషన్‌షిప్ మేనేజర్స్-6, ట్రూ వేల్యూ ఎక్సిక్యూటివ్-20 పోస్టులకు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 317 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 96 మందిని ఎంపిక చేసినట్టు డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి తెలిపారు. కార్యక్రమంలో జేడీఎం డి.మార్టిన్‌లూథర్, ఎన్‌వైకే డీవైఓ విక్రమాదిత్య, వరుణ్ మోటార్స్ హెచ్‌ఆర్ ప్రతినిధులు వంశీ, రవి, సీడాప్ సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంక్ ఖాతా నుంచి నగదు మాయం

భోగాపురం: మండలంలోని ఆంధ్రప్రదేశ్ వికాస్ గ్రామీణ బ్యాంక్‌లో తన ఖాతా నుంచి రూ.20 వేలు పోయినట్లు భోగాపురానికి చెందిన ఖాతాదారు అండగర్ల వెంకటరావు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆగస్టు 7వ తేదీన రూ.10 వేలు చొప్పున రెండు దఫాలుగా డబ్బులను ఎవరో కాజేశారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యు.మహేశ్ తెలిపారు.

అనుమానాస్పదంగా వివాహిత మృతి


సింగారపు సత్యవతి (ఫైల్)


మృతురాలి భర్తను విచారణ చేస్తున్న పోలీసులు

బొబ్బిలి రూరల్: అనుమానాస్పదంగా వివాహిత సింగారపు సత్యవతి(37) మృతి చెందిన సంఘటన గుంటూరులోని తెనాలిలో చోటుచేసుకుంది. ఈ ఘటనపై మృతురాలి తల్లి గొర్లె సింహాచలం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నారు. సీఐ ఎం.నాగేశ్వరరావు, ఎస్‌ఐ సీహెచ్ సత్యనారాయణ తెలిపిన **వివరాలిలా ఉన్నాయి..** సరిగ్గా 20 ఏళ్ల క్రితం మండలంలోని ముత్తాయవలస గ్రామానికి చెందిన సత్యవతికి, పిరిడి గ్రామానికి చెందిన రాముకు వివాహమైంది. వీరు ఉపాధి నిమిత్తం తెనాలి వెళ్లి, భవన నిర్మాణ కార్మికులుగా స్థిరపడ్డారు. వీరికి మధురిత, ఆదిలక్ష్మి అనే ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈ నెల 1వ తేదీ రాత్రి సత్యవతి ముత్తాయవలసలో ఉన్న తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి, భయాందోళనతో ఉన్నట్లు తెలిపింది. ఆ మరుసటి రోజు వేకువజామున ఆమె భర్త రాము సత్యవతి ఉరి వేసుకుని చనిపోయినట్లు ఆమె కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తెలిపాడు. మృతదేహాన్ని ఆటోలో పిరిడికి తీసుకువస్తున్నామని చెప్పాడు. ఈ క్రమంలో అంత్యక్రియలకు ఏర్పాట్లు చేసిన బంధువులు మృతదేహంపై పలు గాయాలు కన్పించడంపై అనుమానాలు వ్యక్తం చేసి, పోలీసులకు సమాచారం అందజేశారు. తన కూతురును అల్లుడే చంపేసి ఉంటాడని సందేహం వ్యక్తం చేస్తూ మృతురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు శనివారం ఉదయం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక విచారణ అనంతరం పోలీసులు మృతురాలి భర్త రాము, ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేయాలి

మక్కువ: తమపై దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఎస్సీ కాలనీ వాసులు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట శనివారం ఆందోళనకు దిగారు. వినాయక ఉత్సవాల సందర్భంగా శుక్రవారం అర్ధరాత్రి స్థానిక బీసీ, ఎస్సీ కాలనీ యువకుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఎస్సీ కాలనీకి చెందిన తిరుపతిరావుకు గాయాలయ్యాయి. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు వెంటనే అతడిపై దాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అయితే దాడికి పాల్పడిన మరో ముగ్గురిని కూడా అరెస్ట్ చేయాలని కోరుతూ ఎస్సీ కాలనీ వాసులు శనివారం పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించి, కోరగా స్పందించిన ఎస్‌ఐ షైడిరాజు వారిని కూడా అరెస్ట్ చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనకారులు తమ ఆందోళన విరమించారు. సాయంత్రం మరో ముగ్గురు యువకులను కూడా అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ ప్రకటించారు.

ఇసుక లారీ, జేసీబీ సీజ్


పోలీసులు సీజ్ చేసిన లారీ, జేసీబీ

బాడంగి: మండలంలోని పినపెంకి-బొత్సవానివలస మధ్యలో ఎటువంటి అనుమతులు లేకుండా డంప్ చేసిన ఇసుకను తరలిస్తున్న లారీ, జేసీబీలను పోలీసులు శనివారం సీజ్ చేశారు. విశాఖపట్నానికి ఇసుక తరలించేందుకు జేసీబీతో లారీలోకి ఇసుక లోడు చేస్తుండగా చూసిన తెర్లాం ఎక్సైజ్ పోలీసులు లారీ, జేసీబీ డ్రైవర్లను పట్టుకుని విచారణ చేయగా అసలు విషయం తెలిసింది. అనంతరం వారిని బాడంగి పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు లారీ ఓనర్ వెన్ని సాయికృష్ణ, లారీ డ్రైవర్ బలగ కాల అప్పారావు, జేసీబీ డ్రైవర్ గురుమూర్తిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ డి.కొండలరావు తెలిపారు. దాదాపు 25 టన్నుల ఇసుకను తరలించేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

గజపతినగరం: పట్టణంలోని చంపావతి నదిలో నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీతారామపురం వద్ద పోలీసులు శనివారం పట్టుకుని సీజ్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి, నెల్లిమర్ల మండలంలోని కొండవెలగాడకు చెందిన వల్లూరి శ్రీను అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

మేనేజ్‌మెంట్ కోర్సులతో ఉపాధి

విజయనగరం అర్బన్: మేనేజ్‌మెంట్ స్టడీ కోర్సులతో ఉపాధి, ఉద్యోగావకాశాలు అధికంగా లభిస్తున్నాయని కేంద్రియ గిరిజన వర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి తెలిపారు. స్థానిక కేంద్రియ గిరిజన వర్సిటీ ప్రాంగణంలో 'ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ బడ్జెట్ స్పైస్ మేనేజ్‌మెంట్' అనే అంశంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో సరైన ప్రతిభ చూపితే ఉద్యోగం సాధించే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి చేరుకుంటారన్నారు. ఇదే సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన విశాఖ ఎస్‌ఆర్‌డీసీ డైరెక్టర్ బీకే సాహు మాట్లాడుతూ వ్యాపారాల్లో ఎదగాలంటే మేనేజ్‌మెంట్ కోర్సులు చేయడం ఉత్తమమని అన్నారు. కార్యక్రమంలో వర్సిటీ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐదుగురికి గాయాలు


లక్కవరపుకోట: సంఘటన స్థలంలో గాయపడిన వ్యక్తి

గజపతినగరం: వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని పాతశ్రీరంగ రాజపురం గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. శనివారం సాయంత్రం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు బహిర్భూమికి వెళ్తుండగా, అదే గ్రామానికి చెందిన మరో ముగ్గురు మోటార్‌బైక్ వెళ్తూ వారిని ఢీకొన్నారు. దీంతో బైక్ నడుపుతున్న వ్యక్తితో పాటు బహిర్భూమికి వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. అప్రమత్తమైన స్థానికులు చికిత్స నిమిత్తం విజయనగరం ఆస్పత్రికి క్షతగాత్రులను తరలించారు.

లక్కవరపుకోట(కొత్తవలస): మండలంలోని అరకు-విశాఖ రోడ్డులో ఉన్న దేశపాత్రునిపాలెం జంక్షన్ సమీపంలో జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. కూలి పనుల నిమిత్తం పెందుర్తికి చెందిన తండ్రీకొడుకులు ఎ.వరంబాబు(60), ఎ.మోహన్‌రావు కొత్తవలస మండలంలోని మిందివలస గ్రామానికి మోటార్‌బైక్‌పై వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న ఆటో వీరిని ఢీకొట్టి ముందుకు దూసుకుపోయింది. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వారికి గాయాలు కాగా, చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు వారిని తరలించారు. క్షతగాత్రుల్లో వరంబాబు పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

క్లుప్తంగా

బోధనేతర కార్యక్రమాలు రద్దు చేయాలి

విజయనగరం ఫూల్‌బాగ్‌: ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలు రద్దు చేయాలని యూటీఎఫ్‌ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.రమేష్‌చంద్రపట్నాయక్‌, ఈశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్‌ చేశారు. హాజరు పేరుతో బోధనా సమయం హరించే యాప్‌లు రద్దు చేయాలన్నారు.

13న స్తుతి సంకీర్తన



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పాస్టర్‌ జాన్‌ మోజెస్‌, తదితరులు

విజయనగరం టౌన్‌: స్థానిక కేఎల్‌ పురం సిటీ చర్చిలో ఈ నెల 13న నిర్వహించనున్న స్తుతి సంకీర్తన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పాస్టర్‌ జాన్‌ మోజెస్‌ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు చర్చిలో కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆ రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరాటంకంగా స్తుతి సంకీర్తన ఉంటుందన్నారు. కార్యక్రమంలో సునీల్‌కుమార్‌, యబ్బోజు చౌదరి, సుగుణాకర్‌, కరుణకుమార్‌, రఘు, తదితరులు పాల్గొన్నారు.

బొత్స రామ్మోహనరావు సేవలు ఎనలేనివి



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న శశిభూషణరావు

విజయనగరం టౌన్‌: నిరుపేదలకు బొత్స రామ్మోహనరావు అందించిన సేవలు ఎనలేనివని సత్య విద్యాసంస్థల డైరెక్టర్‌ డాక్టర్‌ ఎం.శశిభూషణరావు తెలిపారు. బొత్స రామ్మోహన్‌ వర్ధంతిని పురస్కరించుకుని తోటపాలెంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో 6,7,8,9వ తరగతి విద్యార్థులకు శనివారం స్కాలర్‌షిప్‌లు అందజేశారు. అనంతరం రైల్వేస్టేషన్‌ వద్ద నిరుపేదలకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సరస్వతీ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి ఏటా వర్ధంతి, జయంతి వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బొత్స రామకృష్ణ, సీహెచ్‌. చిన్నయ్య, బొత్స చైతన్య, ఎన్‌సీసీ కెప్టెన్‌ మీసాల సత్యవేణి, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాదస్వర కచేరి

విజయనగరం టౌన్‌: స్థానిక మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం కళాశాల విద్యార్థులతో నిర్వహించిన నాదస్వర కచేరీ ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. ఆర్‌.వెంకటరమణ నాదస్వరం, కె.జగదీశ్వరరావు డోలుపై సహకరించారు. అనంతరం ప్రముఖ హరికథా కళాకారిణి కాళ్ల నిర్మల హరికథాగానం ఆహూతుల కరతాళ ధ్వనులందుకుంది. వయోలిన్‌పై ఎం.ఈశ్వరమ్మ, మృదంగంపై ఎం.శివకుమార్‌ సహకరించారు. కళాశాల ప్రిన్సిపల్‌ ఆర్‌వీ ప్రసన్న కుమారి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

గౌతమ్‌కు ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న ఉపాధ్యాయులు

నెల్లిమర్ల రూరల్‌: బ్రెయిన్‌ ట్యూమర్‌తో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తంగుడుబిల్లి గ్రామానికి చెందిన ఏడో తరగతి విద్యార్థి సారిపల్లి గౌతమ్‌కు తోటి విద్యార్థులు శనివారం ఆర్థిక సహాయం అందించారు. విద్యార్థులు తమ వంతుగా రూ.12 వేలు సేకరించి ఉపాధ్యాయుల చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఈ నెల 30 వరకు పౌష్టికాహార మాసోత్సవాలు



మాట్లాడుతున్న సీడీపీఓ సుగుణవతి

భోగాపురం రూరల్‌: భోగాపురం ఐసీడీఎస్‌ ప్రాజెక్ట్‌ పరిధిలోగల భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ మండలాల్లో ఉన్న అన్ని సెక్టార్లలో ఈ నెల 30 వరకు పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు సీడీపీఓ జె.సుగుణవతి తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, ఈ నెల 1 ఉత్సవాలు ప్రారంభమయ్యాయన్నారు. ఉత్సవాల్లో భాగంగా మహిళల ఆరోగ్యం, చిన్నారుల పౌష్టికాహారం, నీటి సంరక్షణ, స్త్రీ – పురుష వివక్షత, సంప్రదాయ ఆహారం, తదితర అంశాలపై చిన్నారులు, మహిళలను చైతన్య పరుస్తామని చెప్పారు.

ఆదర్శవంతంగా 14వ డివిజన్‌

- ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి
- రూ.50.60 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి, నగర మేయర్‌

విజయనగరం: మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలోగల 14వ డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దనున్నట్లు ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. డివిజన్‌ పరిధిలో రూ.50.60 లక్షలతో ఇప్పటికే పూర్తి చేసిన అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు కొత్త పనులకు మేయర్‌ వెంపడాపు విజయలక్ష్మి, కార్పొరేటర్‌ ఎస్‌వీవీ రాజేష్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా రూ.20.60 లక్షలతో శాలివాహనుల కోసం నిర్మించిన హంస భవనాన్ని ప్రారంభించారు. అలాగే స్వామి వివేకానంద పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రహదారులు, కల్వర్టులకు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మేయర్‌ విజయలక్ష్మి మాట్లాడుతూ, అభివృద్ధే ధ్యేయంగా ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి పని చేస్తున్నారని చెప్పారు. కార్పొరేటర్‌ ఎస్‌వీవీ రాజేష్‌ మాట్లాడుతూ, తమ డివిజన్‌ శివారు ప్రాంతంలో ఉన్నప్పటికీ, ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో అభివృద్ధి చెందుతోందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్‌ రేవతీదేవి, అసిస్టెంట్‌ కమిషనర్‌ ప్రసాదరావు, జోనల్‌ ఇన్‌చార్జ్‌లు ముచ్చు శ్రీనివాసరావు, 2వ డివిజన్‌ కార్పొరేటర్‌ బి.ఆనందరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇసరపు రామకృష్ణ, బొంగ భానుమూర్తి, ఇసరపు శ్రీనివాస్‌, తదితరులు పాల్గొన్నారు.

ఇది మీ సంక్షేమ ప్రభుత్వం..



లబ్ధిదారులకు బుక్‌లెట్‌ అందిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స, తదితరులు

- ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ సురేష్‌బాబు

డెంకాడ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న జగన్‌ మోహన్‌రెడ్డి సర్కార్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు పిలుపునిచ్చారు. మండలంలోని నాతవలసలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ సురేష్‌బాబు, నియోజకవర్గ పరిశీలకుడు, మాజీ ఎంపీ డీవీజీ శంకరరావు, తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరినదీ వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ, రైతులకు రైతుభరోసా.. విద్యార్థులకు అమ్మఒడి లాంటి ఎన్నో మంచి పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందని చెప్పారు. విడతల వారీగా లక్షలాది రూపాయల డ్వాక్రా రుణాలను మాఫీ చేసి మహిళలకు ఆర్థి భరోసా కల్పిస్తున్నారని తెలిపారు. వృద్ధులు మొదలుకుని దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఒకటో తేదీనే పింఛన్లు అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు గ్రామాల్లోనే ప్రభుత్వ సేవలు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వెంకట సత్య వాసుదేవరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బడుకొండ లక్ష్మి, వైస్‌ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, విద్య, మౌలిక సదుపాయాల రాష్ట్ర డైరెక్టర్‌ బమ్మిడి లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు బమ్మిడి వెంకటరమణ, నాయుడు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడితో అనారోగ్యం



డాక్టర్‌ నీలిమను సత్కరిస్తున్న కళాశాల డైరెక్టర్‌ డాక్టర్‌ శశిభూషణరావు

విజయనగరం అర్బన్‌: మానసిక ఒత్తిడి కారణంగా అనేక మంది మహిళలు అనారోగ్యానికి గురవుతున్నారని ప్రముఖ వైద్యురాలు బి.నీలిమ ప్రసూజ అన్నారు. శనివారం స్థానిక గాజుల రేగ సీతం ఇంజినీరింగ్‌ కళాశాలలో 'మానసిక ఆరోగ్య ప్రాముఖ్యత' అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మానసిక ఆరోగ్యం, రుతుచక్రం, మానసిక భయం వంటి అంశాలు మహిళ ఆరోగ్యానికి కీలకంగా నిలుస్తాయన్నారు. అనంతరం ముఖ్య అతిథిని సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్‌ డాక్టర్‌ ఎం.శశిభూషణరావు, ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ డీవీ రామ్మూర్తి, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గణేష్‌ నవరాత్రి ఉత్సవాలు



పూజలు చేస్తున్న ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి , తదితరులు

భోగాపురం రూరల్‌: మండలంలోని అన్ని గ్రామాల్లో గణేష్‌ నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. సవరవిల్లిలో ఏర్పాటు చేసిన వినాయక మంటపంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల్లో భక్తిభావం పెరగడం సంతోషించదగ్గ విషయమన్నారు. అనంతరం నిర్వాహకులు, సర్పంచ్‌ ఉప్పాడ విజయభాస్కరరెడ్డి ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పట్నతాతయ్యలు, తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకత వెలికితీసేందుకు పోటీలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న మహారాజా ఎన్‌సీసీ అధికారి కల్యాణ్‌ అశోక్‌

విజయనగరం: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు క్రీడా, సాంస్కృతిక పోటీలు దోహదం చేస్తాయని మహారాజా కళాశాల ఎన్‌సీసీ అధికారి ఎ.కల్యాణ్‌అశోక్‌ అన్నారు. పట్టణంలోని రోటరీ సామాజిక భవనంలో రోటరీ యూత్‌ మంత్‌ ఉత్సవాలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోటరీ వేదికగా ఏటా ఈ పోటీలు నిర్వహించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్‌ అధ్యక్ష కార్యదర్శులు ఉమాబాలాజీ, సూర్యలక్ష్మి, రూప, అనిల్‌ కుమార్‌, చైర్మన్‌ జి.వినోద్‌కుమార్‌, గ్రంధి విష్ణుమూర్తి, ఆర్‌.నాగమల్లి, జ్యోతి బచావత్‌, కె సత్యం, తదితరులు పాల్గొన్నారు.

'ఆటిజంను నిర్మూలించవచ్చు'

విజయనగరం: ఆటిజం, ఏడీహెచ్‌డీ, స్పీచ్‌థెరపీల ద్వారా చిన్నారుల్లో ఆటిజం వ్యాధిని నిర్మూలించవచ్చని ఆ సంస్థ సీఈఓ పవన్‌కుమార్‌ అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేట్‌ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఏ–కిడ్స్‌ సంస్థ ద్వారా ఈ థెరపీలను పరిచయం చేస్తున్నామన్నారు. ఆటిజంతో బాధపడుతున్న పిల్లల్లో నైపుణ్యాలను పెంచేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఐఏపీ అధ్యక్షుడు డాక్టర్‌ అజాజ్‌ రహమన్‌, డాక్టర్‌ శ్రీనివాస్‌, అశోక్‌బాబు, పలువురు పీడియాట్రిక్‌ వైద్యులు, డైరెక్టర్‌ వి. నాగేంద్ర, తదితరులున్నారు.

గురునాయుడుకు ఎమ్మెల్యే అభినందన



గురునాయుడును అభినందిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: మెక్సికోలో జరిగిన యూత్‌ వరల్డ్‌ వెయిట్‌ లిఫ్టింగ్‌ చాంపియన్‌షిప్‌లో గోల్డ్‌ అండ్‌ సిల్వర్‌ పతకాలు సాధించిన శనపతి గురునాయుడును నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అభినందించారు. మోపాడలోని ఎమ్మెల్యే స్వగృహానికి శనివారం విచ్చేసిన గురునాయుడును ఎమ్మెల్యే అప్పలనాయుడు దుశ్శాలువకప్పి సత్కరించారు. కార్యక్రమంలో కోచ్‌ రాము, గదల అచ్చుంనాయుడు ఉన్నారు.

వృథాగా తాగునీరు



నీటితో నిండిపోయిన పీఆర్‌ కార్యాలయ ప్రాంగణం

నెల్లిమర్ల: విజయనగరం మున్సిపల్‌ కార్పొరేషన్‌కు తాగునీటిని సరఫరా చేసే పైపు విరిగిపోవడంతో భారీగా తాగునీరు వృథా అయ్యింది. నెల్లిమర్ల పట్టణ పరిధిలోని చంపావతి నది నుంచి నగరానికి తాగునీటిని సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్‌ స్థానిక ఆర్‌ఓబీ దిగువ నుంచి వెళ్లింది. వంతెనకు సమీపంలో పంచాయతీరాజ్‌ ఎస్‌ఈ కార్యాలయం వద్ద పైపు శనివారం ఉదయం విరిగిపోయింది. దీంతో భారీగా తాగునీరు లీకవడంతో, కార్యాలయ ప్రాంగణంతో పాటు ఈ ప్రాంతమంతా నీటితో నిండిపోయింది.

నేడు విద్యుత్‌ సరఫరా నిలిపివేత

భోగాపురం: విద్యుత్‌ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో భోగాపురం పంచాయతీ పరిధిలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ జ్ఞానేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కాలువల్లో బ్లీచింగ్‌ పిచికారీ

భోగాపురం రూరల్‌: కలుషిత వాతావరణం కారణంగా సచివాలయ పరిధిలో చాలామంది వివిధ వ్యాధుల బారిన పడుతున్నారని సర్పంచ్‌ కిలారి స్వప్న అన్నారు. ఈ మేరకు పంచాయతీ పరిధిలోని కాలువల్లో శనివారం బ్లీచింగ్‌ పిచికారీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రహణంమొర్రి శస్త్రచికిత్సలు నిర్వహించడం వరం

- ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరభద్రస్వామి

విజయనగరం ఫోర్ట్‌: తిరుమల మెడికవర్‌ ఆస్పత్రిలో చిన్నారులకు గ్రహణంమొర్రి ఉచిత శస్త్రచికిత్సలు నిర్వహించడం పేద ప్రజలకు వరమని విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. శస్త్రచికిత్సల వైద్యశిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నాలుగోసారి శిబిరం నిర్వహించి 60 మంది చిన్నారులకు శస్త్రచికిత్సలు చేయడం హర్షణీయమన్నారు. పేద ప్రజలకు ఉపయోగకరమైన ఇటువంటి శిబిరాలు శాశ్వతంగా నిర్వహించేందుకు చర్యలు చేపడతామని ఆస్పత్రి ఎం.డి తిరుమల ప్రసాద్‌ అన్నారు. కార్యక్రమంలో మిషన్‌ స్మైల్‌ సంస్థ ప్రొగ్రాం మేనేజర్‌ రహమాన్‌, డాక్టర్‌ దుర్గాప్రసాద్‌, డాక్టర్‌ మహేష్‌, డాక్టర్‌ శ్రావణి, డాక్టర్‌ ప్రభాకర్‌, డాక్టర్‌ కులదీప్‌, ఏఓ నారాయణరావు పాల్గొన్నారు.

రైతుభరోసాతో అన్నదాతకు ఆసరా



సింగవరంలో రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, తదితరులు

డెంకాడ: అన్నదాతలకు ఆసరాగా ఉండాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని సింగవరం గ్రామంలో రూ.21.80 లక్షల అంచనాల విలువతో నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ సురేష్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎరువులు, విత్తనాలు, తదితర అవసరాల కోసం మండల, జిల్లా కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేసేవారిని.. ఇప్పుడు రైతుభరోసా కేంద్రాల ద్వారా ఇంటిముంగిటే అందుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో రైతు పక్షపాత ప్రభుత్వం ఉందని, అన్నదాతలు కూడా ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకుడు డీవీజీ శంకరరావు, ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బడ్డుకొండ లక్ష్మి, వైస్‌ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, సొసైటీ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం, బాలి సత్యనారాయణ, సర్పంచ్‌ పిట్ట పద్మావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు పిట్ట అప్పారావు, సంచాన కృష్ణమూర్తి, భావన గుర్నాథరావు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో సర్పంచ్‌లు

- ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ

డెంకాడ: గ్రామ సచివాలయాల్లో సర్పంచ్‌లు ప్రతిరోజూ కనీసం రోజుకు గంటసేపైనా ఉండాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో ఎంపీపీ బంటుపల్లి వెంకట సత్య వాసుదేవరావు అధ్యక్షతన మండల పరిషత్‌ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మారుతున్న కాలంతో పాటు ప్రభుత్వాలు పాలనా విధానంలో మార్పులు తీసుకువచ్చాయన్నారు. వీటిని గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు తెలుసుకుని ముందకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జగనన్న కాలనీల్లో హౌసింగ్‌, విద్యుత్‌, గ్రామీణ నీటిసరఫరా విభాగం, మండల ఇంజినీరింగ్‌, తదితర విభాగాలకు చెందిన అధికారులు సమన్వయంతో పని చేసి కాలనీల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. గ్రామీణ నీటిసరఫరా డీఈ వైకుంఠంనాయుడు మాట్లాడుతూ, బంటుపల్లి పంచాయతీలోని యాతపేటలో ఇంటింటికీ కుళాయిలు పూర్తి చేశామని తెలిపారు. విద్యుత్‌ శాఖ ఏఈ పి.అప్పలస్వామినాయుడు మాట్లాడుతూ, మండలంలోని గ్రామాల వారీగా విద్యుత్‌ సమస్యలను గుర్తించామని, వాటిని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని తెలిపారు. వైద్యాధికారిని పావని మాట్లాడుతూ, ఈ నెల 8,9 తేదీల్లో సామూహిక నులి పురుగుల నివారణా మాత్రలు అందించడం జరుగుతుందన్నారు. పాఠశాలల నాడు–నేడు ఇంజినీరింగ్‌ అధికారి రాజు మాట్లాడుతూ, మండలంలో నాడు–నేడు మొదట విడత పనులు పూర్తికాగా... 17 పాఠశాలల్లో రెండో విడత పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ ప్రగతిని వివరించారు. సమావేశంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బడుకొండ లక్ష్మి, వైస్‌ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, సొసైటీ అధ్యక్షులు రొంగలి కనక సింహాచలం, బాలి సత్యనారాయణ, తహసీల్దార్‌ పి.ఆదిలక్ష్మి, ఈఓపీఆర్‌డీ అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం



చంద్రంపేటలో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ గిరిబాల

నెల్లిమర్ల రూరల్‌: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది కృషి చేయాలని ఎంపీడీఓ గిరిబాల సూచించారు. మండలంలోని టెక్కలి, చంద్రంపేట గ్రామాల్లో శనివారం పర్యటించిన ఆమె ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామాల్లో చెత్త నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి చెత్త శుద్ధి కేంద్రాలకు తరలించాలని సూచించారు. వెల్ఫేర్‌ అసిస్టెంట్లు ప్రతిరోజూ పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజన పనితీరును గమనించాలని కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ భానోజీరావు పాల్గొన్నారు.

భూగర్భ జల సంరక్షణపై ప్రదర్శన నేడు

విజయనగరం అర్బన్‌: భూగర్భజల సంరక్షణ, యాజమాన్య పద్ధతులపై ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి స్థానిక శిల్పారామంలో ప్రదర్శన నిర్వహించనున్నట్లు జిల్లా భూగర్భ జలశాఖ ఉప సంచాలకుడు ఎస్‌వీకే దుర్గాప్రసాద్‌ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భూగర్భ జలాలకు సంబంధించిన వివరాలు, వాటి సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను ప్రదర్శన ద్వారా వివరిస్తారని పేర్కొన్నారు. అదేవిధంగా వివిధ రకాల నమూనాలను కూడా ప్రదర్శనలో ఉంచుతామని తెలిపారు. భూగర్భ జలాల సంరక్షణపై ఇటీవల పాఠశాల స్థాయి విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను నిర్వహించామని.. ఆ చిత్రాలను ప్రదర్శనలో ఉంచుతామని తెలిపారు. విద్యార్థులతో పాటు సామాన్య ప్రజలు కూడా హాజరై భూగర్భ జలాల సంరక్షణ ఆవశ్యకతను తెలుసుకోవాలని కోరారు.

ఓ వైపు కారుమబ్బులు... మరో వైపు వెండి కొండలు



ఒమ్మిలో పచ్చని వరి పైరుపై అందంగా కనిపిస్తున్న కారు మబ్బులు



మల్యాడ రహదారిలో కనువిందు చేసిన వెండి కొండలు

పల్లెలను కారుమబ్బులు కమ్మేశాయి.. శనివారం ఉదయం నుంచి భానుడు తన విశ్వ రూపాన్ని చూపించడంతో దీంతో తీవ్ర ఉక్కబోతతో ప్రజలు అల్లాడిపోయారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకొనడంతో ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకున్నాయి. ముందుగా ఆకాశన వెండి మబ్బులు పలకరించగా...క్షణాల్లోనే నల్లటి మేఘాలు దట్టంగా కమ్ముకొని పల్లెవాసులను కనువిందు చేశాయి. నెల్లిమర్ల మండలంలోని ఒమ్మి, మల్యాడ గ్రామాల్లో పచ్చని పొలాలు, చెట్లతో మేఘాలు అందంగా సాక్షాత్కరించాయి.

– నెల్లిమర్ల రూరల్‌

ఏపీ పీజీ సెట్ ప్రారంభం



పరీక్షలను ఆన్‌లైన్ ద్వారా పర్యవేక్షిస్తున్న ఏపీ పీజీసెట్ చైర్‌పర్సన్, రాష్ట్ర కన్వీనర్

కడప ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ పోస్టు గ్రాడ్యుయేషన్ ప్రవేశ పరీక్షలు (ఏపీ పీజీ సెట్) శనివారం ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని 13 జిల్లాలతోపాటు హైదరాబాద్‌లోనూ పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశారు. ప్రతిరోజూ మూడు దశల్లో జరిగే ఈ ఆన్‌లైన్ పరీక్షలకు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లుచేశారు. పరీక్షల నిర్వహణపై ఏపీ పీజీ సెట్–22 చైర్‌పర్సన్ ఆచార్య మునగాల సూర్యకళావతి, రాష్ట్ర కన్వీనర్, రాష్ట్ర ఉన్నత మండలి కార్యదర్శి ఆచార్య వై. నజీర్‌అహ్మద్, ఆచార్య వి. శంకర్, టీసీఎల్ సంస్థ సాంకేతిక నిపుణులు రాజగోపాల్ యోగి వేమన విశ్వ విద్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పరీక్షలను పర్యవేక్షించారు. ఉదయం జరిగిన ఇంగ్లీష్ పరీక్షకు 1,245 మంది విద్యార్థులకు 913 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన బోటనీ, మ్యాథమెటిక్స్ పరీక్షకు 1,074 మంది విద్యార్థులకు 883 మంది.. సాయంత్రం జరిగిన మూడో సెషన్లో హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సు పరీక్షకు 3,678 మందికి 3,044 మంది హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించినట్లు వైవీయూ పీజీ సెట్ రాష్ట్ర కన్వీనర్ ఆచార్య నజీర్ అహ్మద్ తెలిపారు.

జేఈఈ మెయిన్ బీఆర్క్, బీప్లానింగ్‌లో 'తిరుమల' ప్రతిభ

రాజమహేంద్రవరం రూరల్: జేఈఈ మెయిన్ బీఆర్క్, బీ ప్లానింగ్ ఫలితాల్లో తమ తిరుమల ఐఐటీ మెడికల్ అకాడమి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు చెప్పారు. తమ విద్యార్థులు బి ప్లానింగ్ విభాగంలో పలు కేటగిరిల్లో 1,5,7, 11,12,16,18,18,20,25,27,27,32,34,37, 37,42,42,44,47,49,50,51,55,58,65,68, 68,70,71,71,75,79,80,81,91,96,99 ర్యాంకులు, 500లోపు 90 మంది,1000లోపు 134 మంది, 2000లోపు 173 మంది, 5000లోపు 208 మంది ర్యాంకులు సాధించారన్నారు. బీఆర్క్ విభాగంలో పలు కేటగిరీల్లో తమ విద్యార్థులు జాతీయస్థాయిలో 6,15.25,26,32,36,52,61,65 ర్యాంకులు, 500 లోపు 39 మంది, 1000 లోపు 74 మంది, 2000లోపు 139 మంది, 5000లోపు 269 మంది ర్యాంకులు సాధించారని వివరించారు.

పవర్ ఎవర్ గ్రీన్



విశాఖలో సౌర విద్యుత్ పలకలతో హోటల్ నిర్మాణం

ఖర్చు రూ.45 లక్షలు..

- ఐదంతస్తుల భవనంపై నిలువుటద్దాల్లా అమరిక
- రాష్ట్రంలో ఇప్పటి వరకు కనిపించని ఈ మోడల్
- రోజూ 100 కిలోవాట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి టార్గెట్
- భవన అవసరాలకు పోనూ మిగిలినది గ్రిడ్‌కు విక్రయం
- ఎనిమిదేళ్లలో తిరిగిరానున్న పెట్టుబడి

సాక్షి, అమరావతి : విద్యుత్ షాక్ నుంచి తప్పించుకునేందుకు ఓ వ్యక్తి స్మార్ట్‌గా ఆలోచించారు. సోలార్.. సో బెటర్ అని భావించారు. గ్రీన్ పవర్.. ఎవర్ గ్రీన్... అని విశ్వసించి తన ఐదు అంతస్తుల భవనం గోడలకు సౌర ఫలకాలను అమర్చారు. భవనాన్ని సోలార్ ప్యానల్ ఎలివేషన్‌తో అద్భుతంగా తీర్చిదిద్దారు. అందరూ భవనాలపై రూఫ్‌టాప్ సోలార్ సిస్టంను ఏర్పాటు చేస్తుంటారు. కానీ, ఆయన దానికి భిన్నంగా గోడలకు నిలువుగా ప్యానల్స్‌ను అమర్చారు. ఫుల్ ఎకో గ్రీన్ హోటల్‌గా రికార్డు సృష్టించారు. స్మార్ట్ సిటీ విశాఖపట్నంలోని గురుద్వార జంక్షన్ వద్ద 'స్మార్ట్ ఇన్ ది గెస్ట్ హౌస్' పేరుతో అన్నె నారాయణరావు (బాబ్జి) అనే వ్యాపారి నిర్మించిన ఈ భవనం విశేషంగా ఆకట్టుకుంటోంది.

ఆకర్షణీయంగా.. ఆదర్శవంతంగా...

ఐదు అంతస్తుల భవనానికి సోలార్ ప్యానళ్లను నిలువుగా అమర్చడంతో అద్భుత డిజైన్‌లా కనిపిస్తుంది. ఈ భవనం ఆకర్షణీయంగా, అందరికీ ఆదర్శంగా కూడా ఉంది. భవనం ఎలివేషన్ కోసం నలుపు రంగు అద్దాలకు బదులుగా దాదాపు 200 సోలార్ ప్యానళ్లను నిలువుగా ఏర్పాటు చేశారు. ఈ ప్యానల్స్ రోజుకు దాదాపు 100 కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తాయి. నెట్ మీటరింగ్ ద్వారా భవనానికి అవసరమైన 40శాతం విద్యుత్ వినియోగించుకుంటారు. మిగిలిన విద్యుత్‌ను యూనిట్‌ను రూ.6 చొప్పున ఏపీఈపీడీసీఎల్ ద్వారా గ్రిడ్‌కు విక్రయిస్తారు. రాత్రి వేళ భవన అవసరాలకు గ్రిడ్ నుంచి కరెంటు తీసుకుంటారు. ఈ భవనానికి సౌర విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి రూ.45 లక్షలు ఖర్చయినట్లు యజమాని బాబ్జి 'సాక్షి'కి తెలిపారు. తాము వినియోగించుకోగా, మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించడం ద్వారా ఎనిమిదేళ్లలో పెట్టుబడి వెనక్కి వచ్చేస్తుందని భావిస్తున్నామని చెప్పారు. భవనం పైన మరో 70 సోలార్ పలకల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.

రాష్ట్రంలో తొలిసారిగా...

దేశం మొత్తం విద్యుత్ వినియోగంలో మూడో వంతు కన్నా ఎక్కువగా భవనాల్లోనే ఉంటుంది. ముంబైలోని ఓ డేటా సెంటర్‌లో దాదాపు ఒక మెగావాట్ సామర్థ్యం గల దేశంలోనే అతిపెద్ద బిల్డింగ్ ఇంటిగ్రేటెడ్ వర్టికల్ సోలార్ సిస్టంను 2019లో ఏర్పాటు చేశారు. మన రాష్ట్రంలో విశాఖపట్నంలోనే తొలిసారిగా ఈ తరహాలో 'స్మార్ట్ ఇన్ ది గెస్ట్ హౌస్' పేరుతో ఒక హోటల్ నిర్మించారు. ఇక్కడ 15 రోజుల కిందట విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించారు. ప్రస్తుతం రోజుకు 250 నుంచి 300 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి అవుతుందని యజమాని బాబ్జి తెలిపారు. త్వరలోనే పూర్తి స్థాయి సామర్థ్యం మేరకు విద్యుత్ ఉత్పత్తి అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. మరోవైపు సంప్రదాయ గాజు అద్దాల స్థానంలో సౌర పలకలు ఏర్పాటు చేయడం వల్ల విద్యుత్ ఉత్పత్తితోపాటు సూర్య కిరణాలను నిరోధించి థర్మల్ ఇన్సులేషన్ తరహాలో పనిచేస్తాయి. దీనివల్ల ఏసీల వినియోగాన్ని కూడా తగ్గించవచ్చు. గాజు వినియోగం వల్ల ఏర్పడే కాలుష్యాన్ని నివారించవచ్చని ఇంధన రంగ నిపుణులు చెబుతున్నారు.

రాష్ట్రంలో మాదే తొలి గ్రీన్ బిల్డింగ్



'పర్యావరణాన్ని కాపాడటంతోపాటు విద్యుత్ బిల్లుల భారం నుంచి బయటపడటం కోసం ఎంతో శ్రమించి భవనం మొత్తం సోలార్ పలకలతో నిర్మించాం. భవనం రూఫ్‌టాప్ మీద కూడా సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేస్తున్నాం. దీంతో రాష్ట్రంలోనే మాది తొలి గ్రీన్ బిల్డింగ్ అని భావిస్తున్నాం. ఈ మేరకు సర్టిఫికెట్ పొందడం కోసం విశాఖ నగరపాలక సంస్థ అధికారులకు దరఖాస్తు చేశాం.' –బాబ్జి, భవన యజమాని, విశాఖపట్నం

కోలుకున్న మంత్రి విశ్వరూప్

- ఫోన్‌లో మాట్లాడిన సీఎం జగన్
- ఆస్పత్రి నుంచి నేడు డిశ్చార్జ్ అయ్యే అవకాశం
- మైల్డ్ బ్రెయిన్ స్ట్రోక్‌తోనే అస్వస్థత
- హెల్త్ బులెటిన్ విడుదల చేసిన హైదరాబాద్ సిటీ న్యూరో ఆస్పత్రి

అమలాపురం టౌన్: అస్వస్థతకు గురై, హైదరాబాద్‌లోని సిటీ న్యూరో సెంటర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పూర్తిగా కోలుకున్నారు. ఈ మేరకు ఆస్పత్రి శనివారం హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. మైల్డ్ బ్రెయిన్ స్ట్రోక్‌తోనే ఆయన అస్వస్థతకు గురైనట్లు ఆ బులెటిన్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం విశ్వరూప్ ఆస్పత్రి వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. ఆయన ఆదివారం సాయంత్రం డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందని మంత్రి కుమారుడు కృష్ణారెడ్డి తెలిపారు. ఆస్పత్రి సీనియర్ కన్సల్టెంట్ న్యూరో స్పెషలిస్ట్ డాక్టర్ బి.చంద్రశేఖరరెడ్డి మంత్రికి ప్రత్యేక వైద్యం అందిస్తున్నారు. అమలాపురంలో శుక్రవారం వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం మంత్రి విశ్వరూప్ అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. తొలుత ఆయనను రాజమహేంద్రవరం బొల్లినేని ఆస్పత్రిలో చేర్చి, ఆ తర్వాత మరింత మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించిన విషయం విదితమే. ఇదిలా ఉండగా ఆస్పత్రిలో కోలుకుంటున్న మంత్రి విశ్వరూప్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం ఉదయం ఫోన్ చేసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పూర్తిగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు. మంత్రి విశ్వరూప్ పూర్తిగా కోలుకున్నారని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన మరో కుమారుడు డాక్టర్ శ్రీకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు.



ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రాణిగారి తోటలోని 82వ సచివాలయం పరిధిలో డి.ధనలక్ష్మికి వితంతు పెన్షన్ ఇస్తున్న వలంటీర్ సిహెచ్.భారతి



ఏలూరు తంగెళ్లమూడిలో మంచం మీదినుంచి లేవలేని స్థితిలో ఉన్న అంగడల పులిరాజుకు రూ.10 వేల పింఛన్ అందిస్తున్న వలంటీర్ ఎండీ యూనిస్



శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న లావేరు మండలం సుభద్రాపురం గ్రామానికి చెందిన దివ్యాంగురాలు పార్వతికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శంకర్

ఆత్మీయ ఆదరణ

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటిస్తున్న ప్రజాప్రతినిధులకు ప్రతి ఇంటి వద్ద ప్రజల నుంచి ఆత్మీయ ఆదరణ లభిస్తోంది. తమ సంక్షేమం కోసం పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌కి తమ ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని ప్రజలు దీవిస్తున్నారు. అన్ని జిల్లాల్లో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, అర్హులకు అవి అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. తమ దృష్టికి వచ్చిన చిన్నచిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు.



పల్నాడు జిల్లా సాతులూరులో వృద్ధురాలు సుబ్బలక్ష్మికి సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న మంత్రి విడదల రజిని



అనకాపల్లి జిల్లా కూండ్రం గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



ప్రకాశం జిల్లా మొహిద్దీన్‌పురంలో లబ్ధిదారుకు సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందిస్తున్న గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు

పోలీసుల మద్దతుతోనే కుప్పంలో దాడులు

- వాటిని చిన్న ఘటనగా పేర్కొనడాన్ని తప్పుబట్టిన చంద్రబాబు
- పోలీసులు నిష్పక్షపాతంగా పనిచేయాలి
- డీజీపీకి టీడీపీ అధినేత లేఖ

సాక్షి, అమరావతి : ఇటీవల తన కుప్పం పర్యటనలో బయటి వ్యక్తులతో వైఎస్సార్‌సీపీ స్థానిక నేతలు దాడులకు పాల్పడ్డారని, దీన్ని చిన్న సంఘటనగా పేర్కొనడాన్ని తప్పుబడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డికి శనివారం లేఖ రాశారు. తాను కుప్పం నుంచి ఏడుసార్లు అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించినా ఇప్పటిదాకా ఎలాంటి హింసాత్మక సంఘటనలు జరగలేదని అందులో పేర్కొన్నారు. గత కొంతకాలంగా కుప్పంలో వైఎస్సార్‌సీపీ నేతలు తమ అనుకూల పోలీసు అధికారుల మద్దతుతో హింసా రాజకీయాలకు పాల్పడుతు న్నారని, గత నెల 24 నుంచి 26 వరకు జరిగిన తన కుప్పం పర్యటనలో బయటి వ్యక్తులను రప్పించి మరీ నియోజకవర్గంలో హింసాత్మక సంఘటనలకు తెరలేపారన్నారు. అయితే, దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకుండా టీడీపీ నేతలను అరెస్టు చేయడాన్ని ఆయన తప్పుబట్టారు.

డీజీపీ ప్రకటన హాస్యాస్పదం

ఇక కుప్పంలో శాంతిభద్రతలు బాగానే ఉన్నాయని, సాధారణ ఘటనలే అని డీజీపీ ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని చంద్రబాబు ఆ లేఖలో పేర్కొన్నారు. గత నెల 24వ తేదీ సాయంత్రం రామకుప్పం మండలం కొల్లుపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నేతలు గుమిగూడి, తన కాన్వాయ్ గ్రామం సమీపంలోకి రాగానే టీడీపీ కార్యకర్తలపై రాళ్లు రువ్వారని ఆయన ఆరోపించారు. మరుసటి రోజు పోలీసుల సమక్షంలోనే అన్నా క్యాంటీన్, పరిసర ప్రాంతాలను ధ్వంసం చేశారని ఆయన లేఖలో తెలిపారు. గతేడాది కూడా ఇలాంటి సంఘటనలు జరిగినా, తనపై దాడిచేస్తామని బహిరంగంగా ప్రకటించినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. టీడీపీ నేతలు ఇచ్చిన ఫిర్యాదులను స్థానిక పోలీసులు కనీసం నమోదు కూడా చేయలేదన్నారు. 'ఇవన్నీ మీకు చిన్న విషయం కావొచ్చు. కానీ.. నాగరిక, ప్రజాస్వామ్య సమాజంలో హింస, వేధింపులు, బెదిరింపులకు చోటు లేదు'.. అంటూ, శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసులు నిష్పక్షపాతంగా పనిచేయాలని చంద్రబాబు ఆ లేఖలో కోరారు.

స్ఫూర్తినిచ్చిన అవయవదానం



కమ్మినేని గణేశ్వరరావు (ఫైల్)

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 12వ వార్డు పల్లివీధికి చెందిన ఏఎస్‌ఐ కమ్మినేని గణేశ్వరరావు మరణించడంతో ఆయన అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. వివరాల్లోకి వెళ్తే కాశీబుగ్గకు చెందిన గణేశ్వరరావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పోలీసు అధికారిగా పనిచేస్తుండేవారు. రాష్ట్ర విభజన అనంతరం కామారెడ్డి పోలీసుస్టేషన్ పరిధిలో పనిచేస్తూ అక్కడే స్థిరపడిపోయారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయం కావడంతో బ్రెయిన్‌డెడ్ అయ్యింది. ఈ నెల 31న మరణించడంతో హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తండ్రి అవయవాలను దానం చేస్తూ కుమారుడు, కుమార్తెలు సంతకాలు చేసి స్ఫూర్తిగా నిలిచారు.

108లో ప్రసవం



ఆశా కార్యకర్తకు బిడ్డను అందిస్తున్న 108 సిబ్బంది

సారవకోట: మండలంలోని రామకృష్ణాపురం పంచాయతీ చరణ్‌దాసుపురం గ్రామానికి చెందిన కల్యాణి శనివారం ఉదయం 108 వాహనంలో మగబిడ్డకు జన్మనిచ్చింది. శనివారం ఉదయం పురుటినొప్పులు రావడంతో సమాచారం అందుకున్న 108 సిబ్బంది సకాలంలో గ్రామానికి చేరుకున్నారు. ఆస్పత్రికి తరలించేలోగా నొప్పులు ఎక్కువగా రావడంతో సిబ్బంది ఆపీసు, చిన్నవాడు వాహనంలో ప్రసవానికి ఏర్పాట్లు చేయడంతో మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉండటంతో కోటబొమ్మాళి మండలం కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు.

నేడు జాబ్‌మేళా

ఇచ్ఛాపురం: సీడాప్ (సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్) ఆధ్వర్యంలో ఆదివారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇచ్ఛాపురం మున్సిపల్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో సీడాప్–డీఆర్‌డీఏలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ జాబ్‌మేళాలో విభిన్న ప్రతిభావంతులు కూడా పాల్గొనవచ్చని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పనుల్లో పురోగతి ఏదీ?

- అక్టోబర్ నెలాఖరు నాటికి భవన నిర్మాణాలు పూర్తి కావాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వ భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. శనివారం భవన నిర్మాణాలకు సంబంధించి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పనుల పురోగతిపై పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజినీరింగ్ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీఓలతో చర్చించారు. నిర్మాణ దశలో ఉన్న నాడు–నేడు పనులు, రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, బల్క్ మిల్క్ సెంటర్లు, హెల్త్ క్లినిక్‌లు, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లు, డిజిటల్ లైబ్రరీల అభివృద్ధి పనుల నిర్మాణాలు, పురోగతిపై మండలాల వారీగా సమీక్షించారు. పలుమార్లు ఆదేశాలు జారీ చేసినా నేటికీ 205 పంచాయతీరాజ్ భవనాలు ప్రారంభం కాకపోవడంపై వివరణ కోరారు. 24 గ్రామ సచివాలయ భవనాల పనులు నేటికీ ప్రారంభం కాకపోవడంపై ఆరా తీశారు. ఈ విషయమై ఎచ్చెర్ల తహశీల్దార్, ఎంపీడీఓలపై చర్యలు చేపట్టాలని జెడ్పీ సీఈఓ ఆర్.వెంకటరామన్‌ను ఆదేశించారు. సెప్టెంబర్ 15 నాటికి అన్ని చోట్లా పనులు ప్రారంభం కావాలని, అక్టోబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. బిల్లులు పెండింగ్ లేకపోయినా కొన్ని మండలాల్లో పనుల పురోగతి లేకపోవడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. నాడు నేడు పనుల్లో మంచి ప్రగతి చూపిన ఇచ్ఛాపురం మండల అధికారులకు అభినందనలు తెలిపారు. అనంతరం జల్ జీవన్ మిషన్ ద్వారా చేపడుతున్న ఇంటింటికి కుళాయి పనులపై ఆరా తీశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఆర్‌డీఓ బొడ్డేపల్లి శాంతి, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, గృహ నిర్మాణ శాఖ పథక సంచాలకుడు ఎం.గణపతి రావు, ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకుడు కె.రామారావు, సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్త డాక్టర్ ఆర్.జయప్రకాష్, ఆర్‌అండ్‌బీ పర్యవేక్షక ఇంజినీర్ కె.కాంతిమతి తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నంలో భారీ వర్షం

పాతపట్నం: మండల కేంద్రం పాతపట్నంలో శనివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ, ఉక్కపోతతో విలవిల్లాడిన ప్రజలకు సాయంత్రం పడిన వర్షం కొంత ఉపశమనం కలిగించింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొరసవాడ, కాగువాడ, బురాగాం, రొంపివలస, రొమదల, తెంబూరు, గంగువాడ తదితర గ్రామాల్లో పంట పొలాల్లో నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



వర్షం కురుస్తున్న దృశ్యం



పర్ణశాలలో 'ఎకో'దంతుడు

పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని ఒకటో వార్డు మొగిలిపాడులో పెద్దవీధి పూజాకమిటీ సభ్యులు పర్యావరణానికి ప్రాధాన్యమిస్తూ వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. మట్టి విగ్రహానికి వాటర్ కలర్స్‌ను మాత్రమే వినియోగించి గడ్డితో ఏర్పాటు చేసిన పర్ణశాలలో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

\- కాశీబుగ్గ

అఖండ దీపారాధన

ఆమదాలవలస మండలం అక్కులపేట–వేణమ్మపేట గ్రామంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. రాత్రి సమయంలో మండపం వద్ద వినాయకుని ఆకృతిలో దీపాలు వెలిగించి అఖండ దీపారాధన చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

\- ఆమదాలవలస రూరల్



ఇరిగేషన్ ఉద్యోగిపై హత్యాయత్నం



గాయపడిన రమణ

మందస: మండలంలోని సాబకోట పంచాయతీ బుడంబో గ్రామానికి చెందిన సవర రమణ (రామన్న)పై శనివారం హత్యాయత్నం జరిగింది. ఈయన మందస ఇరిగేషన్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పని చేస్తున్నారు. మందస నుంచి స్వగృహానికి వెళ్తుండగా బుడంబో సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఆయనపై గుర్తు తెలియని వ్యక్తి ఒక్కసారిగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. అప్రమత్తమైన రమణ కేకలు వేస్తూ పరుగున ఇంటికి చేరుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటనపై రమణ మందస పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మిస్సింగ్ కేసుల్లో దర్యాప్తు ముమ్మరం

- పోలీసు అధికారులకు ఎస్పీ రాధిక ఆదేశం



వర్చువల్ విధానంలో సమీక్షిస్తున్న ఎస్పీ జి.ఆర్.రాధిక

శ్రీకాకుళం క్రైం: పోక్సో, మిస్సింగ్ కేసుల్లో దర్యాప్తు ముమ్మరం చేయాలని ఎస్పీ జి.ఆర్.రాధిక అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో వర్చువల్ విధానం ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సర్కిల్ వారీగా పోక్సో, మిస్సింగ్, అత్యాచార కేసులపై సంబంధిత అధికారులతో ఆరా తీశారు. మిస్సింగ్ కేసులు ఛేదించడంలో ముందంజలో ఉండాలన్నారు. కేసుల తీవ్రతను బట్టి పోలీసు స్టేషన్‌లో సిబ్బందిని బృందాలుగా విభజించి తప్పిపోయిన వ్యక్తుల ఫొటోలతో కూడిన వివరాలను రైల్వే స్టేషన్లు, ఆర్టీసీ కాంప్లెక్సుల్లో అతికించి వ్యక్తి బంధువులను విచారించాలన్నారు. గుర్తు తెలియని మృతదేహాలను నిశితంగా పరిశీలించి నిర్ధారించాలన్నారు. పోక్సో యాక్ట్ కేసుల దర్యాప్తు, విచారణ వేగవంతం చేసేందుకు, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు కె.శ్రీనివాసరావు, టి.పి.విఠలేశ్వరరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ప్రమాదానికి గురైన యువకుడు మృత్యువాత



మృతిచెందిన దుర్గాప్రసాద్

వజ్రపుకొత్తూరు రూరల్: నువ్వలరేవుకు చెందిన యువకుడు బైనపల్లి దుర్గాప్రసాద్(21) రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. దుర్గాప్రసాద్ శుక్రవారం మధ్యాహ్నం నువ్వలరేవు నుంచి నగరంపల్లి వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వజ్రపుకొత్తూరు–నువ్వలరేవు కూడలి వద్ద అదుపు తప్పి బోల్తాపడ్డాడు. క్షతగాత్రుడిని కాశీబుగ్గలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు బైనపల్లి కాంత, ఢిల్లీ విషాదం మునిగిపోయారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

ఇంటికి వెళ్తుండగా వ్యక్తి మృతి

కొత్తూరు: కొత్తూరు చేపల మార్కెట్‌కు ఎదురుగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ వద్ద శనివారం భామిని మండలం ఘనసర గ్రామానికి చెందిన కె.భాస్కరరావు అస్వస్థతకు గురై మృతి చెందాడు. భాస్కరరావుకు జ్వరం రావడంతో భార్య లక్ష్మితో కలిసి కొత్తూరు సీహెచ్‌సీకి వచ్చాడు. వైద్యులు పరీక్షించి సెలైన్ ఎక్కించారు. రెండో సెలైన్ పెడతామని చెప్పినా వినకుండా ఆస్పత్రి నుంచి బయటకు వచ్చి ఇంటికి బయలుదేరారు. ఇంతలో వర్షం కురవడంతో మార్గమధ్యలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ వద్ద కూర్చున్నాడు. కాసేపటికే తీవ్ర అస్వస్థతకు గురై భాస్కరరావు మృతి చెందాడు. వెంటనే బంధువులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని స్వగ్రామం ఘనసరకు తీసుకువెళ్లారు.

అక్టోబర్ 9న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ మీట్



అథ్లెట్ విన్యాసం, (ఇన్‌సెట్లో) కొన్న చిన్నారావు

శ్రీకాకుళం న్యూకాలనీ: దివంగత కొన్న చిన్నారావు మెమోరియల్ జిల్లాస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్(మీట్)–2022 పోటీలను అక్టోబర్ 9న నిర్వహించనున్నారు. కొన్న చిన్నారావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ప్రతి ఏడాది అథ్లెటిక్స్‌తోపాటు వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది కూడా జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలతోపాటు సెలక్షన్స్ ట్రైల్స్ కూడా నిర్వహించాలని నిర్వాహక కమిటీ సభ్యులు కొన్న మధుసూదనరావు, ప్రగడ అశోక్‌కుమార్, పూడి బాలాదిత్య, వాండ్రంగి శ్రీనివాసరావు శనివారం తెలిపారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు కొన్న వెంకటేశ్వరరావు (వాసు) నేతృత్వంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నొపడ విజయ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ మెంటాడ సాంబమూర్తి ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అండర్–14, 16, 18, 20 విభాగాలలో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రేపు టీచర్స్ డే

'ఈ టీచర్ చాలా స్ట్రిక్ట్' అనిపించుకుంది
సావిత్రి 'మిస్సమ్మ'లో.
'ఈ టీచర్ భలే చక్కగా పాఠాలు చెబుతుంది'
అని మెచ్చుకోలు పొందింది జమున
'మట్టిలో మాణిక్యం'లో.
'పంతులమ్మ' సినిమాలో లక్ష్మి పిల్లల పాఠాలే కాదు
కథానాయకుని జీవితాన్ని కూడా చక్కదిద్దింది.
'రేపటి పౌరులు', 'ప్రతిఘటన' దగ్గరి నుంచి
నిన్న మొన్నటి 'సరిలేరు నీకెవ్వరు' వరకు
టీచర్ అంటే విజయశాంతే.
'లేడీస్ టైలర్'లో రాజేంద్ర ప్రసాద్ వంటి
అల్లరి స్టూడెంట్‌ని బెత్తం దెబ్బలు కొట్టి
సరి చేయలేదూ అర్చన.
టీచర్ పాత్రకు గ్లామర్ ఉండకపోవచ్చు గాని
ప్రాముఖ్యత ఉంటుంది.
అలాంటి ప్రాముఖ్యత కొందరు హీరోయిన్లకే దక్కింది.
అదిగో చాక్‌పీస్ ఒక చేత్తో బెత్తం మరో చేత్తో పట్టుకుని
వాళ్లిటు నడిచొస్తున్నారు చూడండి.


'మిస్సమ్మ'లో సావిత్రి


'మట్టిలో మాణిక్యం'లో జమున


'పంతులమ్మ'లో లక్ష్మి

వెండితెర టీచరమ్మ

శిశువుకు అమ్మ తొలి టీచర్. స్కూల్లో 'టీచరమ్మే' తొలి టీచర్. నర్సరీల్లో, ఐదు లోపల తరగతుల్లో పిల్లలకు తొలిగా పరిచయం అయ్యేది ఎక్కువగా టీచర్లే. వీరే పిల్లలకు తొలుత ఆత్మీయులవుతారు. బడి పట్ల, పాఠాల పట్ల ఆసక్తి కలిగిస్తారు. ఈమె కూడా అమ్మలాంటిదే కాబట్టి భయం లేకుండా వెళ్లొచ్చు అని పిల్లలకు నమ్మకం కలిగిస్తారు.

అయినా సరే 'గురు దేవా' అంటే మగ గురువు గుర్తుకొస్తాడు. స్త్రీల వాటా ఈ విషయంలో సమానం అయినప్పటికీ. సినిమాల్లో కూడా హీరోలు వేసిన టీచర్ పాత్రలు ఎక్కువ ఉన్నాయి. హీరోయిన్లకు తక్కువగా ఈ చాన్స్ వచ్చింది. 'గ్లామర్' సినిమా కమర్షియల్ సినిమా వచ్చాక 'టీచర్' పాత్రలో హీరోయిన్‌ను గ్లామరస్‌గా చూపించలేము అనే భావనతో నిర్మాత, దర్శకులు హీరోయిన్‌ను 'ఒక ఆడి పాడే బొమ్మ' స్థాయికే కుదించి పెట్టారు. అయితే అప్పుడప్పుడు మంచి టీచర్ పాత్రలు సత్తా ఉన్న నటీమణుల చేతుల్లో పడి మెరిశాయి. వాళ్లు తెర మీద ఉంటే ప్రేక్షకులు బుద్ధిగా చూసే విద్యార్థులయ్యారు. రిజల్ట్ వందకు వంద వచ్చింది.


'రేపటి పౌరులు'లో విజయశాంతి

మీకు మీరే మాకు మేమే: సినిమాల్లో హీరోను చూసి హీరోయిన్ జంకడం ఆనవాయితీ. కాని 'మిస్సమ్మ'లో సావిత్రిని చూసి రామారావు జంకుతుంటాడు. దానికి కారణం ఆమె నిజాయితీ, టీచర్‌గా సిన్సియారిటీ. స్కూల్లో పిల్లలకు పాఠాలతో పాటు జమిందారు గారి కూతురికి సంగీతం పాఠాలు కూడా చెప్తుంది సావిత్రి. అంతేనా? కొంచెం నాన్ సీరియస్‌గా ఉన్న ఎన్.టి.ఆర్ తనను అందుకునేంతగా ఎదిగేలా చేసి ఒక రేవుకు చేరుస్తుంది. 'రావోయి చందమామా మా వింతగాధ వినుమా'... ఆ రోజుల్లో టీచర్లు పాటలు పాడే పాటలు ఇంత శుభ్రంగా వినసొంపుగా ఉండేది.

నా మాటే నీ మాటై చదవాలి: 'మట్టిలో మాణిక్యం'లో చలం అమాయకుడు. పౌరుషంతో పట్నం వస్తే టీచరైన జమున పరిచయం అవుతుంది. ప్రేమిస్తుంది. మామూలు చదువే కాదు లౌక్యంగా ఉండటానికి అవసరమైన చదువు కూడా చెబుతుంది. పాఠాలను పాటగా మార్చి ఆమె పాడే 'నా మాటే నీ మాటై చదవాలి నేనంటే నువ్వంటూ రాయాలి' పాట బాగుంటుంది. ఆ తర్వాతి రోజుల్లో సింగీతం శ్రీనివాసరావు హీరోయిన్ లక్ష్మితో 'పంతులమ్మ' సినిమా తీశాడు. 'పంతులమ్మ' టైటిల్‌తో ఒక సినిమా వచ్చి హిట్ కావడం విశేషం. భార్య మరణించిన వ్యక్తి జీవితంలోకి వచ్చిన ఒక పంతులమ్మ అతని పిల్లలకు పాఠాలు చెబుతూ అతని లోని ఒక అపోహను తొలగించడం కథ. 'ఎడారిలో కోయిల' పాట ఒయాసిస్‌లా ఉంటుంది. ఆ తర్వాత 'శుభలేఖ' సినిమాలో సుమలత టీచర్‌గా నటించింది. కట్నం అడగడాన్ని ఎదిరించిందని ఆమె ఉద్యోగం పోతుంది. కాని ఆమె వెరవదు.

ఈ దుర్యోధన దుశ్శాసన
క్లాసులోని రౌడీ పిల్లాణ్ణి సరి చేయడం టీచర్ బాధ్యత. మరి సమాజంలో ఉన్న రౌడీ పిల్లాణ్ణి దండించడం? చట్టం, న్యాయం, వ్యవస్థ విఫలమైతే ఆ బాధ్యత కూడా టీచరే తీసుకుంటుంది. 'ప్రతిఘటన'లో లెక్చరర్ అయిన విజయశాంతి ఊళ్లో అనేక ఘాతుకాలకు కారణం అవుతున్న రౌడీని అంతిమంగా తెగనరికి నిర్మూలిస్తుంది. చాక్‌పీస్ పట్టిన చేతులు గొడ్డలి కూడా పట్టగలవు అని హెచ్చరిస్తుంది. ఈ టీచర్ పాత్ర తెలుగులో వచ్చిన అన్ని టీచర్ పాత్రల కంటే శక్తిమంతమైనది. క్లాసు రూమ్‌లో పిచ్చి జోకులు, లెక్చరర్ల మీద పంచ్‌లకు తావు ఇచ్చే పాత్ర కాదు ఇది. ఈ పాత్రను చూడగానే మహా మహా పోకిరి స్టూడెంట్లు కూడా సైలెంటైపోవాల్సిందే. 'ఈ దుర్యోధన దుశ్శాసన దుర్వినీత లోకంలో' అని విజయశాంతి పాడుతుంటే ఆ వేదనా శక్తి చూసే ప్రతి విద్యార్థిలో పరివర్తన తెస్తుంది. విజయశాంతి ఆ తర్వాత 'రేపటి పౌరులు', 'సరిలేరు నీకెవ్వరు' సినిమాల్లో కూడా టీచర్‌గా నటించింది.

అరె ఏమైంది ఒక మనసుకు రెక్కలొచ్చి: అతను బెస్త పల్లెలో రౌడీ. ఆమె క్రైస్తవ విశ్వాసాలు కలిగిన టీచర్. అతను హింస. ఆమె దయ. హింసను వీడి దయ వరకూ చేసే ప్రయాణాన్ని ఆ టీచర్ ఆ రౌడీలో ప్రేరేపిస్తుంది. అతని పాపాలన్నీ స్వీయ రక్తంతో ప్రక్షాళనం అవుతాయి. చివరకు అతను ఆమె ప్రేమను పొందుతాడు. రౌడీగా చిరంజీవి, టీచర్‌గా సుహాసిని 'ఆరాధన'లో నటించారు. 'అరె ఏమైంది' పాట ఇప్పటికీ హిట్

ప్రేమమ్ మరికొన్ని: ఇటీవలి కాలంలో ఈ కాలపు హీరోయిన్లు కూడా టీచర్లుగా నటించారు. 'ఘర్షణ'లో అసిన్, 'గోల్కొండ హైస్కూల్'లో కలర్స్ స్వాతి, 'హ్యాపీ డేస్'లో కమలిని ముఖర్జీ, 'రాక్షసుడు'లో అనుపమ పరమేశ్వరన్ టీచర్లుగా కనిపిస్తారు. మన సాయి పల్లవి మలయాళ 'ప్రేమమ్'లో టీచర్‌గా నటించే పెద్ద క్రేజ్ సాధించింది. ఆ పాత్రను తెలుగులో శృతిహాసన్ చేసింది.

స్త్రీ శక్తి

ఫిమేల్ మోటర్ స్పోర్ట్స్ అథ్లెట్‌గా ప్రయాణం సులువేమీ కాదు.
మద్దతు ఇచ్చే వాళ్ల కంటే వద్దనే వాళ్లే ఎక్కువ... దీనికి ఐశ్వర్య మినహాయింపు కాదు.
మొన్న...'ఈ రంగాన్ని ఎందుకు ఎంచుకున్నావు?' అని ఆశ్చర్యంగా అడిగారు.
నిన్న... 'స్లోయెస్ట్ బైకర్' అని ముఖం మీదే అన్నారు.
ఇప్పుడు మాత్రం... ఐశ్వర్య గురించి 'ఆశాకిరణం లాంటి ప్రొఫెషనల్ బైకర్' అంటున్నారు...

బ్యాక్ ఆన్ ది బైక్
పడి లేచిన కెరటం


ఐశ్వర్య

బెంగళూరుకు చెందిన ఐశ్వర్యకు చిన్నప్పటి నుంచి బైక్‌లు అంటే చాలా ఇష్టం. ఇంట్లో నాన్న బైక్ ఉండేది. ప్రతి ఆదివారం ఆ బైక్‌పై తనను ఏదో ఒక కొత్త ప్రదేశానికి తీసుకెళుతుండేవాడు. ఇంటర్‌మీడియెట్ ఫెయిల్ అయిన తరువాత ఐశ్వర్యకు బైకే లోకం అయింది. ఫ్రెండ్స్‌ను తీసుకొని రోజూ బైక్‌పై చక్కర్లు కొట్టేది.

ఇలా తిరుగుతున్న రోజుల్లో ఒకసారి టీవీలో మోటోజీపి రేస్ చూసి 'వావ్' అనుకుంది. అలాంటి రేస్‌లో ఒకరోజు తాను భాగం అవుతానని అనుకోలేదు ఐశ్వర్య.

ఇక అది మొదలు... మోటర్‌స్పోర్ట్స్, మోటర్‌స్పోర్ట్స్ అథ్లెట్ల గురించి తెలుసుకోవడం మొదలుపెట్టింది. నిజంగా చెప్పాలంటే అదొక ప్రపంచం!


సక్సెస్ రూట్‌లో...

నిన్నటివరకు బైకింగ్ అనేది తనకు సరదా మాత్రమే. క్రికెట్, ఫుట్‌బాల్‌లాగే అది కూడా ఒక ఆట అని, దానిలో నిరూపించుకుంటే అంతర్జాతీయస్థాయికి వెళ్లవచ్చు అని తెలిశాక ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించింది. ట్రెనింగ్, రేసింగ్‌తోనే రోజులు గడిచేవి. అయితే ఐశ్వర్య అమ్మానాన్నలకు, వారి అమ్మా, నాన్నలకు ఆమెను పెద్ద గవర్నమెంట్ ఆఫీసర్‌గా చూడాలనేది కల. అయితే వారొకటి తలిస్తే ఐశ్వర్య కల ఒకటి తలిచింది. తండ్రి ససేమిరా అన్నాడు. తల్లి మాత్రం పట్టువిడుపు ధోరణి ప్రదర్శిస్తూ మద్దతు ఇచ్చేది. 2018లో కొద్దిమందితో కలిసి జోర్డీ అనే కోచ్ దగ్గర శిక్షణ తీసుకుంది. జోర్డీ సలహా మేరకు బజా అరగాన్, స్పెయిన్‌లో పాల్గొని ఫస్ట్ ఫిమేల్ ఇండియన్‌గా చరిత్ర సృష్టించింది ఐశ్వర్య. (స్పానిష్ బజా...స్పెయిన్‌లోని అరగన్ ప్రాంతంలో జరిగే ర్యాలీ రైడ్ లేదా క్రాస్-కంట్రీ ర్యాలీ. ఆఫ్రికన్ ఎడ్వెంచరస్ ర్యాలీలను స్ఫూర్తిగా తీసుకొని 1983లో దీనిని దేశంలో మొదలుపెట్టారు) ఆరుసార్లు నేషనల్ రోడ్‌రేసింగ్ ర్యాలీ ఛాంపియన్‌గా నిలిచింది. 2019లో మోటర్ స్పోర్ట్స్‌లో వరల్డ్ టైటిల్ గెలుచుకుంది.

తన సాధనతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంది.

మోటర్‌స్పోర్ట్స్ లో మన దేశానికి సంబంధించి గట్టిగా వినిపిస్తున్న పేర్లలో ఐశ్వర్య పేరు ఒకటి.

'నిజానికి మా కుటుంబంలో మోటర్‌స్పోర్ట్స్ గురించి తెలిసిన వారు లేరు. వరల్డ్ ఛాంపియన్‌షిప్ గురించి గైడ్ చేసేవారు కూడా లేరు. నాకు నేనే తెలుసుకుంటూ వెళ్లాను. రేస్‌లలో పాల్గొనడం ద్వారా ఎంతోమందితో మాట్లాడి, వారి నుంచి ఎన్నో విషయాలు తెలుసుకునే అవకాశం వచ్చింది' అంటుంది ఐశ్వర్య.

'ప్లాన్ బీ' లేదా సెకండ్ కెరీర్ అనేవి ఉండాలి అంటారు. అయితే ఒక రంగంలోకి, ఒక లక్ష్యం కోసం దిగిన వారు 'ప్లాన్ బీ' గురించి ఆలోచించవద్దు అంటుంది ఐశ్వర్య.

'ఈ రంగంలో రాణించకపోతే నెక్స్ట్ ఏమిటి? అని ఎప్పుడూ అనుకోలేదు. కచ్చితంగా సాధించాల్సిందే అనుకున్నాను' అంటుంది ఐశ్వర్య. స్పెయిన్‌లో మహిళలు మోటర్‌స్పోర్ట్స్‌లో రాణించడానికి అనువైన వాతావరణం, మౌలిక వసతులు ఉన్నాయి. కుటుంబ మద్దతు కూడా బలంగా ఉంటుంది. అలాంటి పరిస్థితి మన దేశంలో కూడా రావాలని కోరుకుంటుంది ఐశ్వర్య.

మోటర్ స్పోర్ట్స్ అంటే పరాజయాలు, విజయాలు మాత్రమే కాదు... గట్టి గాయాలు కూడా. ఒక ప్రమాదంలో చావు అంచుల వరకు వెళ్లి వచ్చింది ఐశ్వర్య. ఇక ఆమె నడవడం కూడా కష్టమే అనుకున్నారంతా. అయితే 'బ్యాక్ ఆన్ ది బైక్' అంటూ మళ్లీ విజయపథంలో దూసుకుపోవడానికి ఎంతోకాలం పట్టలేదు!

మెడి టిప్స్

పనుల్లో, ఆటల్లో భుజం గాయపడకుండా జాగ్రత్త పడండి!

భుజం దగ్గర ఉండేది కీలకమైన కీలు. పైగా నిద్రసమయంలో తప్ప... దాదాపుగా కదులుతూ ఉండే భాగం కావడంతో దానికి గాయమయ్యే అవకాశాలు ఎక్కువ. ఇక ఆటల సమయంలోనైతే భుజం, అక్కడి కీలు నిత్యం పనిచేస్తూనే ఉంటాయి. అందుకే భుజానికి గాయాలవడానికీ, దాంతో అనేక రకాల సమస్యలు వచ్చేందుకు అవకాశాలు ఎక్కువ. ఉదాహరణకు భుజం గూడ తప్పడం (షోల్డర్ డిస్‌లొకేషన్), రొటేటర్ కఫ్ టేర్, స్లాప్ టేర్స్, టెండనైటిస్, టెండన్ రప్చర్స్ వంటివి.

సాధారణంగా ఆటల్లో భుజం తాలూకు గూడ తప్పడం అనే సమస్య ఎక్కువగా వస్తుంటుంది. ఇలా జరిగినప్పుడు దాన్ని సరైన స్థానంలో అమర్చాల్సి ఉంటుంది. దాంతో పరిస్థితి చక్కబడుతుంది. ఇక గూడ తొలగడం అనే ఆ సమస్య నిత్యం జరుగుతూ ఉంటే 'ఆర్థోస్కోపీ స్టెబిలైజేషన్' అనే శస్త్రచికిత్స అవసరం కావచ్చు. ఆ శస్త్ర చికిత్స ద్వారా ఈ సమస్యను నిపుణులు చక్కదిద్దుతారు

భుజానికి వచ్చే సాధారణ సమస్యల నివారణ కోసం...



● క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల భుజం కండరాలు బలంగా మారి భుజానికి వచ్చే అనేక సమస్యలు నివారితమవుతాయి ● వ్యాయామంలో తన వీపు భాగంలో ఉండేవీ, వెనకవైపు కండరాలపై కూడా దృష్టిపెట్టడం కూడా అవసరం. చాలా మంది శరీరానికి ముందువైపు ఉన్న కండరాలు బలంగా రూపొందడానికీ, అవి అందంగా మంచి షేప్‌తో కనిపించడానికి తగిన ప్రాధాన్యమిస్తుంటారు. ఆ మేరకే వ్యాయామాలు చేస్తుంటారు. అయితే భుజం విషయంలో మాత్రం చేతులకు వెనక వైపున ఉండే కండరాలు కూడా బలంగా రూపొందే వ్యాయామాలు చేయాలి. అప్పుడే భుజం చాలాకాలంపాటు ఆరోగ్యంగా ఉంటుంది ● మధుమేహ వ్యాధిగ్రస్తులకు 'ఫ్రోజెన్‌షోల్డర్' అనే బాధాకరమైన కండిషన్ వచ్చే అవకాశాలు ఎక్కువ. అందుకే డయాబెటిస్‌ను అదుపులో పెట్టుకునేందుకు, ఫ్రోజెన్‌షోల్డర్‌ను నివారించుకునేందుకు అవసరమైన వ్యాయామాలు చేయడం మంచిది ● కంప్యూటర్‌పై పనిచేసేవారు, వీడియోగేమ్స్ ఆడేవారు, టీవీ చూసేవారు, డ్రైవింగ్ చేసేవారు సరైన భంగిమలో కూర్చోవాలి. వారు నిటారుగా కూర్చొని పనిచేయడం వల్ల కండరాలపైనా, ఇరువైపుల ఉన్న భుజాలపైన సమంగా భారం పడుతుంది. అంతే తప్ప ఒకవైపు ఒంటి పనిచేయడం సరికాదు ● భుజాలు బెణకడం వంటివి జరిగినప్పుడు అది తగ్గే వరకు వ్యాయామాలు ఆపేసి, వేడినీటి కాపడం, ఐస్ కాపడం పెట్టాలి. ఇలా చేశాక రెండు రోజుల తర్వాత కూడా నొప్పి తగ్గకపోతే వెంటనే డాక్టర్‌ను కలవాలి.

దగ్గును బలవంతంగా ఆపుకోకండి!

పదిమంది మధ్య ఉన్నప్పుడు బలంగా అదేపనిగా దగ్గు వస్తుంటే చాలామంది ఆపుకోడానికి ప్రయత్నిస్తుంటారు. దగ్గడం అన్నది సాధారణంగా ఊపిరితిత్తులకు సంబంధించిన అనారోగ్యానికి సూచన. చాలా జబ్బుల్లో అదో లక్షణం. అదే సమయంలో దగ్గడం అనే ప్రక్రియ మనల్ని కొన్ని సమస్యల నుంచి రక్షిస్తుంది కూడా. అందుకే దగ్గు వస్తున్నప్పుడు మీటింగ్‌లో ఉన్నామనో, లేదా నలుగురిలో ఇబ్బంది అనో దాన్ని ఆపకూడదనీ, అణచివేయకూడదని సూచిస్తున్నారు వైద్యనిపుణులు.



దగ్గినప్పుడు మన శ్వాసనాళాల్లోని గాలి చాలా వేగంగా బయటకు వస్తుంటుంది. దాంతో దేహంలోపల ఉన్న అవాంఛిత స్రావాలు బయటకు వెళ్లిపోతాయి. ఊపిరితిత్తుల్లో స్రావాలు అక్కడే ఉండిపోయినా, అక్కడి వాయునాళాల్లో అవి అడ్డుపడ్డా, గట్టిగా దగ్గు వస్తుంది. అలాంటప్పుడు దగ్గితే... కళ్లె / కఫం బయటపడుతుంది. ఫలితంగా మనకు కీడు చేసే స్రావాలను దగ్గు బయటకు పంపించి వేస్తుంది కాబట్టే దగ్గును ఆపుకోకూడదు. వీలైతే మందులతోనూ అణచివేయకూడదు. కానీ దగ్గు వల్ల బాధితులకు నిద్రలేకపోయినా, లేదా పనులకు ఆటంకం కలుగుతున్నా, హెర్నియా వంటి జబ్బులు ఉన్నా... కేవలం ఇలాంటి కొన్ని సందర్భాల్లో మాత్రమే పొడి దగ్గును ఆపడానికి మందులు వాడాలి. నిజానికి దగ్గు అనేది జబ్బు కాదు. మనల్ని రక్షించేందుకు ఉన్న ప్రక్రియ. అందుకే దగ్గు వస్తున్నప్పుడు అది ఏ కారణంగా వస్తుందో తెలుసుకొని, దానికి చికిత్స తీసుకోవాలి. అప్పుడు సమస్యా తగ్గుతుంది. ఆటోమేటిగ్గా దగ్గు కూడా తగ్గుతుంది.

హెల్త్



ఎవరికైనా ఏదో ఒక సమయంలో చిన్నదో, పెద్దదో ఏదో ఓ దెబ్బ తగలక మానదు. చాలామందిలో దెబ్బ కొన్నాళ్ల తర్వాత తగ్గిపోతుంది. కానీ కొందరికి మాత్రం ఆ దెబ్బ తగ్గిన చోట ఉబ్బెత్తుగా చర్మం పైకి ఉబికినట్లుగా అవుతుంది. సాధారణంగా ఛాతీపై లేదా చెవుల మీద ఇలాంటి ఉబ్బెత్తు కాయకాసినట్లుగా అనిపిస్తూ, అది నునుపుగా మెరసిపోతూ ఉంటుంది. ఇలా గాయం మానాక ఉబ్బెత్తుగా మారిన వాటినే 'కీలాయిడ్స్' అంటారు. నిజానికి వాటితో ఆరోగ్యానికి పెద్దగా సమస్య ఉండబోదు. కానీ కేవలం కాస్మటిక్‌గా, కాస్తంత ఉద్వేగపరమైన ఒత్తిడి, ఇబ్బంది తెచ్చిపెట్టే ఈ కీలాయిడ్స్‌పై అవగాహన కోసం ఈ కథనం.

గాయం తర్వాత కీలాయిడ్స్ రాకుండా ఉండాలంటే!

కీలాయిడ్స్ అయ్యే అవకాశం (టెండెన్సీ) ఉన్న వారిలో దెబ్బతగిలినప్పుడు ఇవి వంశపారంపర్యంగా ఆయా కుటుంబాల్లో కనిపిస్తాయి.

లక్షణాలు : ● దెబ్బతగిలిన కొన్ని నెలలు లేదా కొన్ని సందర్భాల్లో ఏళ్ల తర్వాత మానిన ఆ భాగం మిగతా చర్మం కంటే ఉబ్బెత్తుగా పైకి పెరుగుతుంది ● చాలా సందర్భాల్లో ఛాతీ నడిమి భాగంలో ఇలా అయి కనిపిస్తుంటుంది ● ఓ లంప్ (కణితి) మాదిరిగా చేతికి తగులుతుంది. కొన్ని చేతికి మృదువుగా, మరికొన్ని రబ్బరు మాదిరిగా తగులుతాయి ● చర్మం రంగు కంటే భిన్నంగా... ఎరుపు, బ్రౌన్, పర్పుల్ బ్రౌన్ కలగలసిన రంగుల్లో ఉంటాయి ● కొన్ని సందర్భాల్లో కాస్త దురద, నొప్పి కూడా ఉండవచ్చు. మరికొన్ని సందర్భాల్లో అక్కడ వెంట్రుకలు లోపల ఉండిపోయి ఇన్ఫెక్షన్ కూడా రావచ్చు.

కారణాలు : ● ఇవి ఎందుకు వస్తాయనే అంశంపై ఇదమిత్థంగా స్పష్టత లేదు. అందరూ అంగీకరించే అంశం ఏమిటంటే... దెబ్బ నయమయ్యే తీరులో ఏవో కొన్ని తేడాల (డిస్‌ఫంక్షన్) కారణంగా ఇలా జరుగుతోందన్నది అందరూ అంగీకరిస్తున్న అంశం ● మన దేహంలో కొలాజెన్ అనే ప్రోటీన్ ఉంటుంది. గాయాన్ని మాన్పే ప్రక్రియకు ఇది ఉపయోగపడుతుంటుంది. అయితే దెబ్బ తగిలిన ప్రదేశంలో ఈ ప్రోటీన్ మరింత ఎక్కువగా ఉత్పత్తి అవ్వడం వల్ల ఆ ప్రోటీన్ ఇలా కీలాయిడ్స్‌గా పెరుగుతాయనేది నిపుణుల అభిప్రాయం ● కీలాయిడ్స్ పూర్తిగా నిరపాయకరమైనవే.

కీలాయిడ్స్‌తో ముప్పులు ఇవి... ● సాధారణంగా ఇవి కొన్నిసార్లు దెబ్బ తగిలిన చోట మాత్రమే పెరగవు. ఒకటి వచ్చిందంటే కొందరిలో రెండు, మూడు అరుదుగా చాలా గడ్డలు గుత్తులుగా పెరగవచ్చు ● ఒక్కోసారి ఆ గడ్డ చాలా గట్టిగా అటు ఇటు కదలలేనంత బిగుతుగా మారి, కదలికల సమయంలో ఇబ్బంది కలిగించవచ్చు.

నివారణ : కీలాయిడ్స్ రాకుండా కొంతవరకు ప్రయత్నించవచ్చు. ఇందుకు పాటించాల్సిన సూచనలు...

● దెబ్బ మానిన తర్వాత ఆ ప్రదేశంలో చాలా పలుచగా పెట్రోలియమ్ జెల్లీ (వాజలైన్, అక్వాఫర్) రాయాలి. అలా రాసి, రోజుకు రెండు మూడు సార్లయినా మృదువుగా మసాజ్ చేసుకోవాలి ● పెద్ద దెబ్బ కాకపోయినా, దానంతట అదే మానిపోయేంత చిన్నదే అయినా డాక్టర్‌కు చూపించి, తమకు కీలాయిడ్స్ వచ్చే స్వభావమున్నదని చెప్పాలి. దాంతో వారు ఏవైనా ఆయింట్‌మెంట్స్ సూచించవచ్చు. వాటిని డాక్టర్ సూచించిన విధంగా రాయాలి ● ఇలాంటివారికి డాక్టర్లు అక్కడ అప్లై చేసేందుకు సిలికోన్‌జెల్, లేదా ప్రెషర్‌ప్యాడ్ వంటివి సూచిస్తారు. ఆ మేరకు వాటిని ఉపయోగించాలి ● కీలాయిడ్స్ వచ్చే స్వభావం ఉన్నవారిలో చెవులు కుట్టించినప్పుడు చెవి తమ్మె వద్ద కీలాయిడ్స్ పెరగవచ్చు. చెవులు కుట్టించే సమయంలో ఎక్కువ ఒత్తిడి కలిగించకూడదు. కీలాయిడ్స్ ప్రమాదం నివారించేందుకు డాక్టర్ల ఆధ్వర్యంలోనే చెవులు కుట్టించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి ● కీలాయిడ్స్ వచ్చే స్వభావం గలవారు దెబ్బలు తగలకుండా అదనపు జాగ్రత్తలు తీసుకోవాలి. చిన్న చిన్నగాయాలు అంటే ఎక్కడైనా కట్ కావడం, వెంట్రుక లోపలికి పెరిగే దద్దుర్లు వంటివి కూడా కాకుండా చూసుకోవాలి. కొందరికి సర్జరీ అయినప్పుడు ఇలా కాయగా పెరిగే అవకాశం ఉండవచ్చు. అలాంటివారు పోస్ట్ ఆపరేటివ్ సర్జరీ జాగ్రత్తల్లో భాగంగా డాక్టర్లను కలిసి తమ గాయాన్ని చూపి, వారు సూచించిన జాగ్రత్తలు పాటించాలి ● ఇలాంటి స్వభావం ఉన్నవారు చెవులు కుట్టించడంలో భాగంగా ఎక్స్‌ట్రా ఇయర్ పియర్సింగ్ చేయించుకోకపోవడమే మంచిది. అంతేకాదు దేహంలో ఇతరచోట్ల బాడీపియర్సింగ్ వంటివి కూడా చేయించుకోకపోవడమే మంచిది ● టాటూలు వేయించుకోవడం వంటి ఫ్యాషన్ ప్రక్రియలకు పూర్తిగా దూరంగా ఉండాలి.

చికిత్స

● కీలాయిడ్‌ను సర్జికల్‌గా తొలగించడం అన్నది చివరిప్రయత్నంగా అనుసరించాల్సిన పద్ధతి. అయితే ఇలా తొలగించే ప్రయత్నంలో మరోసారి మళ్లీ కీలాయిడ్ పెరిగే అవకాశం ఉండవచ్చు. దీన్ని నివారించడానికి గాయమైన వెంటనే 'కంప్రెషన్ డ్రెస్సింగ్' చేయించడం అవసరం. ఈ కంప్రెషన్ డ్రెస్సింగ్ కోసం ప్రత్యేకమైన ఫ్యాబ్రిక్ లేదా స్పెషల్ గుడ్డతో తయారు చేసిన మెటీరియల్‌ను ఉపయోగిస్తారు. ఒక పక్క గాయం తగ్గడం, మరో పక్క చర్మం ఉబికిపోకుండా అణచేలా జాగ్రత్త తీసుకోవడమే ఈ 'కంప్రెషన్ డ్రస్సింగ్' లక్ష్యం. దీన్ని 12 – 24 గంటల సేపు... ఇలా 4 నుంచి 6 నెలలు డ్రస్సింగ్ చేసి ఉంచాల్సి ఉంటుంది. అయితే ఇది బాధితులకు అంత సౌకర్యంగా ఉండదు ● గాయంలోకి / కీలాయిడ్‌లోకి కార్టిజోన్ / కార్టికో స్టెరాయిడ్ వంటి స్టెరాయిడ్స్ తగిన మోతాదులో ఇంజెక్షన్ ద్వారా పంపడం. (ఇలా చేయడంలో ఆ ప్రదేశంలో రంగు తగ్గడం (హైపోపిగ్మెంటేషన్) రావచ్చు. ఈ స్టెరాయిడ్ ఇంజెక్షన్స్ నెలకొకసారి తీసుకోవాల్సిన అవసరం ఉండవచ్చు. వీటిని కేవలం డాక్టర్ ఆధ్వర్యంలో మాత్రమే, తగిన మోతాదులోనే తీసుకోవాల్సి ఉంటుంది.

అధునాతన చికిత్స ప్రక్రియలు

● లిక్విడ్ నైట్రోజెన్ సహాయంతో గాయం వద్ద బాగా చల్లబరిచే చికిత్స చేసి, గాయాన్ని తొలగించవచ్చు. దీన్ని క్రయోథెరపీ అంటారు. ఇందులో రెండురకాలు ఉంటాయి. ఒకటి ఇంట్రాలీజనల్ క్రయోథెరపీ. మరొకటి సర్ఫేస్ క్రయోథెరపీ. వీటిల్లో ఇంట్రాలీజనల్ క్రయోథెరపీ ద్వారా మంచి ఫలితాలు చూడవచ్చు. ఈ చికిత్సతో పాటు కార్టికో స్టెరాయిడ్ ఇంజెక్షన్ కూడా కలిపి చేస్తే ఫలితాలు ఇంకా మెరుగ్గా ఉంటాయి. కీలాయిడ్స్ మళ్లీ తిరగబెట్టే అవకాశాలు కూడా తక్కువగా ఉంటాయి. అయితే ఇందులో పదే పదే చికిత్స చేయాల్సిన అవసరం ఉండవచ్చు. (రంగు తగ్గడం, నొప్పి వంటి సైడ్‌ఎఫెక్ట్స్ ఈ చికిత్స ప్రక్రియలో కనిపించే అవకాశాలున్నాయి).

లేజర్ చికిత్స

ఇది కూడా ఫస్ట్‌లైన్ ట్రీట్‌మెంట్ కాదు. కేవలం 'పల్స్‌డ్ డై లేజర్ థెరపీ' అని పిలిచే ఈ ప్రక్రియలో 4 – 8 వారాల వ్యవధిలో అనేక సెషన్స్‌లో ఈ చికిత్స చేయాల్సి వస్తుంది.
లేజర్ చికిత్సనూ, కార్టిజోన్ ఇంజెక్షన్లను కలిపి కూడా చికిత్స చేయవచ్చు. (ఇందులోనూ చర్మం రంగు మారడం, మళ్లీ ఉబ్బెత్తుగా మారడం వంటి కొన్ని సైడ్ ఎఫెక్ట్స్ ఉండవచ్చు). సీవోటూ (కార్బన్ డై ఆక్సైడ్) లేజర్ అనే ప్రక్రియను కూడా చాలా తక్కువ మందిలో మాత్రమే వాడతారు.
● కొంతమందిలో ఇటీవల రేడియేషన్ చికిత్స కూడా చేస్తున్నారు. ● సర్జికల్ పద్ధతి చివరి ఆప్షన్‌గా పరిగణిస్తారు. కీలాయిడ్స్ చాలా పెద్దగా ఉండటం, లేదా బాధితులకు ఇబ్బందిగానూ, నొప్పిగానూ ఉన్నప్పుడు సర్జికల్ పద్ధతిని ఆలోచించాలి. ఇది కేవలం నిపుణులైన డాక్టర్ల ఆధ్వర్యంలోనే సర్జరీ చేయించకోవాలి. పైన పేర్కొన్న పద్ధతుల్లో ఒకటిగానీ లేదా కొన్ని గానీ కాంబినేషన్లలో అనుసరించడం వల్ల మెరుగైన ఫలితాలు మనం చూడవచ్చు.


డాక్టర్ స్వప్నప్రియ
సీనియర్ డర్మటాలజిస్ట్

23 సెరెనా గెలిచిన సింగిల్స్ గ్రాండ్‌స్లామ్‌ల సంఖ్య. ఓపెన్ శకంలో (1968 నుంచి) అత్యధిక టైటిల్స్ గెలిచిన ఘనత.

319 వరల్డ్ నంబర్‌వన్‌గా నిలిచిన వారాలు. వరుసగా 186 వారాల పాటు అగ్రస్థానంలో నిలిచి స్టెఫీ గ్రాఫ్ రికార్డు సమం.

14 గెలిచిన గ్రాండ్‌స్లామ్ డబుల్స్ టైటిల్స్. అన్నీ తన సోదరి వీనస్ విలియమ్స్ భాగస్వామిగానే కావడం విశేషం.

2 గ్రాండ్‌స్లామ్ మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్స్. భాగస్వామి మ్యాక్స్ మిర్నీ.

4 గెలిచిన ఒలింపిక్ స్వర్ణ పతకాలు. డబుల్స్‌లో 3 సాధిస్తే... 2012 ఒలింపిక్స్‌లో సింగిల్స్‌లో గెలిచింది.

5 అమెరికా తరఫున ఐదు సార్లు ఫెడరేషన్ కప్ విజేత.

73 కెరీర్‌లో మొత్తం నెగ్గిన డబ్ల్యూటీఏ సింగిల్స్ టైటిల్స్. మరో 25 టోర్నీలలో రన్నరప్.

858 సింగిల్స్ కెరీర్‌లో గెలిచిన మ్యాచ్‌లు

156 సింగిల్స్ కెరీర్‌లో ఓడిపోయిన మ్యాచ్‌లు

605 సింగిల్స్ విభాగంలో ప్రస్తుత ర్యాంక్

413 డబుల్స్ విభాగంలో ప్రస్తుత ర్యాంక్

367 గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో నెగ్గిన మ్యాచ్‌లు



రెండో రౌండ్ పోరు

- నేడు భారత్, పాకిస్తాన్ మధ్య 'సూపర్-4' మ్యాచ్
- రాత్రి గం.7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

దుబాయ్: క్రికెట్ అభిమానులకు వరుసగా రెండో ఆదివారం అసలైన సాయంత్రపు వినోదం. వారం రోజుల వ్యవధిలో భారత్, పాకిస్తాన్ జట్లు రెండోసారి తలపడనున్నాయి. ఆసియా కప్ 'సూపర్-4' దశలో ఇరు జట్ల మధ్య మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. సరిహద్దు దేశాల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు లేని లోటును తీరుస్తూ టోర్నీలో జరుగుతున్న రెండో రౌండ్ పోరు కూడా అంతే ఆసక్తిని రేపుతోంది. ఉత్కంఠభరితంగా సాగిన తొలి మ్యాచ్‌లో చివరి ఓవర్లో విజయంతో భారత్‌దే పైచేయి అయింది. రోహిత్ శర్మ సేన అదే జోరును కొనసాగిస్తుందా లేక బాబర్ ఆజమ్ కెప్టెన్సీలోని పాక్ బదులు తీర్చుకుంటుందా అనేది ఆసక్తికరం.

ఫైనల్లో తెలుగు యోధాస్

పుణే: అల్టిమేట్ ఖో-ఖో లీగ్‌లో తెలుగు యోధాస్ జట్టు ఫైనల్లోకి దూసుకెళ్లింది. శనివారం జరిగిన క్వాలిఫయర్-2లో తెలుగు యోధాస్ 67-44 తో గుజరాత్ జెయింట్స్ జట్టును ఓడించింది. అరుణ్ గున్కీ 16 పాయింట్లు, ప్రజ్వల్ 14 పాయింట్లు సాధించి తెలుగు యోధాస్ విజయంలో కీలకపాత్ర పోషించారు. నేడు జరిగే ఫైనల్లో ఒడిశా జగర్‌నాట్స్‌తో తెలుగు యోధాస్ తలపడుతుంది.

శ్రీలంక విజయం



షార్జా: ఆసియా కప్ టి20 క్రికెట్ టోర్నీ సూపర్-4 దశ తొలి లీగ్ మ్యాచ్‌లో శ్రీలంక నాలుగు వికెట్ల తేడాతో అఫ్గానిస్తాన్‌ను ఓడించింది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్గానిస్తాన్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 175 పరుగులు సాధించింది. ఓపెనర్ రహ్మానుల్లా గుర్బాజ్ (45 బంతుల్లో 84; 4 ఫోర్లు, 6 సిక్స్‌లు), ఇబ్రహీమ్ జద్రాన్ (40; 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. అనంతరం శ్రీలంక 19.1 ఓవర్లలో 6 వికెట్లకు 179 పరుగులు చేసి విజయం సాధించింది. నిసాంక (35; 3 ఫోర్లు, 1 సిక్స్), కుశాల్ మెండిస్ (19 బంతుల్లో 36; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), గుణతిలక (20 బంతుల్లో 33; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), రాజపక్స (14 బంతుల్లో 31; 4 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడి లంక విజయంలో కీలకపాత్ర పోషించారు.



"ఇవి కన్నీళ్లు కాదు. ఆనంద భాష్పాలు. నా తల్లిదండ్రులే ఈ ఘనతకు కారణం. వారికి ఏం ఇచ్చినా తక్కువే. ఇక అక్క వీనస్ లేకపోతే చెల్లి సెరెనా లేదు. సెరెనా ప్రతీ విజయం వెనక వీనస్ ఉంది. ఇదో అత్యద్భుత ప్రయాణం. నా కెరీర్‌లో ఎప్పుడూ చివరి వరకు కూడా ఓటమిని అంగీకరించలేదు. ఇప్పుడు కూడా అలాగే పోరాడాను. ఇన్నేళ్లుగా నాకు కోర్టులో మద్దతునిచ్చిన అందరికీ కృతజ్ఞతలు. నా జీవితమంతా టెన్నిస్ ఆడాను. నేను కోరుకున్నదంతా సాధించాను. ఇకపై ఆటకు దూరంగా భిన్నంగా జీవితాన్ని గడపాలనుకుంటున్నా. రెండోసారి అమ్మను కావాలని భావిస్తున్నా." -సెరెనా

సరిలేరు సెరెనాకెవ్వరు!

ముగిసిన సెరెనా శకం
చివరి మ్యాచ్ ఆడిన అమెరికా దిగ్గజం
యూఎస్ ఓపెన్ టోర్నీలో మూడో రౌండ్‌లో పరాజయం



2007 ఆస్ట్రేలియన్ ఓపెన్... ఆ సమయంలో 81వ ర్యాంక్‌లో ఉన్న సెరెనా విలియమ్స్ అన్‌సీడెడ్‌గా బరిలోకి దిగింది. అప్పటికి ఆమె గ్రాండ్‌స్లామ్ మాత్రమే కాదు, ఏదైనా డబ్ల్యూటీఏ టైటిల్ గెలిచి సరిగ్గా రెండేళ్లయింది. ఆట, శరీరం రెండూ గతి తప్పాయంటూ వరుసగా విమర్శలు వస్తున్నాయి... విపరీతంగా బరువు పెరిగిపోయి మైదానంలో చురుకైన కదలికలు లోపించాయి... టోర్నీలో తొలి మ్యాచ్‌కు ముందు 'నైకీ' ప్రతినిధి ఒకరు ప్లేయర్స్ లాంజ్‌లోకి వచ్చి సెరెనాను కలిశాడు. ఆశించిన స్థాయిలో సెరెనా ఆట లేదని, ఇలాగే సాగితే ఒప్పందం రద్దు చేసుకుంటాం అని హెచ్చరిక జారీ చేశాడు. కనీసం క్వార్టర్ ఫైనల్ అయినా చేరాల్సిందేనని గట్టిగా చెప్పి వెళ్లాడు. అప్పటికే 7 గ్రాండ్‌స్లామ్స్ ఆమె ఖాతాలో ఉన్నా సరే, ఒక స్టార్ క్రీడాకారిణిగా గుర్తింపు తెచ్చుకున్నా సరే, ఆటతో పాటు కోర్టు బయట కూడా సవాళ్లను ఎదుర్కోవాల్సిన పరిస్థితి... ఇలాంటి తీవ్ర ఒత్తిడి మధ్య సెరెనా ఆడింది. తన కసినంతా ప్రదర్శిస్తూ వరుసగా ఒక్కో ప్రత్యర్థిని దాటుకుంటూ ఫైనల్ చేరింది. అక్కడ షరపోవాను ఓడించి సగర్వంగా ట్రోఫీని అందుకుంది. గెలుపు అనంతరం తన ఆగ్రహాన్ని దాచుకోకుండా 'ఓడాలని ఎవరూ కోరుకోరు. ఇలాంటి విజయాలే నన్ను మానసికంగా బలంగా మారుస్తాయి. విమర్శకులందరికీ ఇదే నా సమాధానం' అంటూ గట్టిగా ప్రకటించింది. కెరీర్ ఆసాంతం ఇదే పోరాటపటిమ సెరెనాను గొప్పగా నిలిపింది.

అద్భుతమైన సర్వీస్, పదునైన గ్రౌండ్‌స్ట్రోక్‌లు, రిటర్న్‌లో ధాటి, చురుకైన అథ్లెట్ లక్షణాలు, అన్నింటికి మించి మానసిక దృఢత్వం... లోపాలు లేని ప్లేయర్‌గా సెరెనాను ఆల్‌టైమ్ గ్రేట్‌గా నిలిపాయి. తనకంటే ముందు తరంలో అనేక మంది దిగ్గజాలతో పోలిస్తే ప్రత్యర్థిపై విరుచుకుపడే దూకుడు, పవర్ గేమ్ ఆమెను ప్రత్యేకంగా మార్చాయి. 14 ఏళ్ల వయసులో ప్రొఫెషనల్‌గా ప్రారంభమైన ఆ ప్రస్థానం 18 ఏళ్ల పాటు ఘనంగా సాగి ఇప్పుడు ఆఖరి అంకానికి చేరింది. ఆటలోని అంకెలు మాత్రమే కాదు అంతకు మించిన ఆత్మవిశ్వాసం ఆమెను అందరికీ స్ఫూర్తిగా మార్చాయి. బాల్యం నుంచి స్టార్‌గా మారిన తర్వాత కూడా పలు సందర్భాల్లో నల్ల జాతీయురాలిగా ఎదుర్కొన్న వివక్షను అధిగమించి శిఖరానికి చేరగలగడం ఆమెకే సాధ్యమైంది. తనపై కొందరు వర్ణ వివక్ష వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా సొంత దేశంలోనే ఒక ప్రతిష్టాత్మక టోర్నీలో 14 ఏళ్లు ఆడకుండా స్వీయ వనవాసం పాటించిన ఆమె... లింగ వివక్షపై కూడా టెన్నిస్ కోర్టులోనే తన ఆగ్రహాన్ని ప్రదర్శించడంలో వెనక్కి తగ్గలేదు. అమెరికాలో పేదరికానికి కేరాఫ్ అడ్రస్ లాంటి కాంప్టన్ పట్టణంలో పెరిగిన నాటి నుంచి ప్రపంచాన్ని జయించే వరకు కూడా సెరెనాను అదే పట్టుదల, ఓటమిని అంగీకరించని తత్వం నడిపించాయి. తన విజయాలతోనే కాదు తన ప్రతీ అడుగుతో, ఆడిన ప్రతీ షాట్‌తో క్రీడా ప్రపంచంపై మరచిపోలేని ముద్ర వేసి సెరెనా తన శకాన్ని ముగిస్తోంది. **- సాక్షి క్రీడా విభాగం**

నాన్నే తొలి గురువు



సెరెనాకు ఆట మొదలు పెట్టిన నాటినుంచి అన్నీ నాన్ననే. సాధారణ టెన్నిస్ అభిమానిగా మ్యాచ్‌లు వీక్షించే అలవాటు ఉన్న తండ్రి రిచర్డ్ విలియమ్స్ 1978 ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్, రొమేనియా క్రీడాకారిణి వర్జీనియా రుజికి ఆటతో స్ఫూర్తి పొంది తన కూతుళ్లను కూడా టెన్నిస్ ఆడించాలని నిర్ణయించుకున్నాడు. అక్క వీనస్‌తో పాటు సెరెనా కూడా స్థానిక కోచ్ వద్ద ఓనమాలు నేర్చుకున్నా, కొద్ది రోజులకే అక్కడి నుంచి తప్పించి తండ్రి రిచర్డ్ తనకు తెలిసిన పరిజ్ఞానంతోనే సొంతంగా కోచింగ్ ఇచ్చేందుకు సిద్ధమయ్యాడు. చిన్నప్పుడే సెరెనా షాట్ల మోత మొదలు కాగా, అండర్-10 స్థాయిలోనే అమెరికా టెన్నిస్ సంఘం గుర్తించే తరహా ఆటను ఆమె ప్రదర్శించింది. అయితే నల్ల జాతీయురాలిగా వివక్షను కూడా ఆమె అప్పుడే ఎదుర్కొంది. టోర్నమెంట్‌లు ఆడే సమయంలో శ్వేత వర్ణపు క్రీడాకారుల తల్లిదండ్రులు తమ అమ్మాయిల గురించి చెడుగా మాట్లాడుతున్నారని తెలుసుకున్న రిచర్డ్ ఆ వయసులో టోర్నీలకు దూరంగా ఉంచాలని నిర్ణయించుకున్నాడు. కొంత విరామం, మరింత సాధన తర్వాత సరిగ్గా 14 ఏళ్ల వయసులో అధికారికంగా తొలి ప్రొఫెషనల్ టోర్నీలో సెరెనా ఆడింది. ఆ తర్వాత అంతర్జాతీయ వేదికపై దూసుకుపోయేందుకు ఆమెకు ఎక్కువ సమయం పట్టలేదు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 304వ స్థానంలో ఉన్న సమయంలోనే ఒకే టోర్నీలో వరల్డ్ టాప్-10లో ఉన్న మోనికా సెలెస్, మేరీ పియర్స్‌లను ఓడించడంతో కొత్త చాంపియన్ రాబోతుందనే సంజ్ఞలు అందరికీ కనిపించాయి.

కెరీర్ ప్రైజ్‌మనీ
94,806,080 డాలర్లు
(రూ. **756** కోట్లు)

7 ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్స్
3 ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్స్
7 వింబుల్డన్ టైటిల్స్
6 యూఎస్ ఓపెన్ టైటిల్స్

'రెడిట్' సహ వ్యవస్థాపకుడు అలెక్సిస్ ఒహియాన్‌ను పెళ్లి చేసుకున్న సెరెనాకు ఒలింపియా అనే ఐదేళ్ల పాప ఉంది.

తొలి ప్రత్యర్థి: దిగ్గజ ఆటగాళ్లు కెరీర్‌లో ఎన్ని విజయాలు సాధించినా తొలి మ్యాచ్‌కు ఉండే ప్రాధాన్యతే వేరు. ప్రొఫెషనల్ డబ్ల్యూటీఏ కెరీర్‌లో సెరెనా తొలిసారి కెనడాలోని క్యూబెక్ సిటీలో జరిగిన 'బెల్ చాలెంజ్' టోర్నీలో వైల్డ్‌కార్డ్‌తో బరిలోకి దిగింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో అప్పుడు 149వ స్థానంలో ఉన్న యానీ మిల్లర్ (అమెరికా) చేతిలో 1-6, 1-6 తేడాతో తొలి రౌండ్‌లోనే ఓడింది.

విజయ ప్రస్థానం...

ఓపెన్ శకంలో (1968 నుంచి) సింగిల్స్‌లో అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిల్స్‌తో దిగ్గజంగా ఎదిగినా సెరెనా మొదటి ట్రోఫీ మాత్రం మిక్స్‌డ్ డబుల్స్‌లో రావడం విశేషం. 1998లో మ్యాక్స్ మిర్నీతో కలిసి వింబుల్డన్ గెలుచుకున్న సెరెనా ఆ తర్వాత యూఎస్ ఓపెన్‌నూ సొంతం చేసుకుంది. తర్వాతి ఏడాది పారిస్ ఇండోర్ టోర్నీ గెలవడంతో ఆమె ఖాతాలో మొదటి సింగిల్స్ టైటిల్ చేరింది. ఆ తర్వాత టెన్నిస్ ప్రపంచాన్ని సెరెనా శాసించడం లాంఛనమే అయింది. కొత్త మిలీనియంలో పాత స్టార్లంతా మెల్లగా నిష్క్రమిస్తూ రిటైర్మెంట్ బాట పట్టిన సమయంలో సెరెనా శకం మొదలైంది. 2002లో వరుసగా మూడు గ్రాండ్‌స్లామ్‌లు నెగ్గి ఆ తర్వాత 2003లో ఆస్ట్రేలియన్ ఓపెన్‌తో కెరీర్ స్లామ్ పూర్తి చేసుకోవడంతో ఆమె స్థాయి పెరిగింది. అద్భుత విజయాల ఫలితంగా సహజంగానే నడిచొచ్చిన వరల్డ్ నంబర్‌వన్ ర్యాంక్‌తో సెరెనా మరింత ఎత్తుకు ఎదిగింది. ఆ తర్వాత దశాబ్ద కాలానికి పైగా తిరుగులేని ప్రదర్శనతో సెరెనా సత్తా చాటింది. ప్రత్యర్థి ఎవరైనా నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడే తత్వం ఆమెను అగ్రస్థానాన నిలబెట్టింది. తన సమకాలీన ప్రత్యర్థులపై ఆమె ఆడిన మ్యాచ్ రికార్డు చూస్తే సెరెనా ఆధిక్యం ఎలా సాగిందో అర్థమవుతుంది. వీనస్ విలియమ్స్‌పై 19-12, మార్టినా హింగిస్‌పై 7-6, కాప్రియాటిపై 10-7, హెనిన్‌పై 8-6, అజరెంకాపై 18-5తో సెరెనా పైచేయి సాధించింది. అయితే ఒకదశలో సమ ఉజ్జీలుగా నిలుస్తారని, హోరాహోరీ సమరాలు ఖాయమని టెన్నిస్ ప్రపంచం భావించిన మరో ప్రత్యర్థి మారియా షరపోవాపై సెరెనా ఆధిపత్యం తిరుగులేనిది. 2004 వింబుల్డన్ ఫైనల్లో సెరెనాపై 6-1, 6-4తో గెలవడంతో పాటు అదే ఏడాది డబ్ల్యూటీఏ ఫైనల్లో కూడా షరపోవాదే పైచేయి అయింది. కానీ ఆ తర్వాత వీరిద్దరు 17 సార్లు తలపడగా అన్ని సార్లూ సెరెనానే గెలిచి (ఓవరాల్‌గా 18-2) తానేంటో చూపించింది. 2014 యూఎస్ ఓపెన్ నుంచి వరుసగా మళ్లీ నాలుగు గ్రాండ్‌స్లామ్‌లు గెలిచి రెండోసారి ఈ ఫీట్‌ను సాధించడం సెరెనాకే సాధ్యమైంది. దీంతో పాటు ఆమె సాధించిన మూడు ఒలింపిక్ స్వర్ణాలు కెరీర్‌కు అదనపు హంగును జోడించాయి.



2000 సిడ్నీ ఒలింపిక్స్ స్వర్ణాలతో వీనస్, సెరెనా

గాయాలను అధిగమించి...



టెన్నిస్‌లో 30 ఏళ్ల వయసు అంటే రిటైర్మెంట్‌కు చేరువైనట్లే. గాయాలు, ఇతర ఫిట్‌నెస్ సమస్యలు సహజంగానే వెంటాడుతాయి. కానీ సెరెనా తన చివరి 10 గ్రాండ్‌స్లామ్‌లను 30 ఏళ్లు దాటిన తర్వాతే అందుకుంది. కెరీర్ మొదలు పెట్టిన దాదాపు 15 ఏళ్ల తర్వాత మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్ సాధించడం అసాధారణ ఘనత. మొదటి నుంచి కూడా సెరెనాను పలు మార్లు గాయాలు ఇబ్బంది పెట్టాయి. మోకాలు, పొత్తికడుపు, చీలమండ, వెన్నునొప్పి, కండరాలు, మోచేయి, భుజం, కాలికి గాయం, తొడ, బొటన వేలు, పొరపాటున గాజు పెంకులు గుచ్చుకోవడం... ఈ జాబితా చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. గాయంతో టోర్నీల ప్రారంభానికి ముందే తప్పుకోవడం, టోర్నీ మధ్యలో నిష్క్రమించడం చాలాసార్లు జరిగాయి. అయితే పట్టుదల, పోరాట తత్వం సెరెనాను మళ్లీ బలంగా పైకి లేచేలా చేశాయి. కోలుకుని వచ్చి అదే జోరులో విజయాలు సాధించి చూపడం ఆమెకే చెల్లింది. ఎనిమిది వారాల గర్భవతిగా ఉంటూ 2017 ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ సాధించిన ఆమె బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత 2020 ఆరంభంలో ఆక్లాండ్ ఓపెన్‌ను గెలిచి మరోసారి అందరి దృష్టి తనపై పడేలా చేసింది.

● భారత్‌తో బంధం



2008 మార్చి... అప్పటికే సెరెనా ఎనిమిది గ్రాండ్‌స్లామ్‌లు గెలిచి స్టార్‌గా వెలుగొందుతోంది. అలాంటి సమయంలో కూడా ఆమె టెన్నిస్‌కు పెద్దగా ప్రాధాన్యత లేని భారత్‌లో... అదీ ఒక టియర్-2 టోర్నీలో పాల్గొనడం విశేషం. అదే బెంగళూరు ఓపెన్. ఈ టోర్నీలో ఆమెనే విజేతగా నిలిచింది. సెరెనా కెరీర్‌లో అది 29వ టైటిల్.

ఆట ముగిసె...

సుమారు 24 వేల మంది ప్రేక్షకులు... గ్రాండ్‌స్లామ్ గెలుపు ప్రస్థానాన్ని ప్రారంభించిన సొంతగడ్డపై చివరి సారి బరిలోకి...ఆఖరి సారిగా ఆ రాకెట్ పదును వీక్షించేందుకు వచ్చిన ఫ్యాన్స్ సె-రె-నా... సె-రె-నా... అంటూ హోరెత్తిస్తున్నారు... భారీ స్క్రీన్‌పై గత రెండు మ్యాచ్‌ల తరహాలోనే కెరీర్ అత్యుత్తమ క్షణాలతో 'మాంటేజ్' వీడియో ప్రదర్శన... అది ముగిశాక సెరెనా విలియమ్స్ కోర్టులోకి అడుగు పెట్టింది. అప్పటికే ఆమె ప్రత్యర్థి ఐలా తొమ్లాయనోవిచ్ సిద్ధంగా ఉంది...ప్రతీ షాట్, ప్రతీ పాయింట్, ప్రతీ గేమ్, ప్రతీ సెట్... సెరెనా ప్రతీ అడుగు అభిమానులను అలరించింది. 185 నిమిషాలపాటు హోరాహోరీగా సాగిన సమరం చివరకు ఒక దిగ్గజం కెరీర్‌ను ముగించింది. కెరీర్‌లో తాను ఆడిన 1,014వ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ప్రత్యర్థి చేతిలో ఓడి సెరెనా నిష్క్రమించింది. భావోద్వేగంతో కన్నీళ్లపర్యంతమవుతూ ఇంటర్వ్యూ ఇచ్చిన అనంతరం కోర్టంతా కలియతిరుగుతూ తనదైన శైలిలో 'ట్విర్ల్' తర్వాత అభివాదం చేస్తూ ఆమె కోర్టును వీడిన క్షణంతో ఒక అత్యద్భుత కెరీర్‌కు తెర పడింది.



న్యూయార్క్: మహిళల టెన్నిస్ ఆల్‌టైమ్ గ్రేట్ సెరెనా విలియమ్స్ ఆటకు వీడ్కోలు పలికింది. యూఎస్ ఓపెన్‌లో మూడో రౌండ్‌లో పరాజయంతో ఆమె రిటైర్మెంట్ ప్రకటించింది. భారత కాలమానం ప్రకారం శనివారం తెల్లవారుజామున జరిగిన ఈ మ్యాచ్‌లో సెరెనా 5-7, 7-6 (7/4), 1-6 తేడాతో ఐలా తొమ్లాయనోవిచ్ (ఆస్ట్రేలియా) చేతిలో ఓటమిపాలైంది. తొలి సెట్‌లో ఇద్దరూ పోటాపోటీగా తలపడ్డారు. ఒకదశలో సెరెనా 5-3తో ఆధిక్యంలో నిలిచింది. అయితే కోలుకున్న తొమ్లాయనోవిచ్ స్కోరు సమం చేయడంతో పాటు మరో రెండు గేమ్‌లు కూడా గెలిచి సెట్‌ను సొంతం చేసుకుంది. రెండో సెట్ కూడా ఇదే తరహాలో సాగింది. ఇక్కడా సెరెనా 5-2తో ఆధిక్యంలో నిలిచినా ఆసీస్ ప్రత్యర్థి పోరాడటంతో సెట్ టైబ్రేకర్ వరకు వెళ్లింది. ఈ దశలో తన అనుభవాన్నంతా వాడి సెరెనా సెట్‌ను గెలుచుకోవడంతో పోరు ఆసక్తికరంగా మారింది. అయితే చివరి సెట్‌లో మాత్రం తొమ్లాయనోవిచ్ ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. రెండో గేమ్ తర్వాత స్కోరు 1-1తో సమంగా ఉన్నా ఆ తర్వాత వరుసగా నాలుగు గేమ్‌లు గెలిచి ఐలా 5-1తో విజయానికి చేరువైంది. ఏడో గేమ్‌లో ఆరు మ్యాచ్ సెరెనా ఆరు మ్యాచ్ పాయింట్లు కాపాడుకొని అభిమానులను అలరించినా...చివరకు ఫోర్ హ్యాండ్ అన్‌ఫోర్స్‌డ్ ఎర్రర్‌తో ఓటమి ఖాయమైంది.



కొన్ని వివాదాలూ...

ఆటలో ఎక్కడా దూకుడు తగ్గించని నైజంతో దూసుకుపోయిన సెరెనా సుదీర్ఘ కెరీర్‌లో అప్పుడప్పుడు వచ్చిన వివాదాలు కొంత చర్చ రేపినా, అవి ఆమె గొప్పతనాన్ని తగ్గించేవిగా మారలేదు. 2000 వింబుల్డన్‌లో వీనస్ చేతిలో సెరెనా చిత్తుగా ఓడినప్పుడు మ్యాచ్ ఫలితాన్ని తండ్రి రిచర్డ్ నిర్ణయించాడని, ఇది మ్యాచ్ ఫిక్సింగ్ అని విమర్శలు వచ్చాయి. ఆ తర్వాత 2001 ఇండియన్ వెల్స్ టోర్నీ సెమీస్‌కు ముందు ఆమె ప్రత్యర్థి వీనస్ గాయం పేరు చెప్పి అనూహ్యంగా తప్పుకోవడంతో ప్రేక్షకులు జాతి వివక్ష వ్యాఖ్యలు చేశారు. దాంతో తీవ్ర ఆవేదనకు లోనైన తర్వాతి 14 ఏళ్ల పాటు ఆ టోర్నీలో ఆడలేదు. చెయిర్ అంపైర్లతో వాదనలు, అందుకు జరిమానాలతో పాటు బాల్ బాయ్‌ను కూడా 'గొంతు కోస్తా' అన్నట్లు రాకెట్‌తో హెచ్చరించడం వరకు చాలా సందర్భాల్లో సెరెనా తనపై నియంత్రణ కోల్పోయింది. 2018 యూఎస్ ఓపెన్ ఫైనల్లో ఒసాకాతో మ్యాచ్ సందర్భంగా ఆమె ప్రవర్తన, రాకెట్‌ను నేలకు కొట్టడంవంటి ఘటనలతో బాగా చెడ్డ పేరు వచ్చింది. అయితే ఆమెలోని అద్భుతమైన ఆట అలాంటి తప్పులను కాచేలా చేయగలిగింది.

సినిమా



● శ్రీ కార్తీక్, శర్వానంద్, అమల, రీతూ వర్మ, ఎస్ఆర్ ప్రభు

అది గుర్తిస్తే లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్ - శర్వానంద్

''గతం తాలూకు ఆలోచనలతో మనం దిగాలుగా ఉంటే అది బాధ. భవిష్యత్ గురించి ఆలోచిస్తుంటే అది ఆశ. కానీ ఆలోచనలతో ఈ వర్తమాన క్షణాలను ఆస్వాదించడం మనం మర్చిపోతున్నాం. అది గుర్తిస్తే లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్. ఈ విషయాన్నే శ్రీ కార్తీక్ 'ఒకే ఒక జీవితం'తో చెప్పాలనుకుంటున్నాడు. ఈ సినిమాలో మదర్ సెంటిమెంట్ అనేది ఒక భాగం మాత్రమే. నా పాత్ర, వెన్నెల కిశోర్, ప్రియదర్శి.. ఇలా ఏదో ఒక క్యారెక్టర్‌తో ప్రతి ఆడియన్ కనెక్ట్ అవుతారు'' అన్నారు శర్వానంద్. శ్రీ కార్తీక్ దర్శకుడిగా పరిచయం అవుతూ, శర్వానంద్, రీతూ వర్మ జంటగా నటించిన చిత్రం 'ఒకే ఒక జీవితం' (తమిళంలో 'కణం'). అక్కినేని అమల, 'వెన్నెల' కిశోర్, ప్రియదర్శి కీలక పాత్రలు పోషించారు. ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 9న రిలీజ్ కానుంది. ''ఈ చిత్రంలో శర్వానంద్ తల్లి పాత్రలో నటించాను. పదేళ్ల తర్వాత నేను చేసిన తెలుగు చిత్రం ఇది. ఈ సినిమాతో నాకు శర్వానంద్ మూడో కొడుకు అయ్యారు (నవ్వుతూ). ఈ సినిమాలో ముగ్గురి జర్నీ చూస్తారు. ఈ ముగ్గురూ కాలంతో ఆడుకుని ఓ అంశాన్ని కరెక్ట్ చేయాలనుకున్నప్పుడు విధి మాత్రం మారదు. ఎందుకనేది థియేటర్స్‌లో చూడాలి'' అన్నారు అమల. ''నేను తెలుగువాడినే. మా అమ్మగారి మాతృభాష తెలుగు. ఇప్పుడు మా అమ్మగారు లేరు. మా అమ్మ గురించి తీసిన సినిమా ఇది. ఈ సినిమా కోసం 'సిరివెన్నెల' సీతారామశాస్త్రిగారు రాసిన 'అమ్మ' పాట చిరకాలం నిలిచిపోతుంది'' అన్నారు శ్రీ కార్తీక్. ''మా బ్యానర్ నుంచి వచ్చిన 'ఖాకీ', 'ఖైదీ' చిత్రాలను ప్రేక్షకులు బాగా ఆదరించారు. ఆ నమ్మకంతోనే తెలుగులో స్ట్రయిట్ ఫిల్మ్ 'ఒకే ఒక జీవితం' చేశాం'' అన్నారు ఎస్ఆర్ ప్రభు. ''అమలగారు నాకు స్ఫూర్తి'' అన్నారు రీతూ వర్మ.

విజయ్ సేతుపతి విడుదల



● విజయ్ సేతుపతి, సూరి

విజయ్ సేతుపతి ఉపాధ్యాయుడిగా తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతున్న తాజా చిత్రం 'విడుదలై' (విడుదల). కానిస్టేబుల్ పాత్రను సూరి చేస్తున్నారు. వెట్రిమారన్ దర్శకత్వంలో ఎల్రెడ్ కుమార్, ఉదయనిధి స్టాలిన్ రెండు భాగాలుగా నిర్మిస్తున్న చిత్రం ఇది. నిర్మాతలు మాట్లాడుతూ– ''మొదటి భాగం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. రెండో భాగంలో కొన్ని సన్నివేశాలు మాత్రమే చిత్రీకరించాల్సి ఉంది. భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. కళా దర్శకుడు జాకీ నేతృత్వంలో రూ. 10 కోట్లతో రైలు, రైలు బ్రిడ్జి సెట్ రూపొందించాం. అలాగే సిరుమలై ప్రాంతంలో పల్లెటూరి నేపథ్యంలో భారీ సెట్ నిర్మించాం. ప్రస్తుతం యాక్షన్ కొరియోగ్రాఫర్ పీటర్ హెయిన్ నేతృత్వంలో కొడైకెనాల్‌లో సన్నివేశాలను తెరకెక్కిస్తున్నాం. ఇందులో బల్గేరియా నుండి తమిళనాడుకి వచ్చిన స్టంట్ బృందం పాల్గొంటోంది'' అన్నారు. భవాని శ్రీ, ప్రకాశ్‌రాజ్, గౌతమ్ మీనన్, రాజీవ్ మీనన్, చేతన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఇళయరాజా, కెమెరా: వేల్‌రాజ్.

వెల్‌కమ్ మిర్నా



● మిర్నా మీనన్

హిట్ ఫిల్మ్ 'నాంది' తర్వాత హీరో 'అల్లరి' నరేశ్, దర్శకుడు విజయ్ కనకమేడల కాంబినేషన్‌లో రూపొందనున్న సినిమా 'ఉగ్రం'. సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మించనున్న ఈ చిత్రం షూటింగ్ త్వరలో ఆరంభం కానుంది. ఇందులో మిర్నా మీనన్ కథానాయికగా నటించనున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. తూము వెంకట్ కథను అందిస్తున్న ఈ సినిమాకు అబ్బూరి రవి మాటలు రాస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల, కెమెరా: సిద్.

రావణ కల్యాణం ఆరంభం



● సింహా, సందీప్, సత్యదేవ్

సింహా ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'రావణ కల్యాణం'. ఆలూరి సురేష్, సింహా సమర్పణలో జేవీ మధు కిరణ్ దర్శకత్వంలో అరుణ్ కుమార్ సూరపనేని, కె. రేష్మి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా శనివారం ఆరంభమైంది. తొలి సీన్‌కి యాక్టర్ సత్యదేవ్ కెమెరా స్విచ్చాన్ చేయగా, సింహా తనయుడు అర్జున్ సింహా క్లాప్ ఇచ్చారు. దర్శకుడు వీవీ వినాయక్ గౌరవ దర్శకత్వం వహించారు. సింహా మాట్లాడుతూ – ''రావణ కల్యాణం' కథ విన్నప్పుడు నేనెంత ఎగ్జైట్ అయ్యానో, థియేటర్స్‌లో ఆడియన్స్ చూస్తున్నప్పుడు అంతే ఎగ్జైట్ అవుతారనే నమ్మకం ఉంది. ఈ సినిమాలో సందీప్ మాధవ్, రాజేంద్రప్రసాద్, శత్రు, శరత్ రవి కీలక పాత్రలు చేస్తున్నారు. రధన్ సంగీతం, మనోహర్ సినిమాటోగ్రఫీ అదనపు ఆకర్షణ'' అన్నారు. ''పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు కిరణ్.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంముగా పెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



రజక/కట్నం ప్రసక్తి లేదు/B.Tech/C.Govt. Asst. ఇంజినీర్/జిహెచ్/ 80,000/- PM/ 5'10" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-14477]

SC మాల/కట్నం ప్రసక్తి లేదు/B.Tech /C. Govt.బ్యాంక్ మేనేజర్/SBI/80,000/-PM/ 5'10" ఎత్తు/28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-14477]

కాపు/M.Tech/C.Govt.టెక్నికల్ ఇంజినీర్/ECIL/70,000/-PM/5'10" ఎత్తు / 28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 8886512010 [HA-14477]

పద్మశాలి/M.Tech/C.Govt.డిప్యూటీ మేనేజర్/రైల్వే/12 Lakhs. PA/ 5'9"ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9989450693 [HA-14477]

హిందు మాల/కట్నం ప్రసక్తి లేదు/ 27/ 5'10"/B.Tech/Govt.AE/ట్రాన్స్‌కో/80, 000/-PM అందమైన వరుడుకు వధువు కావలెను. Ph: 6309258463 [HA-14477]

SC హిందు మాల/M.Tech/C.Govt. లోకోపైలెట్/రైల్వేస్/70,000/- PM/ "6" ఎత్తు /28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-8354]

SC హిందు మాదిగ/B.Tech/C.Govt. మేనేజర్/యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా/ 75,000/-PM/5'11"ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-8354]

SC మాదిగ/కట్నం ప్రసక్తి లేదు/29/5'10"/ B.Tech (Civil)/Central Excise & Customs ఆఫీసర్/85,000/- PM గల వెల్ సెటిల్ వరునికి అందమైన సాంప్రదాయ కుటుంబపు వధువు కావలెను. Ph: 7095019114 [H-784080]

SC మాల/కట్నం ప్రసక్తి లేదు/28/5'11"/ B.Tech(NIT)/AEE, ONGC/20 Lakhs P/A గల Well Settled వరుడికి అందమైన సాంప్రదాయ కుటుంబపు వధువు కావలెను. Ph: 9059470587 [H-784080]

బ్రాహ్మణ వధువు కావలెను. పౌరోహితం, విజయవాడ, 36 సం॥, 60-70K PM, Own House, 9989321940, 6300969344 [HA-4492]

హిందు/48y/విడోయర్/సొంత వ్యాపారం/10 Lacs (PM)/ 100 కోట్ల ఆస్తి కలిగిన వరునికి 1వ, 2వ మధ్య తరగతి వధువు కావలెను. పిల్లలు ఉన్నా OK (కుల కట్నం ప్రసక్తి లేదు) సంప్ర: 9059449366 [H-784170]

కాపు/36yrs/5'7"/Well Settle గల డాక్టర్ (MBBS)వరుడికి తగిన Well Settled అందమైన వధువు కావలెను. కమ్మ, కాపు, రెడ్డి సంప్ర: 9347033171 [H-784170]

కాపు/2nd మ్యారేజ్/48/5'8"/BSc/5Cr. స్థిరాస్తి కలిగి పిల్లలు లేని ఏకైక వరునికి పిల్లలు లేని 1వ, 2వ వధువు కావలెను. కట్నం ప్రసక్తి లేదు. Ph: 9346929647, 9573943211 [HA-14502]

రిటైర్డ్/విడో/పెన్షన్/80 వేలు/బాధ్యతలు లేని వ్యక్తికి సమస్యలేని మహిళ కావలెను. Whatsapp: 6304826162. (అన్ని వయస్సుల కులాల వారికి Verified Matchesని చూసే మీ Marriage మిత్ర) [HA-14502]

మాదిగ/B.Tech/Govt.AE / ఇరిగేషన్ Dept / 90,000/-PM/5'10" ఎత్తు/28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. Ph: 9642459724. [HA-14503]

మున్నూరు కాపు/B.Tech(సివిల్)/ Govt.AEE/ఇరిగేషన్ Dept/85,000/- PM/5'8" ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9515755529 [HA-14503]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Address: 106, A K Enclave, Phase II, 8-2-350, Road No. 3, Banjara Hills (Near Furniture Mall), Hyderabad. Ph: 9849321309 / 9347807015. PLEASE CHECK MY WHATSAPP STATUS. Email: koreddy43@gmail.com, Facebook.com/koreddymarriagebureau

వధువు కావలెను

Reddy/ Divorcee/ MBBS/ MD/ Own Hospital/ 1986/ 5'8"/ 50Cr. * Cont: K.C. Reddy, Mar-Bureau-Hyd. Ph:9849321309/ 9347807015

Reddy/ Business/ B.Tech/ MBA/ Very Handsome Boy/ 1995/ 6'/ Jubli Hills - Hyd/ 100Cr. * Cont : K.C. Reddy, Hyd. Ph:9849321309

Reddy/ B.Tech/ Business/ 1992/ 5'10"/ 300Cr * Cont: K.C. Reddy, Mar-Bureau- Road No. 3, B.Hills- Hyd. Ph:9849321309/ 9347807015

Reddy/MBBS/MD/Handsome Boy/1995/ 5'10"/300Cr/20L/M Rental Income * Cont: K.C. Reddy, Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/ B.Tech/ MS/ H1/ USA/ 1991/ 5'11"/ 130K/ 200Cr * Cont: K.C. Reddy, Mar-Bureau- B.Hills- Hyd. Ph:9849321309/ 9347807015

Reddy/B.Tech/Business/1990/6'/1000 Cr. *1989/5'11"/500Cr. *1992/6'/ 100Cr. *1994/5'9"/250Cr. * Cont: K.C.Reddy- Hyd. Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/MS/USA Citizen/ 1992/5'11"/250K/30Cr. *1989/5'11"/ 100K/ 20Cr. * Cont: K.C. Reddy- Hyd. Ph:9849321309/9347807015

Reddy/B.Tech/Business/Royal Family/1994/5'11"/250Cr. *1988/5' 11" / 100Cr. *1997/6'/300Cr. * Cont: K.C. Reddy- Hyd-Ph: 9347807015

Reddy/BE/BITS/1994/5'11"/SWE/UK /1.5Cr/yr/10Cr. *USA/H1/1994/5'11"/ 100K/150Cr. * Cont : K.C. Reddy - Hyd. Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/MS/Job/Hyd/1994/ 5'8"/Father Bureaucrat/ 200Cr. * Cont: K.C. Reddy, Road No.3, B.Hills- Hyd. Ph:9849321309/ 9347807015

వరుడు కావలెను

Reddy/ B.Tech/ 1994/ 5'6"/ 100Cr * 1995/ 5'8"/ 100Cr. * Cont: K.C.Reddy- Mar-Bureau-Road No.3, B.Hills- Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/ MS/ INDIA/ 1995/ 5'7"/ 150Cr. * 1996/ 5'5"/ 120Cr * Cont: K.C. Reddy-Mar-Bureau-B.Hills- Hyd. Ph: 9849321309/9347807015

Reddy/ MBA/ 1998/ 5'5"/ 100Cr. * 2000/ 5'5"/ 100Cr. * Cont: K.C. Reddy-Mar-Bureau-B.Hills- Hyd. Ph: 9849321309/9347807015

Reddy/ B.Tech/ MS/ H1/ USA/ 1990/ 5'8"/ 100Cr. *1992/ 5'4"/ 40Cr. * Cont: K.C. Reddy-Mar-Bureau- B.Hills- Hyd. Ph: 9347807015

Reddy/ B.Tech/ MS/ USA/ 1996/ 5'7"/ 50Cr. * 1993/ 5'4"/ 50Cr. * Cont: K.C. Reddy-Mar-Bureau- B.Hills- Hyd. Ph: 9347807015

Reddy/MBBS/Most Beautiful/Royal Family/1999/5'5"/200Cr/20L/M Rentals. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/MBBS/PG-doc. *MD/DM/Radiation Onchology/1990/5'7"/.* MD/ DVL/ 1990/5'6"/100Cr. * Cont: K.C. Reddy- Hyd. Ph: 9849321309

Reddy/B.Tech/MS/USA/Royal Family/Most Beautiful/1996/5'8"/Rich/ Jublihills-Hyd- * Cont: K.C. Reddy, Hyd. Ph: 9849321309

Reddy/ (Divorcee) MBBS/ 1993/ 5'8"/ 40Cr Needs any Well Settled * 1986/ 5'6"/ 50Cr * Cont: K.C. Reddy-Mar-Bureau- B.Hills- Hyd. Ph: 9849321309/9347807015

Reddy/ MS/ INDIA/ 1994/ 5'3"/ 200Cr/ * MBA/ 1988/ 5'3"/ 200Cr * Cont: K.C. Reddy-Mar-Bureau- Hyd. Ph: 9849321309/9347807015 [D-410]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి BE, 29, 5'11", 22L P/A, 100 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Bengaluru, BE, 35, 5'10", Sr Analyst, 15 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, MBA, 30, 6'1", SWE, H1, 10Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 28,5'8", 10L P/A, 75 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి BE, MS, 25, 5'2"/SWE, 120K, Rich Family, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 22, 5'4", 100Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 26,5'6", 3 Crores, Fair & Slim, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 27,5'5", Rich Family, USA, Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి BE, MS, 27,6', SWE, H1, 200K, 15Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 30, 5'8", Business, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Doctor, Residency USA, 32, 5'10", Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, 42, 5'10", USA BE, MS, Software. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MS, 27, 5'8", Rich Family, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Law, USA, 26, 5'3", Attorney, Fair, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, 25, 5'8", Doctor, 10 Crores, USA, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, M.Tech, 34, 5' 6", Software, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818 [LETTER]

నాయి బ్రాహ్మణ/B.Tech/C.Govt.Asst. మేనేజర్/SBI/72000/-PM/5'10"ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9581317506 [HA-14503]

SC మాల/29y/5'8"/B.Tech/బ్యాంక్ ఎంప్లాయి/60K.PM/వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ గల వరునికి అందమైన వధువు కావలెను. Ph: 8187091590, 8125548806 [HA-14503]

రజక/కట్నం ప్రసక్తి లేదు/B.Tech/ C.Govt. Asst. ఇంజినీర్/R&B/90,000/-PM/5'10" ఎత్తు/ 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 7075953400, 7842467951 [HA-14503]

రజక/డైవర్సీ/32y/5'8"/B.Tech/SWE/ 80K.PM/వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ వరునికి వధువు కావలెను. కుల పట్టింపు లేదు. Ph: 8019230588, 9515658310 [HA-14503]

రెడ్డి/లేట్ మ్యారేజ్/గవర్నమెంట్ టీచర్/45 సం॥, it 5'7"/కోట్ల ఆస్తి గల రెడ్డి వరుడుకి తగిన (CNB) వధువు కావలెను. నో బ్రోకర్స్ డైరెక్ట్ వాట్సప్ No: Ph: 9032233799 [H-783726]

SC మాల/28/5'6"/EEE/Civil Eng. NHA Banglore, 6L PA/మంచి స్థిరాస్తి బాగా స్థిరపడిన వరునికి బాగా స్థిరపడిన SC మాల వధువు కావలెను. Ph: 9346929647, 9573943211 [H-783726]

SC హిందుమాల/34/5'7"/B.Tech (Mech Eng)/ Pvt. Organisation/ 40K PM/ హైదరాబాద్‌లో నివాసముంటున్న అందమైన ఆంధ్ర వరుడికి వధువు కావలెను. Ph: 7799103030, 7901050357 (నో బ్రోకర్స్) [HA-14439]

MALA CHRISTIAN/Govt. Central University Proffesor/ 40y/5'7"/Groom Seeks suitable Bride. Age 30 above or Below. Ph: 9885757388/ 9494964312 [H-766294]

Sunni Muslim, 39 / 5'6" / Divorcee Masters / IT/ Software / Sr. Softweare Consultant Infosis Cont : 89517 22097, 80197 17411 [V- 791814]

★★

వైశ్య 63Y,ఆరోగ్యవంతుడైనఎర్రనిచాయ, నెలకు లక్ష ఆదాయం గల వ్యక్తికి, ఆరోగ్యవంతురాలైన, బాధ్యతలు లేని అందమైన వధువు,విడోఅయిన సం:7989534230. [N-1202630]

సంవత్సరం క్రితం భార్య చనిపోయిన 70 సం॥ కమ్మ రిటైర్డ్ ఎంప్లాయ్‌ని చూసుకొని నుటకు ఏ బాదరాబందీ లేని FC వధువు కావలెను ✆ 98496 92163, 94406 48138 [B-1169490]

నాయుడు/ 48 సం॥/ 5.6/ బాపట్లలో Govt Job/ గల వరునికి/ కమ్మ, రెడ్డిలతో వధువు కావలెను. వయసుతో పని లేదు. ఫైనాన్స్ సపోర్ట్ కావలెను. నో బ్రోకర్స్, డైరెక్ట్ సంప్ర: 9908035068 [G-788900]

బ్రాహ్మణ, 31 ఇంటర్ & ITI, 5.7, పురోహితం 40000/- P.M, సొంత ఇల్లు కలిగిన వరునికి తగిన వధువు కావలెను. కట్నం ప్రసక్తిలేదు. డైరెక్ట్ 9505777154 [G-756197]

కుల పట్టింపు లేదు (BC) /40 సం॥ 2nd మ్యారేజ్ / 5.6' / బిజినెస్ + వెల్ సెటిల్డ్ (14 సం॥ వయస్సు కల్గిన బాబు కలడు) వరునికి తగిన వధువు కావలెను. డైరెక్ట్ : 9515794465. [A-791442]

SC మాల హింధూ వయస్సు 35 సం॥ H-5'10" B.Tech., స్టేట్ బ్యాంక్ మేనేజర్ - వరుడికి వధువు కావలెను. డైరెక్ట్ : ✆ 98498 14490 [R-1144641]

వరుడు కావలెను



No Caste Bar, 1, 2వ 1 కోటి నుండి 100 కోట్ల ప్రాపర్టీ గల వధువులు కలరు, వారికి తగిన వరులు కావలెను. ఇల్లరికం OK త్వరగా చేసుకునే వారికోసం మాత్రమే. Ph: W: 7794960803 [H-784170]

రెడ్డి/కుల పట్టింపు లేదు/45yr/5'4"/ఫెయిర్/MA. English/Govt జాబ్ 70K(PM), వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ, సొంత ఇల్లు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం OK) సంప్ర:8008474869 [H-784170]

హిందు మాల/B.Tech/C.Govt.Asst. మేనేజర్/UBI బ్యాంక్/70,000/-PM/ 5'4" ఎత్తు/28 సం॥ల వధువుకి తగిన వరుడు కావలెను. Ph: 8374801504 [HA-14477]

క్రిస్టియన్/కుల ప్రసక్తి లేదు/డైవర్సీ/B.SC, B.Ed/Govt.టీచర్/50,000/-PM/ 5'5" ఎత్తు/ 36 సం॥ల పిల్లలు లేని అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8374801504 [HA-14477]

వడ్డెర/B.Tech/C.Govt.ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసర్/ఇన్‌కమ్‌టాక్స్ Dept/60,000/-PM/ 5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-14477]

క్రిస్టియన్ మాల/B.Tech/C. Govt.Asst. మేనేజర్/SBI/45,000/-PM/5'5"ఎత్తు/24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8886957298 [HA-14477]

క్రిస్టియన్ మాదిగ/B.Tech/C.Govt. Jr.ఇంజినీర్/రైల్వే/35,000/-PM / 5'4" ఎత్తు /24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8886957298 [HA-14477]

ముదిరాజ్/B.Tech/C.Govt.బ్యాంక్ క్యాషియర్/ఇండియన్ బ్యాంక్/32,000/-PM/ 5'4"ఎత్తు/24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9052296834 [HA-14477]

వాల్మీకి బోయ/B.Tech/Govt.Jr. Asst. /ఎక్సైజ్ Dept/40,000/-PM/5'5" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [HA-8354]

వడ్డెర/M.Sc/C.Govt. స్టెనోగ్రాఫర్/ రైల్వేస్/ 38,000/-PM/ 5'5"ఎత్తు /25 సం॥ అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [HA-8354]

క్రిస్టియన్ మాల/ఏకైక కుమార్తె/B.Tech/ Govt.Asst.ఇంజినీర్/RWS/50,000/- PM/ 5'5"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618007652 [HA-8354]

క్రిస్టియన్ మాదిగ/B.Tech/C.Govt. సైంటిస్ట్/డిఫెన్స్/60,000/-PM/ 5'4"ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [HA-8354]

రెడ్డి/విడో/58y/5'4"/పెన్షనర్/సొంత ఇల్లు/ కొంచెం పొలం సాంప్రదాయ కుటుంబం గల వెల్‌సెటిల్డ్ ఒంటరి వధువుకు వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. Ph: 7287962869 [H-784707]

రెడ్డి/విడో/57y/5'5"/V.Fair/Govt (H.M)/సొంత ఇల్లు & రెంట్స్/ఆంధ్రాలో 20 ఎకరాల మాగాణి/2L/PM Income ఏ బాదరబందీలేని వెల్ సెటిల్డ్ సాంప్రదాయక వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తి లేదు. Ph: 7095001526 [H-784707]

యాదవ/ఎర్రశాఖ అప్పర్ మిడిల్/34y/5'5" ఎత్తు/M.ఫార్మసీ వధువుకు Hydలో జాబ్ కల్గి లక్ష రూ. PM ఆపై ఆదాయం కల్గిన యాదవ వరుడు మాత్రమే కావలెను. డైరెక్ట్ ఫాదర్. Ph: 9989597799 [H-784707]

బ్రాహ్మణ/33y/5'2"/ఇంటర్/29yrs/5'4"/ డిగ్రీ/అందమైన వధువులకు వరులు కావలెను/రిటైర్/Pvt, Govt జాబ్ & పురోహితం అయినా OK. Ph: 9110723130 [H-784707]

రెడ్డి/58y/విడో/ఫ్యామిలీ పెన్షనర్ తక్కువ వయస్సు కొంచెం పంట పొలం/V.Fair/ఏ బాదరబందీలేని మంచి మనస్సు గల వధువుకు మంచి వరుడు కావలెను. Ph: 9059406974 [H-784707]

కాపు/40yr/విడో/high 5Ft/Good Looking వధువుకి Any OC, BC Well Settled వరుడు కావలెను. సంప్ర: 8688671906 [H-784707]

కుల పట్టింపు లేదు/విడో/45/5'4"/ Govt. Job/ PAM/1.5L PM/సొంత ఇల్లు/20 ఎ॥ పొలం/కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 6305873528 [H-784080]

రెండవ పెళ్ళి/విడో/ 55y/Guntur/లెక్చరర్ /Own House/కోట్ల ప్రాపర్టీ/ పిల్లలులేని ఏ బాదరబందీలేని ఏకైక ఒంటరి వధువుకు FC/BC వరుడు కావలెను (పిల్లలున్నా OK) Ph: 8519803423 [H-784080]

SC మాదిగ/24/5'5"/Fair/B.Tech (NIT)/ GST Officer/60,000/-PM గల అందమైన సాంప్రదాయ కుటుంబపు వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 8074766368 [H-784080]

Govt.టీచర్/Age 44Yr Sal: 75K Own House No Children. Well Settledకు, భార్గవి 45yr, సుకన్య రెడ్డి 49Yr తగిన వరులు కావలెను. Ph : 9063855739 [H-784170]

బ్రాహ్మణ/36/5'3"/ఇంటర్/Pvt Job/ 10,000/-PM/సాంప్రదాయ కుటుంబపు వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9030056547, 9676812525 [HA-14502]

2వ పెళ్లి/46Y/Fair/Pvt. Employee/ 30,000/-PM వధువుకి తగిన సెటిల్డ్ వరుడు కావలెను. Any FC/BC Only. Ph: 9848023736 [HA-14502]

కుల ప్రసక్తి లేదు/ఒంటరి/యాదవ/ 36/5'4"/మంచి తెలుపు/స్వంత ఇల్లు గల వధువుకు స్థిరపడిన వరుడు కావలెను. Ph: 6303293337, వాట్సప్ :8187053655 [HA-14502]

బ్రాహ్మణ/27/5'4"/ఇంటర్. *31/5'3"/B.Com. *35/5'3"/ఇంటర్. కట్నాలు ఇవ్వలేని వధువులకు వరులు కావలెను. అన్ని శాఖల/వయసుల వారికి త్వరగా కుదుర్చబడును. Ph: 7815999246 [HA-14503]

యాదవ/B.Tech(సివిల్)/C.Govt.Asst. మేనేజర్ (బ్యాంక్ ఆఫ్ బరోడా)/50,000/- PM/5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9515755529 [HA-14503]

SC మాల/M.Tech(EEE)/C.Govt. డిప్యూటీ మేనేజర్/SBI/65,000/-PM/ 5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9666887287 [HA-14503]

యాదవ/B.Tech/C.Govt. బ్యాంక్ P.O/ కెనరా బ్యాంక్/55000/-PM/5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph; 7842467951, 7075953400 [HA-14503]

బ్రాహ్మణ/25/5'3"/ఇంటర్. 29/5'3"/ ఇంటర్ *34/5'4"/B.Sc. * 38/5'3"/B.Com అందమైన వధువులకు వరులు కావలెను. బిజినెస్/ పురోహితం OK. Ph: 7893005879 [HA-14503]

కాపు/Unmarried/28y/5'4"/ఆటో ఫైనాన్స్ & Own ట్రాన్స్‌పోర్ట్ బిజినెస్/కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకి కుల పట్టింపు లేని వరుడు కావలెను. Ph: 7382055839 [H-783726]

రెడ్డి/డైవర్సీ/28y/5'4"/ఇండియన్ ఆయిల్ సబ్ డీలర్/కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకి కుల పట్టింపులేని వరుడు కావలెను. Ph: 9948468507 [H-783726]

రెడ్డి/Unmarried/26y/5'5"/Government Nurse/కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకి కుల పట్టింపు లేని వరుడు కావలెను. Ph: 9849319880 [H-783726]

కాపు/32 సం.లు/5'6"ఎత్తు/B.Tech/ Working TCS/70,000/-PM గల అందమైన అమ్మాయి & Hydలో Work చేసే అబ్బాయి కావలెను. (ఏదైనా FC Caste) Ph: 94414 43674 [HA-14504]

మాల క్రిస్టియన్ / 26y / 5.4 / M.Tech / అసిస్టెంట్ మేనేజర్ / SBI / 65000 / PM, అందమైన సంప్రదాయ వధువుకు వరుడు కావలయును. 94405 41437, 94939 02958. [L-765629]

కాపు వధువు B.Tech వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. శ్రీ ధనలక్ష్మి మార్యేజ్‌బ్యూరో అన్ని కులంల వార్కి లేట్, రెండవ, కస్టర్టెడ్ మ్యారేజస్ చూడబడును. HO ఏలూరు. సంప్ర: 9390787614, BO JRG 9985450777 [P- 302]

కులపట్టింపు లేదు / విడో / 58Y / Railway Employee / 90K PM / Own House, Rents, Lands 6 Cr Property వధువుకు వరుడు కావలెను. ఇల్లరికం OK. సంప్ర: 86393 20662 [B-413]

రెడ్డివిడో /A:30Yrs/Q:B.Pharm/ మెడికల్ షాప్స్ & ట్రావెల్స్ బిజినెస్‌లు కల్గిన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం Ok).సంప్రదించండి: 9032596676. [T-1636]

Doctor/MBBS/Gangaputra/ 5'6"/26 yrs /Whealish. Looking for Telugu Speaking Doctor/IIT/IIMC/CA/Estd. Businessman. Caste no bar. 9010074074 [HA-1926]

★★

కాపు, కన్వర్టెడ్ క్రిస్టియన్ /CA/ 5'3"/ కోటిరూపాయలు ఆస్తిగల 24 సం॥ వధువుకు వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ కాపు కన్వర్టెడ్ వరుడు కావలెను. 79811 65090. [B-790381]

క్రిస్టియన్ మాల/డైవర్సీ/B.Sc, B.Ed/ Govt. Teachers/ 60,000/-pm/5'5"/ 40 సం॥ పిల్లలు లేని వధువుకు వరుడు కావలెను. సంప్ర॥ 79811 65090. [B-790382]

కాపు॥- 49 సం॥ ఎత్తు 5.2" Fair B.A. అవివాహిత జాబ్ కలిగిన వధువుకు ఏదైన స్థిరాస్తి కలిగిన 1వ, 2వ OC కి చెందిన వరుడు కావలెను. 9059685006 [G-784332]

కుల పట్టింపు లేదు/58Yrs/Widow/ ఆంధ్ర Govt. Rtd/Own House/Rents/ పిల్లలు లేరు.ఏలాంటి బాధరబందీలేని వధువుకు వరుడు కావలెను. ✆ 8309675570. [T-1637]

వేదికలు



ధ్రువ మ్యారేజెస్/ అన్ని కులాల వారికి 1/2/విడో/డైవర్సీ తగిన సంబంధాలు చూడబడును. స్త్రీలకు ప్రత్యేకం. Ph: 9949395407 [H-783398]

సునీతా మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ, లేట్ మ్యారేజెస్, డైవర్సీస్, విడోస్, విడోయర్స్, పెన్షనర్లకు అన్ని కులాలవారికి త్వరగా చూపబడును. (స్త్రీలకు ఫ్రీ). Ph: 9110593035 [H-784080]

రజక వివాహ వేదిక (1994)/ డాక్టర్స్/ ఇంజినీర్స్/ Abroad/ USA/ UK/ B.Ed/ Govt Job సంబంధాలకై సంప్రదించండి ఫోన్: 8106303155/ 9391265304. [H-783726]

వివాహ పరిచయ వేదిక : 2nd & లేట్,11వ తేది ఉ.10 గం.ల నుండి హోటల్ ప్యారడైజ్, కూకట్‌పల్లి, 7వ తేది లోపు 1500/-తో రిజి. చేసుకున్న వారికే ప్రవేశం. వివాహ బంధం. మ్యారేజ్ బ్యూరో Ph: 9948666645 [HA-14477]

VEDIKA365.com నచ్చితేనే ఫీజు ప్రతి నెల పరిచయ వేదిక ఫ్రీగా బయోడేటా పంపి ప్రొఫైల్స్ చూడండి. వివరాలు గోప్యం వాలంటీర్స్‌కి స్వాగతం. 8985811875 [H-783230]

1వ/2వ/లేట్/విడో/విడోయర్ ఒంటరి/ పెన్షనర్స్ స్త్రీలకు మరియు పురుషులకు కుల పట్టింపు లేని అన్ని కులాల వారికి వ: 21-80 సం॥ పెళ్లి సంబంధాలు చూడబడును. సంప్ర: 7416260458 [H-784170]

ఓన్లీ రెడ్డి, కాపు, డాక్టర్స్, ఇంజినీర్స్, సాఫ్ట్‌వేర్, Govt., NRI, బిజినెస్ మరియు మీరు కోరిన పెళ్లి సంబంధాలు చూపబడును. Ph: 8125831394 [HA-14502]

30+ దాటిన వివాహం కాలేదని చింతిస్తున్నారా? కమ్మ, కాపు, రెడ్డి, వైశ్య, మాదిగ, 1వ, 2వ, NRI, డాక్టర్ Govt. వారికి అతి త్వరగా పెళ్లిళ్లు జరిపే సంస్థ. సంప్ర: 9247217621, 8790689274 [HA-14503]

కరువ/కురుమ/కురుబ వివాహ వేదిక 11/9/22, ఉ.9.00 గం॥లకు మండల పరిషత్ హాలు (జిల్లా పరిషత్) కర్నూలు. A.P. బయోడేటా, కలర్ ఫోటోలు, రిజిస్ట్రేషన్ ఫీజు 800/-. సంప్ర: 90327 41194, 94407 56199. [L-1147652]

శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM/ Est : 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st/ 2nd దేశ/విదేశ సంబంధాలకై సం॥ S.రాములు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకులు: స్వర్గీయ S.శారదాగౌడ్, Ph: 8790690809 [H-784701]

ఫ్రీ రిజిస్ట్రేషన్ అన్ని కులములవారికి Govt./ సాఫ్ట్‌వేర్/గెజిటెడ్/MBBS/ PG/ NRI/ PVT/ బిజినెస్/ 1వ/2వ/లేట్ AP/TS 15 సం॥ Exp. Ph: 8712384555 [HA-27167]

వెడ్డింగ్ బెల్స్ మ్యారేజ్ బ్యూరో - ఫ్రీ రిజిస్ట్రేషన్ అన్ని కులాల వారికి 1వ, 2వ మరియు లేట్ మ్యారేజ్ వధూవరులకు సంబంధాలు చూడబడును. Govt/ Bank/ NRI సంబంధాలు సెట్ చేయబడును. ఫోన్: 9494480709, 7396513879 [HA-783520]

15 రో॥ అన్ని కులముల వారికి తగిన సంబంధాలు చూపించగల అతి పెద్ద సంస్థ రోహిణి. www.rohinimarriages.com ✆ 98490 58673, 94418 29644, 94407 85888 W [B-930]

Registration Free. మీకు తగిన సంబంధాలు ఉంటేనే Subscription తీసుకోండి. 25 సంబంధాలు కేవలం రూ. 500/- మాత్రమే. www.jeelakarrabellam.com, 98497 44707 [G-577]

రెండు కుటుంబాలు కలపటం మాములు విషయం కాదు. Fees కట్టాలను కొనేవాళ్లకి మాత్రమే పెళ్లి సంబంధాలు చూడబడును. పూర్ణ మ్యాట్రిమోనీ, తిరుపతి, 7093722724. [T-1470]

తెలుగు బి.సి.కులాల వారి www. bcmatrimony.com ఫ్రీగా రిజిస్ట్రేషన్ అవ్వండి. కులాల వారీగా చూసుకోవచ్చును. వాట్సాప్ : 88865 55388 [R-5143]

★★

కళ్యాణమస్తు రెడ్డి వివాహ వేదిక రెడ్డి కులస్థులకు సంబంధములు కుదర్చబడును ఇట్లు గుడిమెట్ల భాస్కర రెడ్డి (వాస్తు, జ్యోతిష్య నిపుణులు). Ph: 7659924888 [H-783516]

సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే శ్రీ బాలాజి దుర్గ మ్యారేజ్ బ్యూరో అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. సంప్ర: 6302543297 [HA-261]

ముస్లిం మ్యారేజి బ్యూరో, ముస్లింలలోని అన్ని వర్గాలకు సంబంధించిన స్త్రీ మరియు పురుషుల పిల్లలకు సరైన సంబంధములు చూడబడును. సంప్ర॥ 94913 47402, 94926 13009 [B-790326]

కళ్యాణ కల్పవల్లి: గుంటూరు అన్ని కులముల వారికి దేశ విదేశీ సంబంధాలకై వెంటనే సంప్రదించండి. Y.రాఘవరెడ్డి. సంప్ర: 93941 10276 [G-788859]

Reddy's కు మాత్రమే: ఒకే ఫోన్ కాల్‌తో సంబంధములు కుదర్చబడును. US, UK, Aus, Canada, Hyd, AP సంప్ర: B.Siva Rama Reddy. 7989086110, 6302388950 [G-784500]

Mala - Madiga Christian/Hindu, IAS, IPS, Doctors (PG), Bank PO's, Railways, Govt. Employees, Software (IITs & NITs) ✆ 99497 20682. [T-1638]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి పెళ్ళిచూపులు

Combined : 1430/- for 4 Lines, 385/- Extra Line | Andhra Pradesh: 990/- for 4 Lines (Incl. Hyd) 275/- Extra Line | Telangana : 880/- for 4 Lines (Incl. Hyd) 240/- Extra Line | * Color 25% Extra

గమనిక : ఇకపై మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం.

3+3 3 ప్రకటనలకు చెల్లించండి 3 ప్రకటనలు ఉచితంగా పొందండి

నిజామాబాద్	:99122 20764	తిరుపతి	:99122 20586	తాడేపల్లి గూడెం	:99122 20558
కరీంనగర్	:9705933396	కడప	:99516 02932	రాజమండ్రి	:99122 20358
వరంగల్	:99516 02872	అనంతపూర్	:99122 20718	విజయవాడ	:9912225442
నల్గొండ	:95055 08382	కర్నూల్	:9010825556	గుంటూరు	:99122 20349
మహబూబ్‌నగర్	:99516 02829	శ్రీకాకుళం	:99122 20343	ఒంగోలు	:99122 25431
ఖమ్మం	:99516 02868	విశాఖపట్నం	:99122 20550	నెల్లూరు	: 99516 02861

మరియు మీ దగ్గరలోని సాక్షి ప్రాంతీయ కార్యాలయములలో సంప్రదించండి.

6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, Hyd-34 Ph: 040-23256000 Ext: 6230 / 6235 Cell: 9912225453

మైనారిటీ వ్యవహారాల సలహాదారుగా హబీబుల్లా



సాక్షి, అమరావతి: రాష్ట్ర మైనారిటీ వ్యవహారాల సలహాదారుగా నంద్యాలకు చెందిన డీఎస్ హబీబుల్లాను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ముత్యాలరాజు శనివారం ఉత్తర్వులిచ్చారు. హబీబుల్లాకు ప్రభుత్వం కేబినెట్ హోదా కల్పించింది. రెండేళ్లపాటు ఆయన ఆ పదవిలో కొనసాగనున్నారు. గత ప్రభుత్వ హయాంలో నంద్యాలలో చంద్రబాబు నిర్వహించిన నారా హమారా కార్యక్రమంలో ముస్లింలకు మీరు ఏం చేశారని హబీబుల్లా ప్రశ్నించారు. ఇందుకుగాను ఆయనతోపాటు పలువురు యువకులపై అప్పటి టీడీపీ ప్రభుత్వం దేశద్రోహం కేసులు పెట్టి తీవ్రంగా వేధించింది. గత ప్రభుత్వం హబీబుల్లాను వేధిస్తే..ప్రస్తుత ప్రభుత్వం మైనారిటీ వ్యవహారాల సలహాదారు పదవి ఇచ్చి గౌరవించడం గమనార్హం.

అక్రమాస్తులను పెంచుకున్న చంద్రబాబు: హనుమంత్‌నాయక్

సాక్షి, అమరావతి: సీఎం జగన్‌పై చంద్రబాబు నిరాధార ఆరోపణలు చేయడం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ గిరిజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్‌నాయక్ అన్నారు. ఆయన శనివారం తాడేపల్లిలో మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పథకాలను అర్హతే ప్రామాణికంగా అందిస్తున్నట్లు తెలిపారు. చంద్రబాబు పాలనలో టీడీపీ నాయకుల అక్రమాస్తులు ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయని, చంద్రబాబు అమరావతిలో ఎలా దోచుకున్నారో ప్రజలందరికీ తెలుసన్నారు. కుప్పంలో ఓడిపోతానన్న భయంతో చంద్రబాబు ఆరోపణలు చేసున్నారని మండిపడ్డారు.

శ్రీశైలం డ్యామ్ @ 884

నాగార్జునసాగర్‌కు తగ్గిన వరద ప్రవాహం



రెండు గేట్ల ద్వారా నాగార్జున సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

శ్రీశైలం ప్రాజెక్ట్/విజయపురిసౌత్: శ్రీశైలం జలాశయం నీటిమట్టం శనివారం సాయంత్రానికి 884.80 అడుగులకు చేరుకుంది. ఎగువ ప్రాజెక్టులైన జూరాల, సుంకేసుల నుంచి 1,32,829 క్యూసెక్కుల వరద ప్రవాహం శ్రీశైలానికి వచ్చి చేరుతోంది. 10 అడుగుల మేరకు తెరచిన 2 రేడియల్ క్రస్ట్ గేట్ల ద్వారా 55,966 క్యూసెక్కుల వరద నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. శుక్రవారం నుంచి శనివారం వరకు కుడిగట్టు కేంద్రంలో 14.769, ఎడమగట్టు కేంద్రంలో 17.008 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఉత్పాదన అనంతరం 66,703 క్యూసెక్కుల నీటిని, స్పిల్ వే ద్వారా 1,03,623 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు వదిలారు. బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 5,208 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 800 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజల స్రవంతికి 1,688 క్యూసెక్కుల నీటిని వదిలారు. డ్యామ్ పరిసర ప్రాంతాల్లో 1 మి.మీ. వర్షం కురిసింది. ప్రస్తుతం జలాశయంలో 214.3637 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మరోవైపు, నాగార్జున సాగర్ జలాశయానికి వరదనీటి రాక తగ్గుముఖం పట్టింది. దీంతో రేడియల్ క్రస్ట్ గేట్లను తగ్గించారు. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 2 రేడియల్ క్రస్ట్‌గేట్లు, కుడి, ఎడమ గట్టు విద్యుదుత్పాదన కేంద్రాల ద్వారా 1,25,577 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. సాగర్ జలాశయం నుండి అంతే నీటిని విడుదల చేస్తున్నారు. 8 రేడియల్ క్రస్ట్‌గేట్ల ద్వారా 64,128 క్యూసెక్కులు, విద్యుదుత్పాదనతో 32,886 క్యూసెక్కులు కృష్ణా నదిలోకి మొత్తం 97,014 క్యూసెక్కులు వదులుతున్నారు. కుడి, ఎడమకాల్వలు, వరదకాలవకు కలిపి 15,563 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం గరిష్ట స్థాయి నీటిమట్టం 590.00 అడుగులు 312.0450 టీఎంసీలు. ప్రస్తుతం 589.20 అడుగులు 309.6546 టీఎంసీలు ఉంది. ఎగువనుండి వచ్చే వరదను బట్టి గేట్లను పెంచడం, తగ్గించడం గేట్లను మూసివేయడం చేస్తున్నారు. కృష్ణా నది పైగల జలాశయాలన్నీ జలకళతో ఉన్నాయి.

• తెలంగాణ

బ్యాంకు ఉద్యోగే రూ.5.22 కోట్లు దోచేశాడు

సాక్షి, హైదరాబాద్: ఓ ఉద్యోగి తాను పనిచేస్తున్న బ్యాంకుకే కుచ్చుటోపి పెట్టిన వైనం ఇది. బ్యాంకులోని లాకర్ల నుంచి ఏకంగా రూ.5.22 కోట్లు ఎత్తుకెళ్లాడు. ఈ ఘటన మెదక్ జిల్లా నర్సాపూర్‌లో వెలుగుచూసింది. నర్సాపూర్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచిలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్, క్యాష్ ఇన్‌చార్జి నాగేందర్ బ్యాంకులోని నగదుతో పాటు ఏటీఎంలకు వెళ్లాల్సిన నగదును ఎత్తుకెళ్లినట్టు సిద్దిపేట జోన్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పి.సత్యనీరజ సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌కు ఫిర్యాదు చేశారు. సమాచారం ఇవ్వకుండా ఈ ఏడాది జూన్ 21న విధులకు గైర్హాజరైన నాగేందర్‌కు సంబంధిత బ్యాంకు మేనేజర్ ఫోన్ చేయగా, ఆలస్యంగా వస్తానని తెలిపారు. సాయంత్రం వరకు ఎదురు చూసిన అనంతరం అధికారులు ఆయన ఇంటికి వెళ్లగా?? ఓ అనుమానిత వ్యక్తి వచ్చి లాకర్లకు సంబంధించిన సేఫ్ కీస్ అందించి వెళ్లారు. లాకర్లు తెరిచి చూడగా రూ.2.32 కోట్లు, రూ.76 లక్షల విలువైన బంగారు అభరణాలు, రూ.2.19 కోట్లు మాయమైనట్లు గుర్తించారు. దీంతో సీసీ పుటేజ్ పరిశీలించగా, నాగేందర్ ఒక్కడే స్ట్రాంగ్ రూమ్‌లోకి వెళ్లినట్టు రికార్డు అయింది.

చెన్నై ఫెర్టిలిటీ సెంటర్ సీజ్

తిరుపతిలోని సంతాన సాఫల్య కేంద్రాల్లో అధికారుల తనిఖీలు

సాక్షి, అమరావతి/తిరుపతి తుడా: అనుమతి లేకుండా తిరుపతి నగరంలో నిర్వహిస్తున్న చెన్నై ఫెర్టిలిటీ సెంటర్‌ను వైద్య శాఖ అధికారులు శనివారం సీజ్ చేశారు. తమిళనాడు రాష్ట్రం చెన్నై నగరంలోని చెన్నై ఫెర్టిలిటీ సెంటర్‌లో బాలిక పిండాన్ని చట్ట విరుద్ధంగా సేకరించి విక్రయించినట్లు ఆ రాష్ట్ర వైద్య శాఖ అధికారులు గుర్తించారు. ఏపీలోని చెన్నై ఫెర్టిలిటీ సెంటర్ బ్రాంచ్‌లో ఆ పిండాన్ని విక్రయించినట్లు అనుమానం కలగడంతో తమిళనాడు వైద్య శాఖ అధికారులు ఈ మేరకు ఏపీ వైద్య శాఖ అధికారులకు లేఖ రాశారు. ఈ నేపథ్యంలో తిరుపతిలోని చెన్నై ఫెర్టిలిటీ సెంటర్‌తోపాటు మరికొన్ని సంతాన సాఫల్య కేంద్రాల్లో ఎంసీహెచ్ అదనపు డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్ నేతృత్వంలో అధికారుల బృందం శనివారం తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో చెన్నై ఫెర్టిలిటీ సెంటర్ ఎటువంటి అనుమతులు లేకుండానే కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఈ సెంటర్‌ను సీజ్ చేసి రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. రాష్ట్రంలో సరోగసీ చట్టం-2021, అసిస్టెడ్ రీ ప్రొడక్టివ్ టెక్నాలజీ చట్టం-2021ను అనుసరించి సంతాన సాఫల్య కేంద్రాలు నిర్వహించాలని డాక్టర్ అనిల్‌కుమార్ 'సాక్షి' కి తెలిపారు. తిరుపతి జిల్లాలోని అన్ని సంతాన సాఫల్య కేంద్రాల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి తగిన సూచనలు చేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలకు సంతాన సాఫల్య కేంద్రాల పర్యవేక్షణపై ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేస్తామని చెప్పారు.

మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వ ప్రాధాన్యం

రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ సంచాలకులు కిషోర్‌కుమార్

సాక్షి, అమరావతి: అల్పసంఖ్యాక వర్గాల(మైనారిటీలు) సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, వారి అభ్యున్నతికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ జీసీ కిషోర్‌కుమార్ చెప్పారు. విజయవాడ భవానీపురంలోని ఏపీ స్టేట్ ఉర్దూ అకాడమీ ప్రధాన కార్యాలయంలో శనివారం 'మైనారిటీల అభివృద్ధి, సంక్షేమం'పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర్‌కుమార్ మాట్లాడుతూ మైనారిటీల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం నవరత్నాలతోపాటు అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. మైనారిటీలకు మరింత మేలు కలిగేందుకు కొత్త ప్రతిపాదనలు తీసుకువస్తే పరిశీలించి అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఇప్పటికే నాలుగైదు దఫాలు మైనారిటీ సంక్షేమ శాఖ పనితీరుపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమీక్షించారని, త్వరలోనే మరోసారి సమావేశం నిర్వహించి చర్చించే అవకాశం ఉందన్నారు. మైనారిటీల అభివృద్ధికి బడ్జెట్‌లో సైతం అడిగినన్ని నిధులు ఇవ్వడానికి సీఎం సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో వక్ఫ్ బోర్డు సీఈవో, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ ఖదీర్, సర్వే కమిషనర్ ఆఫ్ వక్ఫ్ షేక్ షిరీన్ బేగం పాల్గొన్నారు.



తుపాను తీవ్రత ఎలా ఉంటుంది.. ఇదిగో అచ్చంగా ఇలా ఉంటుంది. యూకేలోని వెస్ట్ ససెక్స్‌లో లైట్ హౌస్‌ను మించేలా.. లైట్ హౌస్‌ను ముంచేలా ఎగసివస్తున్న రాకాసి అలలను గమనించారా.. ఈ చిత్రాన్ని క్రిస్టఫర్ ఐసన్ అనే ఫొటోగ్రాఫర్ తీశారు. వెదర్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ద ఇయర్‌లో ఫైనలిస్టులుగా ఎంపికైన చిత్రాల్లో ఇది కూడా ఒకటి.

విహంగామా

విదేశీ పక్షులతో 'తెలుకుంచి' పులకింత

ఇచ్ఛాపురం రూరల్: పచ్చని చెట్లు తెల్లటి దుప్పటి కప్పుకున్నాయా..అన్నట్లు శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం తెలుకుంచి గ్రామంలో విదేశీ పక్షులు కనువిందు చేస్తున్నాయి. మేఘాల పల్లకిలో వేల కిలోమీటర్లు అలుపూ సొలుపు లేకుండా పయనించి అబ్బుర పరుస్తున్నాయి. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు చిత్ర విచిత్రమైన చప్పుళ్లతో చెట్లపై సందడి చేస్తున్నాయి.

ఇవీ ప్రత్యేకతలు..

చెట్లపై కొమ్మలు, రెమ్మలు ఉంటే తప్ప గూడు ఏర్పాటు చేసుకోలేని ఈ పక్షులు గుడ్లు పెట్టేందుకు చెట్లనే ఆశ్రయిస్తుంటాయి. ఒక్కో పక్షి 2 నుంచి 6 గుడ్లు వరకు పెడుతుంటాయి. 27 నుంచి 30 రోజుల వరకు తల్లి పక్షి గుడ్లు పొదుగుతుంది. పొదిగిన రోజు నుంచి 36 రోజుల పాటు ఆహారాన్ని తీసుకువచ్చి అందించి సంరక్షిస్తాయి. పిల్ల పక్షులు ఎగిరేంత వరకు తల్లి పక్షి గానీ, మగ పక్షి గానీ గుళ్లలో కాపలాగా ఉంటాయి. ఏటా తొలకరి జల్లులు కురిసే జూన్‌లో సైబీరియా నుంచి వస్తోన్న ఈ పక్షుల అసలు పేరు ఓపెన్ బిల్ స్టార్క్స్ (నత్తగొట్టు కొంగలు, చిల్లు ముక్కు కొంగలు). శాస్త్రీయ నామం 'అనస్థోమస్'. తూర్పు-దక్షిణాసియా ఖండంలో ముఖ్యంగా భారత్, శ్రీలంక నుంచి మొదలుకొని తూర్పు ప్రాంతంలో విస్తారంగా సంచరిస్తుంటాయి. వీటి జీవిత కాలం సుమారు 30 ఏళ్లు. బాగా ఎదిగిన పక్షి 81 సెంటీమీటర్ల పొడవు, 11 కిలోల బరువు ఉంటుంది. రెక్కలు విప్పారినప్పుడు 149 సెంటీ మీటర్ల వరకు ఉంటుంది. పగలంతా తంపర భూములు, వరి చేలల్లో తిరుగుతూ చేపలు, నత్తలు, కప్పలు, పురుగులు, ఆల్చిప్పలను ఆహారంగా తీసుకుంటాయి. 6 నెలల పాటు పిల్లలతో గడిపిన పక్షులు పిల్లలు ఎగిరేంత బలం రాగానే డిసెంబర్, జనవరిలో తమ ప్రాంతాలకు పయనమవుతుంటాయి.



తెలుకుంచి గ్రామంలోని చెట్లపై విదేశీ పక్షులు



మోడువారిన చెట్లపై నివసిస్తున్న పక్షులు



అడపడుచుల్లా విదేశీ పక్షులు..

ఈ పక్షులను తెలుకుంచి గ్రామస్తులు తమ ఆడపడుచుల్లాగా భావిస్తుంటారు. గ్రామస్తులకు వాటితో విడదీయరాని అనుబంధం ఉంది. సకాలంలో పక్షులు గ్రామానికి చేరకపోతే ఇక్కడి ప్రజలు ఆందోళనపడుతుంటారు. ఏటా జూన్‌లో ఈ పక్షుల రాకతోనే నైరుతి పవనాలు ఆరంభమవుతాయని గ్రామస్తుల నమ్మకం. వీటి రాకతో తమ ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండుతాయని వారి విశ్వాసం. తాము కూర్చున్న చోట పక్షులు వాలుతాయే తప్ప ఎవ్వరికీ ఎటువంటి హాని చేయవని, వీటిని వేటగాళ్ల బారినుంచి తామే రక్షిస్తుంటామని గ్రామస్తులు చెబుతున్నారు. ఒకవేళ ఎవరైనా పక్షులకు హాని తలపెట్టాలని చూస్తే గ్రామ కట్టుబాటు ప్రకారం ఆ వ్యక్తికి గుండు గీయించి ఊరేగిస్తారు. తిత్లీ, పైలాన్ తుఫాన్ తీవ్రతకు చెట్లు నేలకొరగడంతో విహంగాలకు తెలుకుంచిలో విడిదిలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఏడాదికి వీటి సంఖ్య 30-40% తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం పక్షులు గూళ్లు పెట్టేందుకు నానాపాట్లు పడుతున్నాయి. చెట్లనే ఆవాసాలుగా ఏర్పాటు చేసుకునే ఈ పక్షులు చెట్లు లేక గడ్డికుప్పలు, ఇళ్లపై, పంట పొలాల చాటున గూళ్లు పెట్టుకునేందుకు సిద్ధపడుతున్నాయి. రాత్రి సమయాల్లో విష పురుగులు బారినపడి పక్షులు మృతి చెందుతున్నాయి. పక్షులను సంరక్షించేందుకు గ్రామంలో చెట్లు పెంచాలని అధికారులకు తెలుకుంచి గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

తెలంగాణలో ట్రయాంగిల్ గేమ్

- సెప్టెంబర్ 17ను జాతీయ సమైక్యతా దినంగా పాటించాలన్న ఒవైసీ
- తెలంగాణ జాతీయ సమైక్యతా దినంగా రాష్ట్ర సర్కారు నిర్ణయం
- తెలంగాణ విమోచన దినోత్సవం నిర్వహిస్తున్నాం.. రండి అంటూ సీఎంకు కేంద్ర మంత్రి లేఖ
- ఇన్నేళ్లుగా పట్టించుకోని బీజేపీ, టీఆర్‌ఎస్‌లవి అవకాశవాద రాజకీయమన్న రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాజకీయాలను సెప్టెంబర్ 17.. ఒక్కసారిగా వేడెక్కించింది. ఎత్తుకు పైఎత్తులు వేసేలా శనివారం రాజకీయాలు కొనసాగాయి. మూడు పార్టీల మధ్య గేమ్‌గా మారింది. తెలంగాణ విలీన దినాన్ని ఎనిమిదేళ్లుగా పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెలంగాణ ఉత్సవాల నిర్వహణకు పోటాపోటీగా రంగంలోకి దిగాయి. పరేడ్ గ్రౌండ్‌లో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని, అందులో పాల్గొనాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి.. ముఖ్యమంత్రి కేసీఆర్‌తోపాటు కర్ణాటక సీఎం బస్వరాజ్ బొమ్మయ్, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండేలకు లేఖలు రాశారు. హైదరాబాద్ సంస్థానం నుంచి విముక్తి పొందిన మూడు రాష్ట్రాలను కలిపి విమోచన దినోత్సవం హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి కేంద్ర హోం మంత్రి అమిత్‌షా హాజరవుతారని వెల్లడించారు. మరోవైపు, సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో 'తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవం'గా సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలని తీర్మానించారు. ఇదిలాఉండగా, మజ్లిస్ పార్టీ సైతం ఉత్సవాలను ఆహ్వానిస్తూనే.. జాతీయ సమైక్యతా దినోత్సవంగా నిర్వహించాలంటూ కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు, సీఎం కేసీఆర్‌కు ఆ పార్టీ చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ లేఖ రాశారు. పాతబస్తీలో తిరంగా యాత్రతో పాటు బహిరంగ సభ నిర్వహిస్తామని, కేసీఆర్‌ను కూడా ఆహ్వానిస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అసదుద్దీన్ స్వాగతించారు. కాగా ఈ ఉత్సవాల గురించి ఎనిమిదేళ్లుగా ఏ మాత్రం పట్టించుకోని బీజేపీ, టీఆర్‌ఎస్ ఇప్పుడు నిర్వహిస్తామని చెప్పడం అవకాశవాద రాజకీయమంటూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి విమర్శించడం గమనార్హం.

'పోషణ్ అభియాన్' అమల్లో ఏపీ భేష్

మహారాష్ట్ర తర్వాత రెండో స్థానం కైవసం

- పోషణ్ అభియాన్ అమలులో మానవ వనరులు, మొబైల్ ఫోన్ల పంపిణీలో ఏపీ నంబర్‌వన్
- బాలింతలు, పిల్లల ఆరోగ్య సంరక్షణ, కన్వర్జెన్స్ యాక్షన్ ప్లాన్ అమలులోనూ అగ్రస్థానం
- బాలింతలు, పిల్లలకు పోషకాహారం అందించడంలో అత్యధిక స్కోర్
- నీతి ఆయోగ్ అధ్యయన నివేదిక వెల్లడి

సాక్షి, అమరావతి: కరోనా కష్టకాలంలో గర్భిణులు, పిల్లల్లో పోషకాహార లోపం నివారణకు ఉద్దేశించిన పోషణ్ అభియాన్ పథకం అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది. పథకం మొత్తం అమలులో అత్యధిక విజయాలు సాధించిన రాష్ట్రాల్లో తొలుత మహారాష్ట్ర నిలవగా రెండో స్థానంలో ఆంధ్రప్రదేశ్, మూడో స్థానంలో గుజరాత్ నిలిచాయి. ఈ రాష్ట్రాలు మొత్తం మీద 70 శాతానికి పైగా స్కోర్ సాధించాయి. ఆ తరువాత స్థానాల్లో తమిళనాడు, మధ్యప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్ ఉన్నట్లు నీతి ఆయోగ్ అధ్యయన నివేదిక వెల్లడించింది. కోవిడ్ సమయంలో కీలకమైన ఆరోగ్య, పోషకాహార సేవల విషయంలో ఆయా రాష్ట్రాలు చేపట్టిన వినూత్న చర్యలపై నీతి ఆయోగ్ అధ్యయనం చేసింది. 2019 అక్టోబర్ నుంచి డిసెంబర్ 2020 వరకు పోషణ్ అభియాన్ అమలులో మౌలిక సదుపాయాలు, మానవ వనరులు, శిక్షణపై పురోగతి, అమలు సామర్థ్యాలు, కెపాసిటీ బిల్డింగ్, కన్వర్జెన్స్, ప్రోగ్రామ్, ఔట్‌పుట్ యాక్టివిటీస్, సర్వీస్ డెలివరీలపై నీతి ఆయోగ్ అధ్యయనంచేసి ఆయా రాష్ట్రాలకు స్కోర్లు ఇచ్చింది. ఆ వివరాలు..



మానవ వనరుల నియామకాల్లో ఏపీ టాప్

- కోవిడ్ సమయంలో పోషణ్ అభియాన్ అమలుకు అవసరమైన మానవ వనరుల నియామకాలను నూరు శాతం చేసిన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచింది. జాయింట్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ స్థానాలనూ నూరు శాతం భర్తీచేసిన రాష్ట్రాల్లో ఏపీ ఈ ఘనత సాధించింది. అంగన్‌వాడీ వర్కర్లకు మొబైల్ ఫోన్లను నూరు శాతం పంపిణీలోనూ ఏపీ టాప్‌లో నిలిచింది. పిల్లల వృద్ధి పర్యవేక్షణ పరికరాలనూ నూటికి నూరు శాతం ఏపీ పంపిణీ చేసింది. అంతేకాక.. రాష్ట్రస్థాయిలో సిబ్బంది శిక్షణ, సామర్థ్యం పెంపునూ నూరు శాతం అమలుచేసింది.
- ఆరోగ్య సంబంధిత సేవలు, మౌలిక సదుపాయాలు, మానవ వనరులను అంచనా వేయగా.. కమ్యూనిటీ హెల్త్ కేంద్రాలు, పిల్లలు, బాలింతలకు సేవలు, ఏఎన్‌ఎంల భర్తీలో ఆంధ్రప్రదేశ్ అత్యధిక స్కోర్ సాధించింది. ఆ తరువాత స్థానాల్లో గుజరాత్, కర్ణాటక, కేరళ నిలిచాయి.
- రాష్ట్రస్థాయిలో మౌలిక సదుపాయాలకు సంబంధించి సబ్ సెంటర్లు, కకమ్యూనిటీ హెల్త్ కేంద్రాలు, హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాలు ఆంధ్రప్రదేశ్‌లో నూటికి నూరు శాతం పనిచేస్తున్నాయి. ఈ విషయంలో దేశంలోని 13 పెద్ద రాష్ట్రాల్లో ఏపీ అగ్రస్థానంలో ఉంది.
- ఏపీ సర్కారు ప్రత్యేకంగా సప్లిమెంటరీ పోషకాహారం కూడా పంపిణీ చేసింది. గృహ సందర్శనలు, వర్చువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు పిల్లలకు వర్చువల్ తరగతులు నిర్వహించింది. కమ్యూనిటీ పద్ధతిలో వర్చువల్ ఈవెంట్లనూ నిర్వహించింది. కోవిడ్ సమయంలో జనసమూహాన్ని నివారించేందుకు టోకెన్ ఆధారిత వ్యవస్థ ద్వారా జింక్, ఓఆర్ఎస్‌లను పంపిణీ చేసింది.
- కోవిడ్ సంక్షోభ సమయంలో అక్టోబర్ 2019 నుంచి 2020 రెండో త్రైమాసికం వరకు ఆరు నెలల నుంచి ఆరేళ్ల వయస్సు గల పిల్లలకు సప్లిమెంటరీ పౌష్టికాహారం ఏపీలో 113 శాతం మేర పంపిణీ చేయగా 2020 మూడో త్రైమాసికం నాటికి అది 115 శాతం మేర.. నాలుగో త్రైమాసికం నాటికి అది 119 శాతానికి పెరిగింది.
- ఇక అక్టోబర్ 2019 నుంచి 2020 రెండో త్రైమాసికం వరకు గర్భిణులతో పాటు పాలు ఇచ్చే తల్లులకు సప్లిమెంటరీ పౌష్టికాహారం పంపిణీ 108 శాతం ఉండగా 2020 మూడో త్రైమాసికానికి 111 శాతం, 2020 నాలుగో త్రైమాసికంలోనూ అదే స్థాయిలో పంపిణీ జరిగింది.
- ఇక అక్టోబర్ 2019 నుంచి 2020 రెండో త్రైమాసికం వరకు ఇనిస్టిట్యూషనల్ కాన్పులు ఏపీలో 90 శాతం ఉండగా 2020 మూడో త్రైమాసికంలో 94 శాతానికి.. 2020 నాలుగో త్రైమాసికానికి 100 శాతానికి పెరిగాయి.

గ్రామగ్రామాన సు'రక్షిత' నీరు

ఏడాదిలో 9.51 లక్షల తాగునీటి శాంపిల్స్‌కు నాణ్యత పరీక్షలు

- సురక్షిత తాగునీరే గ్రామీణులకు అందించేలా ప్రభుత్వం పటిష్ట చర్యలు
- గ్రామాల్లో అన్ని బోర్లు, బావులు, చెరువుల్లో నీటికి ఏడాదిలో రెండు విడతలు పరీక్షలు
- పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టళ్లలో నీటికీ రెండుసార్లు పరీక్షలు
- ల్యాబ్‌ల ద్వారా తాగు నీటి పరీక్షల్లో దేశంలో మన రాష్ట్రమే టాప్
- గ్రామాలకే నీటి పరీక్షల కిట్లు
- ఈ ఏడాది హానికర బ్యాక్టీరియానూ గుర్తించే రసాయనాలు సరఫరా
- 97.15 శాతం నమూనాల్లో నీరు సురక్షితమైనదని గుర్తింపు

2.85 శాతం నమూనాలోనే కలుషితాలు

సాక్షి, అమరావతి: గ్రామీణ ప్రాంతాల్లో అత్యంత సురక్షితమైన తాగు నీటిని ప్రజలకు అందించేందుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతోంది. గ్రామాల్లో ప్రజలు తాగు నీటికి నిరంతరం పరీక్షలు నిర్వహిస్తోంది. ఎక్కడైనా కలుషితాలు ఉంటే, ఆ నీటి శుద్ధికి చర్యలు చేపడుతోంది. ఫ్లోరైడ్ తదితర కలుషితాల్లేవని నిర్ధారించుకున్నాక ప్రజలు వినియోగించుకోవడానికి అనుమతిస్తున్నారు. ఇప్పుడు గ్రామీణ మంచి నీటి సరఫరా కేంద్రాల నుంచి అందిస్తున్న తాగు నీటిలో 97.15 శాతం స్వచ్ఛమైనదని పరీక్షలు తేటతెల్లం చేస్తున్నాయి. 2021 ఆగస్టు నుంచి 2022 ఆగస్టు మధ్య ఏడాది కాలంలో మొత్తం 9,51,337 నీటి శాంపిల్స్‌కు పరీక్షలు నిర్వహించింది. గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏటా వర్షాకాలం ప్రారంభమైన తర్వాత ఒక విడత అన్ని గ్రామాల్లో బోర్లు, బావులు, చెరువులు, మంచి నీటి సరఫరా పథకాల నీటికి ప్రభుత్వం పరీక్షలు చేస్తోంది. అవసరమైతే ఏడాదిలో రెండో సారి కూడా పరీక్షలు చేస్తున్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్లలోని బోర్ల నీటికీ కూడా గత ఏడాది రెండు విడతలు కెమికల్, హానికర సూక్ష్మ క్రిముల పరీక్షలు చేసినట్లు ఎస్‌డబ్ల్యూఎస్‌ఎం ప్రాజెక్టు డైరెక్టర్ హరే రామనాయక్, చీఫ్ కెమిస్ట్ కృష్ణమూర్తి 'సాక్షి'కి తెలిపారు.



గ్రామాలకే నీటి పరీక్ష కిట్లు

సాధారణంగా గ్రామాల్లో తాగు నీటి శాంపిల్స్‌ను ఆర్‌డబ్ల్యూఎస్‌కు అనుబంధంగా పని చేసే 107 ల్యాబ్‌లలో పరీక్షిస్తారు. గత మూడేళ్లుగా తాగే నీటి నాణ్యతపై అనుమానం కలిగినప్పుడు అక్కడికక్కడే పరీక్షించేందుకు ప్రభుత్వం అన్ని గ్రామాలకు ఎఫ్‌టీకే కిట్లను సరఫరా చేస్తోంది. వీటితో 8 రకాల ప్రమాదకర రసాయనాలను గుర్తించొచ్చు. ఒక్కొక్క కిట్‌తో వంద శాంపిల్స్‌ను పరీక్షించొచ్చు. ఈ ఏడాది ఈ కిట్లతో పాటు నీటిలో ప్రమాదకర బ్యాక్టీరియాను గుర్తించే హెచ్‌టూఎస్ కెమికల్ సీసాలను కూడా పంపిణీ చేశారు. మార్చిలోనే 7.50 లక్షల హెచ్‌టూఎస్ సీసీలు పంపిణీ చేసినట్టు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వెల్లడించారు. నీటిని పరీక్షించే విధానంపై గ్రామ స్థాయి సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చారు.

దేశంలో ఏపీనే ఫస్ట్

గడిచిన ఏడాది కాలంలో నీటి నాణ్యత పరీక్ష కేంద్రాల్లో (ల్యాబ్‌లలో) పరీక్షల నిర్వహణలో మన రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. గత ఏడాది ఆగస్టు 15 నుంచి ఈ ఏడాది ఆగస్టు 15 వరకు 6,12,458 శాంపిల్స్‌కు ల్యాబ్‌లలో కెమికల్, బ్యాక్టీరియా పరీక్షలు చేశారు. గ్రామాల్లోని ఎఫ్‌టీకే కిట్లతో మరో 3,38,879 పరీక్షలు జరిపారు. ఇలా పూర్తిస్థాయి శాస్త్రీయంగా ఉండే ల్యాబ్ పరీక్షల్లో ఏపీ తర్వాతి స్థానాల్లో తమిళనాడు (5.35 లక్షలు), పశ్చిమ బెంగాల్ (5.31 లక్షలు), మధ్య ప్రదేశ్ (5.28 లక్షలు) ఉన్నాయి.

నాణ్యమైన నీరే

రాష్ట్రంలోని గ్రామాల్లో తాగునీరు ఎంతో సురక్షితమైనదని అన్ని పరీక్షల్లోనూ నిర్ధారణ అయినట్టు అధికారులు వెల్లడించారు. ఏడాది మొత్తంలో చేసిన పరీక్షల్లో 97.15 శాతం నీరు సురక్షితమైనదని తేలింది. 2.85 శాతం శాంపిల్స్‌లో మాత్రమే కలుషిత కారకాలు గుర్తించారు. ల్యాబ్‌లో 6.12 లక్షల శాంపిల్స్‌కు పరీక్షలు చేయగా 25,140 నమూనాల్లో కలుషితాలను గుర్తించారు. 3.38 లక్షల ఎఫ్‌టీకే పరీక్షల్లో 3,077 నమూనాల్లో కలుషితాలు ఉన్నట్టు గుర్తించారు. కేరళ, గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోని గ్రామీణ నీటిలో అత్యధికంగా కలుషితాలు ఉన్నట్టు నిర్ధారణ అయింది.

గొర్రె పిల్ల ఆకలి తీర్చిన గోమాత

పాపం ఆ గొర్రెపిల్లకు ఆకలేసినట్టుంది.. రోడ్డు పక్కన గడ్డిమేస్తున్న ఆవు దగ్గరకు వెళ్లి పాలు తాగడం మొదలెట్టింది. గొర్రెపిల్ల అలా పాలు తాగినంత సేపూ ఆవు కూడా గొర్రెకు అసౌకర్యం కలగకుండా కదలకుండా అలానే ఉండిపోయింది. గొర్రె పిల్ల బొజ్జ నిండాక ఎంచక్కా అక్కడ నుంచి వెళ్లిపోయింది. ఆవు కూడా గడ్డి మేసే పనిలో నిమగ్నమైంది. శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురంలో శనివారం గొర్రె పిల్లకు ఆవు పాలిస్తూ కనిపించిన ఈ దృశ్యాన్ని స్థానికులు ఆసక్తిగా తిలకించారు. – సరుబుజ్జిలి



కాలుష్య నియంత్రణకు సహకరించండి..

కేంద్రాన్ని కోరిన ఎంపీ జీవీఎల్

సాక్షి, న్యూఢిల్లీ: విశాఖపట్నం ఓడరేవులో బల్క్ కార్గో ద్వారా కలిగే కాలుష్యాన్ని నియంత్రించేందుకు కవర్ షెడ్‌లను నిర్మించాల్సిన అవసరం ఉందని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు చెప్పారు. ఓడ రేవు చుట్టూ నివాసాలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. సాగర్ మాల ప్రాజెక్టులో భాగంగా కవర్ షెడ్‌ల నిర్మాణానికి పెట్టుబడి పెట్టి వినియోగదారుల నుంచి వినియోగ చార్జీలు వసూలు చేయడం ద్వారా పెట్టుబడిని తిరిగి పొందాలని కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్ శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్‌కు జీవీఎల్ సూచించారు. శనివారం కేంద్ర మంత్రికి రాసిన లేఖలో ఎంపీ జీవీఎల్ నరసింహారావు ఈ అంశాలను ప్రస్తావించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.